ప్రాచీన ఈజిప్టు గాథలు

Ancient Egypt Stories



డా॥ లంకా శివరామప్రసాద్

Dr. LANKA SIVA RAMA PRASAD

ప్రాచీన ఈజిప్టు గాథలు

(ANCIENT EGYPT STORIES)



డాక్టర్ లంకా శివరామప్రసాద్

Dr. Lanka Siva Rama Prasad

ప్రాచీన ఈజిప్టు గాథలు
(ANCIENT EGYPT STORIES)

by

Dr. Lanka Siva Rama Prasad

June 2021

All rights reserved

Copyright @ 2021
Dr. Lanka Siva Rama Prasad

Published by:

Dr. Lanka Siva Rama Prasad
Srijana Lokam / Writer's Corner
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442, 6305677926
Email: lankasrprasad@gmail.com
www.anuvaadham.com

Price : ₹ **300** **$ 5**

Cover Design & Post Script :
Prakash Pula

Printed at :
Vasavi Printers
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

ప్రస్తావన

2006 అక్టోబరు నెలలో నేను ఈజిప్టు వెళ్లాను. మహోన్నతమైన పిరమిడ్లు, గంభీరంగా, భయంకరంగా కానవచ్చే స్ఫింక్స్, ఒజిమాండియస్ పద్యాన్ని తలపించే పెద్ద పెద్ద విగ్రహాలు, లక్సర్ లేదా థెబెస్‌లోని ఊహాతీతమైన కర్నాక్ దేవాలయపు గ్రేట్ హైపొస్టైల్ హాలు, నైలునదిలో నౌకాప్రయాణం, రాజుల, రాణుల లోయ, సమాధుల దర్శనం, తుతన్‌ఖామున్ సమాధి, తుతన్‌ఖామున్ స్వర్ణ విగ్రహం, మ్యూజియంలో చూసిన మమ్మీలు, పాపిరస్‌లు, తిరుగు ప్రయాణంలో విమానంలో కైరోకు వస్తున్నపుడు నీలిరేఖగా కానవచ్చే నైలునదీ అందాలు, ఎండలో పిరమిడ్లను చూస్తూ, సమాధుల్లోని వాసనకు ముక్కులు మూసుకుంటూ ఒకింత చిరాకుపడి, థెబెస్‌లో లైట్ అండ్ సౌండ్ షోను నిద్రపోతూ ఆనందించి రంజాన్ మాసంలో ఈజిప్టు వచ్చినందుకు కించిత్ ఆత్మనింద చేసుకున్నా ఆ ప్రాచీన ఈజిప్టు రాజసం ముందు అన్ని చిటపటలూ తలవంచి నమస్కరించిన సందర్భాలు గుర్తుకు వచ్చాయి. ఎప్పుడో వ్రాయాల్సిన ఈ పుస్తకం కరోనా పుణ్యమా అంటూ ఇప్పటికి వ్రాయగలిగాను.

ఏడువేల సంవత్సరాల చరిత్రను సంక్షిప్తీకరించడం కష్టమే అయినప్పటికీ, ఈ చిన్న అద్దంలో ఈజిప్టు నాగరికతా వైభవాన్ని, 'రా' వెలుగులు, నైలునది సొబగుల మధ్య మీ ముందుంచుతున్నాను.

– డాక్టర్ లంకా శివరామప్రసాద్

విషయ సూచిక

1. ఈజిప్టు (Egypt) 7
2. ఫారో (Pharaoh) 9
3. చిత్రలిపి (Heiroglyph) 11
4. పాపిరస్ (Papyrus) 13
5. రొజెట్టా శిల (Rosette Stone) 15
6. ద్వికిరీటం (Double Crown) 16
7. ప్రాచీన ఈజిప్టు (Ancient Egypt) 18
8. నవీన ఈజిప్టు (Modern Egypt) 23
9. నైలునది (River Nile) 25
10. బైబిల్‌లో ఈజిప్టు (Bible Egypt) 26
11. ఈజిప్టు వైభవం (The Glory of Egypt) 28
12. సృష్టి–దేవతలు (Creation Myths - Gods) 31
    a) అతుమ్ (Atum)
    b) దివ్య కవలలు (Shu-Tefnut)
    c) గెబ్–నట్ (Geb-Nut)
    d) ప్తా (Ptah of Memphis)
    e) ఖ్నుమ్ (Khnum)
    f) మిన్ (Min of Koptos)
    g) రె (Re) (Ra)
    h) సూర్యుడు–సర్పాలు (Re-Snakes)
    i) స్వర్ణనాగు (Lord of Punt)
    j) ఒసిరిస్ (Osiris)
    k) ఐసిస్ (Isis)
    l) సెత్ (Seth)
    m) నెఫ్థిస్ (Nephthys)
    n) హొరస్ (Horus)
    o) అనుబిస్ (Anubis)
    p) తొత్ (Thoth)

q) ఈజిప్షియన్ క్యాలెండర్ (Egyptian Calender)
r) ఒసిరిస్ – మృతుల రాజు (King of the Dead)
s) హాథర్ (Hathor)
t) సూర్యదేవతలు (Sun Gods)

13. సినుహె గాథ (The Story of Sinuhe) 62
14. హోరస్–సెత్ యుద్ధం (The Contending of Horus and Seth) 66
15. మరణానంతర జీవనం (After Life) 72
16. సి–ఒసిరి (Si - Osiri) 77
17. పవిత్రధేనువు – వృషభం (Celestial Cow - Bull) 79
18. సెఖ్‌మెత్ (Sekhmet) 79
19. ప్రాచీన ఈజిప్టు స్త్రీలు (Ancient Egypt Women) 85
20. ఐసిస్–ఏడుగురు వృశ్చిక స్త్రీలు (Isis - 7 Scorpion Women) 87
21. అమున్ – రె (Amun - Re) 89
22. మాత్ (Maat) 91
23. ఖెఫ్రి (Khefri) 91
24. రా – హోరాక్తె (Ra - Horakhte) 92
25. సొబెక్ (Sobek) 93
26. ఖ్నుమ్ (Khnum) 93
27. గెబ్–నట్ (Geb-Nut) 95
28. సర్పదేవతలు (Serpent Gods) 95
29. నియత్ (Neith) 96
30. మత్ (Mut) 97
31. అనత్ (Anat) 97
32. అస్తార్తె (Astarte) 97
33. కొన్ని మంత్రతంత్రాల కథలు (Magic) 100
34. దైవపుత్రులు (Divine Births) 106
35. దేవతలు–మనుషుల కథలు (Tales of Gods and Men) 109
36. పిరమిడ్లు–భవన నిర్మాతలు (Pyramids & Architects) 125

37. ఫారోల దేశం (The Land of Pharaohs) 134
38. తుతన్‌ఖామున్ సమాధి – ఫారోల శాపం (Tomb & Curse) 137
39. మృతుల పుస్తకం (Book of the Dead) 142
40. ప్రాచీన ఈజిప్టు విశేషాలు (Trivia) 150
41. ప్రాచీన ఈజిప్టు – ఇండియా (Ancient Egypt - India)..... 157
42. ప్రాచీన ఈజిప్టు – ప్రపంచం (Ancient Egypt - World) 163
43. ఈజిప్టు దేవతలు – ప్రభువులు (Gods - Pharaohs) 165
44. కాలరేఖ (Timeline) 169
45. ప్రాచీన ఈజిప్టు – ఒక అద్భుతం (A Wonder - Egypt) 173
ప్రశ్నలు–సమాధానాలు 204

ఆధార గ్రంథావళి :

1) **Egypt 7000 Years of Art & History** (A.C. Carpiceci)
2) **Art and History of Egypt** (A.C. Carpiceci)
3) **Myths & Legends of Ancient Egypt** (Joyce Tyldeslay)
4) **The Mummy** (Ernest A. Wallis Budge)
5) **The Egyptian Book of the Dead** (Papyrus of Ani)
6) **World Mythology** (Roy Willis)
7) **Ancient Egypt** - Eyewitness Guides

1. ఈజిప్టు
(Egypt)

ఈజిప్టు – అనే పదానికర్థం – 'ప్తా' ఆత్మగృహం (Home of the soul (Ka) of Ptah at Memphis). ఐగిప్తాస్ (ప్రాచీన గ్రీకు), ఈజిప్తె (ఫ్రెంచి), ఎయిజిప్టెస్ (లాటిన్), కుబ్తి (అరబిక్), కాప్ట్ (ఇంగ్లిష్), హికుప్తా (ఈజిప్షియన్), మిస్ర్ (అరబిక్), మిస్రు (అక్కడియన్), ముసుర్ (అస్సిరియన్) – (మిస్ర్ అంటే సరిహద్దు.)

ప్రాచీన ఈజిప్టు – నల్లనేల – Black Land - Kmit, కెమెత్. కెమెత్ – ఖెమియా, కెమియాగా పిలువబడింది. (Deshret - desert, dsrt - Red Land, ఎర్రనేల ఇవి ఎడారినేల పేర్లు).

కెమియా (నల్ల నేల)కు మరోపేరు నదీభూమి (Land of the riverbank)

Ta - Shemeaw = Sedge land;
Ta - Mehew - North land

ప్తా (Ptah) ఆత్మగృహంగా, నల్లనేల–కెమియాగా, నదీభూమిగా వ్యవహరించబడి, గ్రీకుల కాలానికి నైలునదీ పరివాహక ప్రాంతం ఈజిప్టుగా పిలువబడింది. ప్రజలను 'ఐగుప్తులు'గా పిలిచేవారు.

క్రీస్తుపూర్వం పదివేల సంవత్సరాల కాలంలో వేట, చేపలు పట్టుకోవడం (Hunter gatherers) దశ నుంచి వ్యవసాయ ప్రధానమైన (Grain grinding) ప్రాంతంగా అవతరించిన ఈజిప్టు క్రీస్తుపూర్వం 8000 సంవత్సరాల నాటికి పశువుల మేతతో ఆకుపచ్చదనం అంతరించగా పచ్చిక భూములు 'సహారా' ఎడారిగా మారాయి. వాతావరణంలో మార్పు కూడా దీనికి కారణం కావచ్చును.

క్రీస్తుపూర్వం 6000 సంవత్సరాలు – నవీన రాతియుగం, ఎగువ, దిగువ ఈజిప్టు ప్రాంతాల అభివృద్ధి, మెరిమ్దా, బదారియన్ (Badarian), నఖాదా (Naqada) సంస్కృతులు, ఈ దశలో పరిఢవిల్లినాయి.

క్రీస్తుపూర్వం 3200 సంవత్సరాల నాటికి ఈజిప్షియన్ హీరోగ్లైఫు (Hieroglyph) చిత్రలిపులు ప్రాచుర్యంలోకి వచ్చాయి.

3150 BCE - మెనెస్ (Menes) ప్రభువు (మెనెస్ పదం హిందువుల మనువు పదానికి దగ్గరగా ఉండడం గమనించవచ్చు).

ఈజిప్షియన్ కాలరేఖ :

పూర్వ సామ్రాజ్య కాలం – 5300 - 3100 B.C. (Predynastic)

1)	ఆర్కాయిక్	-	414 సం॥ (3100-2686 B.C.)	0-2 సామ్రాజ్యాలు
2)	పాత సామ్రాజ్యం	-	505 సం॥ (2686-2181 B.C.)	3-6 సామ్రాజ్యాలు
3)	తొలి మధ్యసామ్రాజ్యం	-	126 సం॥ (2181-2055 B.C.)	7-11 సామ్రాజ్యాలు
4)	మధ్య సామ్రాజ్యం	-	405 సం॥ (2055-1650 B.C.)	11-13 సామ్రాజ్యాలు
5)	రెండవ మధ్యసామ్రాజ్యం	-	100 సం॥ (1650-1550 B.C.)	14-17 సామ్రాజ్యాలు
6)	నవ సామ్రాజ్యం	-	481 సం॥ (1550-1069 B.C.)	18-20 సామ్రాజ్యాలు
7)	మూడవ మధ్యసామ్రాజ్యం	-	322 సం॥ (1069-715 B.C.)	21-24 సామ్రాజ్యాలు
8)	ఆఖరి సామ్రాజ్యం	-	415 సం॥ (715-332 B.C.)	25-31 సామ్రాజ్యాలు
9)	టాలమిక్ సామ్రాజ్యం	-	302 సం॥ (332-30 B.C.)	Macedonian Ptolemic

EGYPT

2. ఫారో
(Pharaoh)

Pharaoh = Great House

ఫారో అనే పదానికర్థం మహా భవన నివాసి, రాజభవన నివాసి. అది తరువాత కాలంలో ఈజిప్టు చక్రవర్తికి పర్యాయపదంగా మారింది. క్రీస్తుపూర్వం 3150–30 సంవత్సరాల మధ్యకాలంలో ఈజిప్టు ప్రభువుల వ్యావహారిక నామాలు – అయిదు (Five Great Names)

1) Horus - హోరస్ – శక్తిశాలి
2) Nebty - నెబితి (Two Ladies) ఇద్దరు యువతులు
3) Horus of Gold - స్వర్ణ హోరస్
4) Prenomen - ప్రినొమెన్ – రెండు రాజ్యాల ప్రభువు
5) Nomen - నొమెన్ (సూర్యపుత్రుడు–Son of Ra)

1) Horus - Wesret Kau - మహా శక్తిశాలి
2) Nebty - Wadjrenput - ఇద్దరు రాణుల భర్త
3) Horus of Gold - Netjere Khau - స్వర్ణ దేవుడు
4) Prenomen - Maat Kare - సత్యవ్రతుడు
5) Nomen - Khnumat - సూర్యపుత్రుడు

హోరస్ నామం – భవనం నమూనాపైన డేగ (Falcon) రూపం చిత్రితమై ఉంటుంది.

నెబితి – ఇద్దరు రాణులు. (ఎగువ ఈజిప్టు రక్షకదేవత– నెఖ్‌బెత్ (Nekhbat) రాబందు (Vulture) రూపంలో) (దిగువ ఈజిప్టు రక్షకదేవత– వాడ్‌జెత్ (Wadjet) త్రాచుపాము (Cobra) రూపంలో చిత్రించబడ్డారు.)

స్వర్ణ హోరస్ (Horus of Gold) - శత్రునాశకుడు, శాశ్వతస్థుడు; సెథ్ గర్వాపహారి.

ప్రినొమెన్ (Prenomen) - He of Sedge & Bee - రెండు ఈజిప్టుల రాజు.

నొమెన్ (Nomen) – సూర్యపుత్రుడు (Son of Ra). (ఈజిప్టు చిత్రలిపిలో బాతు (Duck - Za) పుత్రుడు (Son=Za) రెంటికి ఒకే గుర్తు వాడేవారు).

ఈజిప్ట తొలి ఫారొ – నార్మర్ (Narmer). అతడి మరోపేరు మెనెస్ (Menes) (3100 B.C.). ఆఖరి ఫారో– రెండవ నెక్టానెబొ (Nectanebo II) ఈజిప్ట దేశస్థుడు;

క్లియొపాత్రా, సిజెరియాన్ (టాలమీ వంశస్థులు)

మాగ్జిమైనస్ దైయా (గ్రీకు) (314 A.D.). ఫారొ.

దాదాపు 170 మంది ఫారోలు ఈజిప్టను 3000 సంవత్సరాలు పాలించారు. వీరిలో ప్రఖ్యాతిగాంచినవారు:

1) జొసర్ (Djoser) 2686-2649 B.C. - సక్కారా పిరమిడ్
2) కుఫు (Khufu) 2589-2566 B.C. - గిజా పిరమిడ్
3) హాట్‌షెప్‌సట్ (Hatshepsut) 1478-1458 B.C. - మహిళా ఫారొ
4) మూడవ థుట్‌మొస్ (Thutmose III) 1458-1425 BC - ఓటమి ఎరుగనివాడు
5) అమెన్ హొటెప్ (Amenhotep III) 1388-1351 BC - ప్రశాంత ఈజిప్ట
6) అఖెన్‌ఎటెన్ (Akhenaten) 1351-1334 BC - సూర్యారాధకుడు
7) టుటన్‌ఖామున్ (TutanKhamun) 1332-1323 BC - కింగ్ టుట్
8) రామ్‌సెస్ (Ramses II) 1279-1213 BC - మహావీరుడు
9) క్జెర్‌క్జెస్ (Xerxes I) 486-465 BC - నియంత
10) క్లియొపాత్రా (Cleopatra) 51-30 BC - మహారాణి

PHARAOH

3. చిత్రలిపి
(Hieroglyph)

హీరొగ్లిఫ్ అంటే చిత్రలిపి. పవిత్రాక్షరాలు. దేవుని మాటలు శిలలపై, కొయ్య, లోహాలపై చెక్కినవి కావచ్చును. ఒక భావాన్ని లేదా ఆలోచనను వ్యక్తపరిచేవి చిత్రలిపులు. ఇవి

1) వస్తు రూపాన్ని, క్రియను

2) శబ్దాన్ని, ధ్వని సముచ్ఛయాన్ని

3) వాక్యపు అర్థాన్ని సూచిస్తాయి.

ఈజిప్టు, అనటోలియా, అజెక్ట్, చైనా, మాయన్, మికాంకు, మ్యుస్కా, ఒజిబ్వె, ఒల్మెక్ చిత్రలిపులు వేర్వేరు ప్రాంతాల్లోని లిపి పరిణామాల్ని తెలుపుతాయి.

ప్రాచీన ఈజిప్షియన్లు వ్రాత (Writing) ను తోత్ (Thoth) దేవుడు సృజించాడని, ఆ చిత్రలిపిని Mdju netjer - Words of the gods - దేవభాష – దేవతల పదాలుగా భావించేవారు.

అలెగ్జాండ్రియాకు చెందిన క్లిమెంట్ (Clement) తొలుదొల్త ఈ పదాన్ని (Hieros-Sacred) (Glyph - Inscriptions) వాడినాడు.

దాదాపు 1000 చిత్రలిపి చిహ్నాలున్నాయని ఓ అంచనా. పూజారులు వ్రాసే పద్ధతిని – Priestly writing ను Hierotic గా, డాక్యుమెంట్లు వ్రాసే తీరును Demotic గా పిలిచారు.

గ్రీకు ఆల్ఫాబెట్‌ను అనుసరించిన ఈజిప్షియన్ భాష కొప్టిక్ (Coptic Alphabet). Demotic అంటే ప్రజలభాష లేదా వ్యావహారిక భాష.

Cartouche అంటే అక్షరాల చుట్టూ గీసిన గీత కలిగిన పదం.



HIEROGLYPHS



Egyptian Scribe

HIEROGLYPH

4. పాపిరస్
(Papyrus)

నైలు డెల్టాలో విస్తారంగా పెరిగే పాపిరస్ మొక్క (Cyperus Papyrus) గుజ్జు నుంచి తయారుచేసిన ఉపరితలం వ్రాయడానికి అనువుగా ఉంటుందని ఈజిప్షియన్లు భావించినారు.

పాపిరస్ కాండాలను ఒక దగ్గరకు చేర్చి వాటిపై బరువు ఉంచి ఒత్తడం ద్వారా అవన్నీ కలిసి ఒక దళసరి పొరగా మారేవి.

పాపిరస్ రెల్లు నుంచి చేసిన పాపిరస్, జంతువుల చర్మాల నుంచి (Vellum) పార్చిమెంట్ (Parchment), లోహపు రేకులు, తాళపత్రాలు, వస్త్రాలు, అమాతె (Mexico Bark-paper), ఆస్ట్రకాన్ (Ostracon-Pottery - Earthenware - మట్టి పలకలు), కొయ్య గుజ్జుతో చేసిన కాగితం (Paper), మైనం (Wax Tablets), బిర్చ్ బెరడు (Birch Bark) ఇవన్నీ వ్రాయసకాడికి (Scribe) ఉపయోగ పడేవి.

పాపిరస్ మొక్కను ఆహార పదార్థంగా వాడినపుడు పాపిరస్ (Papyros)గా, బుట్టలు, కాగితం, పడవల తయారీకి వాడినపుడు 'బిబ్లాస్' (Biblos)గా పిలిచేవారని Theophrastus వ్రాసినాడు. పాపిరస్ నుంచి పేపర్; బిబ్లాస్ నుంచి Bibliography, Bibliophile, Bible పదాలు వచ్చాయి.

పాపిరస్ మొక్క బెరడు లోపలి తెల్లటిపొర బిబ్లాస్. ఈజిప్షియన్ భాషలో పాపిరస్‌ను Wadj, Tjufy, Djet అని పిలిచేవారు.

Papyrus



Rosetta Stone

5. రొజెట్టా శిల
(Rosetta Stone)

ఈజిప్టలో రషీద్ (Rashid - Rosetta) పట్టణంలో నెపొలియన్ సైనికులు కనుగొన్న శిలాశాసనం రొజెట్టాశిల (15 జులై 1799).

క్రీస్తుపూర్వం 196లో అయిదవ టాలమీ (Ptolemy V) రాజును దైవాంశ సంభూతుడిగా గుర్తిస్తూ పూజారులు తీసుకున్న నిర్ణయాన్ని – హీరొగ్లైఫ్, డెమొటిక్, ప్రాచీన గ్రీకు అక్షరాలలో చెక్కినారు. దొరికిన శిలాభాగంలో 14 హిరొగ్లైఫ్, 32 డెమొటిక్, 53 ప్రాచీన గ్రీకు పంక్తులు కానవస్తున్నాయి.

పియర్రి–ఫ్రాంకాయిస్ బొఛార్డ్ (Pierre-Francois Bouchard), థామస్ యంగ్ (Thomas Young), జీన్ ఫ్రాంకాయిస్ ఛాంపొల్లియన్ (Jean Francois Champollion) ల కృషి వలన హీరొగ్లైఫ్‌ల అర్ధ తాత్పర్యాలు తెలుసుకోవడం వీలుపడింది.

ఫ్రెంచి దేశపు పరాజయానంతరం రొజెట్టాశిల బ్రిటిష్‌వారి అధీనంలోకి వచ్చింది. ఫిబ్రవరి 1802లో ఇంగ్లాండ్‌కు చేరుకున్న ఈ శిలాశాసనాన్ని మూడవ జార్జి ప్రభువు ఆదేశాలతో బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరచినారు.

ఈజిప్షియన్ హీరోగ్లైఫులను అర్థం చేసుకునేందుకు ఉపకరించిన ఈ గ్రానైట్ శిలాశాసనం ప్రాచీన ఈజిప్టు నాగరికత, విజ్ఞానం, జీవన విధానాలను అధ్యయనం చేసేందుకు పరిశోధకులకు చక్కటి మార్గాన్ని చూపింది.

6. ద్వి కిరీటం
(Double Crown)

Double Crown (Pschent) ద్వి కిరీటం – ఈజిప్టులోని ఎగువ, దిగువ భాగాలు కలిసిన సంయుక్త ఈజిప్టును తెలుపుతుంది. ప్రాచీనులు ఈ ద్వికిరీటాన్ని స్ఖెంటె – Sekhemty (Shmty) – ఇద్దరు శక్తివంతులుగా పిలిచేవారు.

దిగువ ఈజిప్ట అధిదేవత వడ్‌జెత్ (Wadjet) – కాటువేయబోతున్న సర్పరూపిణి (Uraeus)గా, ఎగువ ఈజిప్ట అధిదేవత నెఖ్‌బెత్ (Nekhbet) – రాబందు లేదా డేగ (Egyptian Vulture) చిహ్నాలు వాడేవారు. వీరిని ఇద్దరు యువతులు – Two Ladies గా వ్యవహరించేవారు.

దిగువ ఈజిప్ట కిరీటం ఎర్రరంగులో, ఎగువ ఈజిప్ట కిరీటం తెల్లరంగులో ఉంటుంది.

ఈజిప్ట రాజుల కిరీటాలు:

1) ఎటెఫ్ (Atef) - ఒసిరిస్ కిరీటం తెల్లరంగులో రెండువేపులా ఉష్ట్రపక్షి ఈకలతో ఉంటుంది.
2) డిజ్రెత్ (Deshret) - దిగువ ఈజిప్టును సూచిస్తుంది. ఎర్రటిరంగు, బోర్లించిన కప్పులా ఉంటుంది.
3) హెడ్‌జెత్ (Hedjet) - ఎగువ ఈజిప్ట చిహ్నం. తెలుపు.
4) హెమ్‌హెమ్ (Hemhem) - కేక, అరుపు, పిలుపు దీని అర్థం. ఎటెఫ్‌కు గొర్రె కొమ్ములు బిగించబడి ఉండి, రెండు సర్పాల (Uraei) చిహ్నాలుంటాయి.
5) స్ఖెంటె (Pschent) - ద్వికిరీటం.
6) క్యాప్ కిరీటం (Cap Crown) - రెండు సర్పాల చిహ్నాలతో కూడిన స్వర్ణజరీ నూలువస్త్ర తలపాగా.

మిగతా కిరీటాలు:

1) న్యాయ కిరీటం (Crown of Justification). మృతుల శిరస్సు చుట్టూరా అలంకరించిన పూలదండ. మృత్యువుపై విజయాన్ని సూచిస్తుంది.
2) సూర్యకిరీటం (Radiant, Sun Crown) తలపాగా లేదా కిరీటం. కిరణాలను వెదజల్లుతున్న సూర్యుడికి చిహ్నం.
3) రాబందు కిరీటం (Vulture Crown - రాచస్త్రీలు, మహిళా ప్రభువులు (Female Pharaoh) ధరించే కిరీటాలు. నెఖెబెత్ రక్షకదేవత రూపం.
4) గిద్ద కిరీటం (Modius) - ధాన్యాన్ని కొలిచే పాత్రలా తలపై ఉంచే కిరీటం. సంతానోత్పత్తికి చిహ్నంగా దీనిని భావించేవారు.
5) నెమెస్ (Nemes) - చారల తలపాగా. తుతన్ ఖామున్ (Tutankhamun) మమ్మీపై ఈ రకం తలపాగాను చూడవచ్చు.

7. ప్రాచీన ఈజిప్టు
(Ancient Egypt)

ఎ) పూర్వ సామ్రాజ్యకాలం (Pre Dynastic Period) (5000-3100 B.C.) – రాతియుగపు మానవుడు (Hunter-gatherer) (వేట, పండ్లు ఏరుకోవడం) సంచార స్థితి నుంచి వ్యవసాయదారుడిగా స్థిరజీవన వ్యవస్థ వేపు మారే క్రమపు కాలమిది. మరణానంతర జీవనంపై విశ్వాసం, నైలునదికి రెండు వేపులా– ఉత్తరదిక్కున ఎర్రనేల, దక్షిణాన తెల్లనేల; రాచరిక వ్యవస్థ ప్రారంభం. దక్షిణ దేశపు స్కార్పియాన్ వృశ్చిక రాజు ఉత్తరదేశంపై దండెత్తడం (3200 B.C.)

బి) ఆర్కాయిక్ (Archaic) - Early Dynasty (3100-2686 B.C.) - ఉత్తర దేశాన్ని జయించి సమైక్య ఈజిప్టును పాలించిన తొలి ప్రభువు మెనెస్ (Menes). నైలు డెల్టా తెల్లటి గోడల ప్రదేశాన్ని రాజధానిగా నిర్మించినాడతడు. అదే కాలక్రమేనా మెంఫిస్ (Memphis) పట్టణంగా ఖ్యాతినొందింది. రాజు దైవాంశసంభూతుడుగా, హోరస్ ప్రతినిధిగా భావించబడినాడు. చిన్నిచిన్ని గ్రామాలు; బార్లీ, గోధుమ పంట పొలాలు; నైలునదీ వరదలు ఈజిప్టులో ఆ రోజుల్లో కానవచ్చే దృశ్యాలు.

సి) పాత సామ్రాజ్యం (Old Kingdom) - పిరమిడ్ల కాలం (Age of the Pyramid Builders) (2686-2181 B.C.)

ఫారోల మూడవ డినాస్టిలో జోసర్ (DJoser) ప్రభువు 2630 B.C. ప్రాంతంలో తన ప్రధాన పూజారి, వైద్యుడు, భవన నిర్మాత ఇమ్‌హొటెప్ (Imhotep) అధ్వర్యంలో తన మరణానంతర జీవనం కోసం ప్రపంచంలోనే గొప్ప రాతిభవనంను సక్కారా (Saqqara - Memphis - Step Pyramid)లో నిర్మింపచేసినాడు.

తరువాత 2589–2566 బి.సి. కాలంలో ఈజిప్టును పాలించిన ఖుపు (Khufu-Cheops) ప్రభువుకై కైరో (Cairo) నగరపు పొలిమేరలో గిజా (Giza) పిరమిడ్ (ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటి) నిర్మించబడింది. లక్షమంది పనివాళ్లు 20 ఏళ్లు శ్రమించి నిర్మించిన బృహత్ కట్టడమది. ఖాఫ్రా పిరమిడ్ 2558–2532

B.C. లో, మెన్‌కౌరా పిరమిడ్ 2532–2503 B.C.లో నిర్మించబడినాయి. మూడు, నాలుగు డినాస్టిల కాలంలో వెల్లివిరిసిన శాంతి, సౌభాగ్యం, అయిదు–ఆరు డినాస్టిల కాలం నాటికి న్యుబియా, లిబియా దండయాత్రల వలన, పిరమిడ్ల నిర్మాణపు వ్యయం వలన ఖాళీ అయిన కోశాగారం వలన రెండవ పెపి (King Pepy II) మరణ కాలానికి సంక్షుభిత స్థితిలోకి చేరుకున్నది.

డి) తొలి మధ్యయుగం (First Intermediate Period 3181-2055 B.C.) అంతర్యుద్ధాలు, కరువు కాటకాలు, బయటి దేశాల దండయాత్రలతో ఈజిప్టు అతలాకుతలమైన కాలమిది. మెంఫిస్–థెబెస్‌ల మధ్య ప్రాంతాన్ని హెరాక్లియోపొలిస్ రాజధానిగా పదిహేడు తరాలు గడిచాక, 2055 B.C.లో థెబెస్ యువరాజు మెంటుహోటెప్ (Mentuhotep) హెరాక్లియొ పొలిస్‌ను ఆక్రమించి మరల ఈజిప్టును ఏకీకరణ చేసినాడు.

ఇ) మధ్యయుగం (Middle Kingdom) - 12th Dynasty (2055-1786 B.C.). పదకొండవ డినాస్టి ప్రభువు నాలుగవ మెంటుహోటెప్ (Mentuhotep) హత్య తరువాత అధికారం అతడి మంత్రి (వజీర్) చేజిక్కింది. మొదటి అమెన్‌ఎమ్‌హెట్ (Amenemhet)గా పన్నెండవ డినాస్టి (శకం) ప్రారంభమయ్యింది. ఇట్–టొవి (It-towy) రాజధానిగా, యువరాజు సహపాలనాధికారిగా (Co-regent) పరిపాలన సాగడంతో అంతఃపుర కలహాలు లేకుండా అధికార మార్పిడి సవ్యంగా జరిగేది. బంగారం, దేవదారు కలప, ఏనుగు దంతాలు విస్తారంగా లభించే న్యుబియా, ఈజిప్టు ఏలుబడిలోకి రాగా, బెడౌయిన్ (Bedouins)లను తరిమికొట్టడంతో రాజ్యంలో శాంతి నెలకొన్నది. మూడవ అమెన్ ఎమ్‌హెట్ (1842-1797 B.C.) నాటికి ఉచ్ఛస్థితిని చేరుకున్న మధ్యయుగం నాల్గవ అమెన్ ఎమ్‌హెట్, అతడి సోదరి సొబెక్‌నెఫెరు (Sobekneferu) (తొలి ఈజిప్టు మహిళా ప్రభువు) పరిపాలన కాలంలో ప్రాభవం తగ్గనారంభించింది.

ఎఫ్) రెండవ మధ్యయుగం (Second Intermediate Period) (1786-1567 B.C.). పదమూడో డినాస్టి కాలంలో అనేక అధికార పీఠాలు, తగాదాలు మొదలైనాయి. 1650 B.C.లో హిక్సాస్ (Hyksos)లనబడే పరాయిదేశస్థుల పాలనలోకి ఈజిప్టు వెళ్లిపోయింది. 1570 B.C.లో జరిగిన తిరుగుబాటులో ఈజిప్టు ప్రజలు హిక్సాస్ ప్రభువులను తరిమికొట్టినారు.

జి) కొత్త యుగం (**New Kingdom** 1567-1085 B.C.) మొదటి అహమోస్ (Ahmose-I) కాలంలో (18వ డినాస్టి) మరల ఈజిప్టు ఏకీకరణ కాగా తొలి ప్రాభవాన్ని సంతరించుకున్నది. న్యుబియా నుంచి ఆసియాలోని యూఫ్రటిస్ నది వరకు ఈజిప్టు సామ్రాజ్యం విస్తరించగా ప్రపంచంలోనే అతిపెద్ద సామ్రాజ్యంగా ఖ్యాతినొందింది. మొదటి అమెన్ హొటెప్ (1546-1526 B.C.), థుట్‌మోస్ (Thutmose 1525-1512 B.C.), రాణి హాట్‌షెప్‌సట్ (Hatshepsut 1503-1482 B.C.), మూడవ అమెన్‌హొటెప్ (1417-1379 B.C.) ప్రసిద్ధులైన ఈజిప్టు పరిపాలకులు.

నాల్గవ అమెన్‌హొటెప్ బహుదేవతారాధనకు స్వస్తిచెప్పి సూర్యదేవుడు–అటెన్ (Aton) ఒక్కడే భగవానుడని ప్రకటించి తనను అఖెనాటన్-Akhenaton - Servant of the Aton గా పేరిడుకున్నాడు. అతడి రాజధాని అమర్నా (Amarna). అతడి మరణానంతరం ఈజిప్టు ప్రజలు మరల బహుదేవతారాధన వేపు మొగ్గు చూపినారు.

19, 20 డినాస్టిలను రామెస్సెస్ (Ramesses Period)గా వర్ణిస్తారు. మోసెస్ నాయకత్వాన ఇజ్రాయెల్ ప్రజల వలస (Exodus of Israelites) రెండవ రామ్‌సెస్ (1304-1237 B.C.) కాలంలో జరిగిందని పరిశోధకుల అభిప్రాయం.

ఈ కాలపు ప్రభువుల సమాధుల్లో దాదాపు చెక్కుచెదరకుండా లభ్యమైనవి తుతన్‌ఖామెన్ (Tutankhamen 1361-1352 B.C.) సమాధి. దీనిని 1922 A.D.లో కనుగొన్నారు. మూడవ రామ్‌సెస్ ప్రభువు గుడి (1187-1156 B.C.) కూడా ధ్వంసం కాకుండా మిగిలింది.

హెచ్) మూడవ మధ్యయుగం (Third Intermediate Period 1085-664 B.C.) – ఒరవై ఒకటో డినాస్టి నుంచి వికేంద్రీకరణ ప్రారంభమయ్యింది. ఇరవై రెండో డినాస్టి శశాంక్ (Sheshonq) అనే లిబియన్ వంశస్థుడు అధికారాన్ని చేజిక్కించుకుని స్థిరపడినాడు. ఇరవై అయిదో డినాస్టి కుష్ ప్రాంతపు న్యుబియన్ల ప్రభువులైన షబాకొ (Shabako)తో మొదలైంది. 671 B.C. లో అస్సిరియన్ పరిపాలకుడు ఎసార్‌హద్దన్ (Esarhaddon) కుషైట్ ప్రభువు తహర్కా (Taharka) ను మెంఫిస్ నుంచి తరిమికొట్టి, పట్టణాన్ని ధ్వంసం చేసినాడు.

ఐ) అలెగ్జాండర్ దండయాత్ర వరకూ (664 B.C. - 332 B.C.) - ప్సమ్మెటికస్ (Psammetichus)ల సయెట్ (Saite) ప్రభువుల పాలన రెండు శతాబ్దాలు సాగింది. 525 B.C. లో పర్షియా ప్రభువు కాంబిసెస్ (Cambyses) మూడవ ప్సమ్మెటికస్‌ను పెలూసియం యుద్ధంలో ఓడించి ఈజిప్టును పర్షియన్ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

డరియస్ (Darius 522-485 B.C.), క్జెర్‌క్జెస్ (486-465 B.C.), అటాక్జెర్‌క్జెస్‌లు ఈజిప్టును పరిపాలించారు. 332 B.C. లో అలెగ్జాండర్ పర్షియన్లను ఓడించి ఈజిప్టును మాసిడోనియన్ల పాలనకిందకు తెచ్చాడు.

జె) నవీనయుగం (Modern Period) - అలెగ్జాండర్ మరణానంతరం ఈజిప్టు, టాలమీ (Ptolemy)ల పాలనలోకి వెళ్లింది. టాలమీ వంశస్థులలో ప్రముఖురాలైన క్లియోపాత్రా రోమన్ ఆక్టేవియన్ చేతిలో ఓడిపోగా 31 B.C. నాటికి ఈజిప్టు రోమన్ సామ్రాజ్యంలో భాగమైనది. ఆరు శతాబ్దాల పాటు క్రిస్టియన్‌ల పాలనలో ఉన్న ఈజిప్టు, క్రీస్తుశకం ఏడవ శతాబ్దంలో అరబ్బుల వశమైనది. ఇస్లాం మతాన్ని ప్రజలు స్వీకరించగా ప్రాచీన ఈజిప్టు సంస్కృతి, నాగరికతలు చరిత్ర పుటలలో జ్ఞాపకాలుగా మిగిలినాయి.



MODERN EGYPT

8. నవీన ఈజిప్టు
(Modern Egypt)

దేశం	–	అరబ్ రిపబ్లిక్ ఆఫ్ ఈజిప్టు గొమొరెయ్యెత్ మసర్ ఎల్ అరేబియా
భాష	–	అరబిక్ (ఈజిప్షియన్ అరబిక్)
మతం	–	సున్ని ముస్లిమ్, కాప్టిక్ క్రిస్టియానిటి (5–15%)
ప్రభుత్వం	–	Unitary Semi Presidential Republic
వైశాల్యం	–	10,10,408 చదరపు కిలోమీటర్లు
జనాభా	–	100,075,480 (పదికోట్లు)
స్థూల ఉత్పత్తి	–	1.4 ట్రిలియన్ డాలర్లు
తలసరి ఆదాయం	–	14023 డాలర్లు
కరెన్సి	–	ఈజిప్షియన్ పౌండు (4.73 రూపాయలు)
కాలింగ్ కోడ్	–	+20
డ్రైవింగ్	–	కుడివేపు
ISO 3166 Code	-	EG, eg, egy
ప్రెసిడెంట్ (2020)	–	అబ్దెల్ ఫతా ఎల్ – సిసి
ప్రధానమంత్రి (2020)	–	ముస్తఫా మదబౌలి
ప్రాచీన ఈజిప్టు దేశపు పేరు	–	కెమెత్ (Kemet) - నల్లనేల
ముఖ్య నది	–	నైలు నది
పర్వతాలు	–	తూర్పు పర్వతశ్రేణి
రాజధాని	–	కైరొ (Cairo)
ఇతర పట్టణాలు	–	అలెగ్జాండ్రియా, అశ్వన్; అస్యుత్, సయ్యద్ పోర్ట్, సూయజ్, ఇస్మాలియా

Nile River Map

9. నైలు నది
(Nile River)

నైలు నది – an Nil (Arabic), అమన్‌దాపు (Nobiin)

పొడవు – 6650 కిలోమీటర్లు (Longest River)

దేశాలు – టాంజానియా, ఉగాండా, ర్వాండా, బురుండి, కాంగొ, కెన్యా, ఇథియోపియా, ఎరిట్రియా, దక్షిణ సూడాన్, సూడాన్, ఈజిప్టు.

భాగాలు – బ్లూ నైల్ (Blue Nile) - 80% of Water, Silt
వైట్ నైల్ (White Nile) - పొడుగైనది

తెల్ల నైలునది మధ్య ఆఫ్రికాలోని మహా సరస్సులున్న ప్రాంతంలో (ర్వాండా, బురుండి) మొదలై టాంజానియా, విక్టోరియా, సరస్సు, ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో ప్రవహిస్తుంది.

నీలి నైలునది తానా సరస్సు – ఇథియోపియాలో మొదలై సూడాన్ రాజధాని ఖార్టూమ్ (Khartoum) దగ్గర తెల్ల నైలునదిలో కలవగా ప్రధాన నైలునదిగా ప్రవహించి మధ్యధరా (Medetterian Sea) సముద్రంలో కలుస్తుంది.

పేర్లు – హపి (ఇటెరు–ఈజిప్షియన్) పియారొ–నది, River
అమన్ దావు (నొబిన్) – The Great Water – మహా జలప్రవాహం
ఎన్ నిల్ (En Nil) - ఈజిప్షియన్ అరబిక్ (నహల్–నది)
హ షిహర్ (Ha-Shihor) – బిబ్లికల్ హీబ్రూ

ఉపనదులు – అట్‌బరా, బ్లూ నైల్, బార్ ఎల్ ఘజల్, సొబత్ నది,
పసుపు నైల్ (Yellow Nile)

ఈజిప్టును నైలునది ఇచ్చిన బహుమతి (The Gift of the Nile) గా గ్రీకు చరిత్రకారుడు హెరొడొటస్ (Herodotus) అభివర్ణించాడు.

10) బైబిల్‌లో ఈజిప్టు
(Biblical Egypt)

హీబ్రూలు మిస్–రా–యిమ్ (Mizraim)గా పిలిచిన దేశం ఈజిప్టు. ఇజ్రాయెలులకు ఆశ్రయమిచ్చినదీ, అణగదొక్కినదీ ఈజిప్టు దేశమే.

ఆదికాండము (The Book of Genesis) - కానాన్ (Canaan) ప్రాంతంలో కరువు కాటకాలు సంభవించినపుడు అబ్రహాం, సారా, లాట్‌లు ఈజిప్టు చేరుకుంటారు. ఫారోకు సారా తన సోదరి అని అబ్రహాం చెప్పడంతో సారా (Sarah) అందానికి ముగ్ధుడైన ఫారో ఆమెను తన అంతఃపురానికి పంపిస్తాడు. ప్రతిగా అబ్రహాంకు అనేక బహుమతులతో పాటు హగర్ (Hagar) అనే యువతిని బానిసగా ఇస్తాడు. హగర్ తరువాత అబ్రహాంకు సహచరి అవుతుంది. కొన్నాళ్లకు రాచకుటుంబీకులను ప్లేగు వ్యాధి పీడించగా దానికి కారణం 'సారా'గా అనుమానించిన ఫారో ఆమెను తిరిగి అబ్రహాం వద్దకు పంపివేస్తాడు. (అబ్రహాం భార్య సారా అని నిజం తెలుస్తుంది ఫారోకు).

అబ్రహాం–సారాల మనమడు జాకబ్. జాకబ్–రాఛెల్‌ల కుమారుడు జోసెఫ్. స్వప్న విశ్లేషకుడైన జోసెఫ్ తరువాతి కాలంలో ఆనాటి ఫారోకు వజీర్‌గా ఉన్నతస్థానాన్ని పొందినాడు.

Book of Exodus - జోసెఫ్, అతడి సోదరుల తర్వాత తరాల ఇజ్రాయెలీలు ఈజిప్టు ప్రజలకు వెట్టిచాకిరి చేస్తూ తీవ్రంగా అణచివేయబడినారు. జోసెఫ్ సోదరుడైన లెవి (Levi) మునిమనుమడు మోసెస్ ఆనాటి ఫారో కుమార్తె బథియా (Bathia) వద్ద పెరుగుతాడు. తన జన్మవృత్తాంతం తెలిసిన మోసెస్ ఇజ్రాయెలులను ఈజిప్టు నుంచి దేవుడు నిర్ణయించిన Land of Milk and Honey కు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా ఫారొ నుంచి ప్రతిఘటనలనెదుర్కొని చివరకు సఫలుడయ్యాడు. (ఫారోను రెండవ తుత్‌మోసిస్ (Tuthmosis)గా, కొందరు రెండవ రామ్‌సెస్‌గా భావిస్తారు)

Books of Kings - డేవిడ్ కుమారుడు సొలొమాన్ (Solomon) ప్రభువు ఫారొ కుమార్తెను వివాహం చేసుకుని గెజెర్ (Gezer) పట్టణాన్ని వరకట్నంగా పొందాడు.

సొలొమాన్‌ను వ్యతిరేకించిన జెరొబొమ్ (Jeroboam) ఈజిప్టుకు పారిపోయి అప్పటి ఫారొ శిషాక్ (శశాంక్) ఆశ్రయం పొందినాడు.

Books of Chronicles - సొలొమాన్ కుమారుడు రెహొబామ్ (Rehoboam) ను శిషాక్ ఓడించి యూదా రాజ్యాన్ని ఈజిప్టు సామంత రాజ్యంగా ప్రకటించాడు.

Gospel of Matthew - జీసస్ పెంపుడుతండ్రి జోసెఫ్ తనకు కలలో దేవదూత చెప్పినట్లు మేరీ, జీసెస్‌లను తీసుకుని ఈజిప్టులో ఆశ్రయం పొంది హెరాద్ (Herod) ప్రభువు మరణించాక తిరిగి నజరెత్ చేరుకున్నాడు.

Land of Refuge, Land of Bondage గా ఆశ్రయమూ, అణచివేత రెండూ, ఈజిప్టులో ఇజ్రాయెల్ ప్రజలు అనుభవించినారు.

11. ఈజిప్టు వైభవం
(The Glory of Egypt)

"మూర్ఖుడి హృదయానికి సృష్టికర్త నిర్మాణ చాతుర్యం అర్థం కాదు. అతడి జీవితం దేవుడికి కూడా ఓ భారం. విధికి ముందుచూపుండదు. పరిక్రియ అపసవ్యంగా సంభవించదు. ఈ అద్భుత సృష్టి గావించిన ఆ దేవదేవుని కొనియాడ నెవరితరము? గమ్యము, అదృష్టమును మానవునికి పంపువాడు ఆ భగవానుడే!"

పదిహేను వందలమంది దేవుళ్లు, దేవతలు, మూడు వందలమంది రాజులు, ఆరువేల సంవత్సరాల చరిత్ర కలిగినదీ ఈజిప్టు నేల. గొప్పగొప్ప భవనాలు కాలగతిలో అదృశ్యమైనా శిలానిర్మిత దేవాలయాలు, సమాధులు వాటి గోడలపైనున్న వర్ణచిత్రాలు ఆనాటి ప్రభువుల, ప్రజల దైనందిన జీవిత విధానాలను కొంతవరకు తెలియజేస్తున్నాయి.

పాపిరస్‌లపై వ్రాయబడిన వైద్యగ్రంథాలు, ప్రార్థనాగీతాలు, కాల్పనిక గాథలు, మృతుల పుస్తకాలు, మంత్ర సూక్తాలు, ఇవన్నీ ప్రాచీన ఈజిప్టు నాగరికతా పరిణామ దశలను తేటతెల్లం చేస్తున్నాయి. పిరమిడ్లలో, సమాధులలో లభ్యమైన పాపిరస్ ప్రతులతోపాటు హెరొడొటస్, డయొడొరస్, ప్లుటార్క్ లాంటి రచయితల గ్రంథాలు ఆనాటి ఈజిప్టు సంస్కృతిని వివరిస్తాయి.

నైలునది లేకుంటే ఈజిప్టు నాగరికత లేదు. ఈజిప్టు వాసులకు నైలునది ఇతెరు–ఒక నదీప్రవాహం. ప్రశాంతంగా, మార్మికంగా, మంత్రముగ్ధంగా ప్రవహించే జలధార. "దిగువకు ప్రవహించే ఎగువ ప్రవాహం" అన్నాడు మొదటి టుత్‌మోసిస్ ప్రభువు.

వరదలు వచ్చినప్పుడు నది దాదాపు ఇరవై అయిదు అడుగుల (ఎనిమిది మీటర్ల) ఎత్తుకు పొంగి తనతో బురదమట్టిని తెచ్చి చుట్టుపక్కల నింపేది. ఇటుకలు, కుండలు చేయడానికి, పంటలకు అనువైన మట్టిని అందించేది. నదీ జలాలతోపాటు చేపలు, వాటిని వేటాడే పక్షులు, జంతువులు ఈజిప్టు ప్రజలకు ఆహారంగా దొరికేవి. నది అంచున పెరిగే పాపిరస్ రెల్లుగడ్డి ఇళ్లు, పడవలు, పాపిరస్ నిర్మాణానికి ఉపయోగపడేది. శుభ్రించే నది, మురుగుకాలవ రెండూ ఆ నదీ ప్రవాహమే! వాణిజ్యం,

రవాణా నైలునదిలో, కాలువల్లో విస్తృతంగా జరిగేది. నదీ ప్రవాహం, దాని కిరుపక్కలా సారవంతమైన నల్లనేల, అవతల ఇసుక ఎడారి ఎర్రటి నేల ఈజిప్టు ముఖచిత్రం.

ద్వంద్వాలైన ఎగువ-దిగువ ఈజిప్టు, ఎర్ర-నల్ల నేల, తూర్పు-పడమర నది ఒడ్డు, రాత్రి-పగలు, స్త్రీలు-పురుషులు, జనన-మరణాలు - ఇవన్నీ ఈజిప్టు ప్రాక్కథలలోని ముఖ్యాంశాలు. ప్రశాంతత (Maat) - అల్లకల్లోల స్థితి (Isfet) పరస్పర విరుద్ధ శక్తులు.



THE GLORY OF EGYPT



Egyptian God Ra, Solar Boat, Nun

12. సృష్టి - దేవతలు
(Creation Myths - Gods)

"నేను స్వయంభువును. నన్ను నేను నిర్మించుకున్నాను"

ఆది యందు ఏమియును లేదు – నన్ (Nun) లోతైన కృష్ణజలాలు మినహా. దేవతలు లేరు, ప్రజలు లేరు, వెలుతురు లేదు, కాలమూ లేదు. ఆ అనంత, నిశ్చల జలాలలో తేలియాడింది ఓ బ్రహ్మాండం. ఆ బ్రహ్మాండంలో కానవచ్చింది ఓ అద్భుత కాంతిమెరుపు. ఆ మెరుపు తాకిడికి బ్రహ్మాండం బద్దలు కాగా జీవం ఫెళ్లున విరిసింది. ఆ మహోజ్జ్వల వేగానికి 'నన్' జలాలలో ఏర్పడింది ఓ మట్టిపుట్ట. దానిపై విలాసంగా కూర్చున్న ఆదిదేవుడు అతుమ్ (Atum). స్వయంభువు అతడు. నవలోకానికి వెలుగును తెస్తున్న సూర్యుడతడు.

ఒంటరిగా పుట్టపై శయనించిన ఆ బాలుడు తన జననాంగాన్ని స్పృశించినపుడు జనించారు కవలలు – షు (Shu) పొడిగాలి దేవుడు, టెఫ్‌నట్ (Tefnut) తడిగాలి దేవత. వారిద్దరూ ఓ రోజున నన్ (Nun) జలాలలో అదృశ్యమైనారు. అతుమ్ నేత్రం వారిని నన్ జలాల అడుగున గమనించి వారిని పైకి తెచ్చింది. వారిని చూసి సంతోషించిన అతుమ్ కనుల నుంచి ఆనందబాష్పాలు స్రవించగా వాటి నుండి మానవులు జన్మించారు. దేవతలు, మనుషులు కలిసి చరించిన స్వర్ణయుగం అది.

పొడిగాలి–షు, తేమ–టెఫ్‌నట్‌లకు కవలలు – గెబ్ (Geb) భూదేవుడు, నట్ (Nut) ఆకాశదేవత జన్మించారు. 'గెబ్' నేలదేవరకు, నట్ ఆకాశ దేవతకు సంతానం నక్షత్రాలు. తన సంతానాన్ని మింగి తనలో ఇముడ్చుకున్నదని 'గెబ్' నేలదేవరకు కోపం రాగా 'నట్' ఆకాశదేవత భూదేవర నుంచి విడివడి విల్లులా వంగింది. వారి ఆగ్రహాన్ని ఉపశమింపచేసేందుకు 'షు' పొడిగాలి దేవుడు వారి మధ్య తనే చేతుల అలల్తో వారిని విడదీసి దూరంగా జరిపాడు. 'నట్' ఆకాశదేవత నవ్వులు ఉరుములు; ఆమె కన్నీళ్లు వర్షధారలు. గెబ్ నేలదేవర నవ్వులు భూకంపాలు; అతడి కోపాగ్నిజ్వాలలు కరువు కాటకాలు. నట్ ఆకాశదేవత వంపు శరీరంపై ప్రయాణిస్తాయి చంద్రుడు, తారలూ, సూర్యుడు. సాయంకాలం ఆమె సూర్యుడిని

మింగుతుంది, ఉదయాన ఆమె గర్భం నుంచి వెలువడుతాడు సూర్యుడు ప్రతిరోజూ. గెబ్–నట్‌ల సంతానం ఒసిరిస్ (Osiris), సెథ్ (Seth), ఐసిస్ (Isis), నెఫ్‌థిస్ (Nephthys).

1) అతుమ్ (Atum) ఆదిదేవుడు

2) షు (పొడిగాలి దేవుడు) – టెఫ్‌నట్ (తేమదేవత–తడిగాలి).

3) గెబ్ (భూదేవర) – నట్ (ఆకాశ దేవత)

4) ఒసిరిస్, సెథ్, ఐసిస్, నెఫ్‌థిస్

ఈ తొమ్మిదిమంది ప్రాచీన ఈజిప్టు ప్రధాన దేవతలు. దేవాలయాల వాస్తు కూడా దీనిని అనుసరించే ఉండేది.

దేవాలయం	–	సృష్టికి మూలమైన మట్టిపుట్ట
ప్రహరీ	–	జలాలను, మట్టిపుట్టను విడదీసేది.
కోనేరు	–	ప్రాచీన నన్ జలాలు
ముఖద్వారం	–	తూర్పు ద్వారం, కొండలు
భవన స్తంభాలు	–	పాపిరస్ కాండాలు, తామరపూలు
పవిత్ర పూజాపీఠం	–	ప్రాచీన దేవతల విశ్రమస్థానం
పైకప్పు	–	నట్ (ఆకాశ దేవత)
నేల	–	మట్టిపుట్ట అడుగు భాగం

తొమ్మిది మంది దేవతలలో మొదటి దేవుడు – ఆదిదేవుడు – అతుమ్ – ఆత్మ లేదా పరమాత్మ.

a) అతుమ్ (Atum)

ద్వంద్వ ప్రకృతి, స్త్రీ పురుష స్వభావం గల శక్తి. సృష్టి–విలయ కారకుడు. ఎగువ–దిగువ ఈజిప్టు ప్రభువు. రెండు కిరీటాలు, వంకీల గడ్డం – పాము, బీటిల్ పురుగు (Scarab), గొర్రెతల ఉన్న మానవరూపం, ఇచ్ న్యూమన్, సింహం, గిత్త, బల్లి, కోతి, మట్టిపుట్ట – రూపాలలో కనిపించే బహురూపి. అతడి ప్రత్యక్ష రూపం – రె – సూర్యుడు.

ఉదయ రూపం – ఖెప్రి (Khepri - Scarab Beatle) – ఉదయసంధ్యా సూర్యుడు
మధ్యాహ్న రూపం – రె అతుమ్ (Re Autm) - మండే సూర్యుడు
సాయంకాల రూపం – అతుమ్ (Atum) - సాయంసంధ్యా సూర్యుడు

అతుమ్ తన చేతితో జననాంగాన్ని తడిమినపుడు షు (పొడిగాలి), టెఫ్‌నెట్ (తడిగాలి) కవలలుగా జన్మించారు.

b) దివ్య కవలలు (షు–టెఫ్‌నెట్) (పొడిగాలి – తడిగాలి)

అతుమ్ సృజించిన హస్తం– ఇయుసస్ (Iusaas - She grows Great as she comes - పెరుగుదలగా, God's Wife; God's Hand-దైవ హస్తంగా) పూజింపబడింది. దైవహస్తపు రెండవ రూపం నెబెత్ ఎటిఫెట్ (Nebethetepet). ఈమె కానుకల ప్రదేశం – హుండీ – Lady of the field of offerings గా వర్ణించబడింది.

'అతుమ్' ఉమ్మినపుడు షు–పొడిగాలి, దగ్గిన కఫం నుంచి టెఫ్‌నెట్–తడిగాలి జన్మించారని పిరమిడ్ ప్రతులు – 600 మంత్రం చెబుతుంది. షు (శూన్యస్థితి) – తుమ్ముకు దగ్గరగా ఉండే పదం (Shu); టెఫ్ (తడి) – ఉమ్మి లేదా కఫం (Tefnut).

దేవాలయాలపై చిత్రించిన, చెక్కిన బొమ్మలలో ఈ బూతుబొమ్మలు సందర్శకులలో ఏహ్యభావాన్ని కలిగించాయని కొందరు యూరోపియన్లు అనుకునేవారు.

షు–పొడిగాలి – జీవశక్తి – పురుష స్వభావం
టెఫ్‌నెట్–తడిగాలి – ప్రేమశక్తి – స్త్రీతత్వం

ఇద్దరూ ఎదురెదురుగా నిలబడిన రెండు సింహాల రూపం రుతి (Ruty). (వీరిని సూర్యుడి పుత్రులు–యమ–యమిలుగా భావించవచ్చు). టెఫ్‌నెట్, బస్తెట్, సెఖ్‌మెట్, వడ్జెత్, హాథర్‌లను అతుమ్ సూర్యుడి నేత్రాలు (Eye-irt)గా పిలిచేవారు. పొడిగాలి–తడిగాలి (షు–టెఫ్‌నెట్) ఓసారి నున్ (Nun) జలాల్లో కనిపించకుండా పోయినపుడు అతుమ్ తన నేత్రాన్ని వారిని వెదకమని పంపించాడు. 'నున్' జలాల

అడుగున ఉన్న వారిని వెదికి పట్టుకుని సూర్యనేత్రి అతుమ్ వద్దకు తీసుకు వచ్చేసరికి అతుమ్ మరో నేత్రాన్ని తయారుచేసుకుని ఉండడం గమనించిన సూర్యనేత్రి ఆగ్రహంతో ఊగిపోయింది. ఆమెను శాంతపరచేందుకు సృష్టికర్త అతుమ్ ఆమెను నాగుపాముగా మార్చి తన కనుబొమపైన యురియస్‌గా అమర్చుకున్నాడు.

ఈజిప్ట్ పూజారులు మాట్లాడే భాష – బబూన్ కోతుల అరుపులకు దగ్గరగా ఉండేది. తోత్ (Thoth) ఈ భాషలో నిష్ణాతుడు. అతడు టెఫ్‌నెట్–తడిగాలి గురించి చెప్పిన కథ – The Lion in search of Man - మనిషికై వెదికిన సింహం. "అనగనగా ఓ కొండపై గొప్ప సింహం ఉండేది. అందరికీ ఆ సింహం అంటే భయం. ఒకరోజున ఆ సింహం అడవిలో తీవ్రగాయాలతో రోదిస్తున్న చిరుతపులిని చూసి, ఎవరు నిన్నిలా గాయపరిచారని అడిగింది.

సాహసికుడు, జిత్తులమారి అయిన మానవుడు తనను గాయపరిచాడని చెప్పి చనిపోయిందా చిరుత. కోపంతో ఊగిపోతూ మనిషి జాడకై వెదుకుతున్న సింహానికి తాళ్లతో కట్టివేయబడిన అనేక జంతువులు కనిపించాయి. తమను ఇలా కట్టి పెంపుడు జంతువులుగా మార్చుతున్నది మానవుడని, అతడికి దొరకవద్దని హెచ్చరించాయవి. సింహానికి మరింత కోపం వచ్చింది.

దారిలో ఓ ఎలుక తన దగ్గరకు పారిపోయి రాగా దానిని చంపకుండా వదిలేసినందుకు ఎలుక మీ ఋణం తీర్చుకుంటాననగా సింహం నవ్వింది. చిట్టెలుకవు నీవు, నా ఋణమేమి తీర్చుకుంటావులే – అని సింహం మానవుడిని వెదుకుతూ వెళ్లి వెళ్లి ఓ ఆకులతో కప్పబడిన గోతిపై అమర్చిన వలలో పడింది. తప్పించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నపుడు వల తాళ్లను కొరికి ఎలుక సింహాన్ని వల నుంచి విడుదల చేసింది. సింహ రూపం నుంచి తడిగాలిగా మారి టెఫ్‌నెట్ మరల తన కొండగుహకు చేరుకున్నది" అని చెప్పాడు తౌత్.

సూర్యనేత్రి షు–టెఫ్‌నెట్‌లను నున్ జలాల్లో వెదికి తెచ్చినపుడు అతుమ్ నేత్రాల నుంచి కారిన ఆనందబాష్పాలే మానవులు.

షు–టెఫ్‌నెట్‌లే కలయికలో పుట్టాయి నింగి (నట్–Nut), నేల (గెబ్–Geb).

c) గెబ్-నట్ (నేల-నింగి)

పొడిగాలి (షు), తడిగాలి (టెఫ్‌నెట్)ల కలయికతో గెబ్ దేవుడు-నేల, నట్ దేవత నింగి జన్మించాయి. నేల-నింగిలను వాయుదేవత-పొడిగాలి షు విడదీయగా దుఃఖించిన గెబ్ దేవుడి కన్నీళ్లు సముద్రాలైనాయి. (గెబ్ రూపాలు- ఆకుపచ్చని మైదానాలు, బాతు, కుందేలు); (నట్ రూపాలు- నింగి, పాలపుంత). నింగి నేలల పరిధి, పొడుగాటి కొమ్ములున్న ధేనువు; నింగి-నేలను విడదీసిన వాడు వారి తండ్రి- షు (పొడిగాలి). నింగి-నేల (నట్-గెబ్)ల కుమారులు - ఒసిరిస్, సెథ్; కుమార్తెలు- ఐసిస్, సెఫ్‌థిస్.

అతుమ్, షు, టెఫ్‌నెట్, గెబ్, నట్, ఒసిరిస్, సెథ్, ఐసిస్, నెఫ్‌థిస్‌లు తొమ్మిదిమంది (ఎన్నీడ్-Ennead) - నవదేవతలు.

అగాథపు జలాలలో మంటల మట్టిదిబ్బ (The Mound of Fire) ఈజిప్ట్ ప్రాక్కథలలో సృష్టికి కారణభూతమైనదిగా భావించబడింది.

1) జ్వాలాయుత మృణ్మయరాశి (Mound of Fire)
2) బాతు, ఇబిస్ కొండ లేదా డేగ (ఫాల్కన్)
3) నీలి పద్మం (కలువ-Nymphaea Caerulea)

హెర్మాపొలిస్ (Hermapolis-Modern Ashmunein) పూజారుల కథనం ప్రకారం నలుగురు మండూక దేవుళ్లు, నలుగు సర్పదేవతలు ఈ సృష్టికి కారణభూతులు (కప్ప-పాము).

1) నున్ - నానెత్ (Nun-Naunet) - Chaos - అవ్యక్తస్థితి
2) హె - హౌహెత్ (He-Hauhet) - Infinity - అనంతం
3) కెక్ - కాకెత్ (Kek-Kauket) - Darkness - చీకటి
4) అమెన్-అమానెత్ (Amun-Amaunet) - Hiddenness - మార్మికత

అనంత-అగాధ జలాల మధ్య ఆకస్మికంగా ఏర్పడింది ఓ జ్వాలావలయుత ద్వీపం. Tatenen-తాతెనెన్ ఆ దేవుడి పేరు. (పవిత్ర ప్రదేశం).

ఆ సువర్ణ జ్వాలా భాండం నుంచి వెలువడింది ఓ సహస్రదళ పద్మం. ఆ రేకులు విచ్చుకోగానే కానవచ్చిన సూర్యబింబం శిశువుగా, స్కరాబ్ బీటిల్-

పేడపురుగుగా కానవచ్చిన రూపం. కొందరికి ఆ జ్వాలా ప్రదేశంలో కానవచ్చింది బ్రహ్మాండం. బహుశా విశ్వహంస లేదా ఓ గొప్ప బాతు పెట్టిన గుడ్డులా! ఆ బాతు పేరు గెన్‌జెన్ (Gengen). తోత్ రూపమైన ఐబిస్ కొంగ గుడ్డులా! కొందరు దానిని ఆదిసర్పమైన అమెన్–కెమాటెఫ్ (Amen-Kematef) అండంగా పూజించినారు.

అనంత జలాల మధ్య జ్వాలాయుత ద్వీపం నాభిలా కానరాగా దాని నుంచి తామరతూడు, దాని చివర వికసించిన పుష్పం. దానిలో సువర్ణకాంతులతో ధగద్ధగాయమానంగా ప్రజ్వరిల్లుతున్న సూర్యబింబం. సమస్త దేవతలకు జన్మస్థానం ఆ జ్వాలాద్వీపం.

d) మెంఫిస్ ఆదిదేవుడు 'ప్తా' (Ptah of Memphis)

మెంఫిస్ త్రిమూర్తులు – ప్తా (Ptah), అతడి భార్య సెఖ్‌మెత్ (Sekhmet) - వారి పుత్రుడు – నెఫెర్‌తెమ్ (Nefertem).

ప్తా దేవుడు ఈజిప్టు దేవతల మయశిల్పి. అతడి హృదయపు ఆలోచన నుంచే ప్రపంచం ఆవిర్భవించి, అతడి మంత్రాక్షరాల నుంచి కార్యరూపం దాల్చింది.

25వ సామ్రాజ్య కాలంలో న్యుబియన్ ఫారొ (Pharaoh) షబక (Shabaka) మెంఫిస్ దేవాలయం జీర్ణస్థితిలో ఉన్న పాపిరస్ పత్రాన్ని శిలాక్షరాలుగా శిలపై వ్రాయించాడు. 'షబక్ శిల'గా దానికి పేరు వచ్చింది.

లోహకారుడు, శిల్పి! నౌకా నిర్మాత, వడ్రంగుల అధిదేవత ప్తా (Ptah). ప్తా ఇతర పేర్లు– సుందర వదనుడు, సత్యమూర్తి, న్యాయాధీశుడు, ప్రార్థనల స్వీకర్త, ఉత్సవాధిదేవత, శాశ్వతుడు, స్వయంభువు, ద్విరూపుడు, తొలి సృష్టికర్త.

ఆకుపచ్చటి శరీరం, ముసుగు, వంకీల గడ్డం, రాజదండం (వస్–Was), అంఖ్ (Ankh)–జీవశక్తి, డజెడ్ (Djed) స్తంభం – అతడి చిహ్నాలు. శక్తి (Power-Was), జీవం (Ankh-Life), స్థిరత్వం (Djed-Stability) ఈ మూడింటిని సూచిస్తాయవి.

కాలం గడచినకొద్దీ 'ప్తా' ప్రాచీన ఆధునిక దేవతలతో కలిసి పరిగణించ బడినాడు.

సొకార్ (Sokar) ఫాల్కన్ దేవుడితో, ఒసిరిన్‌తో కలిసిన రూపాల్ని వివిధ కాలాల్లో ప్రాచీన ఈజిప్టు ప్రజలు 'ప్తా'ను ఆరాధించేవారు. తాతెనిన్‌గా, ఉత్సవాల (Hebsed) అధిదేవతగా, సూర్యుడిగా (Re), అతుమ్ (Atum, Aten)గా, 'బా' (ఆత్మ–ba) ఆత్మరూపాలైన షు, టెఫ్‌నెట్‌లుగా, పవిత్ర వృషభం ఎపిస్ (Apis) రూపంలో దేవతల రాయబారిగా (Herald of Re) 'ప్తా'ను పూజించేవారు.

ఈజిప్టు పేరు కూడా 'ప్తా' నామంతో ముడిపడి ఉండడం గమనార్హం. మెంఫిస్ (Memphis)ను ప్రాచీనులు హికుప్తా (Hikuptah - Home of the soul of the Ptah) అని పిలిచేవారు. గ్రీకు, లాటిన్ భాషలలో 'ఐగుప్త'గా ఇంగ్లీషులో ఈగుప్ట్, ఈజిప్ట్ (Egypt)గా రూపాంతరం చెందింది.

'ప్తా' దేవుడి అవతారంగా ఎపిస్ వృషభాన్ని ఆనాటి ప్రజలు కొలిచేవారు. రె–అతుమ్ కాంతి నుంచో, చంద్రుడి వెన్నెల నుంచో ఎపిస్ వృషభం జనించిందని నమ్మేవారు.

e) ఖ్నుమ్ (Khnum of Elephantine)

దేవతల కుంభకారుడు, నైలునది మట్టి నుంచి శిశువులను తయారుచేసి తల్లుల గర్భంలో ఉంచే దేవుడు 'ఖ్నుమ్' (Khnum). అశ్వన్ పట్టణానికి ఎదురుగా ఉన్న ఎలిఫంటైన్ (Elephantine) ద్వీపం ఈ దేవుడి నివాసస్థానం. పిల్లల సంరక్షక దేవత, గిజా పిరమిడ్ నిర్మాత – ఖ్నుమ్. ఖ్నుమ్ భార్య శాటిస్ (Satis), కుమార్తె అనుకెత్ (Anuket).

ఈజిప్టు ప్రజలకు జీవ ప్రవాహం నైలునది. నైలునది ఉధృతరూప వరద ప్రవాహం– హాపి (Hapy). చేపలకు, పక్షులకు అధిదేవత. పాపిరస్, తామరతూడుల తలపాగా, నీలి ఆకుపచ్చ రంగు, బొద్దుగా దేహం, తిండిపుష్టి గల శరీరం, జారిన రొమ్ములు, గుండ్రటి పొట్ట, గోచీ కట్టుకుని తిండి పదార్థాలను మోసుకువస్తున్న రూపం – హాపి; నేలమాలిగల్లోంచి నీరుబికినట్లు, స్త్రీపురుషుల సంభోగ సమయాన ఉద్రేకం ఉప్పొంగినట్లు నైలునది వరదలా పెల్లుబికి నేలను ముంచెత్తుతున్న రూపమది.

ఇతడిని అదుపులో ఉంచే దేవుడు 'ఖ్నుమ్'. ఖ్నుమ్– పడవలు, నిచ్చెనల అధిదేవత. కుమ్మరి సారెతో (Potter's Wheel) మట్టినుంచి కుండలు చేసినట్లు

శిశువుల్ని తయారుచేస్తాడు. వంపులు తిరిగిన కొమ్ములున్న 'గొర్రె' ముఖంతో 'ఖ్నుమ్' సంతానదేవుడుగా, పురిటినెప్పులను పర్యవేక్షించేవాడిగా పూజింపబడినాడు.

f) మిన్ (Min of Koptos)

సంతాన దేవత, నల్లటి ముఖం, స్తంభించిన శిశ్నం, లెట్యూస్ (Lettuce-పాలకూర తోట) చిహ్నాలు. ఒసిరిస్-ఐసిస్‌ల కుమారుడిగా, ఉత్సవాలకు అధిదేవుడిగా కాట్టస్, అఖ్‌మిమ్ ఎగువ ఈజిప్టు ప్రాంతాలలో పూజింపబడినాడు.

g) రె (Re) – సూర్యుడు (సూర్యనౌకా ప్రయాణం)

ఉదయాన కనిపించి సాయంకాలాన అస్తమించే 'రవి' రాత్రి ప్రయాణ మెటువంటిది? ఇలా ఆలోచించిన ప్రాచీన ఈజిప్టు వేదాంతులు కాలవిభజన, గణన మొదలెట్టి క్యాలెండర్ తయారుచేసారు.

పగలు పన్నెండు గంటలు – పన్నెండుగురు దేవతలు (ఆదిత్యులు) – సూర్యరూపాలు– 1) మాత్ (Math), 2) హు (Hu), 3) సియా (Sia), 4) అస్బెత్ (Asbet), 5) ఇగరెత్ (Igaret), 6) సెథ్ (Seth), 7) హోరస్ (Horus), 8) ఖొన్సు (Khonsu), 9) ఐసిస్ (Isis), 10) హెకా (Heka), 11) సూర్యుని పడవ కర్ణధారి, 12) రక్షకుడు (సంధ్యాసమయాన).

సూర్యుని రథం లేదా పడవ పేరు మాండ్‌జెత్ (Mandjet) (to grow fet-ప్రకాశవృద్ధి).

సూర్యాస్తమయ సమయాన 'రె' కట్టుకట్టబడిన ఒసిరిస్ (Bandaged Osiris) రూపాన కానవస్తాడు. ఒక్కోసారి 'హాథర్' రూపాన, మరోసారి బెన్‌బెన్ (Benben) శిలపై కూర్చున్న 'బెను' (Benu) పక్షిలా సృష్టిలోని తొలి శబ్దాన్ని తన అరుపుగా (ఓంకారంలా) వినిపిస్తాడు. సూర్యుని గమనాన్ని బట్టి నెలకు ముప్పై రోజులు, సంవత్సరానికి పన్నెండు నెలలుగా 360 రోజులు వచ్చినాక ఓ అయిదు రోజులకు దేవతల పేర్లు పెట్టి 365 రోజుల క్యాలెండర్ తయారుచేసారు – హీలియోపొలిస్‌లో.

దక్షిణ ఈజిప్టులో చాంద్రమానపు పద్ధతి, అధికమాసం ప్రాచుర్యంలో ఉండేవి. క్రీస్తుపూర్వం 3100 నాటికి ఈజిప్టు ఏకీకరణ జరిగినప్పుడు రెండు

పద్ధతుల్ని కలిపి ఒకే క్యాలెండర్, సంవత్సరానికి మూడు ఋతువులు నిర్ణయించ బడినాయి.

1) అఖెత్ (Akhet-Inundation) - నైలునది వరదకాలం
2) పెరెత్ (Peret - Planting growth) - పంటల కాలం
3) షోము (Shomu - Harvest) - కోతల కాలం.

నక్షత్రాలు, రాశులకు వేర్వేరు పేర్లుండేవి. డెబ్భైరోజులు కనబడకుండా తూర్పుదిక్కున సొథిస్ (Sothis) నక్షత్రం కనిపించడం వరదకాలం (అఖెత్) రాకకు ప్రారంభంగా గ్రహించారు. సొథిస్‌ను దివ్యగోవు (Celestial Cow)గా, ఆమె భర్త సాహ్ (Sah) - Orion Constellation లో ఐసిస్, ఒసిరిస్‌లతో ఉండడాన్ని గమనించారు.

గ్రహాలను, తోకచుక్కలను మృతాత్మలుగా భావించేవారు. చంద్రుడు 'లా' (Lah) దేవుడు కాలగతిలో ఖొన్సు (Khonsu)గా మారినాడు. సూర్యదేవుళ్ల ఆధిపత్యంలో చంద్రదేవుళ్ళు పరిపాలనా పర్యవేక్షకులుగా, వ్రాయసకాళ్లుగా, గణకులుగా ఉండేవాళ్లు. క్యాలెండర్ నిర్మాణం వారికే అప్పగించబడింది. బబూన్/ ఐబిస్ తల ఉన్న తౌత్ (Thoth) తొలి వ్రాయసకాడుగా, లిపి/వ్రాత (Writing)ను కనుగొన్నవాడిగా, వైద్యుడిగా ప్రసిద్ధికెక్కినాడు.

తౌత్ (Thoth), ఖొన్సు (Khonsu)లకు వేర్వేరు బాధ్యతలుండేవి. కాలగమనంలో అనేక కథలు వారిరువురి పేర్లమీద కల్పన చేయబడినాయి. సూర్యుని పడవ (Boat)లు రెండు.

1) మాండ్‌జెత్ (Mandjet) - పగటి పడవ
2) మెస్కెటెత్ (Mesketet) - రాత్రి పడవ.

మెస్కెటెత్ అంటే To Perish - నశించేది.

రాత్రిపూట సూర్యుడు ప్రయాణించే అధోలోకం 'దువత్' (Duat). నట్ (Nut) ఆకాశం సూర్యుడి పడవను పశ్చిమాన మింగి ఉదయాన తూర్పు దిక్కున విడుదల చేస్తుంది. పగటి పడవలో ఒంటరిగా ప్రయాణించినా, రాత్రి పడవలో 'రె' సూర్యుడికి తోడుగా అతడి పిల్లలు– హు; సియా; షు, టెఫ్‌నెట్, గెబ్, ఐసిస్,

హెూరస్, మాత్, తౌత్, హాథర్, హెకా, నౌకారక్షకులు, సహాయకులు ప్రయాణిస్తారు. రాత్రి ప్రయాణం 12 గంటలు.

1) **మొదటి గంట –** సూర్య శత్రువుల తలలు ఛిద్రం చేసే కన్య. బబూన్లు స్వాగతిస్తుండగా, పండ్రెండు సర్పకన్యకలు దీపస్తంభాలతో దారి చూపిస్తారు. 'రె' పేరు ఇప్పుడు మాంసం (Flesh).

2) **రెండవ గంట –** రక్షకదేవత 'రె' ముందుకు వెళ్తాడు.

3) **మూడవ గంట –** ఆత్మల నాశిని. ఒసిరిస్ పునర్జీవనం.

4) **నాల్గవ గంట –** శక్తి రూపిణి. పడవ ఇక్కడ మృతుల రహదారిలో రెండు తలల, రెక్కల సర్పాల మధ్య ప్రయాణిస్తుంది. రొసెటావొ (Rosetau) ఎడారి, సొకార్ గుహ (Sokar), అనుబిస్ (Anubis) పాతాళలోకంలోని ఒసిరిస్ సమాధిని దాటి నిప్పులు కక్కుతున్న పాములూపాన్ని పొందుతుంది.

5) **అయిదవ గంట –** నావికురాలు. సొకార్, అకెర్‌లు రెండు తలలున్న స్ఫింక్స్‌లా కానవస్తారు. ఏడుగురు పురుషులు, ఏడుగురు స్త్రీలు పడవను సొకార్ దిబ్బ (Sokar mound)పై లాగుతూ నడుపుతారు.

6) **ఆరవ గంట –** అర్ధరాత్రి – నాయకురాలు. ఈ మార్గం జలమయం. మృతులైన ప్రభువుల ఆత్మలుండే ప్రదేశం. 'రె' పురుగు రూపాన్ని దాలుస్తాడు.

7) **ఏడవ గంట –** కల్లోల వినాశిని – సూర్యుని పడవను దుష్టసర్పం అపొఫిస్ (Apophis) వెంబడించగా ఐసిస్, సెథ్, సెర్కెత్‌లు దానిని ముక్కలు ముక్కలుగా నరుకుతారు. ఒసిరిస్ శత్రువుల్ని ఇక్కడ శిరచ్ఛేదం చేస్తారు. పన్నెండు మగతారలు, పన్నెండు స్త్రీ తారలు కాలగమనాన్ని తెలియజేస్తాయి.

8) **ఎనిమిదవ గంట –** భోషాణ దేవత – మానవ శిరస్సులున్న సహాయకులు శత్రు నిశ్శేషం చేస్తారు. పడవ రహస్యమాళిగలను దాటి వస్తుంది.

9) **తొమ్మిదవ గంట –** ప్రభు రక్షకురాలు – దారిలో పన్నెండు మంటలు కక్కే నాగుపాములు శత్రువుల రక్తాన్ని తాగుతుంటాయి.

10) పదవ గంట – శత్రు మర్ధని. పాపులను శిక్షించి, పుణ్యులకు మరణానంతర జీవితం ఇవ్వబడుతుంది. తిరుగుబాటుదార్లు సలసల మండే నీళ్లలో పడవేయబడతారు.

11) పదకొండవ గంట – పవిత్ర నౌకా నిర్వాహకురాలు. ఐసిస్, నెఫ్థిస్‌లు సర్పరూపంలో రెండు రాజ్యాల కిరీటాలను సయస్ (Sais) అధిదేవత నియత్ (Neith) వద్దకు తెస్తారు. పడవ తూర్పుదిక్కుకు దగ్గరలో ఉంటుంది.

12) పన్నెండవ గంట – సూర్య సౌందర్య వీక్షకురాలు – పన్నెండుగురు మగవాళ్లు పదమూడుగురు స్త్రీలు సూర్యుని పడవను లాగుతారు. మెహెన్ (Mehen) అనే పాము మెలికలలోంచి 'రె'ను బయటకు తీస్తారు. ఖెప్రి (Khepri) శిశువు రూపాన 'రె' తూర్పున ఉదయిస్తాడు.

h) సూర్యుడు–మహాసర్పాలు (Re and Snakes)

1) అపొఫిస్ (Apophis). ఈ భయంకర సర్పం నున్ (Nun) జలాల్లో నియత్ (Neith) దేవత లాలాజలం నుంచి జనించి మహాసర్పంగా పెరిగిందని, మెహెత్–వెరెత్‌ల కుమారుడని ఐతిహ్యాలున్నాయి. పెద్దపెద్ద శబ్దాలు చేసే Great Gabbler గా పేరుగాంచినాడు. 'రె'కు బద్దశత్రువు. ప్రతిరాత్రీ సూర్యనౌకకు అడ్డు తగిలినపుడు ఐసిస్, సెర్కెత్, సెథ్‌లు అపొఫిస్ సర్పాన్ని ముక్కలుగా నరుకుతారు. మరుసటి రాత్రికి మరల అపొఫిస్ తన రూపాన్ని పొంది మరల సూర్యనౌకను అడ్డగిస్తుంది. అపొఫిస్‌ను నిలువరించేందుకు, బంధించేందుకు, నరికేందుకు అవసరమైన అనేక మంత్రాలు మృతుల పుస్తకం (The Book of the Dead), The Coffin Texts లో ఇవ్వబడినాయి.

2) మెహెన్ (Mehen). రె–సూర్యుడిని, మృతుడైన ఒసిరిస్‌ను మెహెన్ సర్పం కాపాడుతుంటుంది. 'రె' శత్రువులను బంధించి ఉంచిన కారాగారానికి రక్షకుడిగా వ్యవహరిస్తుంది.

3) ఒరొబొరస్ (Ouroboros). తన తోకను తానే మింగుతూ వలయాకారంగా ఉండే సర్పం. కాలానికి ప్రతీక.

ఇవి మూడు ముఖ్య సర్పాలు. ఇంకా అనేక సర్పాలు సూర్యుని రాత్రి ప్రయాణంలో అడ్డు వస్తూ, సాయం చేస్తూ, దారి చూపిస్తూ ఉంటాయి.

i) స్వర్ణనాగు – పంట్ ప్రభువు (Lord of Punt)

పంట్ అనేది ప్రాచీన కాలంలో ఎరిట్రియన్ లేదా ఇథియోపియన్ తీరంలో ఉన్న వాణిజ్యరేవు. ఆ రేవును చేరుకోవడమంటే శిధిలమైన పడవను థెబెస్ నుంచి ఎర్రసముద్ర తీరానికి లాక్కుపోవడమంత దుర్లభమైన కార్యం. దైవానుగ్రహం ఉంటేనే ఆ ప్రాంతానికి చేరుకోగలమని నావికులు విశ్వసించేవారు.

నానా అరిష్టాల తరువాత నౌక ఒడ్డుకు చేరుకున్నది. నావికులంతా తీరం చేరిన సంతోషంలో ఆనందంగా ఉన్నారు. కాని, కెప్టెన్ సంతోషంగా లేదు. కార్యం విజయవంతం కాలేదు. రాజు కోపిస్తే దెబ్బలకు కొదవా? చావు తప్పి కను లొట్టపోయిన పరిస్థితిలో అతడు విషాదంలో మౌనంగా కూర్చుని ఉండగా అతడి నమ్మినబంటు ధైర్యం చెబుతూ నమ్మకం కలిగించడానికి తన కథ చెప్పాడు.

"గతంలో నేను ప్రయాణించిన నౌక పెనుతుఫానులో చిక్కుకుని ధ్వంసం కాగా నేనొక్కడినే ఓ నిర్జన ద్వీప తీరానికి కొట్టుకుపోయాను. అపస్మారక స్థితిలో మూడు రాత్రులు, పగళ్లు గడిపాక, నాలుగవ రోజున ప్రాణం కుదుటపడగా ద్వీపంలో సంచరించాను. తినడానికి సరిపడా పండ్లు కాయలు, తియ్యటి నీటి ప్రవాహాలున్నాయక్కడ. దేవతలకు బలులిచ్చి కాస్త స్థిమితపడ్డాను.

అకస్మాత్తుగా నాకు వినవచ్చిందో భయంకరమైన శబ్దం. మహాసర్పం బుసలు కొట్టినట్లు; భూమి వణికింది, చెట్లు అల్లల్లాడినాయి. భయంతో కొయ్యబారి పోయాను. కళ్లు మూతలుపడ్డాయి. నెమ్మదిగా కళ్లు తెరచి చూసేసరికి ఎదురుగా ఓ మహాసర్పం స్వర్ణనాగు పడగవిప్పి బుసకొడుతూ కాటు వేయబోయింది. నేను గజగజ వణికాను.

"ఎందుకొచ్చావిక్కడికి?" అన్నదా నాగు బుసకొడుతూ. మాటలు తడబడిన నన్ను తన నోట కరుచుకుని తన నివాసానికి తీసుకువెళ్లింది.

భయపడ్తున్న నన్ను ఓదార్చి, ఇంకో నాలుగు నెలల్లో మరో నౌకవచ్చి నన్ను ఈజిప్టుకు తీసుకువెళ్తుందని చెప్పి అన్నది– "నీవు అదృష్టవంతుడివి. నన్ను

చూడు స్వర్ణనాగును నేను. డెబ్భై అయిదు మహాసర్పాల కుటుంబం మాది. ఓ దురదృష్టకరమైన రోజున ఉల్కావర్షం కురిసి నా కుటుంబం అంతా మంటల్లో కాలి, మాడి మసైపోయారు. దూరంగా తీరంలో ఉన్న నేనొక్కడినే బతికాను. కాని ఏం బతుకిది జీవచ్ఛవంలా!" అన్నదా స్వర్ణనాగు.

నేనన్నాను– "ఈజిప్టు ప్రభువుకు నేను కరుణామయుడవైన నీ గురించి చెబుతాను. నీకు నౌకలలో సుగంధద్రవ్యాలు పంపుతాను. నీ మంచితనాన్ని ప్రపంచమంతటా తెలియజేస్తాను. నీకు పూజలు చేసి జంతువులను బలియిచ్చి నాగదేవతగా కొలుస్తాను".

సువర్ణనాగు నవ్వింది– "మూర్ఖుడా! ఆపు నీ మాటలు. నేను పంట్ ప్రభువును. నా గురించి, నా సంపదల గురించి ఈజిప్టులో అందరికీ తెలుసు. నీవు వెళ్లిపోగానే ఈ రేవుపట్టణం సముద్రంలో మునిగిపోతుంది. ఇక్కడికి మరెవ్వరూ రాలేరు. దీనిని చూడలేరు".

నాలుగు నెలలు గడిచాయి. స్వర్ణనాగు చెప్పినట్లు నౌక వచ్చింది. స్వర్ణనాగు ఇచ్చిన బహుమతులతో నేను ఈజిప్టు చేరుకున్నాను. ఆ తరువాత నాకు ఆ ద్వీపం కనిపించలేదు. కావున ఓ కెప్టెన్! నీవు కూడా సంతోషంగా ఉండు. మంచి జరుగుతుంది".

కెప్టెన్ అన్నాడు– "మిత్రమా! కృతజ్ఞతలు. కాని చావబోయే బాతుకు నీళ్లు అవసరమా!" అని మరణభయంతో వణుకుతూ కూలబడిపోయాడతడు.

j) ఒసిరిస్ (Osiris)

అసర్, అజర్, అసిర్, వసిర్, అసిరిస్, ఒసిరిస్‌గా ఈజిప్షియన్లు పిలిచిన సంతానదేవుడు, పునర్జన్మ, మృతుల లోకం, మరణానంతర జీవనం, పంటలు, వ్యవసాయానికి అధిదేవత. ఆకుపచ్చని శరీరం, ఫారో వంకీల గడ్డం, అటెఫ్ కిరీటం; వంపు కర్ర, బడితె (Crook- Heka, Flail - Nekhakha) హస్త భూషణాలు కాగా మమ్మీగా కానవచ్చే తొలిదేవుడు.

ఒసిరిస్‌ను అతడి సోదరుడు 26 ముక్కలుగా నరికి ఈజిప్టులో నలుదిక్కులా పారవేస్తే – ఒసిరిస్ భార్య – సోదరి ఐసిస్ – ఆ ముక్కల్ని ఏరి అతడిని పునరుజ్జీవితుడిని కావిస్తుంది. ఒసిరిస్ – ఐసిస్‌ల సంతానం హోరస్ (Horus).

ఖెంటి అమెనిషు (Khenti-Amentiu - తొలి పశ్చిమదేశపు వాసి – మృతుల దేశపు ప్రధమ పౌరుడు) (యముడు); నిశ్శబ్ద దేవత, నిత్య యవ్వనుడు.

తల్లిదండ్రులు– నింగి–నేల (Nut-Geb)
సోదర సోదరీమణులు – ఐసిస్, సెట్, నిఫ్థిస్, హెరువెర్
భార్య – ఐసిస్
సంతానం – హోరస్, అనుబిస్.

నైలునది వరదలు, పంటలు, ఆకుపచ్చని పొలాలలానే జనన మరణ చక్రముంటుందని ఈజిప్టు ప్రజలు విశ్వసించేవారు.

ఒసిరిస్ ఆత్మశక్తి (Ba) - Banebdjet - Ba of the lord of the Pillar of Continuty ని కొన్నిచోట్ల దేవుడిగా గొర్రెపొట్టేలు (Ram) రూపంలో పూజించేవారు.

ఒసిరిస్ గాథ (The Osiris Myth)

ప్లుటార్క్ కథనం ప్రకారం – టైఫాన్ (Typhon) అనబడిన సెట్ (Set) తన సోదరుడిని చంపేందుకు 72 మంది సహాయకులతో కలిసి కుట్ర చేస్తాడు. ఒసిరిస్ పాల్గొన్న విందులో 'సెట్' అతిథులకు ఒక అద్భుతమైన కొయ్యపెట్టెను చూపించి, అది ఎవరికి సరిగా సరిపోతుందో వారికి దానిని బహుమతిగా ఇస్తానంటాడు. అందరూ ప్రయత్నిస్తారు కాని కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువగా ఉంటుందా పెట్టె. ఒసిరిస్ దానిలో పడుకున్నపుడు అతడికి ఖచ్చితంగా సరిపోగా, వెంటనే సెట్ తన అనుయాయులతో కలిసి ఆ పెట్టె మూత మూసి నైలునదిలో పడవేస్తాడు. ఒసిరిస్ చనిపోగా ఆ శవంతో కూడిన పెట్టె బిబ్లాస్ (Byblos) పట్టణానికి దగ్గర సముద్ర తీరానికి చేరుకోగా దానిచుట్టూ ఓ చెట్టు పెరుగుతుంది (సైప్రస్).

బిబ్లాస్ నగర ప్రభువు ఆ చెట్టును కొట్టి తన భవనానికి స్తంభంగా వాడతాడు. ఆ విషయం తెలిసిన ఐసిస్, రాజు, రాణి అనుమతితో ఆ పెట్టెను తీసుకుని చెట్టు దూలాన్ని అక్కడే వదిలేయగా అది స్థానికుల పూజలందుకుంటుంది.

విషయం తెలిసిన 'సెట్' ఆ పెట్టెను దొంగిలించి ఒసిరిస్ శవాన్ని 26 ముక్కలు చేసి నలుదిక్కులా పారవేస్తాడు.

ఐసిస్, నెఫ్థిస్‌లు ఫాల్కన్-డేగల రూపంలో ఆ ముక్కల్ని వెదికి ఒకచోటకు చేర్చగా ఐసిస్ మంత్రశక్తులతో ఒసిరిస్‌ను బతికించి అతడితో సంభోగించగా హోరస్ జన్మిస్తాడు. కొద్దిగంటలకే బతికిన ఒసిరిస్ మరల మరణించగా మృతుల లోకపు ప్రభువవుతాడు.

ప్లుటార్క్ కథనంలో ఒసిరిస్ శరీరపు 26 ముక్కలలో శిశ్నభాగం (Penis)ను చేపలు తిన్నాయని – అందుకే ఈజిప్షియన్లు చేపలు తినడానికి సందేహిస్తారని వ్రాసినాడు. ఐసిస్ తన మంత్రశక్తులతో శిశ్నభాగాన్ని సృజించి ఒసిరిస్‌తో సంభోగించిందని అతడి కథనం. అంతేకాక ఒసిరిస్ బతికి ఉన్నపుడు ఐసిస్‌కు పుట్టినవాడు హోరస్ అని, చనిపోయినాక మరల బతికించబడి, ఐసిస్‌తో కలవగా పుట్టినవాడు హార్పొక్రెటిస్ (Harpocrates) అని ప్లుటార్క్ వ్రాసినాడు.

గర్భవతిగా ఉన్న ఐసిస్, దిగువ ఈజిప్టు రెల్లుపొదల్లో హోరస్‌ను ప్రసవించి, సెట్‌కు కానరాకుండా పెంచింది. ఆ ప్రదేశాన్ని Nest of Horus - హోరస్ నివాసం అని పిలిచేవారు.

ఒసిరిస్ ఆకుపచ్చని పొలాలకు, హరితవనాలకు; సెట్ విస్తరించే ఎడారికి; ఐసిస్, నెఫ్థిస్‌లు భూమ్యాకాశాల అంచులకు ప్రతీకలు.

ఒసిరిస్ – ఐసిస్‌ల సంతానం హోరస్.

ఒసిరిస్ – నెఫ్థిస్‌ల అక్రమ సంతానం అనుబిస్.

k) ఐసిస్ (Isis)

ఐసిస్, ఐసెస్, వాస్, వుసా, అసెత్, ఎసెట్‌గా పిలువబడిన ఐసిస్ ఈజిప్టు ప్రాచీన దేవతలలో ప్రముఖురాలు. ఒసిరిస్‌కు సోదరి, భార్య; హోరస్‌కు తల్లి. ప్రాచీన దేవత హాథర్ (Hathor)లా 'ఆవు కొమ్ముల మధ్య సూర్యబింబం' తలకట్టును కలిగి ఉంటుంది. గెబ్-నట్‌లు ఈమె తల్లిదండ్రులు.

ఈజిప్టు, న్యుబియా ప్రజలు ఫిలె (Philae) దేవాలయంలోని ప్రధాన దేవతగా ఐసిస్‌ను పూజించేవారు. తన సోదరుడు 'సెట్' కుట్ర వలన ఒసిరిస్ మరణిస్తాడు. భర్త మరణంతో శోకిస్తున్న యువతి రూపంలో ఆమె ఆనాటి ఈజిప్టు స్త్రీల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయింది.

తన భర్తను బతికించుకుని అతడితో కుమారుడిని కని ప్రతీకారం తీర్చుకున్న గాథ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.

ఒసిరిస్ అథోలోకంలో (Underworld - Duat) హాయిగా ఉండేందుకు ఉపయోగపడిన మంత్రశక్తులు, మృతులకు సాయపడతాయని ప్రజలు విశ్వసించి ఆమెకు పూజలు జరిపేవారు. సెట్ కంటపడకుండా హొరస్‌కు జన్మనిచ్చేందుకు ఆమె పడినన్ని కష్టాలు ఎవరూ పడి ఉండరు.

పెరిగి పెద్దవాడైన 'హొరస్' తన బాబాయి 'సెట్'కు ప్రతిద్వంద్విగా మారుతాడు. సెట్‌ను చంపే విషయంలో ఒకసారి తల్లితో విభేదించి ఆగ్రహంతో పరశురాముడిలా తల్లి తల నరికి, తరువాత ఆమెకు ఆవుతల అతికించి బతికిస్తాడు. ఆమె రూపం హాథర్‌లా ధేనువులా ఉండడానికి కారణంగా ఈ కథ చెబుతారు.

ఆమె మాతృత్వాన్ని ప్రస్తుతించడానికి అనేక కథలు కల్పించబడినాయి.

హొరస్‌కు ఆమె అంశకు పుట్టిన నలుగురు కుమారులు– మృతుల అవయవాలున్న (కాలేయము, మూత్రపిండాలు, పేవులు, పొట్ట) కలశాల రక్షకులు.

అదేవిధంగా సంతానోత్పత్తి దేవుడు 'మిన్' (Min) Kamutef - Bull of his mother - తల్లికి భర్తగా పిలువబడినాడు. ఐసిస్ అంశతో కలిసి తన గిత్తలను సంతానంగా పొందడం వలన.

అపిస్ (Apis) వృషభానికి తల్లిగా, ప్రభువులకు మంత్రసానిగా, జీవప్రదాతగా, రక్షకురాలిగా, మహాదేవతగా ఐసిస్ పూజలందుకున్నది. ఐసిస్ పదానికి సింహాసనం (Throne) అనే అర్థమున్నదని కొందరి అభిప్రాయం. మృతుల అంత్యక్రియలలో పూజింపబడే దేవత. ఈజిప్టు, ఇంగ్లండ్, గ్రీసు, రోమ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల వరకు ఆమె ఆరాధన వ్యాపించింది. సూర్యనేత్రిగా ఆమెను 'సిరియస్' నక్షత్రంగా భావించేవారు.

l) సెట్ (Seth) – సెత్

సెట్, సెత్, సుతెక్‌గా పిలువబడిన సెత్ ఎడారికి, తుఫానులు, అరాచకం, హింస, విదేశీయులకు ప్రతీక.

సూర్యుని పడవను అస్తవ్యస్త స్థితి (Chaos) సర్పం నుంచి కాపాడే బాధ్యత 'సెత్'దే. ఎర్రనేలకు అధిపతి.

సెత్ జంతువు అనే వింతమృగం 'తల' కలిగినవాడిగా సెత్ చిత్రించ బడినాడు.

ఒసిరిస్‌ను చంపి అతడి శరీరాన్ని ముక్కలుగా చేసినాక, ఐసిస్–ఒసిరిస్‌ల సంతానమైన హొరస్‌ను పట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తాడు సెత్. హొరస్ పెద్దవాడై 'సెత్'ను మట్టుపెట్టేందుకు సిద్ధమైనప్పుడు ప్రధాన దేవతలు ఎక్కువమంది హొరస్‌ను, సృష్టికర్త 'సెత్'ను అభిమానించడంతో యుద్ధం ఎనభై ఏళ్లపాటు సాగుతుంది. జయాపజయాలు అటూయిటూ తూగుతున్నపుడు సెత్, హొరస్‌ల మధ్య యుద్ధంలో ఐసిస్ విసిరిన బల్లెం గురితప్పి 'సెత్'కు తగలకుండా వెళ్లి హొరస్‌ను గాయపరుస్తుంది. ఆగ్రహంతో హొరస్ తన తల్లి తల నరికి తరువాత ఆమెకు ఆవుతల అమర్చి బతికిస్తాడు.

ఒకసారి హొరస్ సెత్‌కు చిక్కినపుడు సెత్ అతడిని బలత్కారం చేస్తాడు. ఇంద్రియ ద్రవం విషపదార్థమై శత్రువును చంపుతుందని ఆనాటి ప్రజల నమ్మకం. అయితే తెలివిగా ఐసిస్ హొరస్ ఇంద్రియాన్ని చేతిలో పట్టుకుని పాలకూరపై పడవేసి, సెత్ ఆ కూరను తినేట్లు చేయగా, సెత్ ఇంద్రియం వల్ల హొరస్, హొరస్ ఇంద్రియం వల్ల సెత్ ఇద్దరూ బలహీనులౌతారు. సెత్–హొరస్‌ల కలయిక వల్ల 'తౌత్' (Thoth) పుట్టాడనేది మరోకథ (శివ కేశవ సంతానం అయ్యప్పలా).

ఇంకోసారి హొరస్ బల్లెపు వేటుకు సెత్ వృషణాలు దెబ్బతింటాయి. సెత్ ఆగ్రహంతో హొరస్ కళ్లు పీకి అంధుడిని చేస్తాడు. అది గ్రహణకాలమవుతుంది. హొరస్ రెండు కళ్లూ సూర్య, చంద్రులు కనుక ఐసిస్, తౌత్, హాథర్‌లు హొరస్‌కు కళ్లు తెచ్చి అమర్చాక అతడు మరల చూడగలుగుతాడు. ఈ కథలన్నీ ప్రతీకాత్మకంగా ఉంటాయి (Allegorical).

ఒసిరిస్ – ఆకుపచ్చ తనానికి ప్రతీక, నల్లనేల
కట్లుకట్టిన ఒసిరిస్ – కాలువలతో విభజించబడిన పొలాలు
సెత్ – ఎడారి, ఎర్రనేల

ఐసిస్ – నైలు జలాలకు, ఆకుపచ్చని పొలాలకు మధ్య ఉన్న రెల్లు, పాపిరస్ మొక్కలు.

నెఫ్థిస్ – నల్లనేల–ఎర్రనేల మధ్య హద్దు.

హోరస్ – ఎడారి ఆక్రమించగా మిగిలిన నల్లనేల

తౌత్ – ఎర్రనేల–నల్లనేల కలిసిన ప్రాంతం

అనుబిస్ – ఆకుపచ్చని పొలాలు, నెఫ్థిస్ ప్రాంతం కలిసేచోటు లేదా ఎడారి–నెఫ్థిస్‌లు కలిసే చోటు.

తొలిదశలో సెత్‌ను సూర్యరక్షకుడిగా, ఎర్రనేలగా పూజించేవారు. పరాయి దేశాల (అస్సిరియన్, పర్షియన్ దేశాలు) దండయాత్రలో కష్టాలు పడిన ఈజిప్టు ప్రజలు 'సెత్' పరాయి దేశాలకు ప్రతీక కనుక హోరస్ అతడిని ఓడించడాన్ని పండుగగా జరుపుకునేవారు.

m) నెఫ్థిస్ (Nephthys)

నట్–గెబ్‌ల సంతానంగా, ఒసిరిస్, ఐసిస్, సెత్‌ల సోదరిగా, సెత్ భార్యగా, మమ్మీల రక్షకదేవతగా, సంతాపానికి, దుఃఖానికి, మంత్రతంత్రాలకు, బీరు, ఆరోగ్యం, ఎంబాల్మింగ్‌కు ప్రతీకగా నెఫ్థిస్‌ను పూజించేవారు.

Lady of the House - ఇంటి యజమానురాలు నెఫ్థిస్. అనుబిస్ తల్లిగా, హోరస్‌కు పెంపుడు తల్లిగా నెఫ్థిస్ వ్యవహరించబడింది. డేగ రెక్కలతో, అరుపులు సంతాపాన్ని తెలియజేస్తుండగా ఎగిరే పక్షిగా ఆమెను చిత్రించారు.

n) హోరస్ (Horus)

ఫాల్కన్ డేగగా, ఐసిస్–ఒసిరిస్‌ల కుమారుడిగా, తండ్రిని చంపిన 'సెత్'పై పగ తీర్చుకున్నవాడిగా హోరస్ ప్రసిద్ధికెక్కినాడు.

సెత్ ఒసిరిస్ శవాన్ని ముక్కలుగా నరికి పారవేసినపుడు ఐసిస్, నెఫ్థిస్‌లు డేగల రూపంలో వెదికి ముక్కల్ని కలిపి ఒసిరిస్‌ను బతికిస్తారు. అన్ని దేహభాగాలూ లభించినా శిశ్నంను చేపలు తినడంతో అది లభ్యం కాకపోవడంతో ఐసిస్ తన మంత్రశక్తితో శిశ్నాన్ని నిర్మించి ఒసిరిస్‌తో సంభోగించి గర్భవతి అయి తరువాత హోరస్‌కు జన్మనిస్తుంది. సెత్ కంటబడకుండా రెల్లు పొదల్లో హోరస్‌ను దాస్తుంది.

సూర్య చంద్రులు అతడి నేత్రాలు. సెత్‌తో జరిగిన యుద్ధంలో ఒకటి లేదా రెండు నేత్రాలు కోల్పోయిన హొరస్‌కు ఐసిస్, హాథర్ దేవతలు కళ్లు అతికిస్తారు. వాడ్జెత్ (Wadjet, Wedjat) అంటే Eye of Horus హొరస్ నేత్రం అని అర్థం. ఇది ఫారో ప్రభువులను రక్షిస్తుంది తాయెత్తులా!

సెత్‌ను ఓడించినాక హొరస్ ఎగువ, దిగువ ఈజిప్టులకు ప్రభువవుతాడు. సెత్‌కు ఎడారి, ఒయాసిస్సులపై అధికారం ఇవ్వబడ్తుంది. పెద్ద హొరస్, చిన్న హొరస్, బెహ్‌దెత్ హొరస్, భూమ్యాకాశాల అంచు హొరస్, సత్యపుత్రుడు, నల్లటివాడు, ధర్మమూర్తి ఇత్యాది పేర్లున్నాయి హొరస్‌కు.

o) అనుబిస్ (Anubis)

మృత్యుదేవత, మమ్మిఫికేషన్, ఎంబాల్మింగ్ అధిదేవత, సమాధుల రక్షకుడు, భైరవ రూపుడు, తోడేలు ముఖుడు, వృకుడు. అధోలోకంలో మృతుల గుండెను తూచి ప్రదేశార్హతలను నిర్ణయించేవాడు అనుబిస్.

ఇతడి సోదరసమానుడు వెప్‌వావెత్ (Wepwawet) – శునక ముఖుడు.

అనుబిస్ స్త్రీరూపం అన్‌పుత్ (Anput). ఇతడి కుమార్తె కెబెకెత్ సర్పం (Kebechet). అనుబిస్– అన్‌పు రాజకుమారుడు. తొమ్మిది విల్లులు కలవాడు, మిలియన్ల మందిని భక్షించే శునకం, రహస్యాల రక్షకుడు, తొలి పశ్చిమ దేశస్థుడు, పవిత్రదేశపు ప్రభువు. ఎంబాల్మింగ్ గృహ యజమాని.

ఒసిరిస్–నెఫ్‌థిస్‌ల కలయికతో జన్మించి ఐసిస్‌తో పెంచబడినవాడు.

p) తొత్ (Thoth)

ఇబిస్ కొంగ శిరస్సున్న దేవుడు. అతడి స్త్రీరూపం సెషత్ (Seshat); భార్య మాత్ (Maat) జ్ఞానము, వ్రాత, లిపి, చిత్రలిపి, సైన్సు, మంత్ర తంత్రాలు, న్యాయం, కళలకు అధిదేవత.

హెర్మోపొలిస్ ప్రధాన దేవాలయంలో Ogdoad - ఎనిమిది మంది ప్రధాన దేవతలలో ఒకడు. అక్కడ అతడి భార్యపేరు నెహెమెతవె (Nehmetaway). సూర్య రథానికి – పడవకు ఒక చివర తొత్, మరోచివర మాత్ రక్షక దేవతలు.

గ్రీకులు తౌత్‌ను తమ దేవత హెర్మెస్ (Hermes)గా భావించారు.

తౌత్ ఇబిస్ లేదా బబూన్ రూపుడు; దేవతల లేఖకుడు, సమతుల్యతకు అధిదేవత. స్వయంభువు. సమస్త కళల నిర్మాత.

ఒసిరిస్ దేహశకలాలను ఒకచోటకు చేర్చినపుడు అతడిని బతికించే మంత్రాలను ఐసిస్‌కు నేర్పినవాడు తౌత్. 365 రోజుల క్యాలెండర్‌ను నిర్మించినవాడు. పాత సంవత్సరంలో 360 రోజులే ఉన్నపుడు 'నట్' ఆకాశదేవత వంధ్యగా ఉండేది. తౌత్ పందెంకాసి చంద్రుడిలో డెబ్భై రెండవ వంతు కాంతిని అడిగి (360÷72=5) అయిదు రోజులను తీసుకోగా – ఒసిరిస్, సెత్, ఐసిస్, నెఫ్‌థిస్‌లకు జన్మనిచ్చింది నట్–నింగి.

సూర్యుడి (రె,రా)కి నట్–ఆకాశంపై కోపం వచ్చి 360 రోజులూ వంధ్యగా ఉండమని శపించాడు. తౌత్ ఒక పథకం ఆలోచించి చంద్రుడి అంశ ఖొన్సు (Khonsu)తో పందెం కాసి అయిదు రోజులు అధికంగా తెచ్చి 'నట్'కివ్వగా ఆ రోజుల్లో ఆమె గర్భం దాల్చి పిల్లలను కన్నది.

q) ఈజిప్షియన్ క్యాలెండర్ (Egyptian Calender)

360 రోజులు నాలుగు నెలలు చొప్పున మూడు ఋతువులు, అయిదు అధిక దినాలు, ప్రతినెలా పదిరోజులున్న మూడు భాగాలుగా ఉండేది. సూర్యమానం ప్రకారం ఒకరోజును నాలుగేళ్లకు కోల్పోతున్నది గమనించి ఆగష్టస్ కాలంలో కాప్టిక్ (Coptic) క్యాలెండర్‌లో 'లీప్‌డే' (Leap day)ను కలిపారు.

మూడు ఋతువులు

1) వరదల ముంపు (సెప్టెంబరు–జనవరి)

2) శీతాకాలం (జనవరి–మే)

3) పంటకాలం (మే – సెప్టెంబరు)

నైలునది వరదల ఆగమనాన్ని బట్టి తొలి క్యాలెండర్ నిర్మాణం జరిగింది.

చంద్రమానం ప్రకారం– శుక్లపక్షం, కృష్ణపక్షంలా 7,8 రోజుల వారాలుండేవి. అధికమాసం కలిపి సంవత్సరాలు నిర్ణయించేవారు. తరువాత సూర్య, చంద్రమానాలు కలిసిన క్యాలెండరు వచ్చింది.

ప్రజల క్యాలెండర్ (Civil Calender)లో 365 రోజులు = 360+ ఒసిరిస్, హోరస్, సెత్, ఐసిస్, నెఫ్థిస్‌లకు ఒక్కొక్కరికి ఒక్కోరోజు.

నాలుగు మాసాలున్న మూడు ఋతువులు

ఒక్కో మాసంలో పదిరోజులున్న పక్షాలు మూడు, YMD (Year, Month, Day) విధానంలో వ్రాసేవారు. నాలుగేళ్లకోసారి 'లీపుదినం' లేకపోగా సిరియస్ నక్షత్రం మరల అదేచోటున కన్పించేందుకు పట్టిన కాలం 1460 సంవత్సరాలు Apocatastsis అని పిలిచారు.

మానవులకు తెలిసిన తొలి క్యాలెండర్‌గా (పదమూడు నెలల క్యాలెండర్) 4242 B.C.లోనే వెలువరించబడింది. 29½ దినాల చాంద్రమానంను కనుగొన్నది ఈజిప్టులోనే.

r) ఒసిరిస్–మృతుల రాజు (Osiris - King of the Dead)

ఐసిస్ తనభర్త శవం కోసం అన్ని దిక్కులా వెదికి చివరకు అబిడాస్ (Abydos) రాజభవనంలోని సైప్రస్ దూలంలో ఉన్న పెట్టెలో ఒసిరిస్ పార్థివదేహాన్ని కనుగొని, ఆ దేశపు రాణికి చెలికత్తెగా చేరి భర్త శవం ఉన్న పెట్టెను తీసుకు వెళ్లడానికి అనుమతి పొందింది. ఆ పెట్టెను ఈజిప్టుకు తెచ్చిన విషయం తెలుసుకున్న 'సెత్' అకస్మాత్తుగా దాడిచేసి ఐసిస్ లేని సమయాన– ఒసిరిస్ దేహాన్ని (12 లేదా 14 లేదా 26 లేదా 42) ముక్కలు కావించాడని (ఇవి కాలగతిన ఏర్పడిన ప్రావిన్సులు కావచ్చును) ఒక్కోచోట ఒక్కో సమాధి – ఒక్కో దేహ శకలానికి నిర్మించడం మనకు అష్టాదశ శక్తిపీఠాల్ని గుర్తుకు తెస్తుంది. (సతీదేవి దేహ శకలాలు భూపతనమైన ప్రదేశాలు) ఒసిరిస్ శకలాలు పడినచోట విల్లో లేదా తమరిస్క్ చెట్లు పెరిగాయి. ఒసిరిస్ గుండె పడిన ప్రాంతం ఎథ్రిబిస్, ఎడమకాలు పడిన ప్రాంతం బిగా (Bigah) నైలుద్వీపంగా ఇలా వేర్వేరు ప్రదేశాలు గుర్తించబడ్డాయి.

Rosetau (Mouth of Passage ways)ను ఒసిరిస్ జన్మప్రదేశంగా భావిస్తారు. ఇది మెంఫిస్‌కు దగ్గర ఉన్నది. ఒసిరిస్ ప్రధాన దేవాలయాలు Delta of Busirisలో, Southern City of Abydosలో ఉన్నాయి. Abydos - అబిడాస్ శిధిలాలు థెబెస్‌కు ఎనభై కిలోమీర్లు దిగువన కానవస్తాయి.

s) హాథర్ (Hathor)

హాథర్ (Hathor - House of Horus)గా ప్రాచీన ఈజిప్టు ఆకాశదేవతగా, 'రా' భార్యగా, లేక హొరస్ భార్య లేదా తల్లిగా, ఫారోల తల్లిగా, సూర్యుడి నేత్రంగా (Eye of Ra), స్త్రీతత్వంగా, సంగీత నృత్య, ప్రేమల అధిదేవతగా గుర్తించబడింది. ఆమె రూపం ఆవు (Cow). సివంగి, నాగు, సైకామోర్ వృక్షం ఇతర రూపాలు. ఎగువ ఈజిప్టులోని దెందెరా (Dendera)లో ఆమె ప్రధాన దేవాలయం ఉన్నది. హాథర్ ఆగ్రహరూపం సెఖెమెత్ (Sekhmet). నింగి యజమానురాలిగా, నక్షత్రాల నాయకురాలిగా, సూర్యదేవతగా ప్రస్తుతించబడింది.

t) ఈజిప్టు సూర్యదేవతలు (Sun Gods)

* అమున్ (Amun) – సృష్టికర్త, ఆదిత్యుడు
* అటెన్ (Aten) – సూర్యబింబం, సూర్యచక్రం
* అతుమ్ (Atum) – ఆత్మ; అస్తమిస్తున్న సూర్యుడు
* బస్ట్ (Bast) – మార్జాల సూర్యదేవత
* హాథర్ (Hathor) – హొరస్, 'రా' దేవతల మాతృమూర్తి
* హొరస్ (Horus) – ఆకాశదేవర (కుడికన్ను సూర్యుడు, ఎడమకన్ను చంద్రుడు)
* ప్తా (Ptah) – రాత్రి సూర్యుడు – శిల్పి, కళాకారుడు
* రా (Ra) – సూర్యుడు, రవి
* సెఖ్‌మెత్ (Sekhmet) – యుద్ధదేవత, ఎడారి సృష్టికర్త
* సోప్డు (Sopdu) – వేసవి ఎండ, యుద్ధ దేవుడు



Atum



Shu

Ptah



2a-Tefnut

Geb - Nut



Khnum



Min

Re - Horakhty

Night Journey

Apep



Lord of Punt

Isis

Osiris



Set



Nephthys



Anubis

Horus



Thoth

Hathor

Atum
Shu
Tefnut
Geb
Osiris
Isis
Nut
Set
Nepthys


AN ALMOST-HISTORICAL*
EGYPTIAN·GOD·FAMILY·TREE
*MEANING, IN THIS CASE, SEVERAL THOUSAND YEARS' WORTH OF DIFFERING BELIEFS PILED INTO ONE TIDY-LOOKING HEAP.
NOTE: IF NO ANCESTORS ARE LISTED, ASSUME NUN, SELF-CONCEPTION, AND/OR THEY JUST SORT OF SHOWED UP.
©2015 Kevin Bryan
CHILD
MARRIAGE
AFFAIR
IMPREGNATED VIA TAINTED LETTUCE
"FROM WHOSE WATERS EMERGED THE VERY FIRST GOD"
NUN
APEP
ATEN
RA
ATUM
AMUN
MUT
NEITH
KHNUM
SATET
PTAH
SEKHMET
HATHOR
BASTET
MAAT
SHU
TEFNUT
KHONSU
SERKET
ANUKET
IMHOTEP
NEFERTEM
QADESH
RESHEP
GEB
NUT
APIS
BABI
WADJET
NEKHBET
MIN
ISIS
OSIRIS
NEPHTHYS
SET
KHEPRI
HORUS
ANUBIS
TAWERET
BES
HAPY
THOTH
SESHAT



OSIRIS - Lord of the Dead



Egypt Calender

13. సినుహె గాథ
(The Story of Sinuhe)

ఫారో ఉత్తరదిక్కు ప్రాంతాల గవర్నరు, సైన్యాధిపతి, యువరాజు, సభికుడు అయిన సినుహె (Sinuhe) వ్రాసిన కథ ఇది. ప్రభువుకు అత్యంత విశ్వాసపాత్రుడు, ప్రేమాస్పదుడైన స్నేహితుడిగా, అమెన్‌మ్‌హత్ ప్రభువు కుమార్తె, సెన్‌వోస్రెత్ భార్య అయిన నెఫ్రు (Nefru) సేవకుడిని నేను.

30వ సంవత్సరం – ముంపుకాలం మూడోనెల – ఏడవరోజు

ఈ దురదృష్టకరమైన రోజున ఎగువ–దిగువ ఈజిప్టు దేశాల ప్రభువు అమెన్‌మ్‌హత్ అకస్మాత్తుగా పరమపదించినారు. అతడి ఆత్మ నింగిలోని స్వర్ణ సూర్యబింబంలో కలిసిపోయింది. దుఃఖంతో ఈజిప్టు నిశ్చేష్ట అయినది. రాచభవనం మూతపడింది. ప్రభువులు ప్రజలు శోకంలో మునిగినారు.

ప్రభువు మరణించడానికి కొద్దిరోజుల ముందుగా తన కుమారుడైన సెన్‌వోస్రెత్ (Senwosret)ను పడమటి ఎడారి దండయాత్రకు పంపించినాడు. తిరుగుబాటుదారులైన లిబియన్‌లను అణిచేందుకు వెళ్లి విజయం సాధించి లిబియన్ ఖైదీలతో, పశుసంపదలతో తిరిగివస్తున్న రాకుమారుడికి తండ్రి చనిపోయిన విషయం తెలియగానే శరవేగంతో 'సెన్‌వోస్రెత్' రాజధాని చేరుకున్నాడు తన ముఖ్య అనుచరులు వెంటరాగా.

వెళ్లేముందు మిగతా రాజకుమారులకు కూడా ఈ విషయాన్ని తెలియబరచాడు సెన్‌వోస్రెత్. అతడు వెళ్లిపోయినాక రాజకుమారుల రహస్య సంభాషణ విని కొయ్యబారిపోయాను. నిలువెల్ల వణికిపోతూ నేననుకున్నాను ఇక ఈజిప్టులో ఉండడం అంత శ్రేయస్కరం కాదని. గుండె దడ తగ్గకమునుపే వెళ్లి దూరంగా ఉన్న పొదల్లో దాక్కున్నాను. కాస్త తేరుకుని ఎడారి పశ్చిమ అంచు వెంబడే ప్రయాణించి స్నెఫ్రు ద్వీపం (Snefru) చేరుకున్నాను. అక్కడ నుంచి నాటుపడవలో ఎర్ర పర్వతాన్ని చేరుకుని ఉత్తర దిక్కుగా ప్రయాణించి Walls of the Ruler గా పిలువబడిన కోటగోడల వద్దకు చేరుకున్నాను. అక్కడ పొదల మాటున దాక్కుని రక్షకభటుల దృష్టికి కానరాకుండా విశ్రాంతి తీసుకున్నాను.

అప్పటికే దాహంతో నాలుక పిడచకట్టుకుపోయింది. నీరసంగా తూలుతూ నడుస్తూ కెమ్-వెర్ (Kem-wer) ద్వీపం వద్ద పెటెన్ (Peten) చేరుకున్నాను. నా నాలుకపై బొబ్బలు లేచి పగిలాయి. దుర్భరమైన బాధ. చనిపోయాననే అనుకున్నాను. దూరంగా ఎడ్లబళ్ల చప్పుడు వినవచ్చింది. దేశదిమ్మరుల శకటాలు అటుగా పోతున్న సవ్వడి. వాళ్ల నాయకుడు నన్ను గుర్తుపట్టాడు. మంచివాళ్లు. వాళ్లతో కలిసి బిబ్లాస్ వెళ్లాను. కొన్ని నెలలు హాయిగా గడిచాయి. అక్కడ అమ్మునెన్‌షి (Ammunenshi) ఎగువ రెటిన్యు అధికారి (కానన్-Canaan) నాతో చర్చలు జరిపాడు. నేను ఈజిప్టు గురించి నా యజమాని సెన్వోస్రెత్ గురించి గొప్పగా చెప్పాను. అతడు నాకు ఆశ్రయమిచ్చినాడు. తన కుమార్తెనిచ్చి వివాహం చేసి నాకు కొన్ని భూముల నిచ్చినాడు. ఆ 'యూ' భూములలో ఫిగ్‌లు, ద్రాక్షలు అపరిమితంగా పండేవి. తియ్యటి నీరున్న ప్రవాహాలు, మధురమైన తేనె, స్వర్ణధాన్యం, పశుసంపద ఉన్నాయి. రొట్టె, ద్రాక్షసారాయికి కొదువలేదు. వివిధ రకాల మాంస పదార్థాలు నాకోసం తయారుచేయబడేవి. నాకు సంతానం కలిగింది. నా పిల్లలు పెద్ద వాళ్లయ్యారు.

నాకు పిల్లనిచ్చిన మామ తరఫున నేననేక యుద్ధాలలో పాల్గొన్నాను. అతడికి విజయాన్ని అందించాను. నన్నెంతగానో ప్రేమించాడతడు.

ఒకరోజున ఓ తెగ నాయకుడు అత్యంత బలిష్ఠుడు నాకు సవాలు విసిరాడు. నన్ను నాశనం చేయడం అతడి లక్ష్యం కాబోలు. తప్పనిసరి పరిస్థితులలో నేను యుద్ధానికి సిద్ధమయ్యాను. ఉదయానే బలప్రదర్శన ప్రారంభమయ్యింది. ఎవరో దేవుడు నాకు సాయపడినట్లు అతడి ఆయుధాలు గురితప్పాయి. నా బాణం అతడి గొంతులో గుచ్చుకోగా అతడు నేలకూలినాడు. అతడి తల నరికి నేను సింహగర్జన చేసాను. చూస్తున్న వాళ్లందరూ హర్షధ్వానాలు చేసారు. అమ్మునెన్ ఆనందానికి అంతులేదు. ప్రత్యర్థి సంపదలన్నీ నా వశమైనాయి. నా కలలోనైనా ఊహించనంత ధనవంతుడినైనాను. కాని ఎక్కడో స్వదేశానికి వెళ్లాలన్న కోరిక నాలో కలుక్కుమన్నది.

చాలా ఏళ్లు గడిచాయి. నేను వృద్ధుడినైనాను. మృత్యువు నాకోసం ఎదురు చూస్తున్నదనిపించింది. నా దేశం వెళ్లి నా పూర్వీకుల్లానే నా స్వస్థలంలో మరణించి

వారిలానే నా దేహం మమ్మిపై చేయించబడగా మరణానంతర జీవితాన్ని గడపాలన్న కోరిక కలిగింది. ఇక్కడ ఆచారం ప్రకారం గొర్రె చర్మాలలో కప్పబడి ఖననం కాదలుచుకోలేదు.

ఈ విషయం సెన్వోసైత్ ప్రభువుకు ఎలా తెలిసిందో కాని అతడు నావద్దకు దూతలను పంపినాడు. నేను ఈజిప్టు వచ్చేందుకు అనుమతినిచ్చి– 'సినుహె, ఈజిప్టుకు రా! దిగులు పడకు' అని సందేశాన్ని పంపినాడు. నా ఆనందానికి అంతులేదు. ఇక్కడి బాధ్యతల్ని నా కుటుంబానికి, నా పెద్ద కుమారుడికి అప్పజెప్పి నేను ఈజిప్టుకు బయల్దేరాను. నేను Ways of Horus కు చేరుకునేటప్పటికి అక్కడి కోటలో నన్ను ఇన్నాళ్లూ జాగ్రత్తగా చూసుకున్న మిత్రులకు కానుకలు సిద్ధం చేసి ఉన్నాయి. వారికి వీడ్కోలు చెప్పి సముద్రమార్గాన ఇట్జ్–తావె పట్టణం చేరుకున్నాను.

పదిమంది అంగరక్షకులు వెంటరాగా, రాచబిడ్డలు స్వాగతిస్తుండగా నేను రాజు సన్నిధికి చేరుకున్నాను. అతడి పాదాలముందు మాటా, పలుకూ లేకుండా వినమ్రుడనైనాను.

"ప్రభూ, నేను తమ సేవకుడిని!" అన్నాను గద్గదికంగా. ప్రభు పరివారం, కుటుంబం నన్ను చూసి ఆనందపడినారు. నాకొక అద్భుత భవనాన్ని కేటాయించినారు. మరల చాలాకాలానికి ఈజిప్టు దేశవాసిగా హాయిగా నిద్రపోయాను.

నాకొక ఇల్లు, తోట, రాచసమాధుల మధ్య చిన్న పిరమిడ్ నాకోసం కేటాయించబడినవి. నా మరణానంతర జీవనానికై అన్ని వసతులు సమకూర్చ బడినవి. బంగారం, ఎలక్ట్రమ్‌లతో నా విగ్రహం రూపొందించబడింది. ఒక సాధారణుడికి ఈజిప్టు ప్రభువు ఇచ్చిన అపురూప గౌరవమిది.

అందుకే నేనీ కథను స్వహస్తాలతో లిఖిస్తున్నాను.

.....

సినుహె గాథ మనకు మనలో నిక్షిప్తమై ఉన్న స్వంత గడ్డపైని మమకారాన్ని, మనం వదులుకోలేని మత భావనలను, ఆచారాల్ని తెలియజేస్తాయి.

ఫారో అమెనెమ్‌హత్ 12వ డినాస్టి ప్రారంభకుడు. క్రీస్తుపూర్వం 20

శతాబ్దాల నాటి గాథ 1875 B.C. లో వ్రాయబడింది. (సినుహెత్–సినుహె–జనుహెత్–సైకొమోర్ కుమారుడు). (సైకొమోర్ చెట్టును జీవవృక్షం (The tree of life)గా ఈజిప్ట ప్రజలు భావించేవారు). పేరు తెలియని ఈ కథారచయితను ఈజిప్షియన్ షేక్స్పియర్గా అభివర్ణించారు విశ్లేషకులు. బైబిల్లోని జోసెఫ్ కథ, డేవిడ్–గొలియాత్ యుద్ధం, దారితప్పిన కుమారుడు లాంటి కథల పోలికలు ఈ సినుహె కథలో కనిపించడం విశేషం. నోబెల్ బహుమతి పొందిన ఈజిప్ట రచయిత Naguih Mahfouz 1941లో The return of Sinuhe అనే కథ వ్రాసినాడు.

14. హోరస్ - సెత్ యుద్ధం
(The Contendings of Horus and Seth)

అతుమ్ → షు–టెఫ్‌నెట్

షు–టెఫ్‌నెట్ → గెబ్–నట్

గెబ్–నట్ → ఒసిరిస్–ఐసిస్–నెఫ్‌థిస్–సెత్

ఒసిరిస్–ఐసిస్‌ల కుమారుడు హోరస్ తన తండ్రి సింహాసనం తనకు కావాలని అడిగాడు.

ఒసిరిస్‌కు ఎంత హక్కు ఉందో తనకూ అంతే హక్కు ఉందని, మహా బలశాలి, పరిపాలనాదక్షుడైన తాను ఒక బాలుడి చేతిలో ఈజిప్టును ఉంచలేనన్నాడు సెత్.

ప్రధాన దేవతలు సమావేశమయ్యారు. షు, తౌత్, ఐసిస్‌లు హోరస్ పక్షాన ఉన్నారు.

తౌత్ అన్నాడు– "హోరస్ సింహాసనానికి అర్హుడు మిలియన్ రకాలుగా 'సెత్'కన్నా".

ఐసిస్ వెంటనే ఉత్తరగాలిని పిలిచి పశ్చిమ దిక్కుకు వెళ్లి ఒసిరిస్‌కు ఈ శుభవార్త తెలియజెయ్యమన్నది ఆనందంగా.

ఐసిస్ తొందరపాటును చూసి విశ్వాధినేతకు చిరాకు వేసింది. కాసేపు మౌనంగా ఉండి బానెబ్డ్‌జెదెత్ (Banebdjedet)ను న్యాయాధిపతిగా నియమించాడు. ఈ ఎనభై ఏళ్ల తగాదాను పరిష్కరించేందుకు బానెబ్డ్‌జెదెత్ లేఖ వ్రాసినాడు. తౌత్ సాయంతో దేవతల మాత నియత్ (Neith)కు. దేవతల సమావేశంలో నియత్ సమాధానం చదవబడింది. ఆమె తీర్పు హోరస్‌కు అనుకూలంగా వచ్చింది. హోరస్‌ను ఒసిరిస్‌కు వారసుడిగా ప్రకటిస్తూ, పరిహారంగా సెత్‌కు విశ్వాధినేత కుమార్తెలు అనత్, అస్తార్తెలను భార్యలుగా ఇవ్వాలని పేర్కొన్నది. దేవతలు ఒప్పుకున్నారు కాని విశ్వాధినేత చిరాకుపడ్డాడు– "హోరస్ బలహీనుడు, రెల్లుగడ్డి వాసనా, వాడూ".

బాబి అనే దేవత విశ్వాధినేతపై విరుచుకుపడ్డాడు– "నీవు వృద్ధుడివై పోయావు. ఏమాట పడితే ఆ మాట అనడమేనా?". దేవతలు వాదులాడుకుంటుంటే

విశ్వాధినేత అలిగి తన గదికి వెళ్లిపోగా, హాథర్ నగ్నరూపాన అతడిని నవ్వించి మళ్లీ సభకు తీసుకువచ్చింది.

సెత్ అన్నాడు– "నేను సరైన హక్కుదారుడిని, బలశాలిని. సూర్యుని పడవను ఆపే అపొఫిస్ సర్పాన్ని ప్రతిరోజూ చంపేది నేనే! అందుకనే నాకు ఒసిరిస్ కిరీటం దక్కాలి!"

తౌత్ అడిగాడు– "చనిపోయిన తండ్రి కిరీటం కొడుకుకు దక్కుతుందా, సోదరుడికా?"

ఈసారి బానెబ్డ్‌జెదెత్ సెత్‌ను బలపరచాడు.

హోరస్ అన్నాడు– "నా తండ్రి కిరీటం నాకు ఇవ్వడానికి బదులు నాపై నిందలు మోపడం న్యాయమా?"

ఐసిస్ చిరాకుపడింది– "నా తల్లి నియత్ (Nieth)పై, ప్తా–తాతెనెన్ (Ptah-Tatenan) దేవుడిపై ప్రమాణం చేసి చెబుతున్నాను. ఈ తగాదాను హిలియోపొలిస్–అతుమ్ ముందు, ఖెప్రి (Khepri) ముందు ఉంచాలి"

సెత్ ఆగ్రహంతో ఊగిపోయాడు– "రోజుకొక్కర్ని చొప్పున మీ అందరినీ చంపేస్తాను కాని ఐసిస్ ఉన్న సభకు మాత్రం నేను రాను!" అన్నాడు.

దేవతలందరూ మధ్యద్వీపంలో సమావేశమైనారు. ఏ స్త్రీ ముఖ్యంగా ఐసిస్‌లా కనిపించే స్త్రీ ఆ ద్వీపం వేపు రాకూడదని పడవవాడికి ఆజ్ఞలు జారీచేసారు.

ఐసిస్ ముదుసలిరూపంలో పడవవాడు నెమ్‌టీ (Nemty)తో వాదులాటకు దిగింది– "నా నలుగురు పిల్లలు ఆకలితో నకనకలాడుతున్నారు నాలుగు రోజుల్నుంచి. ఇదుగో ఈ ఉంగరం తీసుకుని నన్ను ద్వీపం చేర్చు" అని బతిమలాడింది. ఏ కళనున్నాడో ఆ పడవ నడిపేవాడు. ఆ ముదుసలి అవ్వను ద్వీపం చేర్చాడు ఉంగరం తీసుకుని.

ఐసిస్ ఆ ద్వీపంలో విశ్వాధినేత గుడారంలో భోజనాలు చేస్తున్న దేవతలను చూసింది. అందాల కన్యగామారి సెత్ దృష్టిని ఆకర్షించి సైకామోర్ జీవవృక్షపు మాటుకు వచ్చేలాచేసి అతడితో ఊసులాడింది.

"నీవే చెప్పు అందగాడా! నా భర్త పశువులకాపరి. మా ఇద్దరికి ఒక కుమారుడు. దురదృష్టవశాత్తు నా భర్త చనిపోయాడు. ఓ వ్యక్తి నా కుమారుడిని కొట్టి మా పశుసంపదను కాజేయాలనుకుంటున్నాడు. ఇది న్యాయమేనా?" అన్నది కన్నీరు కారుస్తూ.

సెత్ కరిగిపోయాడు– "చనిపోయిన తండ్రి సంపదలు బతికున్న కొడుకుకు చెందాలి! ఇదే న్యాయం!" అన్నాడు సెత్ ఆవేశంగా.

ఐసిస్ వెంటనే పెద్ద పక్షిగా మారి ఓ గొప్ప తుమ్మచెట్టు కొమ్మలపై వాలి విజయగర్వంతో అరిచింది– "సెత్! నీవు న్యాయం పలికావు నీ నోటితో! ఒసిరిస్ వారసుడు హొరస్ కదా నీవెందుకు అతడి సంపదలను ఆశిస్తున్నావు?"

సెత్ దుఃఖపడుతూ వెళ్లి విశ్వాధినేతతో మొరపెట్టుకున్నాడు. దేవతలు పడవ వాడిని శిక్షించి పడమటి కొండలవేపుకు వెళ్లారు. అక్కడ అతుమ్, రె–హొరాఖ్తి (Re-Horakhty)లు హొరస్‌ను వారసుడిగా ప్రకటించారు.

సెత్ వెంటనే హొరస్‌ను ద్వంద్వ యుద్ధానికి రమ్మని సవాలు చేసాడు. ఇద్దరూ హిప్పొటమస్ రూపాలు దాల్చి సముద్రంలోకి దూకారు. మూడు నెలలలోపు ఎవడు బయటకు వస్తారో అతడు ఓడిపోయినట్లు.

ఐసిస్ దుఃఖానికి అంతులేదు. బలిష్ఠుడు, వంచనాపరుడు అయిన సెత్ ముందు బాలుడైన హొరస్ ఎంత? ఆమె రాగితో హార్పూన్ బల్లెం తయారుచేసి మంత్రదారాన్ని కట్టి సముద్రంలోకి విసిరింది. అది హొరస్‌కు తగలగానే అతడు బాధతో– "అమ్మా, నేను! నీ బల్లెంను తీసెయ్!" అని ప్రార్థించాడు. బల్లేన్ని తీసి ఈసారి విసిరినపుడు అది 'సెత్'ను తగలగా అతడు బాధతో విలవిలలాడిపోతూ– "ఐసిస్! మనం ఎంత శత్రువులమైనా ఒకప్పుడు సోదరీ సోదరులం. నన్ను బాధించడం నీకు న్యాయమా?" అన్నాడు. అతడి మాటలకు కరిగిన ఐసిస్ బల్లేన్ని వెనక్కు లాగింది. హొరస్ అపార్థం చేసుకొని ఆమె శిరస్సును తెగనరికి ఆ తలను పట్టుకుని పారిపోయాడు. 'సెత్' అతడి వెంటపడి బంధించి హొరస్ కళ్లు పీకి భూమిలో పాతిపెట్టాడు. ఆ కళ్లు పర్వతం దిగువన అందమైన పద్మాలుగా వికసించాయి. ఐసిస్ తలలేని శిలగా మారగా ఆమెకు ఆవుతల అమర్చి బతికించారు. (వినాయకుడి కథలా).

హాథర్ చూసింది అంధుడైన హొరస్‌ను. లేడిపాలతో అతడి కళ్లగుంటల్ని నింపి చూపునిచ్చింది. దేవతలు సమావేశమై ఇద్దరూ సామరస్యంగా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి హొరస్–సెత్‌లు విందులో పాల్గొన్నారు. ఇద్దరు బాగా తిని తాగి విశ్రమించాక అర్ధరాత్రి సెత్ వెళ్లి హొరస్‌ను బలాత్కరించబోయాడు. అయితే హొరస్– సెత్ ఇంద్రియద్రవం తన శరీరంలోకి పడకుండా చేతిలో పట్టుకుని తన తల్లి ఐసిస్ వద్దకు వెళ్లగా ఆమె వెంటనే కలుషితమైన అతడి చేతుల్ని నరికి నీళ్లలో పారవేసి అతడికి కొత్త చేతులు వచ్చేలా మంత్రాలు చదివింది. హొరస్ ఇంద్రియాన్ని రాబట్టి సెత్ తోటలోని పాలకూరపై చల్లింది.

ఆ ఉదయాన సెత్ వంటవాడు సెత్‌కిష్టమైన పాలకూరను వడ్డించాడు. ఆ పాలకూరలో నిక్షిప్తమైన హొరస్ ఇంద్రియం సెత్ జీవరసాల్లోకి చేరింది.

మరల దేవతల సమావేశం జరిగింది.

సెత్ అన్నాడు– "హొరస్ బలహీనుడు. అతడు ఆడదానిలా నాతో పడుకున్నాడు". దేవతలు ఆశ్చర్యంగా హొరస్ వంక చూసారు. కొందరు హేళనగా నవ్వారు. హొరస్ అన్నాడు– "అవునా! పరీక్షించండి మా ఇద్దరినీ!".

తౌత్ మంత్రాలు చదువుతూ సెత్ ఇంద్రియశక్తిని ఆహ్వానించాడు హొరస్ శరీరం నుంచి. హొరస్‌లో ఏ మార్పూ రాలేదు. సెత్ ఆశ్చర్యపోయాడు. ఏం జరుగుతున్నది?

ఈసారి 'తౌత్' మంత్రాలు చదువుతూ సెత్ శరీరం నుంచి హొరస్ ఇంద్రియ శక్తిని ఆహ్వానించాడు. ఆశ్చర్యం! సూర్యబింబంలా కాంతులు జిమ్ముతూ స్వర్ణచక్రం సెత్ నుదుటిపై ప్రకాశించింది. దేవతలు నివ్వెరపోయారు.

హొరస్ గెలిచాడు. అయినా సెత్ ఒప్పుకోలేదు. ఇద్దరం పడవ పందెం వేద్దాం. ఎవరి పడవ ఎక్కువకాలం నీటిపై ప్రయాణిస్తుందో వారిదే గెలుపు.

సెత్ పర్వతాన్ని తొలిచి ఓ శిలానౌకను నిర్మించాడు. హొరస్ శిలానౌకలా కానవచ్చే నౌకను నిర్మించాడు. నది మలుపుల్లో రాళ్లకు ఢీకొని సెత్ పడవ మునిగి

పోయింది. హొరస్ పడవ ముందుకు సాగిపోతున్నది. ఉక్రోషంతో సెత్ హిప్పోపొటమస్ రూపంలో హొరస్ పడవకు రంధ్రం చేసాడు. హొరస్ రాగిబల్లెంతో హిప్పోపొటమస్ రూపంలో ఉన్న సెత్‌ను పొడవబోయాడు. దేవతలు వారించి 'సెత్'ను కాపాడినారు.

ఎనభై ఏళ్ల తగాదా 'నియత్' (Neith) వద్దకు మరల వచ్చింది. దేవతలు ఒసిరిస్ సలహా కూడా అడిగారు. ఒసిరిస్ అన్నాడు– "దేవతలకు మానవులకు బార్లీ, గోధుమ ధాన్యాలనిస్తున్నాను నేను. నా కుమారుడికే రాజ్యార్హత ఉంది".

విశ్వాధిదేవత ఒప్పుకోలేదు. నీకన్నా ముందునుంచే ఉన్నాయి బార్లీ, గోధుమలు" అన్నాడతడు.

ఒసిరిస్‌కు కోపం వచ్చింది– "ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నాను. ఇప్పుడు భయంకరమైన పిశాచాలు నా అదుపాజ్ఞలలో ఉన్నాయి. వాటిని వదిలిపెట్టానా అవి తప్పుచేసిన వాళ్ల గుండెలు చీల్చి నా వద్దకు తెస్తాయి! న్యాయంగా ప్రవర్తించండి, ఇది నా హెచ్చరిక!" అన్నాడు.

దేవతలు ఆలోచించారు. హొరస్‌కు ఈజిప్టుపై అధికారం లభించింది. సెత్ బంధింపబడి దేవతల ముందు సంకెళ్లతో నిలబడినాడు. హొరస్ పట్టాభిషక్తుడైనాడు. ఐసిస్ పగ చల్లారింది.

సెత్‌కు 'రె' సూర్యుడితో ప్రయాణం చేసే అవకాశం ఇచ్చారు. అతడు ఆగ్రహంతో ఉరిమినప్పుడల్లా నింగీ, నేల దద్దరిల్లుతాయి.

ఈ కథల్లో మనకు వచ్చే సందేహాలకు సరైన సమాధానం దొరకదు.

1) అన్నదమ్ములైన ఒసిరిస్, సెత్‌లు తమ చెల్లెళ్లయిన ఐసిస్, నెఫెథిస్‌లను పెండ్లాడడమేమిటి?

2) ఒసిరిస్–సెత్‌ల మధ్య పగకు కారణమేమిటి?

3) ఒసిరిస్‌ను చంపినప్పుడు మిగతా దేవతలు ఎందుకు మౌనంగా ఉన్నారు? సెత్ ఎందుకు శిక్షింపబడలేదు?

4) మంత్రశక్తులున్న ఐసిస్ తన భర్తనెందుకు కాపాడలేకపోయింది?

5) అతుమ్-ఆత్మ; షు-టెఫ్‌నెట్ (పొడి-తడి గాలి); గెబ్-నట్ (నేల-నింగి) మర్మమేమిటి?

6) సూర్యరథం లేదా పడవ రహస్యమేమిటి?

ఇవన్నీ నైలునది, నల్లనేల, ఎర్రనేల, కాలువలు కాలరేఖలో వికసిస్తున్న జ్ఞానం దృష్టికోణంలో చూసినపుడు ప్రతీకాత్మకా (Allegorieal) సంబంధం అర్థమై చిక్కుముడులు విడిపోతాయి. ఆనాటి ఆలోచనాపరుల సందేహాలు, వాటికి వాళ్లకు దొరికిన సమాధానాలు కథలరూపంలో నిలిచిపోయాయి. ఒక దేవుడి నుంచి అనేక దేవతల పరిణామం కాలరేఖపై జరిగిన మార్పుల్ని రేఖామాత్రంగా తెలియజేస్తాయి.



Set - Horus

15. మరణానంతర జీవనం
(After Life)

ఈజిప్టు ఉష్ణదేశం. ఎవరైన మరణించగానే అతడి పార్థివదేహాన్ని పవిత్ర స్థలమైన ఎంబాల్మింగ్ ప్రదేశానికి పడవలో తీసుకువెళ్లేవారు. నదీజలాలను, నల్లనేలను దాటి ఎర్రనేల (ఎడారి) ప్రాంతంలోని స్మశానస్థలం వద్దకు వెళ్లేది అంతిమయాత్ర.

అక్కడ శవపు కపాలం నుంచి మెదడును ముక్కు రంధ్రాల ద్వారా గుంజి రసాయనాలు, సుగంధ ద్రవ్యాలతో నిపేవారు. తరువాత చలువరాతి కత్తితో కడుపు పక్కన గాటుపెట్టి లోపలి అవయవాల్ని తీసి మట్టిపాత్రలలో కాని, శిలా కలశాలలోగాని భద్రపరచేవారు. (ఈ కలశాలను ఈజిప్టాలజిస్టులు – మెనెలాస్ పడవ సరంగు కనొపస్ (Canopus) పేరు మీద కనొపిక్ పాత్రలు అని పేరు పెట్టారు).

ఈ పాత్రలకు అధిదేవతలు– హొరస్ కుమారులు నలుగురు.

1) తువాముతెఫ్ (Duamutef) – తూర్పుదిక్కు –పొట్ట (Stomach)
2) హాపి (Hapi) - ఉత్తరదిక్కు – ఊపిరితిత్తులు (Lungs)
3) ఇమ్‌సెతి (Imsety) – దక్షిణం దిక్కు – కాలేయం (Liver)
4) ఖెబెసెనుఫ్ (Qebehsenuef) – పశ్చిమదిక్కు – పేగులు

తువాముతెఫ్ – జాకాల్ తలతో నియత్ రక్షణలో,
హాపి దేవుడు బబూన్ తలతో నెఫ్‌థిస్ రక్షణలో,
ఇమ్‌సెతి – మనిషి తలతో – ఐసిస్ రక్షణలో
ఖెబెసెనుఫ్ – డేగ తలతో – సెర్‌ఖెత్ రక్షణలో
ఆ కనోపిక్ కలశాలకు కావలిగా ఉండేవారు.

మృతదేహంలోని అవయవాలను తీసి కలశాలలో భద్రపరచాక దేహపు ఖాళీస్థలంలో తాటికల్లు లేదా సారా, సుగంధ ద్రవ్యాలతో నింపేవారు. గుండెను ఛాతీలోనే ఉంచేవారు. దాంట్లో ఆత్మ నివసిస్తుందని నమ్మేవారు కనుక ఆ తరువాత గాట్లకు కుట్లు వేసి నేట్రన్ (Hydrated Sodium Carbonate)లో డెబ్భైరోజులు ఉంచి తర్వాత దేహాన్ని వెలికి తీసి కడిగి జిగురు పూసిన నూలు వస్త్రపు మూక్కలతో తల నుంచి పాదాల వరకు చుట్టేవారు. దానిని మృతుడి బంధువులకివ్వగా

వాళ్లు మమ్మీని చెక్కపెట్టెలో భద్రపరచి మరణానంతర జీవన ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసేవారు.

మమ్మిఫైడ్ దేహాన్నుంచిన శవపేటికను ఎడ్లు లాగే సెడ్జిపై ఎడారి ఎర్రనేల గుండా ఖనన ప్రదేశానికి లేదా పిరమిడ్ వద్దకు పూజారుల మంత్రోచ్ఛారణల మధ్య, బంధుమిత్రుల కోలాహలం, రోదనల మధ్య తీసుకువెళ్లేవారు. రొమ్ములు బాదుకుంటూ బంధువులు దుఃఖిస్తుండగా సమాధి ద్వారం వద్ద 'నోటిని తెరవడం' 'Opening of the mouth of the dead' అనే కర్మను నిర్వహించేవారు. మమ్మీని నిలబెట్టి పెసెష్ కెఫ్ (Pesesh Kef) అనే బొడ్డుతాడును కోసే కత్తి, ఎద్దుకాలు, బాడిస లాంటి పవిత్ర వస్తువులతో తాకి, మంత్రాలు తాకినపుడు ఆ శరీరం ఒసిరిస్ దేహంగా మారిందని భావించేవారు. సమాధి గోడలపై రకరకాల నగ్న చిత్రాలు, కథలు లిఖించబడేవి. స్త్రీలకు కూడా దాదాపు ఇదే పద్ధతి అవలంబించేవారు. (ఒసిరిస్‌కు బదులు హాథర్‌గా సంబోధించేవారు). అంత్యక్రియల విందు అనంతరం బంధువులు మిత్రులు నిష్క్రమించేవారు. సమాధి ద్వారం మూయబడేది.

Book of the Deadలో ఆత్మప్రయాణం వివరింపబడింది. మృతుడి గుండెను మాత్ ఈక (the feather of truth) తో తూచడం; 42 న్యాయాధిపతుల ముందు వాంగ్మూలం ఇవ్వడం ఈ మరణానంతర యాత్రలో ముఖ్యఘట్టాలు. మృతదేహం పక్కన Book of the Dead పుస్తకం ఉంటే దానిలోని మంత్రాలను పఠించడం ద్వారా మృతుడు ఒసిరిస్ వద్దకు సునాయాసంగా వెళ్లగలుగుతాడని నమ్మేవారు.

న్యాయాధిపతులు నలభై రెండు మంది. (42 వాంగ్మూలాలు)

1) అసత్యం - Farstruder of Heliopolis (Falsehood)
2) దొంగతనం - Fire Embracer of Kharara (Robbery)
3) దోపిడి - Nosey of Hermopotis (Extortion)
4) చిరుదొంగతనాలు - Swallower of Shades (Stealing)
5) హత్య - Dangerous one of Rosetau (Murder)
6) ఆహారాన్ని వృథా చేయడం - Double lion of the sky (Wasting food)
7) వంచన - Fiery eyes of Letopolis (Crookedness)
8) ప్రసాదాల కానుకల దొంగతనం - Flame (Stealing offerings)
9) అబద్ధాలాడడం - Bone Brakers of Herakleopolis (Lying)

10) ఆహారం లాక్కోవడం - Gaean flame of Memphis (Taking food)
11) క్రౌర్యం - You, of the Covern (Sullenness)
12) అతిక్రమణ - White teeth of Faiyum (Transgression)
13) పవిత్ర వృషభాన్ని చంపడం - Eater of Blood of the shamless
14) ఉల్లంఘన - Eater of Entrails, the house of thirty
15) రొట్టె దొంగతనం - Lord of Truth of Matty
16) దొంగచాటుగా వినడం - Wanderer of Bubastis
17) అస్పష్టభాష - Pale one of Heliopolis
18) వాగ్వాదం - Doubly evil of Andjet
19) స్వలింగ సంపర్కం - Wemenity snake of execution
20) అసభ్య ప్రవర్తన - See whom you bring of Min
21) భయపెట్టడం - Over the old one of Mau
22) ఆక్రమించడం - Demolisher of Chois
23) పిచ్చకోపం - Disturber of Weryt
24) నిజాన్ని వినకపోవడం – Youth of Heliopolitan Nome
25) సమస్యలు సృష్టించడం - Foreteller of Wernes
26) కన్నుకప్పడం - You of the Altar of the Secret Place
27) బాలుడితో శృంగారం - Face behind him of the Cavarn of Wrong
28) నిర్లక్ష్యం - Ht foot, of the dusk
29) కొట్లాట - You of the darkness
30) అత్యుత్సాహం - Bringer of your offerings of Sais
31) అసహనం - Owner of Faces of Nedjefet
32) దేవుని మూర్తి ధ్వంసం - Accuser of Wetjenet
33) మాటకారి - Owner of Horns of Asyut
34) తప్పు చేయడం - Nefertem of Memphis
35) రాజద్రోహం, కుట్ర - Temsep of Busiris
36) నీళ్లలో కదులాడడం – You of Tzebu
37) పెద్ద గొంతుతో అరవడం - Water smiter of Abyss
38) దైవ దూషణ – Commander of Mankind of your house

39) తప్పుడు పనులు - Bestower of Good of Harpoon None

40) ఆత్మస్తుతి – Bestower of Powers

41) అక్రమ సంపాదన – Snake with raised head

42) దైవనింద - Snake who brings and gives

ఈ నలభై రెండు మంది న్యాయాధికారులకు వాంగ్మూలం ఇచ్చాక ఆత్మ అనుబిస్‌ను అనుసరిస్తూ ముందు గదిలోకి పోతుంది. అక్కడ మృతుడి గుండెను (lb) మాత్ ఈకతో తూస్తారు. (ఆ గది పేరు Hall of Two Truths).

Book of Dead Spell-30 (Heart - ib) 'నా తల్లి నుంచి నాకు వచ్చిన హృదయమా! భువిపై నన్ను నడిపించిన హృదయమా! అధోలోకపు ప్రభువు దగ్గర నాకు వ్యతిరేకపు సాక్ష్యము నివ్వవద్దు!'

రెండు నిజాల ఆవరణలో తోత్ హృదయాన్ని మాత్ ఈక బరువుతో తూచినాక తోత్, హోరస్, తొమ్మిదిమంది దేవతలు తమ తీర్పును వెలువరిస్తారు. తెలివైన హృదయం గల ఆత్మలు ఒసిరిస్–హోరస్‌లకు సమానమైన పవిత్రాత్మ లవుతాయి. పవిత్ర రెల్లు వనాల్లోకి ప్రవేశపెట్టబడతాయి.

బరువైన ఆత్మలున్న దుశ్శీలురు ఆకలిదప్పులతో మాడుతూ, తలకిందులుగా అశుద్ధాల మధ్య నడుస్తూ వాటినే ఆహారంగా స్వీకరిస్తూ అగ్ని సరస్సులో కాల్చివేయ బడతారు. కొందరు కత్తులతో నరకబడతారు. కొందరు గంగాళాలలో ఉడకబెట్ట బడతారు. కొందరిని దుష్టమృగాలు తినివేస్తాయి. అమ్మిత్ (Ammit) అనే భయంకర మృగం బరువైన గుండెల్ని చప్పరించి తినేస్తుంది (The Beast of Destiny) – మొసలి తల, సింహపు శరీరం, కాళ్లు, హిప్పొటమస్ వెనుకభాగంతో ఆ మృగం భయంకరంగా ఉంటుంది. గుండెను అమ్మిత్ తినగా మిగతా శరీరాన్ని పిశాచాలు పీక్కుతింటాయి.

సచ్ఛీలురైన ప్రభువులు దేవతలతో కలిసి తిరుగుతారు. సాధారణులు పవిత్ర రెల్లు పొలాలలో హాయిగా తిరుగుతూ రాత్రివేళల సూర్యుని పడవ ముందుకు పోయేందుకు సాయం చేస్తుంటారు.

అయినా మరణానంతర జీవితం గురించి ఎవరి భయాలు వాళ్ళకుండేవి.

ఏడవ క్లియోపాత్రా కాలంలో 'ప్తా' దేవుడి ప్రధాన పూజారి Pasherenptah-III - మూడవ పాషెరెన్ప్తా భార్య తెయిమ్హోతెప్ (Taimhotep) కు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఆమె దుఃఖిస్తున్నది...

"పడమటి దిక్కున, ఆ నిద్రాలోకంలో
చిమ్మచీకటి దట్టంగా ముసిరిన ప్రదేశాన
మమ్మీరూపులు నిద్రిస్తున్నపుడు
వారికి కానరారు తమ సోదరులు
వారికి కానరారు తల్లిదండ్రులు!
వారు మరచిపోతారు భార్యలను, బిడ్డలను
అందరికీ ఆహారమైన జీవజలం
దాహంతో సమానమైనది.
అది నేలపై ఉన్నవారికి దొరికేను.
కాని నేనిక్కడ చుట్టూ నీరున్నా దాహంతో అల్లలాడుతున్నాను
నా ముఖాన్ని నీటి అంచున వీచే ఉత్తర గాలుల వేపు తిప్పు
అప్పుడైనా నా హృదయం దుఃఖంతో చల్లబడుతుందేమో!"

పవిత్ర రెల్లుగడ్డి పొలాలు – చుట్టూ ఇనుప కంచెతో, నీలి ఆకుపచ్చరంగు మొక్కలతో, నీటి కాలువలతో, పొలాలు, ఇసుక తిన్నెలు, గుహలతో కడు రమ్యంగా ఉంటాయి. రా–సూర్యుడి నిరంతర ప్రయాణం, అడ్డంకులు, విజయోత్సవాలు ఆ పొలాల్లో కానవస్తాయి. పవిత్ర Akh ఆత్మ ఊర్ధ్వలోకాలకు పయనిస్తుంది. పక్షి రూపున Ba ఆత్మ–సూర్యుడితో చరిస్తుంది. బలహీనమైన Ka ఆత్మ – ఆకలితో తిరుగుతుంటుంది. బతికి ఉన్నవారి కలల్లో కనబడి తమ తమ కోరికలను, ఆకలి, దాహాలను తీర్చుకుంటుంది.

Osiris, God of the Dead

16. సి-ఒసిరి (Si-Osiri) కథ

సి-ఒసిరి గొప్ప మంత్రగాడు. తన తండ్రి 'సెత్నె'కు పుణ్యాత్ములకు పాపాత్ములకు లభించే మరణానంతర జీవనాన్ని చూపించాలని ప్రయత్నం చేస్తాడు. ఈ కథ పూర్తిభాగం లభించలేదు.

మృతాత్మ ఏడు ఆవరణలను దాటాలి. మొదటి మూడు ఆవరణలలో ఎటువంటి శిక్షలు విధించబడతాయో తెలియదు కాని, నాలుగవ ఆవరణలో పాపుల్ని తాళ్లతో కట్టివేస్తారు. ఆహారపానీయాలు దగ్గర్లోనే ఉంటాయి కాని అందవు. కాళ్లకింద లోతైన గుంటలుంటాయి. (టాంటాలస్‌కు పడిన శిక్షలా).

అయిదవ ఆవరణలో పాపుల కుడికంటిలో మేకులు దిగగొట్టబడతాయి.

ఆరవ ఆవరణలో దేవతల సేవకులపై తీర్పులు చెప్పబడతాయి.

ఏడవ ఆవరణలో ఒసిరిస్ స్వర్ణ సింహాసనంపై కూర్చుని ఉండగా అనుబిస్ ఎడమ పక్కన, తౌత్ కుడివేపున, అధోలోక వాసులు రెండువేపుల నిలబడి ఉంటారు. త్రాసులో మృతుడి ఆత్మ తూయబడుతుంది. పాపపుణ్యాలు బేరీజు వేసి తౌత్ పాపాత్ముల గుండెలను అమ్మిత్-రాకాసి మృగం వేపు విసరగా అది తినివేస్తుంది. మంచి పనులెక్కువ చేసినవారు దేవతల సమూహంలో చేర్తారు. పాపపుణ్యాలు సమంగా ఉన్నవారు సొకార్-ఒసిరిస్ అనుయాయులతో పనిచేస్తారు.

ఈ కథ చెప్పి సి-ఒసిరి అదృశ్యమైపోతాడు. సెత్నె-మెహుసెఖె దంపతులకు కుమారుడు జన్మిస్తాడు. అధోలోకంలోని విషయాలను, పాపులకు విధించబడే చిత్రహింసలను జనాలకు అర్థమయ్యేందుకు ఈ కథ చెప్పబడిందని తెలుస్తుంది.

(డివైన్ కామెడిలో వర్జిల్-డాంటీల నరకలోక ప్రయాణం, బైబిల్‌లోని దివెస్-లాజరస్ వృత్తాంతం, గరుడపురాణం, భాగవతంలో పాపులకు విధించే శిక్షలను ఈ కథ గుర్తుకు తెస్తుంది.)

బెను పక్షి (Benu Bird) తొలికేకతో ఈ ప్రపంచం ఆవిర్భవించింది. అంతం కూడా అలాగే జరుగుతుంది. మృతుడు అడిగాడు అతుమ్‌ను- "నా జీవన కాలమెంత?". అతుమ్ జవాబిచ్చాడు- "మిలియన్ల సంవత్సరాలు. యుగాంతాన నేను ఈ ప్రపంచాన్ని నాశనం చేస్తాను. ఈ భూమి మరల ఆదిమ జలాల్లో మునిగిపోతుంది. నేను ఒసిరిస్‌తో ఉండిపోతాను. బహుశా ఓ గొప్ప సర్పంగా- మానవులకు ఎరుకలేకుండా, దేవతలు చూడకుండా.

మరల నూతన ప్రపంచం సృష్టించబడుతుంది".

Si - Osiri



Celestial Cow

17. పవిత్ర ధేనువు - వృషభం
(Celestial Cow - Bull)

ఈజిప్టు నాగరికత తొలినాళ్లలో పశుసంపదకు ఎనలేని ప్రాముఖ్యత ఉండేది. నగాదా (Nagada) సమాధులలో, గెర్జె పాలెట్ (Gerzeh Palette) లాంటి వాటిపై అందమైన ఆవుతల, అయిదు నక్షత్రాలు–చెవులు, కొమ్ములు, నుదుటిపై ముద్రించబడినవి కనుగొన్నారు.

ప్తా (Ptah) - Apis Bull; Montu (Buchis), రె–అతుమ్ (Mnevis) ఇవి వృషభ రూపాలు.

ఆవు పాలధార – ఆకాశంలో పాలపుంత.

హాథర్, ఐసిస్‌లు ధేనువు రూపాలు.

18. సెఖ్‌మెత్
(Sekhmet)

హాథర్ ఆగ్రహరూపం సెఖ్‌మెత్. హిందువుల కాళికాదేవిలా ఉగ్రరూపిణి. వైద్యదేవత.

హాథర్–సెఖ్‌మెత్‌ల గురించి Book of the Cow of Heaven పుస్తకంలోని The Destruction of Mankind అధ్యాయంలో వర్ణించబడింది.

కాలం ఇంకా పుట్టని కాలంలో – దేవతలు భూమిపై ఉన్న కాలమది. రా (సూర్యుడి)పై ప్రజలు తిరుగుబాటు చేసారు. రవి (Re-Ra)కు కోపం వచ్చింది. సూర్యనేత్రి, షు, టెఫ్‌నట్, గెబ్, నట్, నన్, వాళ్ల పరివారాన్ని రమ్మని పిలిచాడు. రహస్య సమావేశం జరిగింది.

నన్‌తో అన్నాడు రా (రె) సూర్యుడు– "తండ్రీ! ప్రజలలో అవిధేయత పెరిగింది. నేను వృద్ధుడనైనానట! నా ఎముకలు తెల్లబడి వెండిలా, నా శరీర కాంతి స్వర్ణంలా, నా శిరోజాలు లాపిస్ లాజులైలా కానవస్తున్నాయట! నా కన్నీటి నుంచి పుట్టిన వీళ్లు నన్నే ధిక్కరిస్తున్నారు. వీళ్లని నాశనం చేసేముందు మీ సలహా కావాలినాకు!".

నన్ అన్నది– “అవిధేయతను సహించరాదు. నీ సూర్యనేత్రానికి పని కల్పించు! హాథర్‌ను పంపి దుష్టులను పరిమార్చు!”

అత్యంత శాంతమూర్తి హాథర్, అత్యుగ్రనేత్రి సెఖ్‌మెత్‌గా మారింది. ఎడారి నిండా రక్తపుటేరులు, గుట్టలు గుట్టలుగా శవాలు. ఆ వినాశనానికి సాక్షాత్తు ‘రె’ రవి కూడా చలించిపోయాడు. సెఖ్‌మెత్ ఇంకా ఆగ్రహంగానే ఉన్నది. ఆమెను వదిలేస్తే సర్వనాశనం తప్పదు.

‘రా’ ఆలోచించి దేవతలతో కలిసి ‘యెబు’ దేశంలో దొరికే ఎర్రరంగు పొడిని బార్లీతో కలిపి ‘బీరు’ తయారుచేసి పొలాల్లో నింపాడు. సెఖ్‌మెత్ ఆ ఎర్రటి ప్రవాహాన్ని రక్తంగా భావించి తాగి మత్తుగా నిద్రపోయి మునుపటి హాథర్‌గా మారింది.

రె (రవి – సూర్యుడికి నేలపై ఉండబుద్ధి కాలేదు. దేవధేనువు మెహెత్–వెరెత్ పై కూర్చుని ఆకాశంలో సంచరిస్తూ దిగువన నేలపై ఇంకా తగవులు పడుతున్న మానవజాతిని గమనిస్తూనే ఉన్నాడు.

సప్తరూపాల హాథర్

కాలం గడిచేకొద్దీ హాథర్‌కు ఏడు రూపాలు వచ్చాయి (నవదుర్గల్లా). సప్త మూర్తులైన హాథర్‌లు భవిష్యవాణిలో సిద్ధహస్తులు. The Doomed Prince కథలో వారి జోస్యాన్ని గమనించవచ్చు.

ఎన్నో ఏళ్లుగా సంతానలేమితో బాధపడుతున్న రాజదంపతులకు దేవతల కరుణ వలన కుమారుడు జన్మించాడు. అతడు పుట్టినరోజున ఏడుగురు హాథర్‌లు వచ్చి భవిష్యత్ గణన చేసి అన్నారు.

“ఈ బాలుడికి మృత్యు కారకులు – కుక్క, పాము లేదా మొసలి కావచ్చు! జాగ్రత్తలు తీసుకోండి!”

రాజు చింతాక్రాంతుడైనాడు. చేసేదిలేక ఒక దుర్భేధ్యమైన కోటలో బాలుడిని పెంచాడు. ఆడుకునే వయసు వచ్చిన బాలుడు ఓ కుక్కపిల్లను చూసి తనకి కావాలని అడిగాడు. ఎంతో సంశయిస్తూనే రాజు తగు జాగ్రత్తలతో కుమారుడికి కుక్కపిల్లను అప్పగించాడు.

రాకుమారుడితో పాటు కుక్క కూడా పెద్దదయ్యింది. యుక్తవయసులో ఉన్న రాకుమారుడు తండ్రితో అన్నాడు– "విధి నిర్ణయం దాటరానిదైతే అది నేను ఎక్కడున్నా నన్ను మృత్యువుకు అప్పగిస్తుంది. కనీసం నేను బయటి ప్రపంచాన్ని చూసి తృప్తిగా చనిపోతాను. సెలవివ్వండి!" అని ప్రాధేయపడినాడు. చేసేదిలేక రాజు అనుమతినిచ్చాడు. రాజకుమారుడు యూఫ్రటిస్ నది పక్కన ఉన్న నహరిన్ (Naharin) దేశానికి చేరుకున్నాడు.

నహరిన్ దేశపు రాజుకు అందాల కుమార్తె ఉన్నది. ఆమె కొరకు ఓ అద్భుత భవనాన్ని నిర్మించి పై అంతస్తు కిటికి ఏడు క్యూబిట్ల ఎత్తులో ఉండేట్లు కట్టించినాడు. "ఎవరైతే ఒక్క గెంతులో ఆ కిటికీని చేరుతారో అతడికి నా కుమార్తె నిస్తాను" – అని చాటింపు వేసినాడు. అనేక దేశాల్నుంచి రాజకుమారులు అక్కడకు చేరుకున్నారు.

వాళ్లందరూ ఎంత ప్రయత్నించినా సఫలురు కాలేదు. ఈలోగా రాకుమారుడు వారిని కలిసి తాను ఈజిప్షియన్ రథసారధి కుమారుడినని చెప్పుకున్నాడు. రాజ కుమారుల అనుమతితో అతడు ఒక్క గెంతులో కిటికీలోకి ప్రవేశించి లోన ఉన్న రాకుమార్తెను కలుసుకున్నాడు.

రథసారధి కొడుక్కి తన కుమార్తెను ఇవ్వడం నహరిన్ రాజుకు ఇష్టంలేదు. రాకుమారుడిని చంపే ప్రయత్నం చేయబోతే రాకుమారి అడ్డువచ్చి, అతడు చనిపోతే తానూ చనిపోతానన్నది. తప్పని పరిస్థితుల్లో రాజు వాళ్లిద్దరికీ వివాహం జరిపించాడు. చాలా రోజులు హాయిగా గడిచాయి.

రాకుమారుడు తన భార్యకు విధి నిర్ణయం గురించి చెప్పాడు. కుక్క, పాము లేదా మొసలి వలన తనకు ప్రాణగండం ఉందని వివరించాడు కాని తానొక రాజకుమారుడినన్న విషయం ఇంకా తెలియనివ్వలేదు. అతడిని ప్రాణప్రదంగా ప్రేమించిన రాకుమారి అతడిని కంటికి రెప్పలా కాపాడుతున్నది.

రాకుమారుడికి తెలియదు తనని వెంబడిస్తూ ఓ మొసలి నహరిన్ రాజ్యానికి వచ్చిందని. ఆ మొసలి రాకుమారుడి నివాసంలో ఉన్న మడుగులో దాగి ఉన్నది. అయితే అంతకు ముందు నుంచి ఆ మడుగులో స్థిరనివాసమున్న నీటి పిశాచికి కోపం వచ్చి మొసలిని నానా విధాలుగా బాధిస్తూన్నది గత మూడు నెలలుగా.

ఆరోజు నగరంలో విందురోజు. భోజనాల అనంతరం రాకుమారుడు నిద్రపోయాడు కాని రాకుమార్తె మెలకువగానే ఉన్నది. ఎందుకైనా మంచిదని ఆమె తమ మంచం పక్కనే పాత్రలో బీరు, పాలు కలిపి గమనిస్తూ ఉన్నది. అర్ధరాత్రి మెల్లగా ఒక పాము వచ్చి రాకుమారుడిని కాటువేసే ముందు బీరు కలిపిన పాలు తాగి నిద్రపోగా, రాకుమారి దానిని ముక్కలు ముక్కలుగా నరికి చంపింది. రాకుమారుడు ఉలిక్కిపడి లేచి ఆ చచ్చిన పాము ముక్కలను చూసి తన భార్యను ఎంతగానో మెచ్చుకున్నాడు. దేవుడికి పూజలు సలిపి తనను కాపాడమని వేడుకున్నాడు.

కొద్దిరోజుల తర్వాత రాకుమారుడు తోటలో నడుస్తున్నపుడు అతడి పెంపుడు కుక్క భయంకరంగా మొరుగుతూ "నేనే నీ మృత్యువును" అని అతడిపై దూక బోయింది.

రాకుమారుడు పరిగెత్తి పక్కనే ఉన్న మడుగులో దూకాడు. అప్పటికే అక్కడ ఉన్న మొసలి అతడిని పట్టుకుని "నేనే విధి నిర్ణయించిన మృత్యువును. అయితే గత మూడు నెలలుగా ఈ నీటిపిశాచం నన్ను నానా బాధలు పెడుతున్నది. నీవు దానిని హతమారిస్తే నేను నిన్ను వదిలేస్తాను" అన్నది.

మరుసటిరోజు ఉదయాన నీటిపిశాచం వచ్చింది.

(ముగింపు వ్రాసి ఉన్న భాగం దొరకలేదు). బహుశా రాకుమారుడు మూడు గండాలు తన భార్య ప్రేమతో, హాథర్ దేవతల చల్లని చూపులతో, రే–సూర్యుడి ఆశీస్సులతో, గట్టెక్కి తాను రాజకుమారుడినన్న విషయం తెలియబరచి అందరినీ ఆశ్చర్యానందాలలో ముంచెత్తి ఉండవచ్చును'–.

హాథర్‌ను శృంగారదేవతగా, సంగీతం, నృత్య కళలకు అధిదేవతగా, స్వర్ణదేవతగా పూజించేవారు.

మార్జాల శిరస్సున్న బస్తెత్ (Bastet of Bubstis)ను హాథర్‌కు రూపంగా కొందరు కొలిచేవారు. సెఖ్‌మెత్, వడ్జెత్, షెస్మెతెత్, చంద్రనేత్రి (Lunar Eye of the Moon), సూర్యనేత్రి (Solar Eye of Re), బస్తెత్, హాథర్ రూపాలు ఆమె సప్తరూపాలు. సెఖ్‌మెత్ (Sekhmet), వడ్జెత్ (Wadjet), షెస్మెతెత్ (Shesmetet) సింహ రూపాలలో ఒసిరిస్‌కు కాపలాగా ఉంటారు.



Sekhmet


ANCIENT EGYPTIAN GODDESSES
Hathor
Love
Isis
Healing
Maat
Truth
Bastet
Joy
Neith
War
Sati
Fertility
Mut
Motherhood
Serquet
Guardian
Nephthys
Darkness
Sekhmet
Protection
Rennut
Harvest
Seshat
Writing

Egypt Women

19. ప్రాచీన ఈజిప్ట్ స్త్రీలు
(Egypt Women)

పిరమిడ్లలో, సమాధులలోని చిత్రలిపులు, చిత్రాలు, శిల్పాలలో మనకు ప్రభువులు, పూజారులు, ముఖ్య అధికారుల జీవన చిత్రాలు కొంతవరకు తెలిసాయి కాని ప్రాచీన ఈజిప్ట ప్రజల జీవనమెలా ఉండేది, ఆనాటి సమాజంలో స్త్రీల పాత్ర ఏమిటీ అనేది చాలావరకు ఊహాగానమే! పితృస్వామ్య వ్యవస్థ, మగవాళ్ల ఆధిక్యత ఉన్నా ఆస్థిపాస్థులు, రాజకీయ వ్యవహారాల్లో సమాన హక్కులుండేవి. ఫారోలుగా, ప్రభువులుగా ప్రజల మన్ననలు పొందిన స్త్రీలున్నారు.

నేత, వ్యవసాయం, పిల్లల సంరక్షణ స్త్రీల పరిధిలో ఉండేవి. ధనవంతులైన స్త్రీలకు ఎక్కువగా స్త్రీ పనివాళ్లుండేవారు.

దాయిలుగా, నృత్య గాన కళాకారిణులుగా, సువాసన ద్రవ్యాల తయారీ దారులుగా, రోదకులుగా, పూజారిణులుగా స్త్రీలుండేవారు.

అన్నా, చెల్లెళ్ల మధ్య వివాహాలుండేవి అరుదుగా. ప్రభువులకు సలహాదారులుగా వారి తల్లులు భార్యలు వ్యవహరించేవారు. నెలసరి సమయంలో ఆంక్షలుండేవి. కుటుంబ నియంత్రణ విధానాలలో తుమ్మజిగురు ద్రవాన్ని వాడేవారు.

గర్భిణీ స్త్రీల దేవత తెనెనెత్ (Tenenet).

పుట్టబోయే శిశువు ఆడ–మగ తెలుసుకోవడానికి గర్భిణీస్త్రీ మూత్రాన్ని బార్లీ, గోధుమ గింజలున్న గుడ్డసంచిలో పోసేవారు. బార్లీ ముందు మొలకెత్తితే బాలుడు, గోధుమ మొలకెత్తితే బాలిక అని అనుకునేవారు. ప్రాచీన ఈజిప్టలో బార్లీ పదానికి సమానార్థకం– తండ్రి.

దాయిల పర్యవేక్షణలో ప్రసవం జరిగేది. చదరపు చాపపై కూర్చుని ఉన్న భంగిమలో నెప్పులు పడేవారు. చాపకు నాలుగుదిక్కులా నాలుగు ఇటుకలు ఉంచేవారు (నాలుగు దేవతలకు చిహ్నంగా) – నట్ (నింగి), టెఫ్‌నట్ (తడిగాలి), అసెట్ (అందం), నెబెత్‌హెట్ (అద్భుతం) ఆ దేవతలు.

ప్రాచీన ఈజిప్ట సమాజంలో మతం ప్రధానపాత్ర పోషించేది. దేవతల ఆశీస్సుల కోసం పూజలు జరిపేవారు. హాట్‌షెప్‌సట్ (Hatshepsut), క్లియొపాత్ర

(Cleopatra), నిటోక్రిస్ (Nitocris), సొబెక్‌నెఫెరు (Sobekneferu), నెఫెర్‌యుతెన్ (Neferneferuaten), టూస్‌రెత్ (Twosret)లు ఫారోలైన మహిళలు. తియు (Tiyi), నెఫెర్‌తితి (Nefertiti), నెఫెర్‌తారి (Nefertari) మహారాణులుగా ముఖ్యపాత్రలు పోషించారు. క్రీస్తుపూర్వం 2970 కాలంలో పాలించిన మెర్‌నియత్ (Merneith) – తొలి ఈజిప్ట రాణి.

నెబెత్ (Nebet) అనే మహిళ ఆరవ డినాస్టిలో వజీర్ (Vajir)గా పనిచేసింది (ఫారొ తర్వాత ముఖ్యపదవి). సెషత్ (Seshat) దేవతల వ్రాయసగత్తె (Scribe) లేఖకురాలు.

రోమన్ సామ్రాజ్యాన్ని ప్రభావితం చేసిన ఈజిప్ట దేవతలు ఐసిస్, హాథర్, బెస్తెత్, సెఖ్‌మత్‌లు.

అమున్ ప్రధాన పూజారిణిని God's Wife of Amun గా పిలిచేవారు. ఫారోల తల్లులు లేదా భార్యలు ఈ పదవికి అర్హులు. అహమోస్–నెఫెర్‌తరి, ఆమె కుమార్తె మెరితమెన్, ఆ తరువాత హాట్‌షెప్‌సత్‌లకు ఈ బిరుదు దక్కింది. God's Wife, Divine adorer, God's Hand అనేవి ఇతర పేర్లు.

నెపొలియన్ బొనపార్టి 1798 దండయాత్రల తరువాత ఈజిప్ట నాగరికత యూరప్ దేశాల ఆచార వ్యవహారాలను ప్రభావితం చేసింది. కళలు, ఫాషన్లు, దుస్తులు, డిజైన్లు (Palmtrees) ఈజిప్ట శైలిలోకి మారాయి కొంతకాలం.

ప్రాచీన ఈజిప్ట స్త్రీలు ప్రత్యుత్పత్తి, జీవనానికి ప్రతీకలుగా ఉండేవారు. శాశ్వత జీవనం, మరణానంతర జీవనం సుఖవంతంగా ఉండడంలో స్త్రీల పాత్ర ప్రధానమైనదిగా భావించేవారు.

వంధ్యలు, కేవలం ఆడపిల్లలను కన్న స్త్రీలు (Mothers of Brides) హేళనకు గురయ్యేవారు. ఆడపిల్లల జననాంగ విచ్ఛేదనాక్రియ (Female genetic mutilation) సూడాన్, ఈజిప్ట ప్రాంతాలలో అధికంగా ఉండేది. (క్రీస్తుపూర్వం అయిదవ శతాబ్దం నుంచి). ఉత్తర, తూర్పు ఆఫ్రికా ప్రాంతాలలో మొదలైన ఈ అనాగరిక పద్ధతి అనేక దేశాలకు వ్యాపించింది. 2007లో ఈజిప్టలో ఈ పద్ధతిని పూర్తిగా నిషేధించారు. 87 శాతం మంది ఈజిప్ట స్త్రీలు ఈ పద్ధతికి గురైనవారే! 1987 నుంచి ఈ పద్ధతి తగ్గుముఖం పడుతున్నదని విశ్లేషకుల అభిప్రాయం.

20. ఐసిస్ - ఏడుగురు వృశ్చిక స్త్రీలు
(Isis - Seven Scorpion Women)

ఖెమ్మిస్ (Khemmis) ద్వీపంలో రెల్లుగడ్డి, పాపిరస్ మొక్కల మధ్య హోరస్ జన్మించాడు. శత్రువు 'సెత్' చూపులు ఆ బాలుడిపై పడకుండా 'తౌత్' సలహా ప్రకారం ఏడుగురు వృశ్చికస్త్రీలు వెంటరాగా (ముగ్గురు ముందు, ఊయలకుర్చీ కింద ఇద్దరు, వెనుక ఇద్దరు) Delta town of the Two Sisters - ఇద్దరు సోదరీమణుల మైదాన ప్రాంతానికి చేరుకున్నారు ఐసిస్ బృందం హోరస్‌తో.

ఆశ్రయం అడిగితే ఓ ధనికస్త్రీ నిరాకరించినా ఇంకో పేదరాలు వీరిని ఆదరించింది. ధనికస్త్రీ కుమారుడిని టెఫెన్ (Tefen) వృశ్చికస్త్రీ కుట్టగా ఆ బాలుడు విషజ్వాలల్లో కాలిపోతుంటే ధనికస్త్రీపై జాలిపడి ఐసిస్ తన మంత్రశక్తులతో అతడిని బ్రతికిస్తుంది.

ఏడుగురు వృశ్చికస్త్రీలు – టెఫెన్, బెఫెన్, మెస్తెన్, మెస్తెతెఫ్, పెతెత్, థెతెత్, మాతెత్;

వృశ్చిక దేవత సెర్‌కెత్ (Serket). హోరస్‌ను కూడా తేలు కుట్టినప్పుడు సెర్‌కెత్ అతడిని రక్షిస్తుంది.

తేలు కుట్టినపుడు దేవతనామం (Serket)తో పాటు వృశ్చికస్త్రీల నామాలు పలికినపుడు విషం విరుగుడవుతుందని ప్రజలు నమ్మేవారు. (పిడుగు పడినప్పుడు మనదేశంలో అర్జున, ఫల్గుణ అంటూ అతడి దశనామాలు పలికినట్లు.)

ఈ నామజపం ప్రాముఖ్యత మనకు ఐసిస్–రె గాథలో తెలుస్తుంది.

వృద్ధ సూర్యుడొకనాడు నడుస్తూ పోతున్నప్పుడు అతడి లాలాజలం ఓ చుక్క నేలపై పడింది. ఐసిస్ ఆ ఉమ్మిని మట్టితో కలిపి చిన్న సర్పంగా చేసి నాలుగు దారుల కూడలిలో ఉంచింది.

మరుసటిరోజు రె (రవి–రా–సూర్యుడు) ఆ దారినే పోతున్నపుడు సర్పం కాటువేసింది. బాధతో 'రె' కేకలు పెడుతున్నపుడు ఐసిస్ వచ్చి అన్నది– "నెప్పి తగ్గాలంటే నీవు నీ అసలు పేరు చెప్పాలి. ఎందుకంటే ఈ విషం నీ లాలాజలమే!"

తన అసలు పేరు చెప్పకుండా తనకున్న ఇతర పేర్లన్నీ చెప్పినా నెప్పి తగ్గలేదు. చివరకు అతడు ఐసిస్‌ను దగ్గరకు పిలిచి ఆమె చెవిలో తన అసలుపేరు చెప్పాడు. బాధ ఉపశమించింది. ఐసిస్‌కు అనంతజ్ఞానం లభించింది. ఆమె కుమారుడు హొరస్‌కు 'రె' అసలుపేరు చెప్పింది. అతడు ఈజిప్టుకు ప్రభువైనాడు.

ఇంతకీ 'రె' సూర్యుడి అసలు పేరు ఎవరికీ తెలియరాలేదు. తెలిసినవారు చెప్పనూలేదు'–.



21. అమున్ - రె
(Amun - Re)

అమున్, అమన్, అమెన్ ఈజిప్టు సూర్య–వాయుదేవుడు. హెర్మోపాలిటన్ ఓగ్‌డాడ్ – అష్టదేవతలలో ఒకడు. అతడి భార్య అమానెత్ (Amaunet). క్రీస్తుపూర్వం 2100 నాటికే (11th Dynasty) థెబెస్‌లో ప్రధాన దేవుడిగా పూజలందుకున్నాడు.

హిక్సాస్‌ల నోడించి అహమోస్ (Ahmose) ప్రభువైనాక అమున్ ప్రాధాన్యత పెరిగింది. రె (రా) సూర్యుడితో కలిసి అమున్–రె (1600-1100 B.C.) ముఖ్య దేవుడిగా మారినాడు. జ్యూస్ (Zeus) దేవుడితో సరిపోల్చినారు గ్రీకులు.

అమున్–అదృశ్యరూపుడు. దాగిఉన్నవాడు, నీలిరంగు దేహం కలవాడు.

అమున్ (తండ్రి), మత్ (Mut-తల్లి), చంద్రుడు ఖొన్సు–Khonsu లను థెబెన్ త్రిమూర్తులుగా కొలిచేవారు.

మిన్ దేవుడితో అమున్–మిన్ (Amun-Min) గా పూజింపబడినాడు.

ఈజిప్టులోని లక్సర్ (Luxor) వద్ద ఉన్న కర్నాక్ (Karnak) దేవాలయంలో థెబెన్ త్రిమూర్తులను పూజించేవారు.

అఖెనాతెన్ కాలంలో అతెన్ (Aten) ఏకదేవతారాధన జరిగినా, అఖెనాతెన్ మరణానంతరం, రాజధాని థెబెస్‌కు మార్చబడింది. మరల అమున్–రా ప్రాభవం పెరిగింది.

అమ్మోనియా, అమ్మొనైట్ పదాలు అమున్–అతడి గొర్రె కొమ్ముల (Amun's horns) నుంచి స్వీకరించబడినాయి.



Khephri



Maat

Re - Horakhty

22. మాత్
(Maat)

మాత్ – సత్యం, సామరస్యం, క్రమపద్ధతి, న్యాయం, నీతి, సంతులనం, చట్టం (Truth, Harmony, Order, Justice, Morality, Balance, Law)లకు అధిదేవత.

అస్తవ్యస్థ స్థితి (Chaos) నుంచి క్రమపద్ధతి (Order)ను తెచ్చిన దేవత. ఆమెకు వ్యతిరేకి ఇస్ఫెట్ (Izft) - అన్యాయం, గందరగోళం, హింసలకు ప్రతీక.

మాత్ పురుషరూపం తౌత్ (Thoth). అధోలోకంలో (Duat) మృతుడి గుండెను త్రాసులో తూచేప్పుడు మాత్ ఈకను రెండోపక్క ఉంచి తూస్తారు. మాత్ ఈక కన్నా బరువు తక్కువ ఉన్న గుండె Blessed Soul గా దేవతల సమూహంలో చేరుతుంది. బరువు ఎక్కువవున్న గుండె (ib)ను అమ్మిత్–The devourer మృగం మింగివేస్తుంది.

మాత్ (మే, మీ) – క్రమపద్ధతి (Order) ఈజిప్ట్ మతంలో ముఖ్యమైన భావన. మాత్ సూర్యుని కుమార్తె. ఉష్ట్రపక్షి (Ostrich) ఈకతో సూచింపబడుతుంది. ఆమె తల్లిదండ్రులు రా–హోథర్‌లు.

23. ఖెఫ్రి
(Khephri)

ఖెఫ్రి, ఖెప్రి – పురుగు – Scarab ముఖమున్న దేవుడు. ఉదయ సూర్యుడికి ప్రతీక. సృష్టి పునరుజ్జీవనానికి చిహ్నం.

ఖెప్రి ఉదయభానుడు, రా–మధ్యంధిన మార్తాండుడు, అతుమ్–సాయంకాలపు సూర్యుడు.

Scarab beetle - 'ఉనికి'లోకి రావడాన్ని తెలియజేస్తుంది.

24. రా-హోరాఖ్తె
(Ra-Horakhte)

ఉదయసూర్యుడు - Horus of the two Horizons - డేగ తల (Falcon). ఉదయ–అస్తమయ సూర్యుడు. హిలియోపొలిస్‌లో ఇతడిని God of the East - తూర్పు దేవుడిగా అభివర్ణించారు. హోరస్–రా లు కలిసిన మూర్తి – హరాఖ్తె.

పదిమంది ప్రముఖ ఈజిప్టు దేవతలు:

1) అమున్–రా (రహస్య దేవుడు, అదృశ్యరూపుడు) Amun - Ra

2) మత్ (మట్) – (మదర్, తల్లి, ఎగువ దిగువ ఈజిప్టుల మాత) Mut

3) ఒసిరిస్ – (సజీవుల రాజు) (The King of Living)

4) అనుబిస్ – ఎంబాల్మింగ్ దేవుడు (The Divine Embalmer)

5) రా (రె) – సూర్యుడు, రవి, ప్రకాశకుడు (Ra)

6) హోరస్ – పగ, ప్రతీకారపు దేవుడు (Horus)

7) తౌత్ – జ్ఞానదేవత (Thoth)

8) హాథర్ – మాతృత్వదేవత (Hathor)

9) సెఖ్‌మెత్ – యుద్ధదేవత (Sekhmet)

10) గెబ్ – భూదేవత (Geb).

25. సొబెక్ (Sobek)

నైలునదిలోని మొసలిగా, మకరపు శిరస్సున్న మానవరూపుడిగా, ఫారో అధికారశక్తిగా, సంతానోత్పత్తి దేవుడిగా, సైన్యశక్తిగా, నైలునది వల్ల కలిగే నష్టాలను ఆపే దేవుడిగా పూజలందుకున్నాడు.

క్రీస్తుపూర్వం 2686 నుంచి క్రీస్తుశకం 350 వరకు ప్రాచీన ఈజిప్టు పుస్తకాలలో పేర్కొనబడి నియత్ (Neith) కుమారుడిగా, ఇంద్రియ ద్రవానికి అధిదేవత (Semen)గా పేర్కొనబడినాడు.

Sobek - గర్భం కలిగించేవాడు (Impregnate). సొంబెక్-రా, సొబెక్-హోరస్‌ల ఐక్యరూపాలు. సూర్యుడి ప్రతిరూపాలలో సొబెక్ గుర్తించబడినాడు. ఫైయుమ్ (Faiyum) - సరస్సు ప్రదేశం - ముఖ్యంగా మొయిరిస్ సరస్సు (Moeris Lake) అతడుండే ప్రదేశం. క్రాకొడిలొపొలిస్ (షెడెత్-Shedet) ముఖ్య పట్టణం. దక్షిణ ఈజిప్టులో Kom-ombo ను House of Sobek అని పిలుస్తారు. అతడి వ్యక్తిత్వాన్ని సూచించే బిరుదులు- దొంగల దేవుడు, తింటూనే సంభోగించేవాడు, సూదిదంతుడు, ఒసిరిస్ వైద్యుడు.

26. ఖ్నుమ్ (Khnum)

నైలునదీ ప్రారంభ ప్రదేశ దేవత. మానవ శిశువుల శరీర నిర్మాత. కుమ్మరి చక్రంపై నైలునది మట్టితో శిశువులను చేసి తల్లుల గర్భాన ఉంచుతాడు. దేవ కులాలుడు. తన నుంచి ఇతరులను తయారు చేయువాడు.

ఎలిఫెంటయిన్, ఎస్నా పవిత్ర స్థలాల్లో అర్చింపబడిన దేవుడు. నైలునది రక్షకుడు.

నెబ్ట్-యు, మెన్‌హిత్‌లు ఖ్నుమ్ భార్యలు

నియత్ (Neith) - Mother of the mothers.

ఖ్నుమ్-నియత్‌లు ఖ్నుమ్-రె (Khnum-Re)కు తల్లిదండ్రులు.

గొర్రెతల (Ram head)తో కుమ్మరి సారె (Patter's Wheel)తో చేసిన శిశువులలోకి ప్రాణవాయువు ఊదే దేవుడు. అతడి చేతిలోని కలశంలోంచి నైలునదీ ప్రవాహం క్రిందకు జారుతున్నట్లుంటుంది. గొర్రెతల కలవాడు

Sobek



Khnum

Geb - Nut

27. గెబ్ - నట్ (Geb-Nut)

గెబ్ – భూదేవుడు. తలచుట్టూ పొడపాము. నాగుల తండ్రి (Father of Snakes). భూకంపాలను పుట్టిస్తాడు. పంటలను పెరగనిస్తాడు. గొర్రె, వృషభం, మొసలి అతడి రూపాలు. కొన్ని పుస్తకాలలో గెబ్‌ను సృష్టికర్త బాతు (Creator Goose)గా బ్రహ్మాండాన్ని, దాని నుంచి సూర్యుడిని, ప్రపంచాన్ని సృష్టించినవాడిగా పేర్కొన్నారు.

నట్–ఆకాశదేవత. నింగి, తారలు, విశ్వం, ఖగోళశాస్త్రానికి ప్రతీక. గెబ్ భూదేవుడిపై, వంపుగా వంగి ధేనువు రూపంలా కానవస్తుంది. ఒసిరిస్, ఐసిస్, నెఫ్థిస్, సెత్‌లు సంతానం. గెబ్ ఆమె భర్త. వేల ఆత్మల తల్లి, దేవమాత, రక్షకురాలు, ఆకాశదేవత ఆమె పేర్లు.

28. సర్పదేవతలు (Serpent Gods)

1) అపెప్ (Apep, Apophis) - అస్తవ్యస్త స్థితికి ప్రతీక (Chaos God). వెలుగుకు శత్రువు. మాత్ సక్రమస్థితికి వ్యతిరేకి. 'రా' సూర్యుడి పడవను నిలువరించ బోయినపుడు అథోలోకంలో (Duat) సెత్ (Seth) అతడిని ముక్కలుగా నరుకుతాడు. సూర్యాస్తమయ సమయానికి పడమటి కొండల (Bakhu-బాఖు) వద్ద దాక్కుని సూర్యుని పడవ కింద చేరి భయంకరంగా అరుస్తూ, తుఫానుల్ని, భూకంపాల్ని సృష్టిస్తాడు. సెత్ లేదా రా అతడిని ఓడిస్తారు. (ఇంద్రుడు – వృత్రాసురుడి కథలా).

2) మెహెన్ (Mehen) - తన తోకను తానే మింగే ఒరొబొరస్ (Ouroboros) సర్పంలా – మెహెన్ సూర్యుడు 'రా' చుట్టు రాత్రి ప్రయాణంలో రక్షణగా ఉంటుంది.

3) నెహెబు-కావు (Nehebu-Kau) - ఆదిశేషుడులా ఆదిసర్పం. 42 న్యాయమూర్తుల్లో ఒకడైన నెహెబ్‌కావు ఆత్మలకు 'కా' (Ka) రూపాన్నిస్తాడు. ఒసిరిస్‌కు అంగరక్షుడిగా, 'రా'కు సహాయకుడిగా రాత్రి ప్రయాణంలో తోడ్పడతాడు. మృత ప్రభువులకు ఆహారాన్ని, సందేశాలను అందజేస్తాడు.

4) రెనెన్యుతెత్ (Renenutet) - నైలునదికి వరదలు వచ్చినపుడు దిగువ ప్రాంతాల్లోని పాములు ప్రజల నివాస స్థలాల్లోకి వచ్చేవి. అందుకని పాములు రావడానికి, వరదలకు గుర్తుగా ఈజిప్టు ప్రజలు భావించేవారు. సర్పదేవతలు నాగినులు (Cobra)గా పూజింపబడేవారు. ఫారో ప్రభువుకు దాయిగా రెనెన్యుతెత్‌ను భావిస్తారు. షాయి (Shai) విధిదేవుడి స్త్రీరూపం రెనెన్యుతెత్.

5) వడ్జెత్ (Wadjet, Uto, Buto, Udjo) - ఆకుపచ్చ నాగిని దిగువ ఈజిప్టు రక్షకదేవత. ఫారోల, పిల్లల రక్షకురాలు. హోరస్‌కు దాయిగా వ్యవహరించింది. Eye of the moon - చంద్రనేత్రిగా ఫారో శిరస్సునలంకరించిన నాగిని. అగ్ని జ్వాలలను విరజిమ్ముతూ Lady of the Devouring flame గా రె (రా) సూర్యుడు ఎపొఫిస్ సర్పాన్ని ఓడించేందుకు తోడ్పడుతుంది.

6) వెరెత్‌హెకావు (Werethekau) - రా–హోకార్తె భార్యగా, మంత్రశక్తుల అధిదేవతగా, గర్భిణీస్త్రీలు, పాలిచ్చే తల్లులకు రక్షక దేవతగా ఈమె పూజింపబడింది. ఈజిప్టు ప్రభువుల కిరీటాలను సర్ప, సింహ రూపాలలో కాపాడుతుంది.

షాయి (Shai), రెనెన్యుతెత్, మెస్కెనెత్‌లు విధిదేవతలుగా ఆయుర్దాయాన్ని, మరణ కారణాన్ని, పుట్టుకను నియంత్రిస్తారు.

29. నియత్ (Neith)

సృష్టికర్త, భయంకరి, జ్ఞానదేవత, నేత, నీరు, వేట, యుద్ధం, ప్రసూతి, విధి అధిదేవత. ఆమె చేతిలో రాజదండం (Scepter), జీవబీగం (Ankh) ఉంటాయి. స్వర్గధేనువుగా, మెహెత్–వెరెత్ (Mehet-Weret=The Great Flood) మహా వరదగా, సూర్యుడికి రోజూ జన్మనిచ్చే తల్లిగా వర్ణించబడిన అధిదేవత నియత్.

యురియస్ (Uraeus) ఈజిప్షియన్ నాగిని రూపంలో ఉంటుంది. సామ్రాజ్యం, రాచరికం, అధికారాలకు చిహ్నం.

ఆదిమ జలాల రూపాన ఆమె తొలి అమ్మతల్లి. ప్తా (Ptah) దేవుడిది

South of his wall, నియత్‌కు North of her wall - అని పేరు. నేత, మగ్గాలకు అధిదేవత. మకర రక్షకురాలు. సూర్యునికి జన్మనిచ్చే గోవు. దుర్గమ దారుల్ని తెరుస్తుంది (Opener of the ways).

రా, అపెప్‌లకు, సొబెక్‌కు తల్లిగా ఖ్నుమ్‌కు భార్యగా పేర్కొనబడింది. హోరస్–సెత్‌ల తగాదాలో ఆమె సలహా కోరుతారు. ఆమె తీర్పు ఒక ప్రధాన ఘట్టం ఆ కథలో.

30. మత్ (Mut)

మాత, మత్, మదర్. ఈమె–తల్లిదేవత. అమెన్‌కు భార్యగా, ఖొన్సు (Khonsu)కు తల్లిగా ఈమె పేర్కొనబడింది. పెద్ద విగ్గు, రాబందు ఈకల తలపాగా, రంగురంగుల దుస్తులు, దక్షిణ ఈజిప్టు తెల్లకిరీటం – ఈమె ఆహార్యాలు. సూర్యనేత్రి (Eye of Re)గా ఈమె Mut-Sekhmet. ఫారోలకు తల్లి, వైద్యురాలు.

31. అనత్ (Anat)

మధ్య సామ్రాజ్య కాలం నాటికి కాననైట్ల (అనంత్–అనిత్) దేవత హిక్సాస్‌ల పాలనలో ఈజిప్టు దేవతలలో చేరింది. సంతానోత్పత్తి, వేట, యుద్ధాలకు అధిదేవత. కన్యగా, మోహినిగా, యువతిగా, శత్రు భయంకరిణిగా పేరు పొందింది. నియత్‌లా నేతకు, యుద్ధానికి ప్రతీక. సింహవాహిని.

32. అస్తార్తె (Astarte)

సంతానోత్పత్తి, శృంగారం, యుద్ధాలకు అధిదేవత. పద్దెనిమిదవ డినాస్టి కాలంలో సెమిటిక్ ప్రజల ద్వారా ఈమె ఈజిప్టు దేవతలలో చేరింది. హోరస్–సెత్ తగాదాలో అనత్–అస్తార్తెలు 'రా' పుత్రికలుగా సెత్ పక్షాన పాల్గొంటారు.

అస్తార్తె – సంతృప్తి లేని సముద్రం కథలో సెత్ యమ్ సముద్రాన్ని వ్యాకుల పరచి అస్తార్తెను బహుమతిగా స్వీకరిస్తాడు.

సర్పదేవతలు – **Serpent Gods**



నియత్–Neith

మాత్–Mut

అనత్–Anat

అస్తార్తె–Astarte

ఎటెన్–Aten



బస్తెత్–Bastet

33. కొన్ని మంత్ర తంత్రాల కథలు (Magic)

మొదటి కథ

వెబవొనెర్ (Webaoner) అనే దేవాలయ పూజారికి అందమైన భార్య, చక్కని ఇల్లు, అనేక సంపదలు ఉన్నాయి. అయితే అతడి భార్య ఒక అందగాడిని చూసి మోజుపడింది. ఆ యువకుడూ ఈమెను చూసి మోహాతిరేకుడై రహస్య వర్తమానం పంపాడు.

పూజారి ఇంట్లో నీటి కొలను పక్కన చిన్ని ఇల్లు ఉంది. పూజారి లేని సమయం చూసి ప్రేమికులిద్దరు కాలాన్ని శృంగారభరితంగా గడపసాగారు. అది గమనించిన ప్రధాన సేవకుడు పూజారికి ఆ విషయం చెప్పాడు. కోపం, దుఃఖం మిళితమైన భావనలతో పూజారి తన మంత్రాలపెట్టె నుంచి మైనపు ముద్ద తీసి దానితో ఏడంగుళాల మొసలిబొమ్మను చేసి ప్రేమికుడు వచ్చినపుడు నీటికొలనులో వదలమన్నాడు.

పూజారి గుడికి వెళ్లాడని గమనించిన ప్రేమికుడు తన ప్రియురాలిని చేరి సరససల్లాపాల తరువాత స్నానం చేద్దామని కొలనులో దిగి మునక వేసినపుడు ప్రధాన సేవకుడు నీళ్లలోకి మొసలి మైనపుబొమ్మను వదిలాడు. మంత్ర ప్రోక్తమైన ఆ బొమ్మ ఏడు క్యూబిట్ల (పన్నెండు అడుగుల) మొసలిగా మారి ఆ ప్రేమికుడిని నోట కరుచుకుని సరస్సు అడుగుకు లాక్కుపోయింది.

ఏడవ రోజున వెబవొనెర్ పూజారి తన ప్రభువైన నెబ్కారాజును తీసుకువచ్చి సరస్సు దగ్గర మంత్రాలు చదవగానే మొసలి ఆ దురదృష్టవంతుడైన ప్రేమికుడిని నోట కరుచుకుని వచ్చి పూజారి పాదాల చెంత పడవేసింది. పూజారి మంత్రాలు చదవగానే మరల మైనపుబొమ్మగా మారిపోయింది.

పూజారి భార్య చేసిన నేరం రాజుకు అర్థమయ్యింది. రాజాజ్ఞ వినగానే మొసలిబొమ్మ మొసలిగా మారి భీకరంగా అరుస్తూ ప్రేమికుడిని సరస్సులోకి లాక్కుపోయి తినేసింది. పూజారి భార్యను సజీవదహనం చేసి ఆ బూడిదను సరస్సులో పడవేసారు.

వ్యభిచారానికి శిక్షలు కఠినంగా ఉండేవన్న విషయం ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది.

రెండవ కథ

హెరొడొటస్ ఇటువంటి కథనే తన శైలిలో చెప్పాడు.

ఫెరాస్ ప్రభువు పదేళ్లపాటు దృష్టిలోపం వల్ల అంధుడైనాడు. భర్తను తప్ప అన్యుల నెరగని యువతి మూత్రంతో రాజు కళ్లను శుభ్రం చేస్తే చూపు వస్తుందని ఆనాటి వైద్యులు చెప్పారు. రాజుకు అంతఃపురం నిండా రాణులున్నారు కదా అందుకనే రోజుకొక్కరి మూత్రంతో కళ్లను తడిపినా ప్రయోజనం లేకపోయింది. అవమానం, అనుమానం, అసహనంతో ఉన్న రాజు ఆఖరి ప్రయత్నమని ఆఖరి రాణి మూత్రంతో కళ్లు కడిగాడు! ఆశ్చర్యం! చూపు వచ్చింది. మిగతావాళ్లను అగ్నికి ఆహుతిచేసి ఆఖరిరాణిని పట్టపురాణిని చేసినాడు ఫెరాస్ ప్రభువు.

మూడవకథ

మంత్రశక్తుల కథ మరొహటి.

స్నెఫ్రు ప్రభువుకు విసుగు పుట్టింది. రోజూ ఈ రాజకీయాలూ తలనెప్పులేనా! పూజారిని సలహా అడిగాడు. పూజారిపేరు Djadja-em-Ankh. అతనన్నాడు– "అందమైన యువతులతో నౌకావిహారానికి వెళ్లండి". రాజు తలచుకుంటే అమ్మాయిలకు కొదవా!

ఇరవైమంది కన్యలు, అపురూప లావణ్యవతులు, వెండి బంగారు తీగెలతో అల్లిన వలల్ని దుస్తులుగా ధరించి, బంగారం–ఎలక్ట్రమ్ పిడులున్న తెడ్లతో రాగా అత్యంత సుందరమైన పడవ సరస్సులో వెళుతుంటే వాళ్లు మధురమైన స్వరాలతో గానం చేస్తూ రాజును సంతోషపరుస్తున్నారు.

ఇంతలో ఓ అందాలరాశి శిరోజాలనున్న నీలి ఆకుపచ్చ తలపిన్ను జారి నీటిలో పడిపోగా ఆమె కెవ్వున కేకపెట్టి ఏడుపు మొదలెట్టింది. రాజు వెంటనే పూజారిని పిలిచి సలహా అడిగాడు. పూజారి దేవుని స్మరిస్తూ మంత్రాలు చదివి సరస్సును ఎండింపచేసి అడుగున పడి ఉన్న తలపిన్నును తెచ్చి ఇచ్చి మరల సరస్సులో నీరు నింపాడు. పడవ కదిలింది. రాజు ఆనందభరితుడై పూజారిని అనేక విధాలుగా సత్కరించాడు.

నాలుగవ కథ

'జెడ్–స్నెఫ్రు' (Djed-Snefru) అనే పట్టణంలోని మంత్రగాడి పేరు Djedi-జెడి. నూటపదేళ్ల వయసులో కూడా అయిదువందల రొట్టెలు, సగం ఆవు మాంసం, వంద కూజాల బీరు సునాయాసంగా తిని తాగుతాడు. తెగిన తలను అతికిస్తాడని, సింహాల్ని మచ్చిక చేస్తాడని ప్రతీతి. "తౌత్ రహస్య గదికి దారి తెలిసిన వాడతడొక్కడే!" – అన్నాడు Hardjedef రాకుమారుడు తన తండ్రి ఖుఫు ప్రభువుతో.

ఖుఫు (Khufu) ప్రభువు ఆ మంత్రగాడిని తన వద్దకు తీసుకురమ్మని రాకుమారుడిని ఆజ్ఞాపించాడు. రాకుమారుడు మంత్రగాడి ఇంటికి వెళ్లి అతడిని ఆహ్వానించాడు.

మంత్రగాడు తన పిల్లలు, పుస్తకాలతో రాచనౌకలలో రాకుమారుడి వెంబడే రాజభవనానికి వచ్చాడు.

ఖుఫు రాజు మంత్రగాడిని పరీక్షించడానికి మరణశిక్ష వేయబడిన ఖైదీని తెప్పించి సభికుల ముందట శిరచ్ఛేదం చేయబోగా రాజును వారించి ఒక బాతును తెమ్మని అడిగాడు మంత్రగాడు. బాతు తలనరికి తల తూర్పువేపున, శరీరం పడమటి వేపున ఉంచారు సైనికులు దూరదూరంగా. మంత్రగాడు మంత్రాలు చదవగానే తలవెళ్లి బాతు శరీరానికి అతుక్కుని బాతు పరిగెత్తసాగింది. అలాగే ఇబిస్‌ను, వృషభాన్ని తలనరికి బతికించాడు.

ఖుఫు అడిగాడు– "తౌత్ రహస్య గదులెక్కడున్నాయి?"

మంత్రగాడు బదులిచ్చాడు– "నాకు తెలియదు, కాని, అవెక్కడున్నాయో తెలిపే గ్రంథాలున్నాయి నా దగ్గర.

హిలియోపొలిస్ ఇన్‌వెంటరీ అనే భవనంలోని చెక్కపెట్టెలో ఆ గ్రంథాలున్నాయి. రెడ్‌జెడెత్ గర్భంలో ఉన్న ముగ్గురు శిశువులలో పెద్దవాడు మాత్రమే వాటిని తీసుకు రాగల సమర్థుడు" అన్నాడు మంత్రగాడు.

"ఎవరీ రెడ్‌జెడెత్?" అన్నాడు ఖుఫు ప్రభువు.

"ఆమె సఖ్బు (Sakhbu) ప్రభువు, 'రె' సూర్యుడి పూజారి భార్య. పూర్ణ గర్భిణిగా ఉన్నదామె. ఆమె సంతానం రేపటి ఫారోలవుతారు" అన్నాడు మంత్రగాడు.

ఫారో చింతాక్రాంతుడైనాడు. అతడిని చూసి మంత్రగాడన్నాడు– "రాజా! దిగులు పడవద్దు! మొదట నీ కుమారుడు, ఆ తరువాత అతడి కుమారుడు, అతడి తరువాత అవకాశం ఆ ముగ్గురికి దక్కుతుంది".

"రెడ్‌జెడెత్ రాణి ఎప్పుడు ప్రసవిస్తుంది?" ఖుఫు అడిగాడు.

"శీతాకాలం తొలినెల పదిహేనవ రోజున" అన్నాడు మంత్రగాడు.

"నేను 'రె' దేవాలయం చూడగలనా?" అన్నాడు రాజు.

"రెండు చేపల కాలువలో నీళ్లు నింపుతాను తమరు వెళ్లేప్పుడు" అన్నాడు మంత్రగాడు – "నాలుగు క్యూబిట్ల లోతు. తమరు అనుకున్న పని అవుతుంది".

ఖుఫు అనుకున్న పని దిగ్విజయంగా పూర్తయ్యింది. ప్రభువు మంత్రగాడిని అనేక కానుకలతో సత్కరించాడు. ఖుఫు ప్రభువు, రాకుమారుడు Hardjedef లకు ఆత్మీయ అతిధిగా మంత్రగాడు Djedi చిరకాలం జీవించాడు.

అయిదవ కథ

ఆరోజున రెడ్‌జెడెత్‌కు పురిటి నొప్పులు మొదలయ్యాయి. చాలా కష్టపడుతున్నదామె. బయట ఆమె భర్త రెవొసర్ (Rewoser) బయట బిక్కుబిక్కు మంటూ ఉన్నాడు. తన పూజారి దయనీయ స్థితిని చూసిన రె(రా) సూర్యుడు ఐసిస్, నెఫ్‌థిస్, మెస్కెనెట్, హెకెత్, ఖ్నుమ్‌లను పిలిచి ఆమెకు సాయపడమని చెప్పి పంపించాడు. నలుగురు దేవతలు నాట్యకత్తెలుగా, ఖ్నుమ్ వారి సేవకుడిగా వచ్చి రెవొసర్ అనుమతితో ప్రసవవేదన పడుతున్న రెడ్‌జెడెత్ వద్దకు వెళ్లారు. వారి పర్యవేక్షణలో పుట్టిన మొదటి శిశువుకు మహాబలుడు (Strong) అని పేరు పెట్టింది ఐసిస్. అడుగున్నర పొడవు, స్వర్ణకాంతులీనే శరీరం, లాపిస్‌లాజులి – నీలిరంగు శిరోజాలు – ఇతడు సమస్త ప్రపంచాన్ని ఏలే ప్రభువవుతాడు – అన్నది మెస్కెనెత్. ఖ్నుమ్ అతడికి ఆరోగ్యాన్ని వరంగా ఇచ్చాడు.

రెండవ శిశువుకు మహాయోధుడు (Kicker) అని పేరు పెట్టింది ఐసిస్; మెస్కెనెత్, ఖ్నుమ్‌లు ఆశీర్వదించారు.

మూడవ శిశువుకు రేచుక్క (Dark) అని పేరు పెట్టింది ఐసిస్; మెస్కెనెత్, ఖ్నుమ్‌లు ఆశీర్వదించారు.

ముగ్గురు శిశువులు యావత్ప్రపంచాన్ని ఏలగలరని రెవొసర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పూజారి సంతోషంతో వారికి ఓ పెద్ద సంచినిండా బార్లీ ధాన్యమిచ్చి దీనితో మంచి బీరు తయారవుతుందని చెప్పి వీడ్కోలు తీసుకున్నాడు.

అయితే ఐసిస్ ఆ బార్లీ సంచిలో మూడు కిరీటాలుంచింది. సంచిని భద్రపరచమని, తాము తిరుగు ప్రయాణంలో తీసుకుంటామని, పూజారికి చెప్పి అయిదుగురు వెళ్లిపోయారు.

పధ్నాలుగు రోజుల తరువాత రెడ్‌జెడెత్ మరల యధావిధి తన పనులు చేసుకుంటూ ఇంటిలో బీరు లేకపోవడం గమనించింది. మూలగదిలో ఉన్న బార్లీ సంచిని తన భర్త తన ప్రసవ సమయంలో సాయపడిన వారికి కానుకగా ఇచ్చాడని ఆమె సేవకురాలు చెప్పింది.

సేవకురాలు గదిలోకి వెళ్లగానే ఆ బార్లీ సంచిలోంచి అతిలోక మధురమైన సంగీతం, నృత్య గీతాల సవ్వడి వినిపించగా వెళ్లి, తన యజమానురాలిని పిలుచుకు వచ్చి చూపించింది. వాళ్ల ఆశ్చర్యానికి అంతులేదు. ఆ సంచిని పెట్టెలో పెట్టి, ఆ పెట్టిని పెద్ద మందసంలో ఉంచి దానికి తోలుబెల్టుతో కట్టి అత్యంత విలువైన వస్తువులుంచే చోటున ఉంచి తన భర్త రాగానే ఆ విషయం చెప్పింది. అతడు ఆనంద పరవశుడైనాడు.

ఒకరోజు చెప్పిన పని చేయనందుకు రెడ్‌జెడెత్ తన సేవకురాలిని మందలించింది. ఆమె ఆగ్రహంతో బార్లీ సంచి, రేపు ప్రభువులు కానున్న ముగ్గురు శిశువుల సంగతి ఖుఫు ప్రభువుకు చెప్పాలని వెళ్తూ దారిలో తన సవతి సోదరుడి పొలం వద్ద ఆగింది. అతడు ఆమె చెప్పింది విని ఆమెనే తప్పుబట్టాడు. కోపంతో ఊగిపోతూ ఆమె పక్కనే ఉన్న సరస్సు వద్దకు వెళ్లగా ఓ మొసలి ఆమెను నోట కరుచుకుపోయింది.

ఆమె సోదరుడు చింతాక్రాంతుడై రెడ్‌జెడెత్ వద్దకు వెళ్లేప్పటికి ఆమె దుఃఖ వదనంతో కూర్చుని ఉండగా అతడు, మొసలి తన సోదరిని నోట కరుచుకు పోయిన విషయాన్ని చెప్పాడు'–.

పాపిరస్ వెస్ట్‌కార్‌లో అయిదవ డినాస్టి గురించి వ్రాయబడింది.

ఖుఫు (Khufu) తర్వాత అతడి కుమారులు Djedefre, Khaefre; వారి తరువాత మెన్‌కవురె (Menkaure) (మూడో గీజా పిరమిడ్ నిర్మాత) అతడి తరువాత

Shepseskaf, అతడి తరువాత ఈ ముగ్గురు శిశువులలో మొదటివాడైన మహాబలుడు (Strong) - Userkaf, అతడి తరువాత మహాయోధుడు (Kicker) - Sahure, అతడి తరువాత రేచుక్క (Dark) Neferirkare - Kakai లు ఈజిప్టును పాలించారు. ఆ విధంగా జోస్యం ఫలించింది.

Female Genetic Mutilation - జననాంగాల విచ్ఛిత్తి – Female, Male Circumission, Infibulation వల్ల ఈజిప్ట స్త్రీలకు ప్రసవ వేదనలు మరింతగా ఉండేవి. దాయాల వద్ద హిప్పొపొటమస్ దంతంతో చేసిన పనిముట్లు జనన ద్వారాన్ని వెడల్పు చేయడానికి పనికి వచ్చేవి. బయట ప్రజలకు వాటిని మంత్రదండాల్లా ప్రదర్శించేవారు. అలాగే ప్రసవం కూర్చున్న స్థితిలోగాని, మోకాళ్లపై కూర్చున్నట్లుగా గాని, ప్రసవ పీఠం మధ్యలో రంధ్రం ఉన్న చెక్కపీటపై గాని కూర్చొని నెప్పులు పడేవారు. నెప్పులు అధికమయ్యేందుకు బాధ తగ్గేందుకు వేడి చేసిన ఇటుకలు వాడేవారు.

అమ్మిత్ (Ammit) the devourer లా, హిప్పొటమస్‌లా ఉండి ప్రసవాల్ని పర్యవేక్షించే దేవత–తవెరెత్.

Opet the Nurse, Raret the sow, Nun Mehet - Weret – వీళ్లందరూ ప్రసవకాలపు దేవతలు. బెస్ అనే సింహ మానవుడు ప్రసవ కాలమందు సహాయకుడిగా, పాముల నుంచి కాపాడేవాడిగా వర్ణించబడినాడు. బెస్ స్త్రీరూపం బెస్తెత్ (Bestet).

34. దైవ పుత్రులు (Divine Births)

హాట్‌షెప్‌సత్ (Hatshepsut), మూడవ అమెన్‌హొతెప్ (Amenhotep-III), రెండవ రామెస్సెస్ (Ramesses II) లు తమను తాము దేవతల వరప్రసాదులుగా ప్రకటించుకున్నారు. తాను అమున్–రె సూర్యుడి పుత్రికగా ప్రకటించుకున్న హాట్‌షెప్‌సత్ ఇరవై రెండు సంవత్సరాలు మొదటి టుత్‌మోసిస్ కుమార్తెగా, రెండవ టుత్‌మోసిస్ విధవరాలిగా, మూడవ టుత్‌మోసిస్ (Tuthmosis) సవతితల్లిగా రాజ్యపాలన చేసింది. Horemakhet - Khepri - Re Atum ల కరుణతో నాలుగవ టుత్‌మోసిస్ – ముతెమ్‌వియా (Mutemuia) ల కుమారుడైన మూడవ అమెన్‌హొతెప్ (Amenhotep). ముప్పై ఎనిమిది సంవత్సరాలు ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించాడు.

'ప్తా' (Ptah) వరప్రసాదైన రెండవ రామెస్సెస్ Ramesses-II దాదాపు అరవై ఆరు సంవత్సరాలు పాలించాడు. ఆరోజుల్లో ఈజిప్ట ప్రజల ఆయుర్ధాయం కేవలం నలభై సంవత్సరాలు.

ఈజిప్ట ఆఖరి ప్రభువు–ఈజిప్ట వాసి– ముప్పైవ డినాస్టి రెండవ నెక్‌తన్‌బొ (Nectanebo-II) హొరస్ అంశగా తనను తాను ప్రకటించుకున్నాడు. క్రీస్తుపూర్వం 343 సంవత్సరంలో పర్షియన్లు దండెత్తినపుడు ఫాల్కన్ డేగలా అతడు రహస్య ప్రదేశానికి ఎగిరి అదృశ్యమైనాడు.

క్రీస్తుపూర్వం 332లో అలెగ్జాండర్ ఈజిప్టను ఆక్రమించుకున్నాక లిబియా ఎడారిలో 300 మైళ్లు ప్రయాణించి జ్యూస్–అమ్మాన్ జోస్యంతో తనను A Living God గా 'నడిచే దేవుడి'గా ప్రకటించుకున్నాడు. ఒక కథనం ప్రకారం 'నెక్‌తన్‌బొ' ప్రభువు డేగగా ఎగిరి, పాముగా మారి అలెగ్జాండర్ తల్లి ఒలింపియాస్‌తో కలవగా అలెగ్జాండర్ జన్మించాడని; అలెగ్జాండర్ చేతిలో మరణించి నెక్‌తన్‌బొ ఖననం చేయబడడం వలన (Who buries gets the throne) అలెగ్జాండర్‌కు ఈజిప్ట ప్రభువయ్యే అర్హత లభించిందని చెప్పబడింది.

టాలమీ ప్రభువులు కూడా తాము దైవాంశ సంభూతులమని చెప్పుకునే ప్రయత్నాలు చేసారు. మొదటి టాలమి (Ptolemy-I) సెరాపిస్ (Serapis) అనే కొత్త దేవుడిని సృష్టించి గ్రీకులకు, ఈజిప్ట ప్రజలకు మధ్య సయోధ్య కుదిర్చే

ప్రయత్నం చేసాడు. సెరాపిస్–ఐసిస్–హార్పొక్రెటిస్ తండ్రి–తల్లి–కుమారుడు – త్రిమూర్తులుగా కొన్నాళ్లు టాలమీ ప్రభువుల దేవతలైనారు.

రెండవ టాలమీ ప్రభువు తన సోదరి రెండవ అరిస్నో (Arisnoe-II)ను వివాహమాడి అన్నా–చెల్లెళ్లు వివాహ (ఒసిరిస్–ఐసిస్, సెత్–నెఫ్థిస్) సంప్రదాయాన్ని పునరుద్ధరించాడు.

పన్నెండవ టాలమీ తనను Neos Dionysis కొత్త డయొనిసిస్‌గా అభివర్ణించుకున్నాడు.

మొదటి టాలమీ తల్లి అరిస్నో తాను హెరాక్లిస్–డయొనిసిస్ వంశస్థురాలిగా చెప్పుకున్నది. ఏడవ క్లియొపాత్రా చరిత్రలో ప్రసిద్ధికెక్కిన ఈజిప్టు రాణి. దివంగత ఒసిరిస్–ఐసిస్–హోరస్‌లా దివంగత జూలియస్ సీజర్–క్లియొపాత్ర–సిజరియన్‌లు త్రిమూర్తులుగా తాను 'ఐసిస్' ప్రతిరూపాన్నని ప్రకటించినది క్లియొపాత్రా!

వీరందరికి భిన్నంగా బహుదేవతారాధన నుంచి ఈజిప్టును ఏకదేవతారాధన వేపు మళ్లించినవాడు మూడవ అమెన్‌హొతెప్–తియె (Tiy) రాణిల కుమారుడు నాలుగవ అమెన్‌హొతెప్ (Amenhotep-IV) దేవతల సమూహం (Pantheon) బదులుగా – సూర్యచక్రం (Sundisc) ను దేవుడు Aten (అతెన్)గా తనను అఖెనాతెన్ (Akhenaten) గా – Living spirit of Aten గా ప్రకటించుకున్నాడు. సహస్ర కిరణ సూర్యబింబం, ఒక్కడే దేవుడు, శరీరం లేనివాడు; (అతెన్–అఖెనాతెన్–నెఫెర్‌తితి కొత్త త్రిమూర్తులయినారు). అతెన్ స్తోత్రం–

స్వర్గపు అంచు నుంచి ప్రకాశించే దైవమా
ఓ అతెన్! సృష్టికర్తా!
సమస్తలోకాలకు వెలుగునిచ్చువాడా!
నీవు లేని ఈ ప్రపంచం లేదు
పశ్చిమాన నీవు అస్తమించగా అంతా చీకటే!
మృత్యువు వచ్చినట్లు నేల అంధకారమవుతుంది.
దొంగలు క్రూరమృగాలు, పాములు సంచరిస్తాయప్పుడు.
నీవు ఉదయించగానే చీకటి పారిపోతుంది
రెండు లోకాల ప్రజలు నిన్ను ప్రస్తుతిస్తారు

దైనందిన పనుల్లో మునిగిపోతారు
పక్షులు, జంతువులు, జలచరాలు సంతోషిస్తాయి.
నీవు సంతానదేవతవు
గర్భధారణ నుంచి అంత్యేష్టి వరకు కాపాడేది నీవే.
నీవు కానరానిదేమీ లేదు,
ఈ ప్రపంచం నీవు సృష్టించినదే
మానవాళిని సక్రమ పధాన నడిపించేది నీవు
నైలునదిని నిండైన జలాలతో ప్రవహింపచేస్తావు
పంటపొలాల్ని ఆకుపచ్చని రంగుతో అలరిస్తావు
ఋతువుల సృష్టికర్తవు నీవే!
నింగిని నిర్మించి దానిలో ప్రకాశిస్తున్నావు
నాకు నీ అండ నిచ్చినావు
నేను నిన్ను పూజిస్తున్నాను
నీవు నాకు నీ శక్తియుక్తుల నిచ్చినావు.
జీవుల జనన మరణాలను నియంత్రించేది నీవు.
నీనుంచి జన్మించి, ఎగువ దిగువ ఈజిప్టులకు ప్రభువునై
మాత్‌లో నివసిస్తూ, రెండు రాజ్యాల రాజునై,
సూర్యపుత్రుడినై, సత్వమార్గాన పయనిస్తూ,
కీర్తిప్రతిష్ఠల వెలుగుతున్న అఖెనాతెన్‌కు దీర్ఘాయుష్షునిమ్ము.
ప్రభువు అత్యంత గాఢంగా ప్రేమించే రాణి
నెఫెర్‌తితికి ఆయురారోగ్యాల నిమ్ము!
ఓ అతెన్!

ఈ అమర్నా వృత్తాంతం అఖెనాతెన్‌తో ముగిసింది. అఖెనాతెన్ మరణించగానే 'తుతన్‌ఖామెన్' (Tutankhamen) కాలంలో ఈజిప్టు మరల పాత బహుదేవతారాధనా పద్ధతిలోకి తరలిపోయింది.

35. దేవతలు-మనుషుల కథలు
(Tales of Gods and Men)

అన్ని ప్రాచీన గాథల్లో – ఎవరూ లేని కాలం, దేవుళ్లకాలం, దేవుళ్లు–మానవులతో నడిచిన కాలం, మానవకాలంల ప్రసక్తి కనబడుతుంటుంది. ఆ గడచిన కాలపు సంఘటనలు కాలం గడిచినకొద్దీ ప్రజల నోళ్లలో నాని కథలుగా, పాటలుగా, కావ్యాలుగా గానం చేయబడతాయి.

దేవతలు మానవులకు చేసిన ఉపకారాలు, మానవులు దేవుళ్లకు చేసిన సాయాలు అన్ని ప్రాచీన కావ్యాల్లో, ఇతిహాసాల్లో వర్ణించబడినాయి. వరాలు, శాపాలు, అతీంద్రియ శక్తులు మానవులను భయపెట్టేవి. దేవుళ్లు దేవతలు మానవులను వివాహం చేసుకోవడం లేదా సంతానాన్ని ప్రసాదించడం అనేక కథల్లో ప్రధాన అంశంగా కనబడుతుంది.

"ఈ బతుకిక వృథా" అని దిగాలు పడిన మనిషికి దేవతాస్త్రీ కనబడడం, ఆమెతో కలిసినాక తన ఆత్మ (ba) తో సంభాషించడం ముఖ్యాంశంగా ఓ కథ వ్రాయబడింది.

1) మాటకారి రైతు (The Tale of the Eloquent Peasant)

మాటకారి రైతు కథలో – ఓ మోసపోయిన రైతు న్యాయస్థానంలో ఫిర్యాదు చయగా అతడి వాక్చాతుర్యానికి ముచ్చటపడిన న్యాయాధికారి అతడి వాదనను లిఖింపచేసి రాజుకు పంపగా, రాజు రైతుకు పరిహారమిప్పించి మోసం చేసినవాళ్లను శిక్షించడం – కథ సారాంశం.

వదినత్రన్ (Wadinatrun) గ్రామంలోని ఓ పేదరైతు ఖున్–అనుప్ (Khun-Anup). అతడి భార్య మెరిత్ (Merit). తమ దగ్గర ఉన్న మిగులు ధాన్యాన్ని, వస్తువుల్ని అమ్మి సరుకులు తెచ్చుకుందామని, భార్యాబిడ్డలకు చెప్పి రైతు నెని–నెసుత్ (Herakleopolis) రాజధాని పట్టణం వేపు బయల్దేరాడు. అతడి గాడిదల బండిపై ధాన్యం, నాట్రన్ ఉప్పు, రకరకాల మొక్కలు, జంతుచర్మాలు, ఉష్ట్రపక్షి ఈకలు, ఖరీదైన చెక్కలు ఇలాంటివి విలువైన వస్తువులున్నాయి. వెర్నెటి జిల్లాకు చేరుకునే

సరికి ఒకచోట దారి కేవలం బండి పోయేంత ఇరుకుగా ఉంది. ఒకపక్క బార్లీ పొలాలున్నాయి. రెండోపక్క వేగంగా పోతున్న నది.

ఆ ఇరుకుదారిపై తన ఉత్తరీయాన్ని పరిచి అడ్డంగా నిలబడి ఉన్నాడు Djehuty-Nakht. జెహుతి నఖ్త్ – పైకి పెద్దమనిషిలా కనిపించే మోసగాడు. బాగా ధనవంతుడు. అధికారులకు బహుమతులిచ్చి, విందు భోజనాలు ఏర్పాటు చేసి చాలా మర్యాదస్తుడని పేరుపొందినవాడు. కాని అతడు చేసిన అకృత్యాలకు లెక్కలేదు.

"రైతు సోదరా! జాగ్రత్త. నా ఖరీదైన శాలువా దారిపైన ఉన్నది. దానికే మాత్రం తగలకుండా నీ బండిని నడుపుకో!" అన్నాడతడు తాను 'మెరు' కుమారుడైన 'రెన్సి' రాజప్రతినిధి ఉద్యోగినన్న అహంకారంతో. చూపుతోనే అతడు పసిగట్టినాడు ఆ రైతు బండిలో విలువైన వస్తువులున్నాయని.

ఖున్–అనుప్ ప్రాధేయపడ్డాడు– "అయ్యా! నేను పట్టణం పోవాలి! తమరు ఆ శాలువాను తొలగిస్తే నేను వెళ్లిపోతాను" అన్నాడు బండి దిగి.

ఇంతలో గాడిదలు పక్కనున్న పొలంలోని కాసిన బార్లీ కంకుల్ని కొరికి తిన్నాయి. జెహుతి–నఖ్త్ ఆగ్రహంతో బొబ్బలు పెట్టాడు– "నా శాలువా తీసి నీకు దారి ఇద్దామనుకునేలోపలే నీ గాడిదలు, ఎంతో విలువైన నా బార్లీ కంకుల్ని తిన్నాయి. నీ గాడిదలనివ్వు నాకు జరిగిన నష్టానికి! లేదా నిన్నిక్కడ నుంచి కదలనివ్వను" అన్నాడు.

ఖున్–అనుప్ ఏం మాట్లాడినా పెడర్థాలు తీస్తూ ఆ మోసగాడు తగాదా కాస్త పెద్దది కాగానే రైతును చావగొట్టి అతడి గాడిదలను, బండిని, సరుకును స్వాధీనం చేసుకుని అతడిని ఊరిబయటకు తరిమివేసాడు. వారం రోజులు రైతు ఆ మోసగాడి ఇంటి చుట్టూ తిరిగాడు, ఏడ్చాడు, మొత్తుకున్నాడు. ప్రయోజనం లేకపోయింది. గత్యంతరం లేక రైతు వెళ్లి అక్కడి న్యాయాధిపతితో న్యాయం చెయ్యమని మొర పెట్టుకున్నాడు. న్యాయాధిపతి అన్నాడు– "నీకేమన్నా మతిపోయిందా! అతడెంత పెద్దమనిషి! జెహుతి–నఖ్త్ మీద నేరం మోపుతావా నీవు?"

వలవలా ఏడుస్తూ పేదరైతు రాజప్రతినిధి 'రెన్సి'తో మొరపెట్టుకున్నాడు.

"సత్యమనే నదీ ప్రవాహాన నీవు ప్రయాణిస్తే చక్కని గాలి నీకు సాయపడుతుంది. నీ పడవకే ప్రమాదమూ రాదు. భయపు చీకటి ముఖాన్ని నీవు చూడవు. నీ దగ్గరకు మంచి చేపలు, పక్షులు ఎగిరి వస్తాయి. ఎందుకంటే నీవు అభాగ్యులకు రక్షకుడవు. అనాథలకు తండ్రివి. విధవలకు భర్తవు, భర్తల నిరాదరణకు గురైన స్త్రీలకు సోదరుడివి. నీపేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. లోభం, దురాశ నీ చెంతకు చేరవు. చెడుపై మంచి గెలుచునట్లు నీవెల్లప్పుడు విజయపథాన నడుస్తావు. ఓ న్యాయాధిపతీ! ఋజువర్తనుడా! ప్రభూ! నా విన్నపాన్ని ఆలకించు! నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దు!".

'రెన్సి' ఆశ్చర్యపోయాడు. ఓ మామూలు రైతుకింత వాక్చాతుర్యమా! వెంటనే ఈ విషయాన్ని రాజు నెబ్‌కౌరి (Nebkaure)కి తెలియబరచాడు.

రాజు ఆజ్ఞాపించాడు– "అతడు మాట్లాడేదంతా వ్రాయసకాడితో (Scribe) లిఖింపచేయి. అతడిని నీ దగ్గరనే ఉంచి అన్నిరకాల వసతుల్ని కలుగజేయి. అతడి కుటుంబానికి దినవారీ భత్యాలను పంపు. నీవీ సహాయం చేస్తున్నట్లు అతడికి తెలియనియ్యవద్దు!"

రెన్సి గుంభనంగా ఉండిపోయాడు. మరుసటిరోజు ఖున్–అనుప్ వచ్చి మరలా మాట్లాడినాడు. అతడు మాట్లాడుతున్నది తెరల వెనుక దాగిఉన్న వ్రాయసకాడు లిఖిస్తూనే ఉన్నాడు.

"భోగభాగ్యాలతో విలసిల్లుతున్న ప్రభూ! నీవు స్వర్గనౌక చుక్కానివి. న్యాయమనే త్రాసుకు సూచికాబాణానివి. సత్యపరిపాలకుడివి. న్యాయాన్ని నిలబెట్టే వాడివి. గొప్పవాడు ఇతరుల ధనానికై ఆశపడడు. న్యాయ కొలమానం ఒరిగితే సహించలేని ధర్మమూర్తివి నీవు. ఓ న్యాయమూర్తీ! నీవు చూస్తుండగానే కొందరు న్యాయపు త్రాసును తప్పుడు పద్ధతులతో తమవేపు ఒరిగేట్లు చేస్తున్నారు. న్యాయమూర్తులు అన్యాయవర్తనులై చట్టాలకు వక్రభాష్యం చెబుతున్నారు. వారిని దండించడం సబబు కదా ఓ న్యాయమూర్తీ!"

"చాల్లే! తెగ వదురుతున్నావు! నిన్ను జైల్లో పడవేస్తాను ఇంకా మాట్లాడితే!" అన్నాడు రెన్సి.

ఖున్–అనుప్ వాగ్ధార ఆగలేదు– "అవును ప్రభూ! తమరు గొప్పవారు, శక్తివంతులు. కాని తమ హృదయం దురాశకు లోనైనది; దయ దాక్షిణ్యాలు లేనిదై, నీ నిరాదరణను చవిచూసిన వ్యక్తి నిజంగా దురదృష్టవంతుడే! నీవు మకరదేవత వార్తాహరుడివి. నీవు మహమ్మారి సెఖ్‌మత్ కన్నా ప్రమాదకరమైనవాడివి. ధనవంతులకు దయ, కరుణ ఉండాలి. అవి నీలో మృగ్యమైనవి. హింస, ద్వేషం అవి కరుడుగట్టిన నేరస్థుల స్వంతం. దొంగ, స్వార్థపరుడు – వీళ్లను మార్చడం కష్టం. నీకు అన్నపానాదులకు కొదవలేదు. అన్ని సంపదలూ నీ స్వంతం. ఓ ప్రభూ! అధర్మపరులైన నీ న్యాయమూర్తులను మందలించు. నాకు న్యాయం ప్రసాదించు! నా మొర ఆలకించు!"

'రెన్సి' ప్రశాంతంగా అతడి వాదన విని మరల రేపటికి వాయిదా వేసినాడు. అలా ప్రతిరోజు అతడు రావడం, వాదన వినిపించడం, అతడి మాటలను రహస్యంగా లేఖకుడు పాపిరస్‌లపై గ్రంథస్థం చేయడం ఇవన్నీ క్రమం తప్పకుండా జరుగుతూనే ఉన్నాయి. ఆవేశంలో పేదరైతు మాటజారి దెబ్బలుతినే పరిస్థితిలోకి వెళ్లి, బయటపడ్డాడు. తొమ్మిదవరోజు వచ్చింది.

"ప్రభూ! నాలుక అనే త్రాసు మనిషి తప్పుల్ని కప్పి పెడుతుంది. సత్యం జారిపోతుంది. అసత్యాలతో జీవించేవాడికి వారసులుండరు. అతడి పడవ ఆగేందుకు సురక్షిత నౌకాశ్రయం దొరకదు. హెచ్చుతగ్గులు లేక, కాలయాపన జరుగనీక, త్వరపడక, తలతిప్పక, దృష్టి మళ్లించక సత్యాన్ని గమనించాలి. న్యాయం కోసం అర్థిస్తున్నవాడిని నిరాదరించకు. నీ మౌనాన్ని వీడి న్యాయాన్ని పలుకు. నేను మాట్లాడుతూనే ఉన్నాను ఇన్ని దినాలుగా! నీవు వినడం లేదు. ఇక నేను వెళ్లి నాకు జరిగిన అన్యాయాన్ని 'అనుబిస్'తో మొరలిడుతాను".

'రెన్సి' అన్నాడు శాంతంగా– "భయపడకు మిత్రమా! నీ ఫిర్యాదులు పరిశీలింపబడినాయి".

అతడు చూస్తుండగానే అతడి ఫిర్యాదులు లిఖింపబడిన పాపిరస్ కాగితాలు 'నెబ్‌కౌరి' ప్రభువుకు పంపబడినాయి. న్యాయం పేదరైతు పక్షాన నిలిచింది. రైతుకు తన సంపదలు, రాజు పంపిన బహుమతులు అందాయి. జెహుతి–నఖ్త్ శిక్షింపబడినాడు.

...ఈ కథ ముగిసింది.

2) ఇద్దరు సోదరుల కథ (Two Brothers)

ఇది పంధొమ్మిదవ డినాస్టి Ennana - ఎన్నానా వ్రాసినది. బైబిల్‌లోని జొసెఫ్–పొటిఫర్ భార్య కథలా, పాపిరస్ వెస్ట్‌కార్‌లోని పూజారి Webaoner కథలా ఉంటుంది. అన్నదమ్ములలో ఒకడిపేరు అనుబిస్. రెండవవాడు బాతా (Bata).

అనుబిస్ తన సోదరుడైన 'బాతా'ను స్వంత కొడుకులా గారాబంగా చూసుకునేవాడు. ఒకరోజున అన్నదమ్ములిద్దరూ పొలానికి వెళ్లారు. నాగలి దున్నుతూ విత్తులు విత్తుతున్నారు. విత్తనాలు అయిపోయాయి. అనుబిస్ తమ్ముడిని ఇంటికి పంపాడు విత్తనాలు తెమ్మని.

ఇంటికి బాతా వచ్చేసరికి అన్నయ్య భార్య ఇతడిని పట్టించుకోనట్లు నటించింది. తల దువ్వుకుంటూ– "నీకేం కావాలో తీసుకో! నన్ను విసిగించకు!" అన్నది వయ్యారాలొలకబోస్తూ.

ధాన్యం తీసుకుని వెళ్తుంటే అడిగిందామె– "ఎన్ని బస్తాలు? ఏం ధాన్యం?".

బాతా చెప్పాడు– "మూడు సంచుల గోధుమలు, రెండు సంచుల బార్లీ!"

"అయిదు సంచులు మోస్తున్నావా నీవొక్కడివే! అందగాడివే కాదు బలం గలవాడివి కూడా!" అన్నది క్రీగంట అతడిని చూస్తూ. "రా! ఎంత బలవంతుడివో చూస్తాను. పొలం ఎంత బాగా దున్నుతావో అర్థం చేసుకుంటాను" అన్నదామె నర్మగర్భంగా.

బాతా గజగజ వణికిపోయాడు. భయం, కోపం వరదలా ముంచెత్తా యతడిని. "నా సోదరుడు నన్ను కొడుకుగా చూసుకుంటున్నాడు. నీవు నాకు తల్లితో సమానం. మరెప్పుడూ ఈ ప్రస్తావన తేకు. ఇక్కడితో ఈ విషయం మరచిపోదాం" అని అతడు ఆగకుండా పొలంవేపు వెళ్లిపోయాడు.

సాయంకాలం ఇంటికి అనుబిస్ వచ్చేసరికి ఏదో ఘోరం జరిగినట్లు ఇల్లంతా చీకటిగా ఉంది. ఆ చీకటిలో బలాత్కారం చేయబడినదానిలా ఆమె అనుబిస్‌తో అన్నది– "నీ సోదరుడు, మనం స్వంత బిడ్డలా చూసుకునే అతగాడు

ఈరోజు ఇంటికి వచ్చాడు. నన్ను చెరపట్టినాడు. అతడిని చంపకపోతే నేను బతకను!" అన్నది వలవలా ఏడుస్తూ.

చీకటి పడేప్పటికల్లా అనుబిస్ బల్లేన్ని సానబట్టి పశువుల పాక తలుపు దగ్గర దాక్కున్నాడు. సోదరుడు రాగానే చంపేద్దామని.

బాతా గడ్డిమోపు నెత్తినెట్టుకుని వస్తుంటే పశువుల పాక దగ్గర మొదటి ఆవు అన్నది– "జాగ్రత్త! తలుపు దగ్గర నీ సోదరుడు బల్లెంతో నిన్ను చంపడానికి సిద్ధంగా ఉన్నాడు, పారిపో!"

తలుపు కింద అనుబిస్ పాదాలు కనిపించగానే 'బాతా'కు అర్థమయ్యింది ఆవు చెబుతున్నది నిజమేనని.

నెత్తిమీద మోపును పారవేసి అతడు వెంటనే పారిపోతుంటే అనుబిస్ అతడి వెంటపడినాడు. 'బాతా' ప్రార్థించాడు 'రా' దేవుడిని.

కరుణామయుడైన రా(రె) సూర్యదేవుడు అన్నదమ్ముల మధ్య మొసళ్లతో నిండిఉన్న నది సృష్టించాడు. ఆ నదికి చెరోవేపున అన్నదమ్ములు. 'బాతా' అరిచాడు– "అన్నిటినీ చూసే ఆ సూర్యుడు రేపు ఉదయాన వస్తాడు. అతడు చెప్పింది విని ఆనక నన్ను చంపుదువులే! ఆ తరువాత నేను దేవదారు వనానికి వెళ్లిపోతాను. ఇక నీతో కలిసి నేనుండలేను!"

తెల్లవారింది. "నిజం తెలుసుకోకుండా నాపై నింద వేస్తున్నావు. వెళ్లి నీ భార్యనడుగు! అయినా తండ్రిలాంటి వాడివి నాపై అనుమానపడినావు" అంటూ పదునైన రెల్లుబద్దతో తన శిశ్నాన్ని కోసి నది నీళ్లలో పడవేసాడు 'బాతా'. ఆ శిశ్నాన్ని ఓ చేప మింగింది. రక్తం కారుతూ సొమ్మసిల్లి పడిపోయాడు బాతా ఆవలి ఒడ్డున. ఈ ఒడ్డున ఉన్న అనుబిస్‌కు నిజం తెలిసివచ్చింది. అటువేపు వెళ్లేందుకు అడ్డుగా మొసళ్లు తిరుగాడుతున్నాయి నదిలో.

బాతా తేరుకుని అన్నాడు– "ఇప్పుడు నేను ఇంటికి రాను. నేను దేవదారు వనంలోకి వెళ్తున్నాను. నాకేదన్నా కీడు సంభవించిందని నీకు అనిపిస్తే నీవు నన్ను వెదుక్కుంటూ దేవదారు వనంలోకి రా! అక్కడ ఎత్తైన చెట్టు పూలమధ్య నా

హృదయాన్ని ఉంచుతాను. నా హృదయం నీకు దొరికేంతవరకు ఏడేళ్లైనా వెదుకుతూనే ఉండు. దొరికినాక దానిని చల్లటి నీళ్లున్న పాత్రలో పడవేయి. నేను సజీవుడనౌతాను. నీ చేతిలో ఉన్న మధుపాత్రలో నురగ పొంగిందంటే నాకేదో అపాయం సంభవించిందని అర్థం. ఇప్పటికి ఇంటికి వెళ్లు! వీడ్కోలు" అని 'బాతా' వెదురువనంవేపు వెళ్లిపోయాడు.

అనుబిస్ దుఃఖిస్తూ ఇంటికి వెళ్లి విశ్వాసహీనురాలైన తన భార్యను శిక్షించినాడు. తన సోదరుడికై విలపిస్తూ తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతున్నాడు.

బాతా ఆ దేవదారు వనంలో ఒక ఇల్లు కట్టుకున్నాడు. తొమ్మిది దేవతలను ప్రార్థించినాడు. రె–హౌరాక్తె ఆజ్ఞానుసారం ఖ్నుమ్ ఓ అందాల సుందరిని సృష్టించినాడు. ఏడుగురు హాథర్‌లు వచ్చి "ఆ బాలిక తలారి చేతిలో మరణిస్తుంది" అని జోస్యం పలికారు. నవయవ్వనంతో ఉన్న ఆమె 'బాతా'కు సహచరిగా ఉన్నది కాని 'బాతా' తన శిశ్నాన్ని పోగొట్టుకున్నాడు. ఏం ఉపయోగం ఆమెకు?

ఒకరోజున ఆమె శిరోజాలు కొన్ని నీళ్లలో పడి సముద్రంలో కొట్టుకుపోయి రాజు దుస్తులకు అంటుకున్నాయి. ఆ శిరోజాల పరిమళాలను చూసి రాజు, అతడి సభికులు అది సూర్యపుత్రిక– రె–హౌరాఖ్తి కుమార్తె శిరోజాలుగా భావించారు. రాజు పంపగా అతడి సైనికులు ప్రపంచమంతా గాలించినారు. కొందరు ఆమెను దేవదారు వనంలో కనుగొని ఆమెను తీసుకుపోబోయినపుడు 'బాతా' తీవ్రంగా ప్రతిఘటించాడు. ఒకడు బతికివెళ్లి రాజుకు ఈ సంగతి చెప్పాడు. రాజు ఈసారి ఓ తెలివైన వృద్ధమహిళను ససైన్యంగా పంపాడు. ఆమె నగలు, విలువైన దుస్తులు చూపి ఆ అందాలరాశి మనసు చూరగొని ఆమెను రాజు సన్నిధికి చేర్చింది. రాజు ఆమెను పెండ్లాడి రాణిని చేసినాడు.

తన సైన్యాన్ని పంపి 'బాతా' ఇంటిని, దానిపక్కనే ఉన్న దేవదారు వృక్షాన్ని నరికేయించాడు. చెట్టుతో పాటు దానిలో ఉన్న 'బాతా' హృదయం నేలకూలగా 'బాతా' చనిపోయాడు. అనుబిస్ మధుపాత్రలో ద్రవం నురగలు కక్కుతూ పొంగింది. సోదరుడికి అపాయం జరిగిందని గ్రహించి అనుబిస్ దేవదారు వనంలోకి వెళ్లాడు. అక్కడ మంచంపై విగతజీవుడిగా 'బాతా' ధ్వంసమైన ఇంటిలో కనిపించాడు.

మూడేళ్లు వెదికాడు 'బాతా' హృదయం కోసం. చివరకు ఓ పైన్ శంఖువు కనిపించింది కూలిన దేవదారు వృక్షం ఎండుటాకుల మధ్య. దానిని చల్లటి నీటిలో ఉంచగానే 'బాతా' దేహంలో కదలిక కానవచ్చింది. కళ్లలో చలనం వచ్చింది. గుండె 'బాతా' శరీరంలోకి వెళ్లగానే అతడు సజీవుడైనాడు.

తనకు అన్యాయం చేసినవారిపై ప్రతీకారం తీర్చుకోవాలనుకుని 'బాతా' ఒక వృషభరూపాన్ని దాల్చినాడు. "నన్ను నీవు ఈజిప్ట రాజు వద్దకు తీసుకువెళ్లు. నీకు అనేక బహుమతులు లభిస్తాయి. వాటిని తీసుకుని ఇంటికి పోయి వివాహం చేసుకో! సుఖంగా బ్రతుకు!" అన్నాడు.

అనుబిస్ అలాగే చేసి బహుమతులు తీసుకుని ఇంటికి పోయినాడు. రాజభవనంలో ఆ వృషభాన్ని చూసి అందరూ ఆనందపడినారు. దాన్ని ఆపే వారెవరూ లేరు. అది ఒకరోజున రాజుగారి వంటగదికి వెళ్లింది. అక్కడ రాణి ఒంటరిగా ఉండడం చూసింది.

"చూసావా! నేను వచ్చాను" అన్నది వృషభం. రాణి భయపడి అక్కడి నుంచి రాజు వద్దకు వెళ్లింది. ఆరోజు రాజభవనంలో విందు.

రాణి అన్నది– "ప్రభూ! నాకు ఆ వృషభపు కాలేయం తినాలని కోరికగా ఉన్నది!"

రాణి కోరిక కాదనలేని రాజు ఆ అద్భుత వృషభాన్ని చంపించినపుడు రెండు రక్తపు చుక్కలు ఎగిరి, ఒకటి రాజభవనపు ఎడమ తలుపుపై, మరొకటి కుడి తలుపుపై పడినాయి. ఆ ద్వారస్తంభాలు వెంటనే పొడుగాటి పర్సియా చెట్లుగా పెరిగి నింగినంటాయి. అంత సుందరంగా ఉన్న చెట్లను చూసేందుకు రాజు అక్కడకు వచ్చాడు స్వర్ణరథంపై.

రాజు–రాణి చెరొక చెట్టు కింద కూర్చున్నారు. చెట్టులోంచి స్వరం వినవచ్చింది ఆమెకు "విశ్వాస ఘాతకురాలా! దేవదారు చెట్టును నరికించావు, వృషభాన్ని చంపించావు. అయినా నేను బతికే ఉన్నాను!".

రాణి మరల రాజును వరం అడిగింది– "ప్రభూ! ఆ చెట్లను నరికివేయి. నాకు పీడకలలు వస్తున్నాయి".

పనివాళ్లు చెట్లు నరుకుతున్నపుడు ఓ చిన్ని ముక్క ఎగిరి రాణి నోట్లో పడింది. ఆ తరువాత రాణి గర్భవతై తొమ్మిది నెలలకు పండంటి కుమారుడిని కన్నది. రాజు ఆనందానికి అంతులేదు. తన కుమారుడిని 'కుష్' రాజ్యానికి వారసుడిగా ప్రకటించాడు. తండ్రి తదనంతరం అతడు రాజై సభను సమావేశపరచినాడు.

రాణి శిక్షింపబడింది. అనుబిస్ యువరాజైనాడు. 'బాతా' చనిపోయాక అనుబిస్ రాజ్యాన్ని పరిపాలించాడు.

3) సత్యం-అసత్యం (Truth and Falsehood)

"ఎల్ పర్వతంలోని రాగి యావత్తూ కత్తిగా, కొప్టస్ అడవుల్లోని కలప అంతా పిడిగా, పర్వతాన్ని తొలిచిన గుహ కత్తిని ఉంచే సంచిగా, కాల్ మంద పశువుల చర్మాలన్నిటితో చేసినది బెల్టుగా ఉన్న సత్యమనే కత్తి అత్యంత శక్తివంతమైనది. దానికి దయలేదు. అందుకనే దాని రెండు కళ్లూ పొడిచి అంధుడిని చేసి, నా ఇంటి గుమ్మానికి కాపలాదారుడిగా ఉంచాలి" అని కోరింది అసత్యం.

సత్యం-అసత్యం అన్నదమ్ములు. తొమ్మిది మంది దేవతలకు సత్యం తప్పు చేసినవాడిలా, ఎవరినీ లెక్కచేయనివాడిలా కనిపించాడు. అసత్యపు వినయ విధేయతలు, పొగడ్తలకు వాళ్లు లొంగిపోయి అసత్యం చెప్పినట్లు చేసారు.

అయితే అసత్యానికి తన సోదరుడు సత్యం గొప్పతనం అర్థమయ్యింది. అది అతడిని ప్రతిక్షణమూ కలవరబెడ్తుంటే భరించలేక సేవకుల్ని పిలిచి సత్యాన్ని తీసుకుపోయి ఎడారిలో ఆకలిగొన్న సింహాల మధ్య విడిచిపెట్టమని ఆజ్ఞాపించాడు.

సత్యమంటే సేవకులకు ఇష్టం. అందుకని సత్యాన్ని అడవిలో వదిలేసి అసత్యానికి అబద్దాలు చెప్పారు సత్యాన్ని సింహాలు చుట్టుముట్టాయని. అసత్యం సంతోషించాడు.

కొద్దిరోజుల తరువాత - అడివి పొదల మధ్య పడిఉన్న అంధుడైన సత్యాన్ని ఓ యువతి తన పరివారంతో వెళ్తూ గమనించింది. అతడి సౌందర్యానికి ముగ్ధురాలై అతడిని తన ఇంటికి తీసుకువెళ్లి పరిచర్యలు చేసి అతడి వలన గర్భవతి అయి ఓ చక్కటి కుమారుడిని కన్నది.

అంధుడైన సత్యం ఆమె ఇంటిలోనూ ద్వారపాలకుడిగా ఉండేవాడు. బాలుడు అన్ని విద్యలలోనూ ఆరితేరినవాడైనపుడు అతడి తోటివారు – నీ తండ్రెవరు? అని హేళనగా ప్రశ్నించగా అతడు తన తండ్రి తన ఇంటి ద్వార పాలకుడని తెలిసి తల్లిని మందలించినాడు.

అతడు పది రొట్టెముక్కలు, చేతికర్ర, కత్తి, చెప్పులు, ఆహారం, ఒక చక్కటి వృషభాన్ని తీసుకుని – తన తండ్రి చెప్పగా అతడికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకున్నవాడు గనుక – అసత్యపు రాజ్యం వేపు వెళ్లినాడు. అక్కడ అసత్యపు పశువుల కాపరులను కలిసి వారికి కానుకలిచ్చి, తాను దూరదేశం వెళ్తున్నానని, వచ్చేవరకూ ఈ వృషభాన్ని తమదగ్గర సురక్షితంగా ఉంచమని వారికి కొంత ధనాన్ని ముట్టచెప్పినాడు.

అతడు వెళ్లిన కొన్నాళ్లకు 'అసత్యం' ఆ పశువుల మందను చూడటానికి వచ్చి ముచ్చటైన ఆ వృషభాన్ని చూసి, పశువుల కాపరులను సమాధానపరచి, ఆ వృషభాన్ని నరికి వంటలు వండించుకుని తిన్నాడు. కొన్ని రోజుల తరువాత యువకుడు వచ్చి తన వృషభాన్నిమ్మంటే పశువుల కాపరుల వద్ద సమాధానం లేదు. వాళ్లు ఆ మందలో తనకు నచ్చిన వృషభాన్ని తీసుకుపొమ్మన్నారు కాని అతడు ఒప్పుకోలేదు.

"నా వృషభం ఈజిప్టు అంత పెద్దది. అది అమెన్ ద్వీపంలో నిలబడితే దాని తోక పాపిరస్ వనాల వద్ద ఉంటుంది. దాని ఒక కొమ్ము తూర్పున, మరొక కొమ్ము పశ్చిమ దిక్కును తాకుతాయి" అన్నాడతడు.

పశువుల కాపర్లు నవ్వారు. అసత్యం నవ్వాడు. తొమ్మిది మంది దేవతలు నవ్వారు.

యువకుడన్నాడు– "దీనిని మీరు నమ్మరు కాని – ఎల్ పర్వతంలోని రాగి యావత్తూ కత్తిగా, కొప్టస్ అడవుల్లోని కలప యావత్తూ పిడిగా, పర్వతాన్ని తొలిచిన గుహ సంచిగా, కాల్ మంద పశువుల పర్మంతో చేసినది బెల్టుగా సత్యమనే కత్తిని అత్యంత శక్తివంతమైన దానిని అంధుడిగా చేసిందెవరు? నేను ఆ సత్యం కుమారుడిని. న్యాయం కోరుకుంటున్నాను!"

అసత్యం అన్నాడు– "సత్యమింకెక్కడ? ఎప్పుడో చచ్చిపోయాడు. సత్యం బతికుంటే నా కళ్లు పొడిపించి అతడికి ద్వారపాలకుడిగా చేయండి!" అన్నాడు నిర్భీతిగా.

సత్యం కుమారుడు దేవతల్ని సత్యం వద్దకు తీసుకువెళ్లినాడు. అసత్యం శిక్షింపబడినాడు. కథ ముగిసింది.

అయితే సత్యానికి చూపు వచ్చిందా? సత్యం అసత్యం ఇప్పుడు ఇద్దరూ అంధులేనా? అసత్యాన్ని అసత్యంతోనే గెలవగలమా? సత్యాన్ని సత్యంతో ఋజువు చేయగలమా? ఇవన్నీ ప్రశ్నలుగానే మిగిలినాయి.

4) వెనామున్ ప్రయాణం (The Voyage of Wenamun)

పదహారవరోజు – వేసవికాలపు రెండవ నెల, అయిదవ సంవత్సరం.

అమెన్ దేవాలయపు పెద్ద– వెనామున్, దేవతల ప్రభువైన అమెన్–రె (Amen-Re) కొరకు అద్భుతమైన పడవ నిర్మాణం కోసం కలప తేవడానికి వెళ్తున్నాడు. ఆ పడవ పేరు – అమెన్ మహానౌక (Amen-Mighty of Prow).

"నేను స్మెండెస్–తంతామెన్‌ల పట్టణమైన తానిస్ (Tanis) చేరుకున్నాను. వారికి అమెన్–రె లేఖను ఇచ్చాను. వారు నన్ను ఆదరించారు. వేసవి నాలుగవ నెల వరకు అక్కడ ఉండి సిరియన్ నౌక కెప్టెన్ మెంగెబెత్ (Mengebet) ఆతిథ్యంలో సిరియన్ సముద్రంలో నౌకాప్రయాణం కొనసాగించాను.

నౌక డార్ (Dor) అనే Tjeker నౌకాశ్రయానికి చేరుకునేసరికి డార్ ప్రభువు నాకు యాభై రొట్టెలు, ద్రాక్షసారాయి ఉన్న కలశం, ఎద్దుమాంసం కానుకలుగా పంపాడు. అయితే మా నౌకలోని ఒక పనివాడు నా వస్తువులు – స్వర్ణ, వెండి పాత్రలు అయిదు డెబెన్ల స్వర్ణం, ముప్పై ఒక్క డెబెన్ల వెండి విలువున్న వాటిని దొంగిలించి పరారయ్యాడు.

నేను డార్ ప్రభువుకు వర్తమానాన్ని పంపాను. "ఆ విలువైన వస్తువులు అమెన్–రేకు చెందినవి. అవి హెరిహోర్, స్మెండెస్ ప్రభువులకు ఆ మాటకొస్తే Tjeker Baal - బిబ్లాస్ రాజు (Byblos) రాజుకు చెందినవి. ఆ దొంగను పట్టుకుని ఆ వస్తువులను నాకు స్వాధీనం చెయ్యగలరు" అని వ్రాసాను లేఖలో.

డార్ (Dor) ప్రభువు ఆశ్చర్యపోయాడు. "ఆ దొంగ నాదేశంవాడైతే నేనే నష్టపరిహారం ఇచ్చేవాడిని. కాని ఆ దొంగ మీ నౌకలో పనివాడు. అది మీ బాధ్యత. అయినా నా ప్రయత్నం నేను చేస్తాను" అన్నాడతడు.

తొమ్మిది రోజులు గడిచాయి. విసిగిపోయిన నేను నా ప్రయాణం కొనసాగించడానికి డార్ (Dor) ప్రభువు అనుమతి కోరాను. (ఇక్కడ పాపిరస్‌లో కథ భాగం శిథిలమైంది. బహుశా 'వెనామున్' అక్కడి నౌకలపై దాడిచేసి 30 డెబెన్ల వెండిని తీసుకుని వెళ్లిపోయి, Tjeker ప్రజలకు కోపం వచ్చేట్లు చేసినాడు.)

బిబ్లాస్ (Byblos) హార్బర్‌లో నేను విశ్రాంతి తీసుకుంటున్నపుడు బిబ్లాస్ రాజు నన్ను వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించాడు.

నేనూ సమాధానమిచ్చాను– "నన్ను ఈజిప్ట తీసుకువెళ్లే నౌక రాగానే వెళ్లిపోతాను".

ఇరవై తొమ్మిది రోజులు గడిచాయి. బిబ్లాస్‌రాజు, దేవాలయంలో ప్రార్థనలు చేస్తున్నపుడు అక్కడి పూజారులలో ఒకరికి పూనకం వచ్చి దైవసందేశం తెలిపాడు. అదేరోజున ఈజిప్ట వెళ్లే నౌక రాగా నేను నా సరుకుల్ని నౌకలోకి ఎక్కించాను. నౌక బయల్దేరే సమయంలో నౌకాశ్రయపు అధికారి పరుగుపరుగున నావద్దకు వచ్చాడు. "బిబ్లాస్ ప్రభువు తమను రేపటివరకు ఇక్కడే ఉండమని వర్తమానం పంపాడు".

కాని నా ప్రయాణం ఆపేదెలా! నౌక ఆగింది. నేను ఉదయమే బిబ్లాస్ ప్రభువును కలిసాను.

అతడన్నాడు– "ఎన్నాళ్లయ్యింది నీవు థెబెస్‌ను విడిచి?".

అతడన్నాడు– "ఖచ్చితంగా అయిదు నెలలు ఇవ్వాళ్టికి!"

అతడడిగాడు– "ఏది నీ దగ్గర అమున్–రె లేఖ?"

నేనన్నాను– "నేను ఆ లేఖను స్మెండెస్–తంతామెన్‌లకు తనిస్ (Tanis)లో అందజేసాను.

అతడికి కోపం వచ్చింది. "నీవు నా దేశంలోకి సరైన అనుమతిపత్రం లేకుండా వచ్చావు. నీకు కలపను మోసుకెళ్లే స్మెండెస్ నౌక లేదు! సిరియన్ నావికులు లేరు! ఓ ఋజువు లేదు!"

నేనన్నాను– "అది ఈజిప్ట నౌక. వారు ఈజిప్ట నావికులు!"

అతడన్నాడు– "ఇక్కడ దాదాపు ఇరవై నౌకలున్నాయి స్మెండెస్‌తో వ్యాపారం చేసేవి".

నేనన్నాను– “తమరిని నేను కోరుతున్నదల్లా తమరు తమ పూర్వీకులు ఈజిప్ట ప్రభువులకు చేసిన సాయాన్ని పునరుద్ధరించమని!”.

అతడన్నాడు– “నిజమే! తగిన పైకం చెల్లించి తీసుకువెళ్లు నీకు కావాల్సినంత కలపను. ఇదివరకటి ఈజిప్ట ప్రభువులు చేసినట్లే! కాని చిల్లిగవ్వ లేకుండా ఎందుకు నీవు ఈ ప్రయాణం చేస్తున్నావు. కనీసం వెయ్యి డెబెన్లు వెండి కావాలి నీకు కావాల్సిన కలపకు”.

నేనన్నాను– “ఈ ప్రపంచమంతా అమెన్–రే దేవుడిదే! మిమ్మల్ని మీరు స్వతంత్రులుగా ప్రకటించుకుంటున్నారు. మీకు తెలుసుననుకుంటున్నాను మీ నౌకాశ్రయం తీరాన ఇరవై తొమ్మిది రోజుల్నుంచి మహాదేవుడు వేచివున్నాడని. మంచిది. మీ లేఖకుడిని పిలవండి. మీకెంత పైకం కావాలో ఆ విషయాన్ని నేను స్మెండెస్–తంతామెన్‌లకు తెలియజేయండి. వారు మీకు పైకం పంపుతారు”.

నేను సిరియాలోనే ఉండిపోయాను. నౌకాభాగాలతో ఓ నౌక ఈజిప్టకు వెళ్లింది. స్మెండెస్, తంతామెన్‌లు ఆ నౌకాభాగపు విలువకు సరిపడా స్వర్ణ రజత వస్తువులు పంపినారు.

నాలుగు కూజాలు, ఒక పాత్ర స్వర్ణంతో చేసినవి.
అయిదు వెండి పాత్రలు
పది రాజవస్త్రాలు
అయిదు వందలు నూలు చాపలు
అయిదు వందలు ఎద్దు చర్మాలు
అయిదువందలు తాళ్లు
ఇరవై సంచుల చిక్కుళ్లు
ముప్పై బుట్టల చేపలు

ఇవి కాక రాణి నాకోసం ప్రత్యేకంగా నూలు వస్త్రాలు అయిదు, అయిదు ఉత్తరీయాలు, ఒక చిక్కుళ్లసంచి, అయిదు బుట్టల చేపలు పంపింది.

బిబ్లాస్ రాజు సంతోషించాడు. మూడు వందల మంది సేవకులు, మూడు వందల ఎద్దులతో కావాల్సిన కలపను సిద్ధం చేసాడు. నేను బిబ్లాస్ ప్రభువును కలిసినపుడు అతడి ఛత్రపు నీడ నాపై పడింది. ఆ ప్రభువు సేవకుడైన ఈజిప్షియన్ పెనామెన్ (Penamen) గొడవ చేసినాడు. అదిచూసి బిబ్లాస్ ప్రభువు నాతో అన్నాడు– “నేను నిన్నిప్పటివరకు మర్యాదగా చూసాను. నీవు సరిగా మసలుకోక

పోతే ఖయెమ్‌వసెత్ సేవకులు పడిన అవస్థలు నీవూ పడతావు. పదిహేడేళ్లు ఇక్కడే నానా కష్టాలు పడి వాళ్లు చచ్చారిక్కడ. కావాలంటే వెళ్లి వాళ్ల సమాధులు చూడు" అని నాకు 'పెనామిన్'ను తోడిచ్చి అక్కడకు పంపినాడు.

అది చూసివచ్చి నేనన్నాను– "వాళ్లు మానవులు. నేను మానవుడినే కాని దైవకార్యం మీద వచ్చాను. నీవు ఈ విషయాన్ని శిలాశాసనంగా ప్రతిష్ఠించు!

–'అమెన్–రె, దేవతల ప్రభువు, తన వార్తాహరుడైన అమెన్–ఆఫ్–ద–రోడ్ ఉత్సవ విగ్రహాన్ని సేవకుడైన 'వెనామున్'తో – పడవ నిర్మాణం కోసం కావాల్సిన కలప కోసం ఇక్కడకు పంపినాడు. నేను కలపను ఈజిప్టుకు పంపాను. దానికి ప్రతిఫలంగా అమెన్–రె నాకు, యాభై ఏళ్ల జీవితాన్ని అదనంగా ఇచ్చును గాక!'–

ఆవిధంగా ఓ ప్రభూ! నీకూ ఈజిప్ట దేవతల అనుగ్రహం దక్కుతుంది".

కలపను నౌకలలో నింపాక నేను నౌకాశ్రయం వేపు వెళ్లేసరికి పదకొండు Tjeker నౌకలు అక్కడ ఆగి ఉన్నాయి. వాటిలోని నావికులు నాకోసం వెదుకుతున్నారని తెలిసింది.

నేను సముద్ర తీరాన కూర్చుని దుఃఖిస్తున్నపుడు బిబ్లాస్ లేఖకుడు వచ్చి నన్ను ఓదార్చినపుడు నేనన్నాను "అటుచూడు! ఆ వలసపోతున్న పక్షులను! ఇప్పటికే అవి రెండుసార్లు ఈజిప్ట వేపు వెళ్లాయి. ఇంటినుంచి దూరంగా ఉన్నానన్న బాధ నా హృదయాన్ని తొలిచివేస్తున్నది. నన్ను బంధించడానికి Tjeker నావికులు వచ్చారు.

బిబ్లాస్ ప్రభువుకు ఈ విషయం తెలిసింది. నాకోసం మధువును, మాంసాన్ని, నేను తేరుకునేందుకు 'టెంటెనె' (Tentne) అనే ఈజిప్షియన్ గాయకుడిని పాటలు పాడేందుకు పంపినాడు.

మరుసటి ఉదయాన Tjeker-Baal బిబ్లాస్ ప్రభువు సభను సమావేశ పరిచాడు.

నావికుల్ని పిలిచి హెచ్చరించాడు– "నా రాజ్యంలో ఇతడిని ముట్టుకునే వీలులేదు. సముద్రంలో మీ ఇష్టం!"

వారికందకుండా నౌకలో నేను సముద్రంలో ప్రయాణిస్తున్నాను వేగంగా. వెళ్లివెళ్లి సైప్రస్‌కు చేరుకున్నాను. అక్కడి ప్రజలు నన్ను చంపడానికి ఆయుధాలతో

వచ్చారు. నేను సైప్రస్ రాణి హతిబా (Hatiba) భవనానికి వెళ్లి ఆమెను అర్థించాను. నా భాష ఆమెకు అర్థం కాలేదు. కాని ఈజిప్ట్ భాష తెలిసిన ఒక వ్యక్తి నా ప్రార్థనను ఆమెకు తెలియజేసినాడు.

"మహారాణీ! థెబెస్ వాసిని నేను! తమ ద్వీపం 'సైప్రస్' గురించి అనేక అద్భుతాలను విన్నాను. న్యాయానికి నెలవైన ఈ ప్రదేశంలో తమరే నన్ను రక్షించాలి!"

ఆమె నన్ను నా కథ చెప్పమని కోరింది.

నేనన్నాను– "సముద్రపు గాలుల ఉధృతిలో నౌక దిశమారి బిబ్లాస్ నుంచి సైప్రస్ ద్వీపానికి కొట్టుకువచ్చింది నా నౌక. అమున్–రె నౌకానిర్మాణం కోసం కలపను మోసుకునిపోతున్నది. మీ ప్రజలు నన్ను చంపడం వలన మీకు నష్టమే కదా! బిబ్లాస్ ప్రభువుకు మీకు వైరం ఏర్పడ్తుంది. మహారాణి! దయచేసి నన్ను రక్షించండి!"

ఆమె తన ప్రజల్ని సమాధాన పరచింది. నాతో అన్నది– నావికుడా వెనామున్! ఈ రాత్రికి నీవు ఈ పట్టణంలో ఉండవచ్చు నా రక్షణలో..."

ఆనక ఏమయ్యిందో మన ఊహకు అందేదే! తరువాత కాలంలో స్మెండెస్ ప్రభువు ఇరవై ఒకటవ డినాస్టి తొలి ప్రభువైనాడు.



Wenamuns - Journey

Eloquent Peasant

Two Brothers Story

Truth - Falsehood

36. పిరమిడ్లు-భవన నిర్మాతలు-కొన్ని కథలు
(Pyramids - Architects - Some Stories)

1) ఇమ్‌హోతెప్ (Imhotep - 27th Century B.C.) : Djoser ఫారో ప్రభువు వజీర్ సక్కారా స్టెప్ పిరమిడ్ నిర్మాత. రా (సూర్యుడి) ప్రధాన పూజారి. జ్ఞాన పుస్తకాల రచయిత (Wisdom texts). వైద్యుడు. దైవత్వం ఆపాదించబడిన రాజకుటుంబానికి చెందని వ్యక్తి. (ఇంకొక వ్యక్తి హాపు కుమారుడు అమెన్‌హోతెప్).

ఇమ్‌హోతెప్ మాతృమూర్తి ఖెరెదు-అంఖ్ (Kheredu-Ankh) బానెబ్‌డిజెటెత్ కుమార్తె. సెఖ్‌మెత్‌ను కూడా ఇమ్‌హోతిప్ తల్లిగా కొందరు అభిప్రాయపడినారు.

గ్రీకులు అతడిని తమ వైద్యదేవుడు ఎస్క్లెపియస్ (Asklepios) తో పోల్చినారు.

2) అమెన్‌హోతెప్ (Amenhotep), హాపు పుత్రుడు : భవన నిర్మాత, పూజారి, లేఖకుడు, ఉద్యోగి. పద్ధెనిమిదవ డినాస్టి కాలం నాటివాడు. తల్లిదండ్రులు ఇటు-హాపు (Itu-Hapu). మూడవ అమెన్‌హోతెప్ ప్రభువు కాలంలో అనేక కట్టడాలను నిర్మించినాడు. మరణానంతరం దైవత్వం ఆపాదించబడిన రాజ కుటుంబానికి చెందని రెండవ వ్యక్తి.

3) తుత్‌మోస్ (Thutmose, Tuthmosis III) : ఈజిప్టు డినాస్టిలో ఆరవ ఫారో. 28-4-1479 నుంచి 11-3-1425 బి.సి. వరకు 54 ఏళ్లు ఈజిప్టును పాలించినాడు. రెండేళ్ల వయసులో సింహాసనమెక్కి తన సవతితల్లి - హట్‌షెప్‌సత్ (Hatshepsut) రక్షణలో ఇరవై రెండేళ్లు ఆ తరువాత ముప్ఫైఏళ్లు స్వయంగా, ఆఖరి రెండేళ్లు తన కుమారుడు Amenhotep II సహచక్రవర్తిగా ఈజిప్టును ఏలినాడు. సువిశాల ఈజిప్టు సామ్రాజ్యాన్ని సిరియా నుంచి న్యుబియా వరకు విస్తరించిన ఘనత అతడిది. ఇరవై ఏళ్ల దండయాత్రలలో 350 పట్టణాలను ఆక్రమించినాడు మెగిడ్డో యుద్ధం (Battle of Megiddo) లో కార్మెల్ పర్వతం లోని అరుణ కనుమగుండా ఒక వరుసలో, (గుర్రం తరువాత గుర్రం, సైనికుడి తర్వాత సైనికుడు) దాటి మెగిడ్డోను చుట్టుముట్టినాడు పదివేలమంది సైనికులతో. అతడి విజయగాథలు కర్నాక్ (Karnak) దేవాలయపు గోడలపై చెక్కబడినవి. ఏడు నెలలు మెగిడ్డో పట్టణాన్ని అష్టదిగ్బంధనం చేయగా మెగిడ్డో, ఫారో వశమైంది.

ఆ యుద్ధపు జ్ఞాపకాలు వెయ్యి సంవత్సరాల తరువాత కూడా బైబిల్‌లో ఆర్మగెడ్డాన్ (Armageddon)గా ప్రతిధ్వనించాయి.

అతడి సైన్యంలోని Djehuty - జెహుతి అనే సైనికాధికారి జొప్పా (Jaffa) పట్టణాన్ని వశపరచుకోడానికి పెద్దపెద్ద బుట్టల్లో రెండువందల మంది సైనికుల్ని కోట లోపలికి పంపి ఆనక విధ్వంసాన్ని సృష్టించి పట్టణాన్ని వశపరచుకున్నాడు. ఈ సంఘటన ఛాయలు మనకు ట్రోజన్‌హార్స్, ఆలీబాబా 40 దొంగలు, రాణి పద్మిని చరిత్రలలో కానవస్తాయి. జెహుతిని ప్రశంసించిన ఫారో అతడికి సెక్కారా స్మశానంలో వీరుల సమాధికి అనుమతి నిచ్చి గౌరవించాడు.

పిరమిడ్ ఆకారంలో నిర్మించబడిన ఫారో సమాధులు 118 నుంచి 138 వరకు ఈజిప్టులో ఉన్నాయని ఓ అంచనా. వీటిలో మెంఫిస్ పట్టణానికి వాయువ్య దిశలో సక్కారా (Sakkara) దగ్గర ఉన్న మెట్ల పిరమిడ్ (Step Pyramid) తొలి డినాస్టికి చెందినది.

Dsojer పిరమిడ్ కాలం 2630–2610 B.C.

పిరమిడ్లలో ప్రఖ్యాతి గాంచినవి కైరో పట్టణపు సరిహద్దులో ఉన్న గిజా (Gija) లోని ఖుఫు పిరమిడ్ (అన్నిటికన్న పెద్దది – ప్రపంచపు ఏడు వింతలలో ఒకటి).

మస్తాబా (Mastaba) బల్లపరుపు సమాధుల నుంచి క్రమేపీ పిరమిడ్లకు సమాధులు పరిణామం చెందాయి.

ఆల్–అజిజ్–ఉత్‌మాన్ (1171–1198)లో పిరమిడ్లను నేలమట్టం చేయ సంకల్పించినా – మెన్‌కవురి పిరమిడ్‌ను ధ్వంసం చేసాక విరమించుకున్నాడు.

ఆదిమ జలాల నుంచి బయటపడిన మట్టిదిబ్బకు ప్రతీక పిరమిడ్. ఇటుకలతోను, శిలలతోనూ నిర్మించిన పిరమిడ్లపై సున్నపురాతిని అమర్చి ఎండలో సూర్యకిరణాలతో మెరిసేలా నునుపు చేసేవారు. సమాధి గది నుంచి సన్నటి మార్గాలు ఆకాశాన్ని వీక్షించేందుకు అనువుగా అమర్చబడినాయి. ఫారో ఆత్మ దేవతలతో కలిసి తిరుగాడేందుకు వీలుగా నిర్మాణాలు జరిగేవి.

అబురావష్ (Abu-Rawash), గిజాలోని ఖుఫు (Khufu-Cheops), ఖాఫ్రె, (Khafre-Chephren) మెన్‌కవురె (Menkaure), చిన్నచిన్న రాణుల పిరమిడ్లు; Great Sphinx of Giza ముఖ్యమైన పిరమిడ్లు.

ఖాఫ్రె పిరమిడ్ కొనభాగాన ఉన్న సున్నపురాయి కేసింగ్ (Lime Stone Casing) పిరమిడ్ల పూర్తి రూపాన్ని చూచాయిగా తెలియజేస్తుంది.

గిజాకు అబుసిర్‌కు మధ్య ఉన్న పిరమిడ్–జయెత్–ఎల్–ఆర్యన్ (Zawyet-el-Aryan) ఇక్కడ ఉత్తరాన నెబ్కా పిరమిడ్, దక్షిణాన Layer Pyramid ఖాబా పిరమిడ్ ఉన్నాయి.

అబుసిర్‌లో మొత్తం 14 పిరమిడ్లున్నాయి. వీటిలో ముఖ్యమైనవి–నియుసెర్రె, నెపెరెర్‌కెరె–ఖకాయి, సహురె పిరమిడ్లు.

సక్కారా (Sakkara)లో DJoser, Userkaf, Teti, Merikare, Unas పిరమిడ్లు ప్రముఖమైనవి. ఇంకా చాలా చిన్న పిరమిడ్లున్న ప్రదేశం సక్కారా.

దహసుర్ (Dahshur)లో స్నెఫెరు (Sneferu) దక్షిణ పిరమిడ్ (Bent Pyramid), Red Pyramid, Black పిరమిడ్‌లు ముఖ్యమైనవి.

మజ్‌ఘునా, లిష్ట్, మెయిదమ్, హవారా, ఎల్‌లహున్, ఎల్ కుఱ్ఱ, నురి ప్రాంతాలలో పిరమిడ్లున్నాయి.

మెరెర్ డైరీ (Merer Diary)లో పిరమిడ్లు కట్టే విధానం వివరించబడింది.

పిరమిడ్ల కథలు – హెరొడొటస్ చెప్పినవి.

ఖుఫు నియంత. అంతేకాక తన కుమార్తెతో దైహిక సంబంధం పెట్టుకున్న వ్యక్తి. పిరమిడ్ కట్టడానికి పైకం చాలనప్పుడు తన కుమార్తెను వేశ్యాగృహాలకు పంపేవాడు. ఆమె తన తండ్రికి ఇవ్వాల్సింది ఇచ్చి తనకోసం ఒక పెద్ద శిలను ఇమ్మని అడిగేదట వీటులను. ఆ రాళ్లతో మధ్య పిరమిడ్ కట్టారని అతడు వ్రాసాడు. ఇది కేవలం కట్టుకథ అని తరువాత బుజువయ్యింది.

మెన్‌కవురె (Menkaure) తన కుమార్తెను బలాత్కారం చేయగా ఆమె ఆత్మహత్య చేసుకున్నదని, మహారాణి తమ సేవకుల్ని అనుమానించి వారి చేతుల్ని నరికించిందని కథనం. కొందరు మెన్‌కవురె పిరమిడ్‌ను రొడొపిస్ (Rhodophis) అనే అందాల రాజనర్తకి కట్టించిందని వ్రాసారు. నవక్రాటిస్ పట్టణంలోని తన భవనంలో ఆమె స్నానం చేస్తున్నపుడు ఆమె సుగంధభరిత పాదరక్ష (Sandal)ను ఒక గద్ద ఎత్తుకుపోయి రాజు ఒడిలో పడవేసిందని, రాజు ఆశ్చర్యభరితుడై ఆమెకై గాలించి (సిండరెల్లా కథలోలా) తన భవనానికి రప్పించి వివాహమాడి ఆమెను రాణిని చేసాడని స్ట్రాబో (Strabo) వ్రాసినాడు.

ఇంకొక కథ ప్రకారం– మెన్‌కవురి–నిటొక్రిస్‌కు బాబిలోన్ (Babylon) రాణి Nitokris - నిటొక్రిస్‌కు సంబంధమున్నదని అంటారు. తన సోదరుడిని చంపిన ఈజిప్షియన్లనందరిని విందుకు ఆహ్వానించి ఒక గదిలో వాళ్లు భోజనాలు చేస్తున్నపుడు నదీ ప్రవాహాన్ని గదిలోకి పంపి వారినందరిని చంపి, తరువాత వెళ్లి మంటల్లో దూకి మరణించిందని, ఆమె ఆత్మ ఇప్పటికీ నగ్నంగా 'గీజా' మైదానంలో తిరుగుతుంటుందని ప్రజలు నమ్మేవారు.

ఇంకొకటి రాంప్‌సినిటస్ (Rhampsinitus) అనే రాజు కథ. అతడు తన సంపదలను దాచడానికి గొప్ప పిరమిడ్‌ను కట్టినాడు. అయితే భవనాన్ని నిర్మించిన మేస్త్రీ భవనపు గోడలో తీయడానికి వీలున్న రాతి నుంచి, తాను చనిపోయే ముందు ఆ రహస్యాన్ని తన ఇద్దరు కుమారులకు చెప్పినాడు. వాళ్లు అప్పుడప్పుడు అర్ధరాత్రులు చడీ చప్పుడు లేకుండా వచ్చి రాంప్‌సినిటస్ సంపదలను కొల్లగొట్టడం మొదలెట్టారు. రాంప్‌సినిటస్‌కు అనుమానం వచ్చింది. సంపదలున్న గదిలో వల పన్నాడు. దొంగతనానికి వచ్చినపుడు అన్న కాలు ఇనుప వలలో ఇరుక్కున్నది. అన్న చెప్పినట్లే తమ్ముడు అన్న తలను ఖండించి తలను, బంగారు వస్తువుల్ని తీసుకుని పారిపోయాడు. రాజు తన భటులను పంపాడు ఎవరన్నా రాజవీధి కూడలిలో వేలాడుతున్న తలలేని శవాన్ని చూసి ఏడుస్తుంటే బంధించమని. మత్తుమందు చల్లి భటులు నిద్రపోతున్న సమయంలో అన్న శవాన్ని ఎత్తుకుపోయి పాతిపెట్టి అంత్యక్రియలు చేసాడు తమ్ముడు.

ఈసారి రాంప్‌సినిటస్ తన కుమార్తెను వేశ్యాగృహానికి పంపాడు. ఎవరైతే తనకు నమ్మశక్యం కాని కథ చెబుతారో వారితో శయనించమని. వేశ్యాగృహానికి వచ్చిన దొంగ ఈ కథ చెప్పినపుడు రాకుమార్తె అతడి చెయ్యి పట్టుకొని బంధించబోయే సరికి, ఆమె చేతిలో శవపు చెయ్యి పెట్టి దొంగ పారిపోయాడు.

రాంప్‌సినిటస్ దొంగను క్షమించానని ప్రకటించాక అతడు వచ్చి తనను పరిచయం చేసుకున్నాడు. రాజు తన కుమార్తెనిచ్చి వివాహం చేసాడు.

ఇటువంటి కథ మన జానపద కథల్లోనూ ఉన్నది.

పై కథల్లో వేశ్యావృత్తి పాత్ర ప్రముఖంగా కనిపిస్తుంది. దాన్ని నీచంగా భావించినట్లులేరు ఆ కాలంలో.

పిరమిడ్లు ఎక్కడెక్కడున్నాయో వెదికి, శిథిలమవుతున్న వాటిని పునరుద్ధరించి కొత్త వైభవం తీసుకురావడానికి ప్రయత్నించి మొదిట ఈజిప్టాలజిస్ట్‌గా

పేరుపొందినవాడు రెండవ రామెస్సెస్ (Ramesses-II) నాలుగవ కుమారుడు ఖెమ్‌వసెత్ (Khaemwaset). మెంఫిస్ పట్టణంలో 'ప్తా' దేవుడికి ప్రధాన పూజారిగా, Apis వృషభాల సంరక్షకుడిగా పేరుగాంచాడు. మరణానంతరం అతడు Setne Khaemwaset - మంత్రశక్తులున్న సాహసికుడిగా అభివర్ణింపబడినాడు. టాలమిక్ పాపిరస్‌పై వ్రాయబడిన ఈ కథ దేవతల రహస్యాలను తెలుసుకోవాలని ప్రయత్నించడం ఎంత ప్రమాదకరమో తెలుపుతుంది.

మెంఫైట్ నెక్రోపొలిస్ (స్మశానవాటిక)లోని నాన్‌ఫెర్‌కాప్తా (Naneferkaptah) సమాధిలో తొత్ పుస్తకం (Book of Thoth) వింత వెలుగులతో కానవస్తున్న దానిని తన మంత్రశక్తుల సాయంతో 'సెత్నె' (Setne) తీసుకోబోయినపుడు నాన్‌ఫెన్‌కాప్తా–అతడి భార్య అహవరి (Ahwere) ఆత్మలు ప్రతిఘటిస్తాయి. అవి చెబుతాయి ఆ పుస్తకాన్ని దొంగిలించడం వలన తాము ఎలా చంపబడ్డామో... 'సెత్నె'తో.

"రాజు మెరెనెబ్‌ప్తా సంతానమైన 'నానెఫెర్‌కాప్తా – అహవరి'లు తండ్రి కోరికకు విరుద్ధంగా ఉన్నా, తండ్రిని బతిమాలి ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. వారి సంతానం మెరిబ్. తాతగారు అతడిని ఎంతో ప్రేమగా పెంచినాడు.

ఒక వృద్ధ పూజారి చెప్పగా తొత్ పుస్తకం గురించి విన్నాడు నాన్‌ఫెర్‌కాప్తా. మొదటి మంత్రంతో నేల, నింగి, అధోలోకం, పర్వతాలు, జలాలను వశపరచుకోవచ్చని, జంతువుల భాష అర్థమవుతుందని; రెండవ మంత్ర ప్రభావంతో రె–ఎన్నీడ్ దేవతలను, చంద్రుడిని, నక్షత్రాలను వీక్షించవచ్చునని.

వంద వెండి డెబెన్లు, అనేక బహుమతులు ఇచ్చినాక ఆ పుస్తకం – "కాప్టస్ (Koptos) జలాల అడుగున ఇనుపపెట్టె, ఆ ఇనుప పెట్టెలో ఒక రాగిపెట్టె, ఆ రాగిపెట్టెలో చెక్కపెట్టె, ఆ చెక్కపెట్టెలో దంతపు పెట్టె, ఆ దంతపు పెట్టెలో వెండి పెట్టె, ఆ వెండి పెట్టెలో ఉన్న బంగారుపెట్టెలో Book of Thoth ఓ మహాసర్ప సంరక్షణలో ఉన్నది" అని తెలియబరిచాడు పూజారి.

విషయం చెప్పాక నానెఫెర్‌కాప్తా భార్య భయపడింది. తన భర్తను ఉసిగొలిపినందుకు శాపనార్థాలు పెట్టింది. అయినా భార్య–భర్త–కుమారుడు ముగ్గురు కాప్టస్ చేరుకున్నారు. అక్కడ ఐసిస్–హార్పొక్రెటిస్ దేవాలయంలో నాలుగు రోజులు పూజలు జరిపి అయిదోరోజున మైనంతో పడవను సిబ్బందిని తయారుచేసి తన మంత్రశక్తులతో ప్రాణం పోసి వారితో తనను Book of Thoth ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లమన్నాడు. అక్కడ తనకు ఎదురైన పాములు, తేళ్లు, రాకాసి బల్లుల్ని,

మహాసర్పాన్ని మూడుసార్లు చంపి ఇనుపపెట్టె–రాగి–చెక్క–దంతపు–వెండి పెట్టెలోని బంగారు పెట్టెలోని Book of Thoth ను తీసుకుని దానిలోని మంత్రాలను చదివి భార్యాబిడ్డల వద్దకు తిరిగివచ్చాడు. భార్య కూడా ఆ మంత్రాలను చదివాక వాటిని ఓ పాపిరస్‌పై వ్రాసి – అసలు పుస్తకాన్ని బీరులో కలిపి తాగి హరాయించుకున్నాడు. ఇప్పుడు ఆ మంత్రపుస్తకం అతడి నరనరాల్లో కలిసిపోయింది. తల్లి–తండ్రి–కుమారులు కాప్టస్ పట్టణాన్ని విడిచి ఆరుమైళ్లు వచ్చారు.

తౌత్ (Thoth) ఈ విషయాన్ని 'రె' సూర్యుడికి నివేదించాడు. దేవతల ఆగ్రహానికి తొలి బలిపశువుగా 'మెరిబ్' నౌకలోంచి నీటిలోకి దూకి మరణించాడు. నానెఫెర్‌కాప్తా తన మంత్రశక్తులతో అతడిని వెలికి దీసినప్పుడు అతడి ఆత్మ దేవతల ప్రతీకారాన్ని చెప్పింది. అతడి శరీరాన్ని, కాప్టస్‌లో ఖననం చేసారు. ఆ తరువాత అహవరి కూడా అలాగే చనిపోయింది. ఆమెను మెరిబ్ పక్కనే ఖననం చేసారు. మరల అదేచోట నానెఫెర్‌కాప్తా నీటిలో మునిగి చనిపోయినా అతడి శరీరం నౌక చుక్కాని వద్ద ఇరుక్కుని మెంఫిస్ వద్ద బయటపడింది. మెంఫిస్‌లో అతడి తండ్రి అంత్యక్రియలు కావించాడు. నానెఫెర్‌కాప్తాను అతడి పాపిరస్ పుస్తకంతో సహా!" అని చెప్పింది అహవరి ఆత్మ సెత్నెఖామ్‌వసెత్‌తో.

సెత్నె– మొండివాడు, ధైర్యవంతుడు. మంత్రశక్తులు కలవాడు. నానెఫెర్‌కాప్తా అన్నాడు అతడితో– "సరే! మనిద్దరి దగ్గర మంత్రశక్తులున్నాయి కదా! ఇప్పుడు మనం 'సెనెత్' ఆట ఆడుదాం! చాతనైతే గెలిచి ఈ మంత్ర పుస్తకం పట్టుకుపో!" అన్నాడు.

మొదటి ఆట ఓడిపోగానే సెత్నె కాళ్లు మోకాళ్ల వరకు నేలలోకి దిగిపోయాయి. రెండవ ఆట ఓడిపోగానే బొడ్డు వరకు, మూడవ ఆట ఓడిపోగానే చెవుల వరకు భూమిలోకి దిగబడిపోయాడు. సెత్నె వెంటనే తన సోదరుడు ఇనరాస్ (Inaros)ను తలుచుకున్నాడు– "వెళ్లి రాజుకు చెప్పి నా మంత్ర పుస్తకాలు, తాయెత్తులు, ప్తా చేతి కంకణాలు తీసుకురా!" అన్నాడు. నానెఫెర్‌కాప్తా సమాధి దగ్గర వాటిని ఉంచగానే 'సెత్నె' సజీవుడై Book of Thoth ను తీసుకుని ఇద్దరూ అక్కడ నుంచి బయటపడుతుంటే అహవరి దుఃఖించింది. నానెఫెర్‌కాప్తా ఆమెను ఓదారుస్తూ అన్నాడు– "వెళ్లనీ! మళ్లీ అతడు ఆ పుస్తకాన్ని తిరిగి ఇవ్వక తప్పదు! వంపుకర్ర ఒక చేతిలో, మండే నిప్పులకుండ తలపై మోస్తూ"

పుస్తకం సెత్నె చేతికి దొరికింది. మంత్రాలను చదివినాడు సెత్నె. ఎవరు ఎంత చెప్పినా దానిని స్వస్థలానికి చేర్చలేదు. కాలం గడిచింది.

ఓరోజున ప్తా దేవాలయాన్ని సందర్శించేందుకు అద్భుత సౌందర్యరాశి బస్తెత్ పూజారి కుమార్తె తన చెలికత్తెతో వచ్చింది. ఆమెను చూసి మోహపరవశుడైన 'సెత్నె' ఆమె చెలికత్తెను పిలిచి అడిగాడు– "ఎవరామె?".

"ఆమె తబుబు (Tabubu). బస్తెత్ పూజారి కుమార్తె".

'సెత్నె' అన్నాడు– "ఆమె నాకు కావాలి! ఒక గంట నాతో గడిపితే చాలు పది బంగరు ముక్కలనిస్తాను. లేకుంటే ఆమెను న్యాయపరమైన చిక్కుల్లో పడవేస్తాను. లొంగకపోతే మంత్రశక్తుల్ని వాడతాను" అని బెదిరించాడు.

తబుబు తన చెలికత్తెను పిలిచి అన్నది– "ఆరాటమెక్కువగా ఉన్నట్లుంది ఆలయ పూజారికి. ఈ రహస్య సంభాషణలెందుకు? తనకు వీలైనపుడు నా యింటికి బుబాస్తిస్‌లోని భవనానికి రమ్మను. అక్కడ ఏ ఆటంకాలూ ఉండవు. ఎంతసేపైనా ఉండవచ్చు!"

అతడు బుబాస్తిస్ వెళ్లాడు. ఆమె అతడిని ఆహ్వానించి అద్భుతమైన తన భవనాన్ని చూపించి పడకగదిలోకి తీసుకువెళ్లింది. చక్కని అలంకరణతో, సున్నితమైన వస్త్రాలతో పరిమళభరితంగా ఉన్నదా గది. స్వర్ణకలశంలో మధువునిచ్చి దాహం తీర్చుకొమ్మని ప్రార్థించింది. తన కోరిక తీర్చమని అతడడిగాడు.

"తప్పకుండా! నీ శక్తులు, సంపదలన్నీ నా పరం చేయి, నేను నీదాని నవుతాను" అన్నదామె.

'సెత్నె' లేఖకుడిని పిలిచి ఆమె చేయమన్నట్లు చేసి పత్రం వ్రాసిచ్చినాడు.

అత్యంత పలుచని దుస్తులలో ఆమె దేహసౌందర్యం వెన్నెలలా మెరిసి పోతున్నది. తమకం పట్టలేక 'సెత్నె' ఆమెను ప్రాధేయపడినాడు. ఆమె అన్నది– "నీ పుత్రులు కింద ఆవరణలో వేచి ఉన్నారు. వెళ్లి వాళ్లను చంపి వారసులు లేకుండా చేయి. అప్పుడే నేను నీ దానినవుతాను". కామం కళ్లుకప్పి, మధువు మనసును మొండిబార్చగా, సేవకులు తన పిల్లలను చంపి కుక్కలకు పిల్లులకు పారవేస్తుంటే చూస్తూ ఉండిపోయాడు సెత్నె ముఖాన ఏ అపరాధ భావమూ లేకుండా.

"తబుబు! నా కోరిక తీర్చు! మందుతున్న ఈ దేహాన్ని చల్లబరుచు" అన్నాడతడు.

ఆమె అతడిని తోటలోని గదిలోకి తీసుకువెళ్లింది. దంతపు శయ్యపై ఇద్దరూ శయనించారు. అతడు ఆమెను తన చేతితో స్పృశించి దగ్గరకు లాక్కోబోయినాడు. ఆమె నోరు తెరిచి భయంకరంగా అరచింది–

సెత్నె ఉలిక్కిపడి నిద్రలేచాడు భయంతో వణుకుతూ. అతడి వంటిపై నూలుపోగు లేదు. అటుగా పోతున్న అతడి తండ్రి రామెస్సెస్ అతడిని చూసి "సెత్నె, ఏమయ్యింది నీకు?" అని అడిగాడు. "ఏమీ లేదు" అన్నాడు సెత్నె. రామెస్సెస్ అన్నాడు– "ఇది పీడకల. భయపడకు. నీ పుత్రులు మెంఫిస్‌లో క్షేమంగానే ఉన్నారు".

తండ్రి సలహా తీసుకుని 'సెత్నె' Book of Thoth ను నానెఫెర్‌కాప్తా సమాధిలో ఉంచడానికి నిశ్చయించుకున్నాడు. తన చేతిలో వంపుకర్రతో, తలపై మండుతున్న కుండతో వెళ్తూ – అహవరి, మెరిబ్ శరీరాలను కాప్టాస్ నుంచి తెప్పించి నానెఫెర్‌కాప్తా సమాధి వద్ద ఖననం చేసి, అతడి సమాధిలో పుస్తకాన్ని యథాస్థానంలో ఉంచి సమాధిని మూసివేసి ఇంటికి తిరిగి వచ్చినాడు. కథ ముగిసింది...

(సెత్నె–నానెఫెర్‌కాప్తాలు ఆడిన సెనెత్ (Senet) ఆట – Passing Game-30 Squares)లో ఇద్దరు ఆటగాళ్లు అయిదు లేక ఏడు నర్తకులు (Dancers) అనే పావులతో ఆడతారు.

Battle of Megiddo



Tuthmosis-III

Imhotep



Amenhotep-III

37. ఫారోల దేశం
(The Land of Pharaohs)

ఫారోకు అర్థం పెద్ద ఇల్లు. ఫారోల దేశం ఈజిప్టు. నైలునదీ జలాలు, మండే 'రా' సూర్యుడి వేడి ద్వంద్వాలు ఆ దేశంలో. నల్లనేల–ఎర్రనేలకు సంకేతాలు ఒసిరిస్–సెత్‌లు.

నీటికి నల్లనేలకు మధ్య ఐసిస్–పాపిరస్–రెల్లుమొక్కలు; నల్లనేలకు–ఎర్రనేలకు మధ్య నెఫ్‌థిస్ పొదలు ప్రతీకలు. 42 కట్లున్న ఒసిరిస్ దేహం నలభై రెండు పరగణాల ఈజిప్టదేశం. ఈ నలభైరెండు గదుల భవనానికి ప్రతీక ఫారో.

1. నెమిస్ (Nemes) తలపాగా
2. వంపుగడ్డం – Beard
3. స్కర్ట్ – Shendyt
4. Pschent + ఎర్రటి కిరీటం (దిగువ ఈజిప్టు)
5. తెల్లటి కిరీటం – ఎగువ ఈజిప్టు

ఇవి ఫారో రాజచిహ్నాలు.

Prenomen, Cartouche name or throne name (Sedge and Bee) - అయిదు ప్రభునామాలు (హోరస్, నెబ్తి, బంగరు హోరస్, రెండురాజ్యాల ప్రభువు, సూర్యపుత్రుడు).

ఫారో రాజ్యానికి రాగానే ఓ ఏడాదిపాటు ఉత్సవాలు జరిగేవి.

1) ఎగువ–దిగువ ఈజిప్టుల ఐక్యతావేడుకలు
2) తెల్లగోడల చుట్టూ ప్రదక్షిణాలు.
3) మహారాజ దర్శనం – సెడ్ (Sed) పండుగ
4) సొకర్ పండుగ (Sokar Festival)
5) రాజశిశువుకు పాలు తాగించడం

క్రీస్తుపూర్వం పదివేల సంవత్సరాలకు ముందు ఆఫ్రికా మధ్యదేశంలో, ఆసియా మధ్యధరా సముద్రం వద్ద నాగరికత ప్రారంభమైనదని, అట్లాంటిస్ సముద్రంలో మునిగిపోతున్నపుడు అక్కడ నుంచి వచ్చిన కొందరు ప్రజలు నైలునది

డెల్టాలో మెరిందా (Merimda) వద్ద, తాసా (Tasa) వాద్ద స్థిర నివాసాలేర్పరచుకున్నారని ఓ భావన.

ఒసిరిస్ ప్రభువు సింహాసనాన్ని అధిష్ఠించిన కాలాన్ని 'Time of the god' దైవకాలం అని పిలిచేవారు. ఒసిరిస్ 22 పరగణాల ఎగువ ఈజిప్టును, ఇరవై పరగణాల దిగువ ఈజిప్టును కలిపినాడని ఐతిహ్యమున్నా ఈజిప్ట తొలి చక్రవర్తి నార్మర్ (Narmer - Menes) మనువును వాస్తవ ప్రభువుగా గుర్తించినారు (3100 B.C.). ఎగువ ఈజిప్ట చిహ్నం రాబందు (Vulture); దిగువ ఈజిప్ట చిహ్నం – నాగుపాము (Cobra).

పాత సామ్రాజ్యం 3200 B.C.లో మొదలైనది. తరువాత రాజధాని Abydos నుంచి Memphis కు మార్చబడి 'Empire of Memphis'గా పిలువ బడినది. మూడవ డినాస్టిలో Djoser స్టెప్ పిరమిడ్‌ను కట్టించినాడు. నాలుగవ డినాస్టిలో స్నెఫెరు (Sneferu) తరువాత ఖుఫు, ఖాఫ్రె, మన్‌కవురెలు పెద్ద పిరమిడ్లను కట్టించినారు. (Great Pyramids).

అయిదవ డినాస్టి హిలియొపొలిస్‌లో ప్రారంభమయ్యింది.

'రా' సూర్యుడి పుత్రులుగా ఫారోలు చెప్పుకున్నారు (Son of Ra). పెపి (Pepi-II) ఆరవఏట రాజుగా సింహాసనమెక్కి 94 సంవత్సరాలు ఈజిప్టును పాలించినాడు. ఆరవ డినాస్టిలో అరాచకం ఏర్పడి మొదటి మధ్యకాలం (2180 BC)లో ఏడు–పదకొండు డినాస్టిలు గడిచాయి.

మొదటి మధ్యకాలం (Middle Kingdom-2060 B.C.) మెంతుహొతెప్ (Mentuhotep I, II, III)ల పాలన. పన్నెండవ డినాస్టి కాలం – 2000 B.C.లో మొదటి అమెనెమ్‌హత్ (Amenemhat-I) అమున్ (Amun) ప్రధాన దేవుడిగా అద్భుతంగా పరిపాలించాడు. అతడి కుమారుడు సెనుసెర్త్ (Senusert I); మూడవ సెనుసెర్త్ కాలంలో ఈజిప్ట సామ్రాజ్యం పాలస్తీనా, సూడాన్‌ల వరకు విస్తరించింది.

రెండవ మధ్యకాలం హిక్సాస్ (Heads of Foreign Countries - Hekakhasut) అవారిస్‌ను ఆక్రమించుకుని దానిని రాజధానిగా చేసుకుని పాలించాడు.

1622 B.C.లో అహమోస్ ప్రభువు హిక్సాస్ (Hyksos)లను పారద్రోలి 18వ డినాస్టి స్థాపించాడు.

1580 B.C. లో నూతన రాజ్యం (New Kingdom) థెబెస్ రాజధానిగా కళలకు, నాగరికతకు ప్రసిద్ధికెక్కింది. టుత్‌మోసిస్–I, టుత్‌మోసిస్–IIలు రాజ్య విస్తరణ చేసినారు. టుత్‌మోసిస్-III ని తొలగదోసి అతడి సవతితల్లి Hatshepsut ఇరవై రెండేళ్లు పరిపాలించింది. ఆమె మరణానంతరం టుత్‌మోసిస్-III అధికారం చేజిక్కించుకుని 34 ఏళ్లు పాలించాడు. 1372 B.C.లో నాలుగవ అమెన్‌హోతెప్ (Amenhotep-IV–కవిరాజు) అమున్ స్థానే Aten (సూర్యబింబం లేదా సూర్యచక్రాన్ని) ప్రధాన దేవతగా చేసి ఏకేశ్వరోపాసనను ప్రారంభించాడు. రాజధాని Akhetatenగా, తనపేరు Akhenaten గా మార్చినాడు.

అతడి తరువాత అధికారంలోకి వచ్చిన తుతున్‌ఖాటున్ (Tutankhaton), అతడి భార్య నెఫెర్‌తితి (Nefertiti)లు థెబెస్‌కు వచ్చి మరల అమున్ సంప్రదాయాన్ని పునరుద్ధరించారు. అతడే చరిత్ర ప్రసిద్ధికెక్కిన Tutankhamen. (పద్దెనిమిదవ ఏటనే మరణించిన అతడి సమాధిని 1922లో Howard Carter కనుగొన్నాడు).

తుతన్‌ఖామెన్ తరువాత ఏర్పడిన అరాచకస్థితిలో రాజ్యం సైనికాధిపతుల చేతికి చిక్కింది. Horemhep, Ramesses-I, Seti-I, Ramasses-II (The Great Ramesses 1279 B.C.) పరిపాలించారు. హిట్టైట్ సైన్యాన్ని Kadesh యుద్ధంలో నిలువరించినవాడై రెండవ రామెస్సెస్ 67 సంవత్సరాలు ఈజిప్టును పాలించాడు. లక్సర్, కార్నాక్, అబుసింబెల్‌లో అద్భుత కట్టడాల్ని నిర్మించాడు.

అతడి కుమారుడు మెర్నెప్తా (Merneptah) తరువాత ఈజిప్ట సామ్రాజ్య పతనం ప్రారంభమయ్యింది.

మూడవ మధ్యకాలం (Third Intermediate Period 1070 B.C.)లో 21వ డినాస్టి తానిస్ (Tanis) రాజధానిగా మొదలైంది. లిబియన్, ఇథియోపియన్ ప్రభువులు, ఆ తరువాత 27వ డినాస్టి కాలం నాటికి పర్షియన్లు అధికారాన్ని చేజిక్కించుకున్నారు. 332 B.C. నాటికి అలెగ్జాండర్ (Son of Raగా లక్సర్ జ్యోతిష్కం) ఈజిప్టను ఆక్రమించి అలెగ్జాండ్రియా పట్టణాన్ని నిర్మించి రాజధానిగా చేసినాడు. 323 B.C.లో అలెగ్జాండర్ అనంతరం టాలమీ (Ptolemaic Period)ల పాలనలోకి, తరువాత రోమన్ల పాలనలోకి వెళ్లింది. 395 A.D. (క్రీస్తుశకం)లో థియొడొసియస్ (Theodosius) మరణంతో ఈజిప్ట తూర్పు రోమన్ సామ్రాజ్యంలో భాగమై గతకాలపు వైభవాన్ని కోల్పోయి ఇసుక తట్టలుగా మిగిలింది.

38. తుతన్‌ఖామున్ సమాధి-ఫారోల శాపం
(Tutan Kha Amun (1342-1323 B.C.)

ఈజిప్టును పద్ధెనిమిదవ డినాస్టిలో బహుదేవతారాధన నుంచి ఎటెన్ (Aten) ఏకేశ్వరోపాసన వేపు మళ్లించాలని ప్రయత్నించిన ఎఖెనాతెన్ (Akhenaten), అతడి భార్య అంఖెసెనామున్; ఎఖెనాతెన్–అంఖెసెనామున్‌ల కుమారుడు తుతన్‌ఖాఅమున్ (అమున్ యొక్క సజీవచిత్రం అని అర్థం) తండ్రి చనిపోయి తాను రాజు కాగానే అతడు బహుదేవతారాధన వేపు మరలినాడు. రాజధానిని అఖెతాతెన్ నుంచి థెబెస్‌కు మార్చినాడు. పదేళ్ల వయసులో రాజై పంధొమ్మిదవ ఏట మరణించాడు. అతడి సమాధిని 1922లో హొవర్డ్‌కార్టర్ కనుగొన్నాడు. దానిలో కనుగొన్న 5000 వస్తువులు, మాస్కు, తుతన్‌ఖామున్ మమ్మీ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచగా ఆ సమాధిని తవ్విన బృందంలో కొందరు ఆకస్మిక మరణానికి గురికావడం – ఫారోల శాపం (Curse of the Pharaohs)గా బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది.

ఎ) ఫారోల శాపం (Curse of the Pharaohs)

ఫారోల సమాధులను దొంగల నుంచి రక్షించడానికి మంత్రాలు లిఖించిన పాపిరస్‌లు, బొమ్మలను సమాధుల్లో ఉంచేవారు. ఆ మంత్రాలను Execration Texts అని పిలుస్తారు. 2686 B.C.నాటి నుండే వీటి ఉనికి ఉన్నది. పరదేశీయులను బంధించినట్లున్న బొమ్మలపై, కాల్చని మట్టిబిళ్లలపై ఎర్రరంగులో వ్రాసి వాటిని సమాధుల లోపల పగలగొట్టేవారు. చేతబడి చేసి బొమ్మల్ని సూదులు కత్తులతో పొడిచినట్లు, ఈ Execration బొమ్మల్ని పగలగొట్టడం, కాళ్లతో తొక్కడం, కత్తులతో పొడవడం, తగలబెట్టడం, మూత్రంలో ముంచడం, పాతిపెట్టడం చేసేవారు. “నాలుగుసార్లు ఉమ్ము; ఎడమకాలితో తొక్కు, బల్లెంతో పొడువు, కత్తితో నరుకు, నిప్పుల్లో పడవేసి ఉమ్ము అనేకసార్లు...” అలా మంత్రజపం చేసేవారు.

సెమ్మా, యురొనతి, మిరిగిస్సా, ఎలిఫాంటైన్, థెబెస్, బలాత్, అబిడస్, హెల్వాన్, సక్కారా, గిజా ప్రాంతాల్లో దాదాపు వేయికిపైగా శాపగ్రస్తపు బొమ్మలు దొరికాయి.

గ్రీకో–రోమన్ దేశాలలో ఇటువంటి వాటిని Curse Tabletగా పిలిచేవారు.

19వ శతాబ్దంలో జీన్–ఫ్రాంకాయిస్ ఛాంపొల్లియన్ చిత్రలిపి అర్థం కనుక్కున్నాక ఈ బొమ్మల రహస్యం అందరికీ అవగతమయ్యింది.

క్రీ.శ. 1699లో లూయిస్ పెనికర్ (Louis Penicher) వ్రాసిన దానిని బట్టి– పోలిష్ బాటసారి అలెగ్జాండ్రియాలో రెండు మమ్మీలను కొని నౌకలో ప్రయాణిస్తుండగా అతడికి ప్రతిరోజూ కలలో రెండు మంత్రదండాలు కానవచ్చేవని, మమ్మీలను సముద్రంలో పారవేసాక పీడకలలు ఆగిపోయాయని – వ్రాసినాడు.

జహి హవస్ (Zahi Hawass) వ్రాసిన దానిప్రకారం– ఓ ఆర్కియాలజిస్టు Kom Abu Billow వద్ద పనిచేస్తూ అక్కడ లభ్యమైన వస్తువుల్ని తీసుకువెళ్తున్నపుడు అతడి సోదరుడు మొదటి రోజున, బాబాయి మొదటి సంవత్సరంలో, మూడవ సంవత్సరాన అతడి పినతల్లి చనిపోయారట. గిజా పిరమిడ్‌ల దగ్గర తవ్వుతున్నపుడు వాళ్లకు ఈ 'శాపం' వ్రాయబడి కనిపించింది. "ఎవరైతే ఈ సమాధుల్ని అపవిత్రం చేస్తారో వారికి నీటిలో మొసళ్ల వలన, నేలపై పాముల వలన అపాయం తప్పదు. హిప్పొపొటమస్‌లు, తేళ్లు వారిని వేటాడును గాక!"

అతడు బహరియా ఒయాసిస్సు వద్ద రెండు మమ్మీలు పిల్లలవి తీసి మ్యూజియంలో భద్రపరచినపుడు అతడికి కలల్లో ఇద్దరు పిల్లలు కనిపించి హడలగొట్టేవారు. తరువాత ఆ పిల్లల తండ్రి మమ్మీని కూడా మ్యూజియంలోకి చేర్చాక ఆ కలలు ఆగిపోయినాయని, ఈజిప్టు చరిత్ర అంటే ఎంతో ఇష్టమున్న ఒక బాలుడు జబ్బు పడినపుడు ఈజిప్టు మ్యూజియంలోని మొదటి అహమోస్ (Ahmose-I) మమ్మీ కళ్లలోకి చూడగానే అతడి వ్యాధి నయమై ఆరోగ్యవంతుడైనాడని వ్రాసినాడు జహి హవస్.

బి) తుతన్‌ఖామున్ సమాధి (Tutankhamun Tomb-KV62)

29 నవంబర్ 1922 నాడు హొవర్డ్ కార్టర్ నాయకత్వాన తుతన్‌ఖామున్ సమాధిని తెరవడంతో ఈజిప్టాలజీలో నవీన శకం ప్రారంభమయ్యింది. (1323 B.C.లో తుతన్‌ఖామున్ చనిపోయాడు. 16 ఫిబ్రవరి 1923 నాడు బరియల్ ఛాంబర్ తెరిచారు).

జార్జి హెర్‌బర్ట్ (George Herbert - 5th Fare of Carnavorn) - ఆర్థిక వనరులు సమకూర్చడమేగాక సమాధిని తెరచిన సభ్యులలో ఒకడు, 5 ఏప్రిల్ 1923 నాడు దోమకాటు విషపూరితం కాగా మరణించాడు. లార్డ్ కార్నవార్న్ బుగ్గపై దోమ కుట్టగా చిన్ని గడ్డ ఏర్పడింది. అతడు గడ్డం గీసుకున్నప్పుడు ఆ గడ్డ

ఎరిసిపెలాస్ (Erysipelas)గా పెద్దదై విషపూరితమై ఇదివరకే ఊపిరితిత్తుల వ్యాధి (Bronchitis)తో బాధపడ్తున్న అతడికి న్యుమోనియాగా మారడంతో అతడు మరణించాడు. అది సమాధులలో ఉండే ఫంగస్ విషం వల్ల కావచ్చునని కొందరి అభిప్రాయం. అయితే తుతన్‌ఖామున్ మమ్మీ ఎడమబుగ్గపై గాయపు మచ్చ ఉంది. తుతన్‌ఖామున్ శాపం వలన లార్డ్ కార్నవార్న్ చనిపోయాడా?

మొదటి జార్జి జేగౌల్డ్ (George Jay Gould) ఆ సమాధిని సందర్శించిన వారిలో ఒకడు. ఫ్రెంచి రివియెరాలో 16 మే 1923 నాడు మరణించినాడు విషజ్వరంతో.

A.C. Mace కార్టర్ బృందపు సభ్యుడు. 1928లో ఆర్సెనిక్ విషం వలన చనిపోయాడు.

కెప్టెన్ రిచర్డ్ బెథెల్ – కార్టర్ సెక్రటరి 15 నవంబర్ 1929లో మేఫెయిర్ క్లబ్బులో మంచం మీద పడుకున్నవాడు పడుకున్నట్లే ఊపిరాడక చనిపోయాడు.

హొవర్డ్ కార్టర్ 2 మార్చి 1939న చనిపోయాడు. కొందరు అతడి చావుకు కారణం తుతన్‌ఖామున్ శాపమేనని భావిస్తున్నారు. మే 1926లో కార్టర్‌కు ఎడారిలో జాకాల్ రెండుసార్లు కనిపించిందని తన డైరీలో వ్రాసుకున్నాడు. (బహుశా 'అనుబిస్' అలా వచ్చాడా?)

కార్టర్ స్నేహితుడు సర్ బ్రూస్ ఇన్‌గ్రామ్ (Bruce Ingram)కు స్వర్ణ కంకణమున్న మమ్మీ చేతిని కార్టర్ ఇచ్చాడని, దానిమీద – "నా శరీరాన్ని అపవిత్రం చేసినవారు, కదిలించినవారికి ఆపదలు తప్పవు. వారిని అగ్ని, జలాలు, మహమ్మారులు వెంటాడును గాక!" అని వ్రాసి ఉంది. దానిని తీసుకువెళ్లిన సర్ బ్రూస్ ఇన్‌గ్రామ్ ఇల్లు మంటల్లో కాలిపోయి, వరదల్లో ధ్వంసమై దానితో పాటు మమ్మీ చేయి అదృశ్యమైందని ఓ కథనం.

హొవర్డ్ కార్టర్ ఈ శాపాన్ని ఏనాడూ నమ్మలేదు. తుతన్‌ఖామున్ సమాధిని, సార్కొఫేగస్ (Sarcophagus)ను తెరచినపుడు 58 మంది సభ్యులున్నారు. కార్నవార్న్ కుమార్తె ఇవ్‌లిన్ హెర్‌బెర్ట్ సమాధి తెరచిన తరువాత 57 ఏళ్లు బదికింది. అలాగే అమెరికన్ ఆర్కియాలజిస్ట్ J.O. Kinnaman 39 ఏళ్లు బదికాడు.

తరువాత కాలంలో వచ్చిన నవలలు, సినిమాలు – ఫారోల శాపాన్ని (Curse of the Pharaohs)ను సవివరంగా చూపించి ఓ మిథ్ (Myth) పాపులర్ కావడానికి తోడ్పడినాయి.

Marie Corelli వ్రాసింది – "The most dire punishment follows any rash intruder into a sealed tomb". ఆమె ప్రఖ్యాత నవలారచయిత్రి. సర్ ఆర్థర్ కానన్ డాయిల్ (Sir Arthur Conan Doyle) - An evil elemental spirit ను సమాధుల్లో రక్షణకై పూజారులు మంత్రప్రోక్తం చేసి ఉంచుతారని, అది సమాధులను తెరచినవారిని వెంటాడుతుందని వ్రాసినాడు.

1323 B.C. - తుతన్‌ఖామున్ (King Tut) మరణం

29 నవంబర్ 1922 – కార్టర్ బృందంచే సమాధి తలుపు తెరవడం

16 ఫిబ్రవరి 1923 – బరియల్ ఛాంబర్ తెరవడం (Burial Chamber)

1923లో ప్రిన్స్ ఆలికామెల్ ఫామెబెను అతడి భార్య కాల్చి చంపింది. 5 ఏప్రిల్ 1923 నాడు లార్డ్‌కార్నవార్న్ మరణం, 1924లో తుతున్‌ఖామున్ మమ్మీని X-Ray తీసిన సర్ ఆర్చిబాల్డ్ డగ్లస్ రీడ్ మరణం.

1924లో సర్ లీస్టాక్ – గవర్నర్ జనరల్ ఆఫ్ సూడాన్ కైరోలో హత్య చేయబడినాడు.

1928లో ఆర్సెనిక్ విషం వలన ఆర్థర్ మేస్ మరణం.

1929లో కార్టర్ సెక్రెటరి బెథెల్ మరణం

1930లో బెథెల్ తండ్రి ఆత్మహత్య

2 మార్చి 1939 నాడు హోవార్డ్ కార్టర్ మరణం.

ఇవన్నీ యాదృచ్ఛికాలే అని విశ్లేషకులన్నప్పటికీ తుతన్‌ఖామున్ శాపంలా, సమాధులను అపవిత్రం చేసేవారిని అధోలోకపు దేవతలు శిక్షిస్తారని ప్రజలు నమ్ముతారు. కొందరు ఈజిప్ట ప్రజలు అడిగారు– “మేం వచ్చి మీ తాతతండ్రుల సమాధులను పెల్లగిస్తే మీరూరుకుంటారా?” అని.

Howard Carter

39. మృతుల పుస్తకం
(Book of the Dead)

మృతుల పుస్తకం "The Book of the Dead" 1550-50 B.C. వరకు ప్రాచుర్యంలో ఉన్నది. పాపిరస్‌లపై వ్రాయబడిన Book of Peret Emheru - Coming Forth by Day, Book of Emerging Forth into the Night - ప్రతులలో మృతుడు అధోలోకం – Duat - Under world లో గడిపే మరణానంతర జీవితానికి పనికివచ్చే సూచనలు, విధి విధానాలు, మంత్రాలు ఉన్నాయి.

ఈ పుస్తకపు ప్రతిని మృతుడి సమాధిలో ఉంచుతారు. Papyrus of Ani వీటిలో ముఖ్యమైనది. దాదాపు 192 మంత్రాలు ఈ Book of the Deadలో ఉన్నాయి. తాయెత్తుల, స్కరబ్ రూపాలపై వ్రాసి వాటిని మృతుడికి తగిలించేవారు.

26వ డినాస్టి (Saite Period) నాటికి Book of the Dead అధ్యాయాలుగా విభజింపబడింది.

అధ్యాయాలు 1-16: సమాధిలో ప్రవేశం. మృతాత్మ అధోలోకంలోకి ప్రయాణం, మృత శరీరానికి చలనం, మాట.

అధ్యాయాలు 17-62: దేవతలు, స్థలాల వివరణ, మృతుడు ఉదయ సూర్యునితో పునరుజ్జీవుడగుట.

అధ్యాయాలు 64-129: సూర్యుడితో ఆకాశ ప్రయాణం. పవిత్ర మృతాత్మగా (Blessed Dead) సాయంకాలం అధోలోకంలో ఒసిరిస్ ముందు ప్రత్యక్షం.

అధ్యాయాలు 130-189: దైవత్వ ప్రాప్తి.

తాయెత్తులు, ఆహారం, స్థలాల వివరణ, మమ్మిఫికేషన్ (Mummification) వలన మృతుడి శరీరం Sah గా మారి దైవత్వం పొందడానికి అర్హత సంపాదిస్తుంది. హృదయంలో తెలివితేటలు, జ్ఞాపకశక్తి ఉంటాయి కనుక హృదయాన్ని దేహంలోనే ఉంచుతారు.

కా (Ka) అనేది ప్రాణశక్తి. మృతదేహంలో ఉండి ఆహార పానీయాలను స్వీకరిస్తుంది. సమాధిలో ఆహారం లేనప్పుడు 105వ మంత్రాన్ని జపించాలి.

25వ మంత్రం మృతుడు తన పేరును మరచిపోకుండా తరచుగా గుర్తు చేస్తుంటుంది.

బా (Ba) దేహపు ఆత్మ – మృతుడి శరీరంలో ఉంటుంది. మానవ శిరసున్న పక్షిగా చిత్రించారు దీనిని.

61, 89 మంత్రాలు 'బా'ను పరిరక్షిస్తాయి.

షత్ (Shut) – మృతుడి నీడ (Shadow)

91, 92, 188 మంత్రాలు నీడను రక్షిస్తాయి.

సా, కా, బా, షత్ లు అన్నీ భద్రపరచబడినపుడు మృతుడు పూర్ణాత్మ అఖ్ (Akh)గా దైవత్వాన్ని పొందడానికి అర్హుడౌతాడు. అంత్యక్రియల ద్వారా 'బా'ను శరీరం నుంచి విడుదలజేసి 'కా'తో కలపడం వలన అఖ్ (Akh)గా మారి దేహాన్ని చేరినపుడు మృతుడు పునర్జీవనాన్ని పొందుతాడు.

ఆత్మలో భాగాలు (Parts of the Soul) :

1) ఖెత్ (Khet) - భౌతిక దేహం (Physical Body)

2) సా (Sah) - ఆత్మదేహం (Spiritual Body)

3) రెన్ (Ren) - పేరు, గుర్తింపు (Name, Identity)

4) బా (Ba) - వ్యక్తిత్వం (Personality)

5) కా (Ka) - స్వతంత్ర ఆత్మ (Double)

6) ఇబ్ (Ib) - హృదయం (Heart)

7) షత్ (Shut) - నీడ (Shadow)

8) సెఖెమ్ (Sekhem) - శక్తి, రూపం (Power, Form)

9) అఖ్ (Akh) - పూర్ణ ఆత్మ (Combined Spirits)

హ (Ha) మానవదేహం. హెకా (Heka) మంత్రం. Karl Richard Lepsius మృతుల పుస్తకాన్ని అనువాదం చేసి Book of the Dead అని పేరు పెట్టినాడు. మృతుల పుస్తకం కాలరేఖ–

3150 B.C. - తొలి చిత్రలిపి

3000 B.C. - తొలి డినాస్టి

2345 B.C. - ఉనాస్ పిరమిడ్ – పిరమిడ్ టెక్ట్స్ – అంత్యక్రియల సాహిత్యం

2100 B.C. - కాఫిన్ టెక్ట్స్ (Coffin Texts)

1600 B.C. - Book of the Dead మంత్రాలు (Spells)

1550 B.C. - ప్రతిని సమాధిలో ఉంచే ఆచారం

600 B.C. - క్రమపద్ధతి

42-553 A.D. - క్రిస్టియానిటి ప్రాభవం

1798 A.D. - నెపొలియన్ ఈజిప్టు దండయాత్ర. వివాంత్ డెనాన్‌కు లభ్యమైన మృతుల పుస్తకం.

1085 A.D. - మృతుల పుస్తక ప్రచురణ

1822 A.D. - జీన్–ఫ్రాంకాయిస్ ఛాంపొలియాన్ – చిత్రలిపిని అర్థం చేసుకోవడం.

1842 A.D. - లెప్సియస్ – Book of the Dead – అనువాదం.

The Book of Nether World 'అమ్‌దువత్' (Amduat) – అథోలోకపు పుస్తకం. ఇది మృతుడి అథోలోకపు ప్రయాణాన్ని వివరిస్తుంది.

1. **The Book of Two Ways -** అథోలోకంలోని కాలువలు, ఏర్లు, ద్వీపాలు, అగ్నులు, సలసలకాగే నీటిని వివరిస్తుంది.

2. **The Book of Gates -** ద్వారపాలకులు ఇద్దరిని, దుశ్చరితులకు విధించబడే శిక్షలు వర్ణించబడినాయి.

3. **The Book of That Which is -** రాత్రి కాలంలోని పన్నెండు గంటలు – పన్నెండు అధ్యాయాలుగా, ఆ సమయంలో జరిగే సంఘటనలను వివరిస్తుంది.

4. **The Book of Apophis -** 'రా' సూర్యుడికి – ఎపొఫిస్ సర్పానికి మధ్య జరిగే యుద్ధాన్ని వర్ణిస్తుంది.

అధోలోక ద్వారాలు (Gates) :

ప్రతి ద్వారంలో మూడు భాగాలుంటాయి.

1) నిప్పులుకక్కే సర్పం – ద్వారానికి ముందు
2) ద్వారం – తలుపు
3) ద్వారపు రక్షకదేవత

సూర్యుని పడవ (Solar Boat) దాదాపు పన్నెండు ద్వారాలను దాటుతుంది తన రాత్రి ప్రయాణంలో.

1) **మొదటి ద్వారం – సియా (Sia) :** అవగాహన (Perception)
అధిదేవుడు – Desert Protector Snake.
'రా' సూర్యుడి రూపం – Atum (అస్తమయ సూర్యుడు).

2) **రెండవ ద్వారం – పాపుల నిర్మూలనం :** అగ్నిసరస్సు
Swallower of Sinners - అధిదేవుడు.

3) **మూడవ ద్వారం – ఆహార కన్య :** జీవ సరస్సు
Stinger Snake
'రా' శ్వాసించే ప్రదేశం.

4) **నాలుగవ ద్వారం :** నాలుగు తెగల మానవుల గణన
ఈజిప్షియన్లు – రెత్ (Reth)
లెవాంటియన్లు – ఆము (Aamu)
లిబియన్లు – థెమెహు (Themehu)
న్యుబియన్లు – నెహెసు (Nehesu)

5) **అయిదవ ద్వారం :** గడువు దేవత (Lady of Duration)
జ్వాలానేత్ర సర్పం.
అపెప్ (అపొఫిస్) ఉండే ప్రదేశం.

6) **ఆరవ ద్వారం :** ఏడు జాకాల్ శిరస్సున్న స్తంభాలు. ఒక్కో స్తంభానికి ఇద్దరేసి పాపులు శిరచ్ఛేదన శిక్ష అమలుకై ఎదురుచూస్తుంటారు.

7) **ఏడవ ద్వారం :** ప్రకాశిని
ఇరవైమంది దేవతలు నాలుగు కొరడాల తాళ్లు పట్టుకుని ఉంటారు.
నాలుగు ఫాల్కన్, నాలుగు మానవ శిరస్సులుంటాయక్కడ.

8) **ఎనిమిదవ ద్వారం :** మహాజ్వాలిని సర్పం.
ఒసిరిస్ శత్రువులను కాల్చి బూడిద చేస్తుంది.

9) **తొమ్మిదవ ద్వారం :** హోరస్, సెత్‌లు డేగ శిరస్సు ఉన్న సింహంపై కూర్చుని స్వారీ చేస్తారు.

10) **పదవ ద్వారం :** ఎపెప్ మహాసర్పం తాళ్లతో బంధించబడి ఉంటుంది.

11) **పదకొండవ ద్వారం :** మార్మిక ద్వారం.
మియుతి మార్జాలం అధిదేవత

12) **పన్నెండవ ద్వారం :** ఐసిస్, నెఫ్‌థిస్‌లిక్కడ సర్పరూపిణులు.
రా–సూర్యుడు ఈ ద్వారాన్ని దాటి పవిత్ర స్కరబ్ (Scarab) గా, ఖెప్రి (Khepri) ఉదయసూర్యుడిగా తూర్పున ప్రత్యక్షమవుతాడు.

'రా' పడవ (Solar Boat) ప్రయాణం:

1) మొదటి గంటలో పశ్చిమదిక్కున (Akhet) అస్తమయ సూర్యుడు అతుమ్ సంధ్యాకాలాన అథోలోకంలోకి వెళ్తాడు.

2) రెండవ గంటలో – వెర్నెస్, ఒసిరిస్ జలాల్లో ప్రవేశం

3) మూడవ గంటలో – వెర్నెస్, ఒసిరిస్ జలాల్లో ప్రయాణం

4) నాలుగవ గంటలో – సెకెర్ ఇసుకమేటపై సర్పనౌక ప్రయాణం

5) అయిదవ గంటలో– ఒసిరిస్ సమాధి దర్శనం – అగ్నిసరస్సు అడుగున ఉన్న సమాధిపై ఐసిస్, నెఫ్‌థిస్‌లు డేగల రూపాల్లో ఎగురుతుంటారు.

6) ఆరవ గంటలో – 'బా', 'రా' దేహంతో ఐక్యమవ్వడం
బా – ఒసిరిస్ దేహంతో ఐక్యమవ్వడం
మెహెన్ సర్పపు మెలికలలో సూర్యుడు 'రా' పునర్జన్మించడం.

7) ఏడవ గంటలో – 'రా' శత్రువులైన ఎపెప్ (ఎపొఫిస్)ను ఐసిస్, సెర్, సెర్‌ఖెత్‌లు బంధించడం. హర్–తెసుఫ్ దేవుడు వీరికి సాయపడతాడు.

8) ఎనిమిదవ గంటలో – సమాధి తలుపు తెరుచుకోగా హోరస్ ఓ మహాసర్పం సాయంతో ఒసిరిస్ శత్రువుల్ని నాశనం చేస్తాడు.

9) తొమ్మిదవ గంటలో – సెకెర్ ఇసుకదిబ్బను వదిలి పడవ మరల జలాల్లో పయనిస్తుంది.

10) పదవ గంటలో – పునరుజ్జీవనం

11) పదకొండవ గంటలో – దేవుడి నేత్రాలు కదుల్తాయి.

12) పన్నెండవ గంటలో – తూర్పున అరుణోదయం.

సూర్యుడితో ప్రయాణం చేసిన మృతుడి ఆత్మా శరీరాలు 'మాత్' ఆవరణకు చేరుకుంటాయి. అక్కడ హృదయ తులాభారం జరిగినాక బరువెక్కువ ఉన్న ఆత్మలను అమ్మిత్–The Devourer మింగివేస్తుంది. అన్ని పరీక్షలు నెగ్గినవారు ఒసిరిస్ రాజ్యంలోకి అడుగుబెడ్తారు.

పరలోక ప్రయాణం
(The Journey to Underworld - Duat)

మృతుడు తన సమాధి నుండి మాత్రమే అథోలోకంలోకి ప్రవేశించగలడు. అనేకమంది దేవతల విగ్రహాలున్న దారిలో నడుస్తూ ఒసిరిస్ ఆవరణలోకి వస్తాడు. శిరచ్ఛేదం చేయబడిన వ్యక్తులకు పునర్జన్మ లేదు. జన్మరాహిత్యాన్ని హిందువులు మోక్షంగా భావించగా మరుజన్మ లేకపోవడానిని ఈజిప్షియన్లు గర్హించేవారు.

అథోలోక ప్రయాణం అనంతరం మృతుడు మాత్ (Maat) ఆవరణలోకి ప్రవేశిస్తాడు. అక్కడ ఉన్న 42 న్యాయాధికారులను ప్రస్తుతిస్తూ తాను ఆ 42 నేరాలకు పాల్పడలేదని వాంగ్మూలమివ్వాలి. ఆతరువాత అతడి హృదయాన్ని త్రాసులో ఒకవేపు ఉంచి మరోవేపు మాత్ ఈక (Maat Feather)ను వేస్తారు. తౌత్ (Thoth) లిఖిస్తుంటాడు. అనుబిస్ పర్యవేక్షిస్తుంటాడు. ఈకకన్నా బరువైన గుండెను అమ్మిత్ రాక్షసి తినివేస్తుంది. అంతటితో మృతుడి కథ సమాప్తమవుతుంది.

శీలవంతుడైన వ్యక్తి ఒసిరిస్ ఆవరణలోకి ప్రవేశపెట్టబడతాడు. అతడు ఆ పవిత్రాత్మలను Sekhet - Aaru లేదా పవిత్ర రెల్లువనాల్లోకి వెళ్లేందుకు అనుమతి నిస్తాడు. అక్కడ వారు Blessed Souls గా దైవరూపులై సుఖంగా జీవిస్తారు.



Book of the Dead of Hunefer sheet 5

Egypt Soul



మృతుడి శరీర భాగాలను నిల్వ ఉంచే కలశాలు



Opening of the mouth ceremony



Weighing the Heart

40. ప్రాచీన ఈజిప్టు ప్రముఖ్యత-విశేషాలు
(Egypt Trivia)

1) పిరమిడ్లు, చిత్రలిపి–వ్రాత, పాపిరస్ కాగితాలు, నల్లటి ఇంకు (సిరా), ఎద్దులు లాగే నాగలి, కొడవలి, నీళ్లు తోడే షడూఫ్ (Shadoof), క్యాలెండర్, నీడ గడియారం, నీటి గడియారం, రక్షకభట వ్యవస్థ, శస్త్రచికిత్స పరికరాలు, తల విగ్గులు, మేకప్ సామాగ్రి, టూత్‌పేస్ట్, మమ్మిఫికేషన్ ఇవన్నిటికీ జన్మస్థానం ఈజిప్టు.

2) ఈజిప్షియన్ అక్షరమాలలో 700 చిత్రలిపి అక్షరాలుండేవి.

3) ఒక మమ్మీకి చుట్టిన బ్యాండేజి ముక్కల పొడవు దాదాపు 1.6 కిలోమీటర్లుండేది.

4) 2000 మంది దేవతలు ఈజిప్టు రక్షకులు

5) పిల్లుల్ని దేవతాస్వరూపాలుగా భావించేవారు.

6) సెనెత్ (Senet) అనే ఆట (పామూ–నిచ్చెన్లు)లా రెండువేల ఏళ్ల క్రితమే ప్రాచుర్యంలో ఉండేది.

7) తొలి కృత్రిమకాలును 900 బి.సి.లో తయారు చేసారు.

8) పేలు (Lice) నుండి తప్పించుకునేందుకు ఈజిప్షియన్లు తరచుగా గుండు చేయించుకునేవారు.

9) ప్రాచీన ఈజిప్టులో రోజువారీ వేతనం ఒక గ్యాలన్ బీరు.

10) పెళ్లి ఉంగరాల సంస్కృతి ఈజిప్టులో మొదలైంది. పెళ్లి ఉంగరాన్ని ఎడమచేతి అనామిక వేలికి పెట్టుకునేవారు.

11) రెండవ పెపి 94 సంవత్సరాల పాటు ఈజిప్టును పాలించాడు.

12) ఫారొ అనే మాటకు అర్థం– గొప్ప ఇల్లు (Great House).

13) ఇండియా నుంచి పంచదార ఈజిప్టుకు చేరేది. తీపి భక్ష్యాలన్నీ తేనెతో చేయబడేవి.

14) ఒక మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, వంద మిలియన్ల జనాభా.

15) అల్–ఖహిరా (Al-Qahirah) (విజేత) కైరో – 973 A.D. లో కాలిఫ్ al-Muizz li Din Allah - దీనిని The Vanquisher of al Muizz - Qahirat al-Muizz - అల్–ఖహీరా అని పిలిచాడు. అదే నేటి కైరో నగరం.

16) ఈజిప్టు ప్రజలు చిత్రలిపులను 'Words of the gods' గా భావించేవారు. (Medju Netjer).

17) Cartouche అనేది ముఖ్య పదాలకు, చుట్టూరా గీసిన బోర్డర్. క్లియొపాత్రా, టాలమీ పదాల్లోని సారూప్యతను గమనించి ఛాంపొల్లియాన్ Rosetta Stone ను డెసిఫర్ చేయడానికి ప్రయత్నించాడు.

18) అరబ్ పదం ముమియా (Mumiya) కు అర్థం బిటుమెన్ లేదా తారు–గోపరసముల మిశ్రమం. దానితో శవాలను భద్రపరచేవారు కనుక వాటికి మమ్మీలనే పేరు వచ్చింది.

19) ఈజిప్టు ప్రజలను ఐగుప్తులనేవారు.

20) ఈజిప్టుకు మరోపేరు తానెతెరు (Ta Neteru). Land of gods - దేవతల నేల, దేవభూమి.

21) Ramesses-II తొంభై ఏళ్లు బదికాడు. అతడి పదమూడవ కుమారుడికి అరవై ఏళ్ల వయసులో సింహాసనం దక్కింది.

22) కైరోలో ఉన్న ఈజిప్టు మ్యూజియంను డిజైన్ చేసినవాడు ఫ్రెంచి ఆర్కిటెక్ట్ Marcel Dourgnon.

23) సక్కారా వద్ద ఉన్న సెరాపియమ్‌ను, నెక్రొపొలిస్ ఆఫ్ సేక్రెడ్ ఎపిస్ బుల్స్‌ను కనుగొన్నది ఆగష్టు మారియెట్టి (Auguste Mariette).

24) తూతన్‌ఖామున్ సమాధిలో దాదాపు 700 వస్తువులు లభించాయి.

25) సేష (Scribe-వ్రాయసకాడు) (Sesha)
సేషత్ (Seshat) – వ్రాయసకత్తె.
సెష్ అంటే చిత్రలేఖనం, సృజన, వ్రాత, చదవడం

26) 21 జులై 1798 నాడు నెపొలియన్ బొనపార్టి మాల్ముక్ సైనికులతో యుద్ధానికి సిద్ధమై తన సైనికులతో – "సైనికులారా! ఈ పిరమిడ్లపై నుంచి నలభై శతాబ్దాలు మీవేపు చూస్తున్నాయి!" అన్నాడు.

27) కైరోకు 15 కిలోమీటర్ల దూరంలోని 'గిజా' (Giza) వద్ద ప్రపంచంలోని ఎత్తైన ఖుఫు పిరమిడ్ ఉన్నది.

28) హెరొడొటస్ కథనం ప్రకారం– హెమియును (Hemiunu) అనే ఆర్కిటెక్ట్ పర్యవేక్షణలో దాదాపు లక్షమంది పనివాళ్లు, 23,00,000 సున్నపురాళ్లను (ఒక్కొక్కటి రెండున్నర టన్నుల బరువు కలది) కొన్ని 80 టన్నుల బరువున్న రాళ్లు. 481 అడుగుల ఎత్తు, ఇరవై ఏళ్లు శ్రమించగా క్రీస్తుపూర్వం 2560లో పూర్తయిన ఈ పిరమిడ్ 3800 సంవత్సరాలు ప్రపంచంలోనే ఎత్తైన కట్టడంగా ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది.

29) ఐసిస్ (Isis) దేవతకు మరోపేరు The Lady of the Pyramids.

30) స్ఫింక్స్ (Sphinx) ఈజిప్షియన్ పదం షెప్స్–అంఖ్ (Sheps-Ankh) సజీవ నేత్రం – Living image; స్ఫింక్స్‌కు Horus of the Horizon అనేది ఇంకోపేరు. అరబ్బులు దీనిని Abu-I-haw = Father of Terror అని పిలిచేవారు. పియర్రి లొటి దీనిని 'సగం పర్వతం–సగం మృగం' అన్నాడు.

31) ఖుఫు పిరమిడ్ దగ్గర్లో 1224 ముక్కలుగా ఉన్న కొయ్యపడవ (46 మీటర్ల పొడవు) – Solar Boat - సూర్యనౌకను కనుగొన్నవాడు కమల్ ఎల్‌మల్లక్.

32) మస్తబా (Mastaba) - House of Eternity - శాశ్వత గృహం.

33) సెరాపిస్ (Serapis) గ్రీకులకు, ఈజిప్షియన్లకు ఉన్న వృషభదేవుడు. ఈజిప్షియన్ వృషభం–Apis (ఎపిస్). మరణించాక పవిత్ర వృషభాన్ని 'Osorapis' అనేవారు.

34) మెంఫిస్ (Memphis) అసలుపేరు Menufer.

35) వంపు పిరమిడ్ (Bent Pyramid) ఉన్న ప్రదేశం దహషుర్ (Dahshur).

36) హాథర్ (Hathor) కు అర్థం Hat-Hor = హోరస్ ఇల్లు.

37) వంద ద్వారాల నగరం థెబెస్ (Hundred gated Thebes) అసలుపేరు Waset (Dominant); Niut - The city ఇంకోపేరు Diospolis Magna: ఇప్పటి పేరు లక్సర్ (Luxor). అరబిక్ al-Uqsur (భవనాలు లేదా కోటలు); లక్సర్‌ను World's greatest open air museum అంటారు.

38) కర్నాక్–(అరబిక్) కోటగ్రామం (Fortified Village).

39) కర్నాక్ దేవాలయంలోని Great Hypostyle Hall - 50000 చదరపు అడుగులు, 134 మహాస్తంభాలు – 16 వరుసలు, 122 స్తంభాల ఎత్తు, పదిమీటర్లు ఒక్కొక్కటి; మిగిలినవి 12–21 మీటర్ల ఎత్తు; వాటి వ్యాసం మూడు మీటర్లు. స్తంభంపైన 70 టన్నుల బరువుండే అడ్డు స్తంభాలు. ఊహాతీతమైన కట్టడం.

40) కర్నాక్ దేవాలయంలోని దేవుడు అమున్–రె (Amun-Re) - Hidden God. 'Amun-Mut-Khansu' తండ్రి–తల్లి–కుమారుడు. దేవతాత్రయం.

41) The Great Hypostyle Hall ను కట్టించినవాడు సెతి (Seti 1290-1279 B.C.)

42) లక్సర్‌కు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉత్తరాన ఉన్నది కర్నాక్ దేవాలయం.

43) ఈజిప్ట పురాతన దేవాలయం – లక్సర్ దేవాలయం మూడవ అమెన్‌హొతెప్ నిర్మించాడు.

44) ఈజిప్ట దేవాలయాలను ధ్వంసం చేసినవాడు అఖెనాతెన్ (Akhenaten 1353-1336 B.C.)

45) 1378 A.D.లో మహమ్మద్ సయిమ్ అల్–దహర్ అక్కడి ప్రజలు స్ఫింక్స్‌కు పూజలు చేస్తుంటే దానిని మాన్పడానికి స్ఫింక్స్ ముక్కు విరగగొట్టాడని అరబ్ చరిత్రకారుడు అల్–మఖ్రిజి వ్రాసినాడు.

46) ప్రభువుల లోయ - Valley of the Kings - The Valley of the Gates of the Kings లో 16-11 Century B.C.లో రాతిని తొలిచిన సమాధులున్నాయి. నైలునదికి పశ్చిమ ఒడ్డున థెబెన్ (Thebes-Luxor) పట్టణానికి అభిముఖంగా, థెబెన్ నెక్రొపొలిస్‌లో రెండు లోయలు తూర్పు లోయలో రాజకుటుంబీకుల సమాధులు, దాదాపు 64 ఇప్పటికి కనుగొన బడినాయి. Tomb of Tutankhamen ఇక్కడే ఉన్నది.

47) 1539–1075 B.C. వరకు మొదట తుత్‌మోసిస్ (Thutmoses) ప్రభువు నుంచి పదకొండవ రామెస్సెస్ (Ramesses-XI) వరకు రాజుల సమాధులు ఈ లోయలో ఉన్నాయి.

48) రాణుల లోయ (The Valley of the Queens) Ta-set-Neferu - The Palace of Beauty లో ఫారోల భార్యల సమాధులున్నాయి.

49) అమర్నాలో Royal Tomb of Akhenaten ఉన్నది.

50) ప్రాచీన ఈజిప్టులో అత్యంత సౌందర్యవతి– నెఫెర్‌తితి రాణి (Nefertiti 1370-1330 B.C.) ఈమె అఖెనాతన్ భార్య.

51) Ushabti - ఉషబ్తి – సేవికాప్రతిమలు. కొయ్యతో చేసిన సేవకుల, సేవికల బొమ్మలు. రాజులకు, రాణులకు మరణానంతర జీవనంలో సేవ చేసేందుకు సమాధులలో ఉంచబడేవి.

52) Dier-El-Medina - శ్రామికుల గ్రామం (పిరమిడ్లను, సమాధులను నిర్మించే పనివాళ్ల గ్రామం.

53) ప్రపంచంలో మొదటి నిరసన (Strike by Workers) జీతాలు చెల్లించనందుకు మూడవ రామెస్సెస్ (Ramesses-III) కాలంలో జరిగింది.

54) సెన్‌మత్ (Senmut) - ఇమ్‌హొతెప్ (Imhotep) తరువాత 1200 సంవత్సరాలకు పుట్టినవాడు. రాణి హాట్‌షెప్‌సత్ (Hatshepsut) దేవాలయాన్ని నిర్మించాడు. Djeser-djeseru-more splendid than splendid గా పేరుపొందిన దేవాలయం అది. అద్భుతాలకే అద్భుతంగా వర్ణించబడింది.

55) రాజుగా వ్యవహరించిన రాణి– She who would be King - Hatshepsut - హాట్‌షెప్‌సత్.

56) Colossi of Memnon - పి.బి. షెల్లీ ఒజిమాండియస్ కవితను గుర్తుకు తెచ్చే ఇరవై మీటర్ల ఎత్తున్న ప్రతిమలు.

57) ఎడ్ఫు దేవాలయం (Edfu)లో దేవుడు– హొరస్. హొరస్ పుట్టుకను తెలిపే Mammisi - Birth House ఈ దేవాలయం ఎడమపక్కన ఉన్నది. 237–57 B.C. మధ్యకాలంలో నిర్మింపబడి ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్న దేవాలయమిది.

58) అస్సువన్–అశ్వన్ పట్టణానికి మరోపేరు– డిబ్ (Dib-కోట, భవనం). Swenett లేదా Syene దేవత పేరుమీదుగా అశ్వన్ అని పిలువబడింది.

59) రెండవ రామ్‌సెస్ నిర్మించిన అబు-సింబెల్ దేవాలయాలు (Twin Temples) అశ్వన్ ఆనకట్టకు 230 కిలోమీటర్ల నైఋతి దిశలో ఉన్నాయి. Kadish యుద్ధంలో గెలిచినందుకు 1264-1244 B.C.లో Ramesses-II, అతడి భార్య Neferteri లకు గుర్తుగా ఈ దేవాలయాల నిర్మాణం జరిగింది. 1968లో వీటిని పక్కనే ఉన్న గుట్టపైన తిరిగి నిర్మించారు.

60) కర్నాక్ ఆఫ్ న్యుబియా - కాలాబాషా దేవాలయం (Kalabasha) మాండులిస్ (Mandulis) దేవుడి నిలయం.

61) అశ్వన్ దిగువ ఆనకట్ట 1902లో కట్టబడింది.

62) అశ్వన్ ఎగువ ఆనకట్ట (High Dam) రష్యాదేశపు సహకారంతో 21 జులై 1970 నాటికి పూర్తి చేయబడింది.

63) అలెగ్జాండ్రియా పట్టణంలో ఒకప్పటి ప్రపంచపు వింతలలో ఒకటి- Pharos - The Greatest Light House ఉండేది.

64) మధ్యధరా సముద్రాన్ని, సూయజ్ (Suez) ఎర్రసముద్రాన్ని కలిపే కృత్రిమ కాలువ సూయజ్ కెనాల్. 161 కిలోమీటర్ల పొడవు. 1859-1869 A.D. పదేళ్లలో నిర్మించి 17 నవంబర్ 1869న అధికారికంగా తెరిచారు. కాలువను దాటడానికి 15 గంటలు పడుతుంది.

65) ఈజిప్ట దేశవాసుల అథోలోకం పేరు Duat-దువత్.

66) మృతుడి హృదయాన్ని మాత్ (Maat) ఈకతో తూస్తారు.

67) పాపులను భక్షించే మృగం పేరు అమ్మిత్ (Ammit-The Devourer).

68) సూర్యుడి పడవను (Solar Boat)ను అడ్డగించే సర్పం ఎపెప్ (Apep) లేదా ఎపొఫిస్ (Apophis).

69) అథోలోకపు న్యాయాధిపతుల సంఖ్య- నలభై రెండు. పాపాలు 42; ఈజిప్టులోని ప్రావిన్సులు: 42.

70) స్ఫింక్స్-మానవ శిరస్సు సింహపు దేహమున్న ఏకైక రూపం. మిగతా దేవతలందరకూ జంతువుల శిరస్సు, మానవ దేహాలుండడాన్ని గమనించవచ్చు.

Female Pharaohs

Cleopatra - VII

Hatshepsut

41. ప్రాచీన ఈజిప్టు - ఇండియా సంబంధాలు
(Ancient Egypt - India Relationships)

1) స్కంధ పురాణం ప్రకారం ఆఫ్రికా పేరు శంఖుద్వీపం.

2) ఇండియన్లు–ఈజిప్షియన్లు ఆవు, వృషభం, సూర్యుడు, సర్పం, నదులను దేవతలుగా కొలుస్తారు.

3) రా, రె, రవి – సూర్యుడి పేర్లు.

4) ఈజిప్షియన్ మమ్మీలను ఇండియా నూలువస్త్రాలతో కప్పేవారని కొందరి అభిప్రాయం.

5) ఇండస్–సరస్వతి కాలంలో సరస్వతీ నది ఎండిపోయినపుడు అక్కడి ప్రజలు కొందరు ఈజిప్టు వేపుకు వెళ్లి స్థిరపడ్డారంటారు.

6) హిక్సాస్ ప్రభువులు ఇక్ష్వాకు వంశీయులా?

7) రాముడు–రామెస్సెస్‌లు పదాల పోలికలు.

8) ఇండస్ లోయలో దొరికిన ఈజిప్షియన్ ముద్రికలు.

9) రెండు లిపుల్లో ఉన్న చిత్రలిపులు – ఈజిప్టు చిత్రలిపి క్రోడీకరింపబడింది. కాని మొహంజదారొ చిత్రలిపి ఇప్పటికీ అర్థం కాలేదు.

10) దక్షిణ భారతదేశంలోని Land of Punt నుంచి ఈజిప్టుకు వ్యాపార సంబంధాలుండేవి. ఇది పాండియన్ రాజ్యంగా, పాతదేవతల రాజ్యంగా ప్రసిద్ధికెక్కింది. ముఖ్యంగా హత్‌షెప్‌సత్ రాణి కాలంలో ఆమె స్వయంగా Land of Punt దర్శించిందని విశ్లేషకుల అభిప్రాయం.

11) బొంబాయి దగ్గరలోని సొపారా (Sopara) రేవు, కేరళలోని క్రాంగనూర్ (ప్రాచీన ముజిరిస్) రేవుల నుంచి నౌకలు ఈజిప్టుకు వెళ్లేవి.

12) రాణి హట్‌షెప్‌సత్, సొలొమాన్ ప్రభువు కాలంలో ఇండియా నౌకలు ఈజిప్టు వెళ్లేవన్న ఆధారాలున్నాయి.

13) తొలి ఇథియోపియన్లు ఇండియా నుంచి వలస వెళ్లారని గ్రీకు రచయిత Eusebius వ్రాసినాడు.

14) నైలునది జన్మస్థానం విక్టోరియా సరస్సులోని Ripon falls గా హిందువులకు తెలుసని లెఫ్టినెంట్ కల్నల్ విల్‌ఫోర్డ్ వ్రాసినాడు.

15) అట్లాంటిస్ నుంచి కాని, ఇండియా నుంచి కాని తొలి నాగరికత ఉద్భవించి ఉంటుంది. మెనెస్–మనువు తొలి ఈజిప్టు ప్రభువు కావడం (నార్మర్ ప్రభువు) రెండు ఈజిప్టులను కలపడంలోని రహస్యం ఇదే కావచ్చు.

16) పా–నుతెర్ (Pa-Nuter) Land of Gods - దైవభూమి అని పిలువబడిన Land of Punt ఇండియా కావచ్చునని కొందరి అభిప్రాయం.

17) ఇండియన్లు–ఇథియోపియన్ల మధ్య ఉన్న పోలికలను ఇప్పుడు పరిశోధకులు విశ్వసిస్తున్నారు.

18) సూర్యవంశం, సూర్యారాధన, సూర్యుని రథం, రవి, అపెప్ సర్పం, ఇవి రెండు దేశాల్లోనూ కథలుగా ఉన్నాయి.

19) ఇండియా నుంచి నూలు, ధనియాలు (Coriander), పట్టు ఈజిప్టుకు పంపబడేవి.

20) ఎగువ ఈజిప్టులోని దేవాలయాల శోభ, నిర్మాణ కౌశల్యం ఇండియన్ శిల్పుల నుంచి వచ్చిందని, దేవాలయ పూజలు, ఆచారాలు ఇండియాలోని దేవాలయ సంస్కృతిని పోలి ఉన్నాయని ప్రాచీన గ్రీకు రచయితలు అభిప్రాయబడినారు.

21) సృష్టి గురించిన అభిప్రాయాలు– అనంత జలాలు, మధ్యలో ద్వీపం (మట్టిదిబ్బ) దానిపై పద్మం, ఆ పద్మంలో బ్రహ్మాండం, దాని నుంచి సృష్టి దాదాపు హిందువుల నమ్మకాలకు దగ్గరగా ఉన్నాయి. ఈజిప్టు నుంచి హిందువులు గ్రహించారా లేక ఇటునుంచి అటు వెళ్లిందా అనేది పరిశోధకులు తేల్చాల్సిన విషయం. నీలికలువ లేదా పద్మం ఈజిప్టు, ఇండియాలలో అత్యంత పూజార్హమైనవి. అలాగే ధేనువు (ఆవు), వృషభం, సింహం, ఆదిశక్తి రూపాలు, రా–రవి, ఆత్మ–పరమాత్మ భావాలు; సృష్టి విశేషాలు ఇవన్నిటిలో చాలా పోలికలు కనిపిస్తాయి.

22) సూర్యుడి సంతానమైన యమ–యమి లానే ఒసిరిస్–ఐసిస్‌లు. మరణానంతరం అథోలోకానికి ప్రభువైన తొలిమానవుడిగా యముడిలో ఒసిరిస్ ఛాయలు కనిపిస్తాయి.

23) కా, బా ఆత్మలలానే ఆత్మల గురించిన అభిప్రాయాలు రెండు మతాల్లోనూ ఉన్నాయి.

24) నరకలోకంలో శిక్షలు (గరుడపురాణం, భాగవతం) – అథోలోకంలో ఈజిప్టు మృతులకు పడే శిక్షలలో సారూప్యతను గమనించవచ్చు.

25) స్వర్గలోకంలో లానే ఆరు (రెల్లు పొలాల్లో) సచ్ఛీలురు హాయిగా కాలం గడుపుతారు.

26) చిత్రగుప్తుడిలా తొత్, పాప–పుణ్యాల చిఠా లిఖిస్తాడు.

27) ఇండియా ప్రాచీనకాలంలో మెలుహా, మెలుక్కా పంత్ దేశంగా పిలువబడింది.

28) గంగా, నైలునదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజల ఆహార వ్యవహారాలు ఇంచుమించుగా ఒకేరకంగా ఉండడం, ఊర్ల పేర్లలోని పోలికలు, నాగదేవతారాధన, ఫాలిక్ (Phallic) శివలింగ పూజలు, గోపూజలు, ఇవన్నీ ఇరుదేశాల సంస్కృతులలోని సారూప్యతను వెల్లడిచేస్తున్నాయి.

29) గోవును కాంతిరేఖగా ఇండియాలో భావించినట్లే ఈజిప్టులోనూ భావించేవారు.

30) అల్–బెర్యూని తన పుస్తకంలో ఇండియా చక్రవర్తి అఫ్రొదియస్ ఈజిప్టులో తొలిసారిగా రథాన్ని ప్రవేశపెట్టాడని వ్రాసినాడు.

31) తమిళదేశంలోని అనేక పదాలు, వాణిజ్య వస్తువుల పేర్లు హీబ్రూ భాషలోకి చేరినాయి. (తుకి–నెమలి; అహలిన్–అఖిల్–కలబంద).

32) సుమేరియన్ భూమి కొలతల పదాలు గోవాలో ఇప్పటికీ వాడుకలో ఉన్నాయి. శతపథ బ్రాహ్మణంలో– గాధి (సుమేరియన్ గుడియా), పరశురాముడు కొంకణ తీరానికి రావడం వర్ణించబడినాయి.

33) హొరస్ తన తల్లి ఐసిస్ తల నరికినట్లుగానే పరశురాముడు తన తల్లి రేణుక తలనరికి మరల బతికింపచేస్తాడు.

34) మిథాని ప్రభువుల పేర్లు– సుతర్ణ, పరతర్ణ, సుక్షత్ర, దశరథ, తవజ లాంటివి హిందువుల పేర్లలా ఉండడం గమనించవచ్చు. వారి సంఖ్యలు, మిత్రా, వరుణ, ఇంద్ర దేవతల ఆరాధనలో పోలికలు కానవస్తాయి.

35) యూదులు ఈజిప్టు నుంచి వలస (Exodus) పోయిన కాలానికి ముందే ఈజిప్టు, ఇండియా మధ్య సంబంధ బాంధవ్యాలు ఉండి ఉంటాయని పరిశోధకుల అంచనా.

36) యయాతి ప్రభువు కుమారుడు మెడెస్ (Medes) రాజ్యస్థాపకుడా? అజమెడె (Aja-Mede) - అజామిళుడా (మేకరూపుడా?)

37) అస్సిరియాన్, అక్కడియాన్, సుమేరియన్ సంస్కృతులలో అక్కడి ప్రజలకు హిందూ ప్రజలకు మధ్య జరిగిన ఇచ్చిపుచ్చుకోవడాలు వ్యాపార సంబంధాలు కావచ్చు, మతపరమైనవి కావచ్చును.

38) జరాతుష్ట్రుడి అవెస్తాకు, హిందువుల వేద సంస్కృతికి ఉన్న సంబంధాలు హిందువులు సింధు నదికి ఆవల తమ సంస్కృతిని వ్యాపింపచేసిన విషయాన్ని తెలియజేస్తున్నాయి.

39) ఎర్ర సముద్రం (Red Sea) పక్కన ఉన్న సొకొత్ర ద్వీపం (Sokotra) సుఖొత్తర ద్వీపంగా అగాధరబైడిస్ వ్రాసినాడు.

40) అలెగ్జాండర్ దండయాత్రలతో అనేక దేశాల మధ్య వాణిజ్య సంబంధాలతో పాటు ధార్మిక విషయాలలోనూ ఒకరి నుంచి ఒకరు నేర్చుకుని ఉంటారు.

41) అప్పటి వరకు ఎడారి ఎండతో, నైలునది వరదలతో సతమతమవుతున్న కెమెటిక్-చీకటి దేశంలోకి ఒక్కసారిగా ఎక్కడినుంచో నాగరికులు వచ్చారు. అత్యంత దుర్లభమైన పిరమిడ్లను కట్టారు. ఎవరీ మెనెస్? మనువు కావచ్చునా?

42) సూర్యారాధన (రా-రవి), గో వృషభ పూజలు, ఆత్మ-పరమాత్మ భావాలు, పునర్జన్మ, అథోలోకంలో శిక్షలు, చిత్రలిపులు ఇవి సింధునదిని దాటి, సముద్రాలను దాటి ఇండియాకు వచ్చాయా లేక ఈజిప్టుకు వెళ్లాయా, లేక రెండుచోట్లా వేర్వేరుగా పరిణామం చెందాయా?

పైన చర్చించినవన్నీ అభిప్రాయాలు మాత్రమే. నిజం నిలకడమీద తేలుతుంది. అంతవరకు మా నాగరికత ముందు అంటే మా నాగరికత ముందు అని వాదించుకుంటాం. పదివేల సంవత్సరాల చరిత్ర మనముందు మౌనంగా నిలబడి ఉంటుంది. మనం తవ్వకాలు జరుపుతూ సత్యశోధనలో నిమగ్నులమౌతాము.

ప్రాచీన ఇండియా (Ancient India)

1) పూర్వ చరిత్రకాలం- నూతన రాతియుగంలో భిరానా నాగరికత (7570-6200 B.C.) గా, మెహర్‌ఘర్ నాగరికత (7000-2500 B.C.) గా చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

2) Bronze Age - సింధులోయ నాగరికత (3300-1300 B.C.), అహర్-బనస్ నాగరికత (3000-1500 B.C.)

3) లోహయుగం (Iron Age) 1200-272 B.C.

వేదిక్ నాగరికత (1500-500 B.C.)లో నలుపు–ఎరుపు రంగుల పాత్రలు (1200-600 B.C.); సామ్రాజ్యాల కాలం (700-300 B.C.); పాండ్యరాజుల కాలం (B.C. 600 - 1600 A.D.).

రెండవ పట్టణీకరణ–

నంద (425–325 B.C.), మౌర్య (321-184 B.C.), అలెగ్జాండర్ దండయాత్ర కాలం.

సంగం కాలం (300 B.C. - 300 A.D.). పల్లవులు (250 B.C. - 800 A.D.), మహామేఘువాహన కాలం (250 B.C.-500 A.D.); శాతవాహనుల కాలం (230 B.C. - 220 A.D.) గా పరిశోధకులు నిర్ణయించారు.

ప్రాచీన ఇండియాకు ఇతర దేశాలకు మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాలను ఈ కాలరేఖ ద్వారా గమనించినపుడు ఈజిప్టు నాగరికత సింధు నాగరికత కన్నా ముందే పరిణామం చెందినదని అనిపిస్తుంది.

అయినా కొత్తకొత్త సిద్ధాంతాలు, అభివృద్ధి చెందిన అన్వేషణా మార్గాలు సైంటిఫిక్‌గా జరిగినపుడు సత్యాన్వేషణ కొంతవరకు ఫలించవచ్చును. ఈ పరిశోధనలన్నీ మానవ పరిణామ దశలు, జిజ్ఞాస, అన్వేషణలను మనకు చూచాయగా తెలియజేస్తాయి.




RA
B-RA-HMA
Khnum
Daksha
Atum
Shiva
Maahes
Narashim
Mut/Ma'at
Maa Durga
Nu
Vishnu


Ancient Egypt - Scribes
Sikha
Gurukul in India for scribes

42. ప్రాచీన ఈజిప్టు - ఇతర దేశాలతో సంబంధాలు
(Foreign Contacts of Ancient Egypt)

- 7500 B.C. – న్యుబియా–బ్తాప్లాయాలోని ప్రాచీన ఈజిప్టు వాసులు మేకలను, గొర్రెలను నైఋతి ఆసియా నుంచి దిగుమతి చేసుకునేవారు.
- 4500–4000 B.C. – బదారియన్ నాగరికతాకాలంలో ఈజిప్టకు సిరియా ఉరుక్‌లకు మధ్య సంబంధాలుండేవి.
- 4400–3100 B.C. – నఖదా, గెర్జె,మాడి నాగరికతా కాలంలో (సిరియా, లెబనాన్ జోర్డాన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, టర్కీ ప్రాంతాలను లెవాంత్ (Levant) అని పిలిచేవారు) లెవాంత్ దేశాలతో వ్యాపార సంబంధాలుండేవి.
- 3100–2575 B.C. – తొలి డినాస్టి కాలం – మెనెస్ (నార్మర్) తన ప్రజలకు కావాల్సిన మట్టి పాత్రలను దక్షిణ కానాన్ (లెవాంత్)లో తయారు చేయించి తన పేరును ముద్రింపచేసాడు.
- 2575–2134 B.C. – ఈజిప్టు వ్యాపారస్తులు న్యుబియా (సూడాన్, ఇథియోపియా), పంత్ (Punt - ఇథియోపియా, ఎరిత్రియా), బిబ్లాస్, ఎబ్లా, సిరియా, ఎగియన్ గ్రీకు ద్వీపాలు, లిబియా దేశాలతో వాణిజ్యాన్ని చేసేవారు.
- 2134–1684 B.C. to 1070 B.C. – మిట్టాని, హిట్టైట్లతో సంబంధాలు
- 1070–343 B.C. – గ్రీకు సైనికులు ఫారొ సైనికులతో కలిసి పోరాడేవారు. న్యుబియా, సైప్రస్‌లతో వాణిజ్య సంబంధాలుండేవి.

అనటోలియా నుంచి తగరం, రాగి లోహాలను (బ్రాంజ్–కంచు) తయారు చేయడానికి దిగుమతి చేసుకునేవారు. ఇతర దేశాలకు ధాన్యం, బంగారం, పాపిరస్, లినెన్, పాత్రలు, వస్తువులు ఎగుమతి చేసేవారు. ఈజిప్టును ఒకప్పుడు Rome's Bread Basket అని పిలిచేవారు. కలప, లోహాలు, విలువైన రాళ్లు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. ఈజిప్టు నుంచి పాపిరస్ లెవాంత్‌లోని బిబ్లాస్‌కు చేరుకుని మెసపొటెమియా ప్రాంతంలో విరివిగా వాడబడేది. బిబ్లాస్ (Byblos) నుంచి Book making, Bible పదాలు వచ్చాయి.

2400 B.C. నాటికే హరప్పా, లొథాల్, మొహెంజదారొ–సింధు లోయ నుంచి (మెలుహా–Meluhha) కలప, Lapis Lzuli లాంటివి ఈజిప్టుకు ఎగుమతి అయ్యేవి.

Egyptian Sky
Goddess
NUT/ MA'AT

Egypt

Nagas in Hindu Temples

Sumerian
Tablets


Sun Solstice and Symbols
Sun Reborn at Galactic centre
Moola- Avatar Point
Holy Cross
Trishul
(Shiva)
and
Serpent
Holy
Pavitram
Liberty
Goddess
Cosmic Egg
Hermes(Greek Myth)
Ankh(Key of Life)


Seshat
Thot
Sekmet
Ptah
Sokar
Hathor
Sobek
Nefertum
Jonsu
Satis
Knum
Neit
Anukis
Uadyet
Nebjet
Faraón
Buey Apis
Imhotep
Nun
Maat
Atón
Aker
Kepri
Horajti
Amon-Ra
Amon
Mut
Atum
Bennu
Hapi
Tefnut
Shu
Bastet
Geb
Nut
Mihos
Apedemak
Osiris
Isis
Neftis
Set
Min
Renenutet
Tueris
Horus
Anubis
Amset
Duamutef
Hapi
Qebehesenuf
Selkis
Sotis
Bes
Ammit
Apofis

43. ఈజిప్టు దేవతలు - ప్రభువులు

(Egypt Gods - Pharaohs)

అఖెనాతన్ (Akhenaten) - 18వ డినాస్టి ఫారొ

అకర్ (Akar) – రెండు స్ఫింక్స్ తలలున్న భూదేవత

అమానెత్ (Amaunet) - అమెన్ భార్య

అమెన్ (Amen) - The hidden one - సృష్టికర్త.

అమెనెమ్‌హత్ (Amenemhat-I) - 12వ డినాస్టి ప్రభువు

అమెన్‌హొతెప్ (Amenhotep-III) - అమెన్–రె అంశన జన్మించినవాడు.

అమెన్‌హొతెప్ (Amenhotep - Son of Hapu) - దైవత్వాన్ని పొందిన ఆర్కిటెక్ట్

అమెన్–కెమాటెఫ్ (Amenkematef) - సర్పరూపుడైన తొలిదేవుడు

అమెన్–మిన్ (Amen-Min) - సంతానోత్పత్తి దేవుడు

అమ్మిత్ (Ammit) - యుద్ధదేవత, రక్షకదేవత

అన్‌డజెతి (Andjety) - బుసిరిస్ దేవుడు

అని (Ani) - అని పాపిరస్ నిర్మాత (Book of the Dead)

అనుబిస్ (Anubis) - జాకాల్ శిరస్సున్న స్మశాన రక్షకదేవుడు

అపిస్ వృషభం (Apis Bull) - పవిత్ర వృషభం (ప్తా చిహ్నం)

అపొఫిస్ (Apophis) - రవి పడవను అడ్డగించే దుష్టసర్పం

అస్తారై (Astarte) - బాబిలొనియన్ దేవత (ఇస్తార్, ఇనాన్నా)

అతెన్ (Aten) - సూర్యచక్రం, రవిబింబం

అతుమ్ (Atum) - పూర్ణదేవుడు; సృష్టికర్త, అస్తమయ సూర్యుడు

బాబి (Babi) - మృతుల పేగులను భక్షించే బబూన్ దేవుడు

బానెబ్ డిజెదెత్ (Banebdjedet) - గొర్రెముఖం దేవుడు

బస్తెత్ (Bastet) - సువాసనా ద్రవ్య కలశం; బస్ దేశపు దేవత

బాతా (Bata) - ఇద్దరు సోదరుల కథలో చిన్నవాడు

బాత్ (Bat) - స్త్రీ భూతం; గోదేవత

బెను (Benu) - సూర్యవిహంగం

బెస్ (Bes) - మరుగుజ్జు దేవుడు; పిల్లల స్త్రీల రక్షకుడు

బెస్‌తెత్ (Bestet) - బెస్ స్త్రీరూపం

క్లియొపాత్రా (Cleopatra-VII) - ఐసిస్ ప్రతిరూపమైన రాణి

జడజలన్ అంఖ్ (Djadja en ankh) - మాంత్రికుడు, పూజారి

జెహుతి (Djehuty) - సైన్యాధ్యక్షుడు (తుత్‌మోసిస్ సైన్యంలో)

జెడి (Djedi) - 3వ డినాస్టి ప్రభువు

సూర్యనేత్రి (Eye of Re) - Eye of Atum

హొరస్ (Horus) - ఒసిరిస్–ఐసిస్‌ల కుమారుడు

హొరస్ కుమారులు (Four sons of Horus) - అవయవ పాత్రల రక్షకదేవతలు

గెబ్ (Geb) - భూదేవుడు

గెన్‌గెన్ (Gengen) - దివ్య బాతు

హాపి (Hapy) - వరద దేవత

హార్పొక్రెటిస్ (Harpocrates) - ఐసిస్–సెరాపిస్‌ల కుమారుడు

హాథర్ (Hathor) - పవిత్ర ధేనురూప దేవత

హత్‌మెహిత్ (Hatmehit) - మత్స్యదేవత

హత్‌షెప్‌సత్ (Hatshepsut) - 18వ డినాస్టి మహారాణి (ఫారొ)

హెకా (Heka) - మంత్రశక్తి (Magic)

హెకెత్ (Heket) - మండూకరూప దాయి

హొర్‌కాథి (Horkathy) - రెండు హృరైజన్ల హొరస్

హొరస్ ఖెంటి ఎన్ ఇర్‌తి (Horus Khentenurty) - అంధ హొరస్

ఇమ్‌హొతెప్ (Imhotep) - సక్కారా పిరమిడ్ ఆర్కిటెక్ట్

ఐసిస్ (Isis) - ఒసిరిస్ భార్య, హొరస్ తల్లి

ఖాఫ్రె (Khaefre) - 4వ డినాస్టి ప్రభువు

నట్ (Nut) - నింగి, గెబ్ భార్య

ఒపెత్ (Opet) - నర్సు, హిప్పోటమస్ రూపిణి

ఒసిరిస్ (Osiris) - ఐసిస్ భర్త

ఒరొబొరస్ (Ouroboros) - శాశ్వతత్వ మహాసర్పం

ప్తా (Ptah) - సృష్టిదేవుడు (మెంఫిస్‌లో)

రామెస్సెస్ (Ramesses-II) - మహావీరుడు

రామెస్సెస్ (Ramesses-III) - ఇరవైవ డినాస్టి ప్రభువు–హత్యకు గురైనాడు

రె (Re, Ra) - రవి, సూర్యుడు

రె హొరాఖ్తి (Re Horakhty) - ఉదయభానుడు

రాంప్‌సినితస్ (Rhampsinitus) - రామెస్సెస్ ప్రభువుల రూపం

రొడొపిస్ (Rhodopis) - ఈజిప్టు సిండరెల్లా

సెఖ్‌మెత్ (Sekhmet) - ఉగ్రరూపిణి

సెరాపిస్ (Serapis) - గ్రీకు–రోమన్ దేవత

సెర్‌కెత్ (Serket) - వృశ్చికదేవత

సెషత్ (Seshat) - వ్రాయసకాళ్ల దేవత

సెత్ (Seth) - ఒసిస్ సోదరుడు, శత్రువు

షు (Shu) - వాతావరణ దేవుడు, పొడిగాలి

సినుహె (Sinuhe) - ఒక కథలోని నాయకుడు

సి ఒసిరి (Si Osiri) - మంత్రగాడు

సొబెక్ (Sobek) - సంతాన్పొత్పత్తి మకరదేవత

సొకార్ (Sokar) - లోహకారుల దేవుడు

సొథిస్ (Sothis) - సిరియస్ నక్షత్రం

తబుబు (Tabubu) - బస్తెత్ పూజారి కుమార్తె

తెఫెన్ (Tefen) - మహావృశ్చికం

తెఫ్‌నట్ (Tefnut) - తడిగాలి

తౌత్ (Thoth) - దేవతల వ్రాయసకాడు

తుతన్‌ఖామెన్ (Tutankhamen) - 18వ డినాస్టి ప్రభువు

తుత్‌మోసిస్ (Thuthmosis-III) - మెగిడ్డో విజేత

ఇద్దరు దేవతలు (Two Ladies) - వడ్జెత్, నెఖ్‌బెత్

విశ్వప్రభువు (Universal Lord) - Re Atum, Horakhty Atum

వడ్జెత్ (Wadjet) - నాగినిదేవత

వెనామున్ (Wenamun) - ఒక కథలో నాయకుడు

వెప్వావెత్ (Wepwawet) - ఎబిడాస్ ప్రభువు

వెరెత్‌హెకావు (Weret Hekau) - మహా మంత్రగాడు

క్లియొపాత్రా (Cleopatra-III) - తండ్రి కీర్తి – Glory of her father అని అర్థం.

ఈజిప్టు శకాలు
(రచయిత అభిప్రాయం)

1) సృష్టి ఆరంభం – పద్మకల్పం
2) షు –వాయుకల్పం
3) రా – సూర్యకల్పం
4) గెబ్ – భూకల్పం
5) ఒసిరిస్ – ఒసిరిస్ కల్పం
6) ఫారో – ప్రభు కల్పం
7) ప్రజా – ప్రజాకల్పం

44. ఈజిప్టు కాలరేఖ
(Timeline)

1) Pre-Dynasty (5300-3100 B.C.) - బదారియన్, నగాదా (అమరషియన్), నగాదా-II (గెర్జియన్) కాలం

2) Early Dynasty (3100-2686 B.C.) - నగాదా-III

ఎ) నార్మర్, ఆహా, డిజెర్, డిజెత్, డెన్, మెరిట్‌నిత్, అనెడ్‌జిబ్, సెమెర్‌ఖెత్, క్వా

బి) హెతప్ సెఖెమ్‌వి, రానెబ్, నినెత్‌జర్, వెనెగ్, సెనెడ్, పెరిబ్‌సెన్, ఖాస్ ఎఖెమ్‌వీ.

3) Old Kingdom (2686-2181 B.C.)

Third Dynasty - నెబ్కా, డిజోసర్, సెఖెమ్‌ఖెత్, ఖాబా, సనఖ్త్, హుని

Fourth Dynasty - స్నెఫ్రు, ఖుఫు, డిజెడెఫ్రె, ఖాఫ్రె, మెక్‌కవురి, సెష్‌సెస్కఫ్

Fifth Dynasty - ఉసర్కఫ్, నెఫెరిరికరి, షెప్‌సెస్‌కరి, రానెఫెరెఫ్, నియిసెర్రి మెన్‌కావుహర్, డిజెడ్‌కరి ఇసెసి, యునస్

Sixth Dynasty - తెతి, ఉసర్‌కరి, పెపి-I, మెరిన్రె, పెపి-II, మెర్నెనె-II, నితొక్రిస్

4) First Intermediate Period (2181-2055 B.C.)

7 - 8 Dynasties - నెఫెర్‌కరి ప్రభువులు (2181–2160 B.C.)

9 - 10 Dynasties - హెరాక్లియొపిస్ మాగ్నా (2160–2025 B.C.)

11వ డినాస్టి – థెబన్ ప్రభువులు (2155–2055 B.C.)

5) Middle Kingdom (2055-1650 B.C.)

11వ డినాస్టి – మెంటుహొతెప్ III, IV, V (2055-1985 B.C.)

12వ డినాస్టి – అమెనెమ్‌హత్ I, సెన్వొస్రెత్ I, అమెనెమ్‌హత్ II, సెన్వొస్రెత్ II, III, అమెనెమ్‌హత్ III, IV, సొబెక్ నొఫ్రు (1985–1773 B.C.)

13వ డినాస్టి – (1773–1650 B.C.) కొద్దికాలపు ప్రభువులు

6) Second Intermediate Period (1650-1550 B.C.)

14వ డినాస్టి – కొద్దికాలపు ప్రభువులు

15వ డినాస్టి – హిక్సాస్ (Hyksos) ఉత్తర ఈజిప్టు

16వ డినాస్టి – థెబన్లు – దక్షిణ ఈజిప్టు

17వ డినాస్టి – థెబన్ ప్రభువులు – సెనాక్‌తెన్రె-I, సెకనెన్రె, కామోస్

7) New Kingdom (1550-1069 B.C.)

18వ డినాస్టి (1550–1295 B.C.) – అహమోస్-I
అమెన్‌హొతెప్-I, తుత్‌మోసిస్-I, II, III
హత్‌షెప్‌సత్, అమెన్‌హొతెప్-II
తుత్‌మోసిస్-IV, అమెన్‌హొతెప్-III,
అమెన్‌హొతెప్ IV (అఖెనాతెన్)
నెఫెర్‌నెఫెరు అతెన్, తుతన్‌ఖామెన్, అయె, హొరెమ్‌హబ్

19వ డినాస్టి (1295–1186 B.C.)
రామెస్సెస్-I, సెతి-I, రామెస్సెస్-II, మిరెన్‌ప్తా,
అమెన్‌మెస్సు, సెతి-II, సిప్తా, తవొస్రెత్

20వ డినాస్టి (1186–1069 B.C.)
సెత్‌నఖ్త్, రామెస్సెస్-III, IV, V, VI, VII
రామెస్సెస్-VIII, IX, X, XI

8) Third Intermediate Period (1069-715 B.C.)

21వ డినాస్టి – స్మెండెస్, అమెన్‌మ్‌నిసు, పసెబఖానుత్ (1069–945 B.C.)
అమెనెమొపి, పెద్ద ఒసొర్కన్, సియమున్, సొసెన్నస్-II

22వ డినాస్టి (945–715 B.C.) - లిబియన్–శశాంక్-I,
ఒసొర్‌కాన్-I, శశాంక్-II, తకెలత్-I, ఒసర్కాన్-II
తకెలత్-II, శశాంక్-III, పిమె, శశాంక్-V, ఒసొర్కాన్-IV

23వ డినాస్టి (818–715 B.C.)

24వ డినాస్టి (724-705 B.C.) - బకెన్‌రెనెఫ్

9) Late Period (715-332 B.C.)

25వ డినాస్టి – (న్యుబియన్) 715–672 B.C.)
పియె, షబకొ, షెబిత్కొ, తహర్కా, తనుతమని

26వ డినాస్టి – Saite (సయెతి) (672–525 B.C.)
నెకావు-I, పసామ్‌తెక్-I, నెకావు-II, పసామ్‌తెక్-II,
వహిబ్రె, అహమోస్-II, పసామ్‌తెక్-III

27వ డినాస్టి (525–404 B.C.) - ప్రథమ పర్షియన్ డినాస్టి
28వ డినాస్టి (404–399 B.C.) - అమిర్‌తయెస్
29వ డినాస్టి (399–380 B.C.) - నెఫారుద్-I, హకర్, నెఫరుద్-II
30వ డినాస్టి (380–343 B.C.) - నెక్తానెబో-I, డిజెధర్, నెక్తానెబో-II
31వ డినాస్టి (343–332 B.C.) - రెండవ పర్షియన్ డినాస్టి

10) Greek - Ptolemaic Period (332-30 B.C.)

మాసిడొనియన్ డిగాస్టె (332–304 B.C.)
గ్రేట్ అలెగ్జాండర్-III, ఫిలిప్ అర్హిదియాస్, అలెగ్జాండర్-IV
టాలమి డినాస్టి – టాలమీ I to X, XI, XII
(304–30 B.C.) క్లియొపాత్రా-VII

మెరిత్‌నిత్ (First Dynasty), Nitokris (6th Dynasty); సొబెక్‌నొఫ్రు (13వ డినాస్టి); హత్‌షెప్‌సత్ (18వ డినాస్టి); తవొస్‌రెత్ (19వ డినాస్టి); క్లియొపాత్రా-VII – ఈ రాణులు ఫారోలుగా వ్యవహరించారు.

హత్య చేయబడిన ఫారో – రామెస్సెస్-III (1155 B.C.)
ఆత్మహత్య చేసుకున్న ఫారో – క్లియొపాత్రా-VII (12 ఆగష్టు 330 B.C.)

Ancient Egypt

2650 BC
The first pyramid, a **step pyramid**, is built

1670 BC
The **Hyksos** people invade and introduce the chariot

1539-1070 BC
This was the time of the '**New Kingdom**'

332 BC
Alexander the Great conquered Egypt and founded **Alexandria**

3100 BC
King Narmer unites Egypt and records it on the **Narmer Palette** (above)

2250 BC
Egyptians introduce **Gods** for all areas of their lives

1648 BC
Nilometers were invented to track the height of the Nile

1070 BC
Egyptians joined **Ra** and **Amun** to make **Amun-Ra**; King of the Gods

330 BC
Queen Cleopatra kills herself. Romans conquer Egypt

Some Gods of Ancient Egypt

Anubis

Thoth

Bastet

Horus

Hathor

www.communication4all.co.uk

Pictures used available from Miles Kelly Clip Art, Dorling Kindersley, and www.istockphoto.com

Bev Evans, 2007

45. ప్రాచీన ఈజిప్టు - ఎప్పటికీ ఒక అద్భుతమే!
(A Wonder that is Egypt)

స్వాగతం! ఓ జీవజలధారా!
విచ్చేయుము వినువీధి నుంచీ!
నీ రాకతో వెలుగుతున్నది నింగి, కంపిస్తున్నది భూ విపంచి!
తెరుచుకున్నవి తూర్పు పశ్చిమ కనుమలు
ఈజిప్టు దేహాన్ని ఆవహిస్తున్నాయి రా–సూర్యుని వెలుగులు!

అనంతంగా విస్తరించిన ఎడారి ఎర్రనేలలో మెలికలు తిరిగిన నీలి మహాసర్పంలా నైలునది, నీలినింగిలో పాలపుంత అది మరో కాంతి నది, మహా సర్పం కుబుసం విడిచి ఉత్తేజితమైనట్లు, వరదలతో పరవళ్లు తొక్కి ఎడారి ఎర్రనేలను నల్లనేలగా, ఆకుపచ్చటి మైదానాల శరీరంగా మార్చే నైలునది, నీలినింగిలో పాలపుంత వెలుగుల్ని ధిక్కరిస్తూ ఉదయాననే తూర్పుదిక్కున ఎర్రటి అగ్నిగోళంలా జన్మించి మధ్యందిన మార్తాండుడై సాయంకాలాన పశ్చిమ కనుమలలో కాంతి తగ్గిన 'రా' రవిబింబమై రాత్రి చీకటిలో అథోలోకాన ప్రయాణించి మరుసటి రోజున మరల జన్మించే కాంతిపుంజము 'రా' మూర్తి కాగా, నైలునదీ జీవజలాలు, 'రా' వెలుగులు కలిసి ఐసిస్–ఒసిరిస్‌లు సెత్–నెఫ్‌థిస్‌లు విహరించే ఓ అద్భుత గృహం ఈజిప్టు గ్రహం (Planet Egypt).

ఆఖరి మంచుయుగం వెనక్కి తగ్గుతున్న కాలం... 'రా' (రవి) వేడికి మంచు కరిగి (10000-8000 B.C.) సముద్రపు నీటిమట్టాలు పెరిగి కొన్నిచోట్ల నదులు ఎండిపోయాయి (సరస్వతి). కొన్నిచోట్ల నేల మునిగి ద్వీపాలు మిగిలాయి (మాల్టా–Malta) ట్యునిషియా, ఇటలీల మధ్య ఉన్న నేల మునిగింది. అప్పటి వరకు ఈడెన్ వనంలా ఉన్న ప్రదేశాన్ని నీరు యూరప్–ఆఫ్రికాలుగా విడదీస్తున్నట్లయ్యింది. అప్పటివరకు కలిసి మెలిసి ఉన్న యూరప్–ఆఫ్రికన్ జీవజాలం విడిపోయాయి. ఉత్తర ఆఫ్రికాలో అప్పటివరకు విస్తృతంగా ఉన్న అరణ్యాలు ఎడారిగా మారాయి. మధ్య ఆఫ్రికా నుంచి మధ్యధరా సముద్రం వరకూ మెలికలు మెలికలుగా ఉన్న ఓ మహాసర్పం–జీవజల ప్రవాహం ఇతెరు నైలునదిగా రూపొందింది.

8000-5000 B.C. అనేకచోట్ల నుంచి ప్రజలు ఈజిప్టు వేపు వలస వెళ్లారు? వారిని అటుగా నడిపించిన శక్తి ఏది? ఆసియా నుంచా లేక అట్లాంటిస్

నుంచా? నైలునదీ వరదలతో జీవితాన్ని పంచుకోవాలని ఎందుకనుకున్నారు వాళ్లు? జంతువులు ఎటు వలసవెళ్తే వాటిని వేటాడుతూ వెళ్లే వేటగాళ్ల కుటుంబాలా అవి? అత్యంత శక్తివంతమైన వరదనీటికి అడ్డుకట్టలు వేసి వ్యవసాయం చేసి స్థిరనివాసులు కావాలన్న భావం వారికెలా కలిగింది. ఇది మానవ పరిణామ దశలో భాగమా? దుఃఖంలో పుట్టి సుఖానికై పడే వెంపర్లాట ఫలితమా!

తొలికాలం దేవతల శకం– 1) Realm of Shu ('షు' శకం), 2) Realm of the Spirit Ra (రవి శకం), 3) Realm of the Earth Geb (భూ శకం). ఆ తరువాత వచ్చింది ఒసిరిస్ (Osiris) శకం. ఒసిరిస్ దైవమానవుడు. అన్ని తెగలను ఐక్యపరచి వరదలను అడ్డుకోవడం, వ్యవసాయం, పిండి, రొట్టె, ద్రాక్షసారా, బార్లీ బీరు, లోహాల తయారి, వ్రాత, లిపి, కళలు నేర్పినవాడు. ఒసిరిస్ తూర్పుదేశాలకు వెళ్తూ అధికారాన్ని తన భార్యకు అప్పగించినాడు. ఇతర దేశాలకు జ్ఞాన భిక్షనిచ్చి ఒసిరిస్ రాగానే అతడి సోదరుడు 'సెత్' మాయోపాయంతో అతడిని బంధించి, నైలునదిలో వేసినాడు ఓ పెట్టెలో పెట్టి. అతడికోసం వెదుకుతూ అబిడాస్ రాచభవనంలోని ఓ మహాస్తంభంలో ఆ పెట్టెను కనుగొని దానిని తెరచి తన భర్త శవాన్ని చూసి ఐసిస్ దుఃఖిస్తున్నపుడు ఆమె కన్నీరు తగిలి ఒసిరిస్ సజీవుడైనాడు. వారిద్దరికీ జన్మించినవాడు హొరస్. (సెత్ ఒసిరిస్ శరీరాన్ని ముక్కలు చేసి ఈజిప్టు అంతా పడవేసాడని, ఆ భాగాలను ఐసిస్, ఆమె సోదరి నెఫ్థిస్‌లు వెదకితెచ్చి తిరిగి ఒసిరిస్ దేహంగా కలుపగా ఐసిస్ మంత్రశక్తుల వలన ఒసిరిస్ పునరుజ్జీవుడై నాడని ఐతిహ్యం). The Great Sphinx (2550 B.C.) మానవ శిరస్సు సింహపు దేహమున్నది ఒసిరిస్ రూపమా లేక ఖాఫ్రె ఫారో (Khafre) రూపమా అనేది ఇంకా తేలలేదు. ఒక్క స్ఫింక్స్ తప్ప మిగిలిన దేవతల రూపాలన్నీ జంతుశిరస్సు, మానవ దేహాల కలయికలే!

దేవతల నుంచి సంపూర్ణ మానవులు ఆవిర్భవించిన సంధికాలమా అది? స్ఫింక్స్‌కు దక్షిణాన ఉన్నది ఎగువ ఈజిప్టు. ఉత్తరాన దిగువ ఈజిప్టు. దిగువ ఈజిప్టులో ఇరవైరెండు పట్టణాలు వృద్ధి చెందాయి. స్ఫింక్స్ ఉన్న ప్రదేశం సింహపురి (Leopolis) దానిని గ్రీకులు హిలియొపొలిస్ సూర్యపురిగా పిలిచినారు.

షు (పొడిగాలి), టెఫ్‌నెట్ (తడిగాలి) ఇద్దరి రూపాలు స్ఫింక్స్‌లా మానవ శిరస్సున్న సింహ రూపాలు. (హిందువుల నరసింహరూపంలో సింహం శిరస్సు,

మానవ శరీరం ఉండడం గమనార్హం). దేవతలకు దేవాలయాలు నిర్మించడం, పూజలు జరపడం ప్రారంభమైన కాలమిది. సయిస్ (Sais), మెటిలిస్ (Metelis), బుటో (Buto - The city of Osiris), తరువాత బుసిరిస్, అబిదాస్ పట్టణాలు ప్రాముఖ్యంలోకి వచ్చాయి. న్యుబియా నుంచి బంగారం, సిరియా నుంచి కలప దేవాలయాల నిర్మాణానికి దిగుమతి అయ్యేది. దిగువ ఈజిప్టులో లియొపొలిస్ అధికారకేంద్రమైంది. డేగ (ఫాల్కన్) ఒసిరిస్ చిహ్నం.

ఎగువ ఈజిప్టులో కాప్టాస్, ఎడ్ఫు, ఎలిఫాంటైన్, తెంతిరి, ఒస్సిరిన్‌కొం, ఒంబస్ పట్టణాలు వేర్వేరు రాజుల అధీనంలో ఉండేవి. వారి గుర్తు మొసలి (Crocodile) సెత్‌కు చిహ్నం. ఎగువ, దిగువ ఈజిప్టుల మధ్య యుద్ధరంగం మధ్య ఈజిప్టు. హాథర్ (Hathor) రక్షకదేవత. అస్సియుత్, అబిడాస్, ఉన్, కుశాయి, కాసా మధ్య ఈజిప్టులో ముఖ్యపట్టణాలు. మిన్ దేవుడు ప్రధాన దేవత కాగా బుటో–నుబ్త్ మధ్య జరిగిన యుద్ధంలో 'బుటో' గెలవడం హొరస్ 'సెత్'పై సాధించిన విజయమైనది. మిన్–హొరస్‌ల దేవతలు కలిసిపోయారు.

ఎగువ దిగువ ఈజిప్టుల మధ్య యుద్ధంలో అనేక ప్రాచీన పట్టణాలు మెండెస్ (Mendes), మెటెలిస్ (Metelis)లు నేలమట్టమయినాయి. ఎగువ ఈజిప్టు ప్రభువైన నార్మర్ (Narmer) – మెనెస్ దిగువ ఈజిప్టును పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకుని ఐక్య ఈజిప్టుకు మూలపురుషుడైనాడు. కొత్త మనువు మెనెస్ శకం ప్రారంభమయ్యింది (3100 B.C.).

3100-2850 B.C. -

తొలి డినాస్టి – రాజధాని అబిదాస్ (Abydos)

నార్మర్ (మెనెస్) – ఐక్య ఈజిప్టు (Narmer, Menes)

ఆహా – మెంఫిస్ నగర నిర్మాత (Aha)

ఉయాద్జి (Uadji), ఉడిము (Udimu) - హెబ్–షెన్ పండుగ

2850 - 2770 B.C.

రెండవ డినాస్టి – రాజధాని మెంఫిస్ (Memphis)

హొతెప్ సెక్‌మిమ్‌నీ, రానెబ్, సినెట్‌జర్, పెరిబెసెన్, ఖాసెకెముయి

ఆ కాలపు ముఖ్య ప్రభువులు

2770 - 2620 B.C.

మూడవ డినాస్టి – రాజధాని మెంఫిస్

జోసర్ (Djoser) - పిరమిడ్ల నిర్మాణం (Sakkara)

సెఖ్‌మెత్, సనాఖ్తె, ఖాబా

2620 - 2500 B.C.

నాలుగవ డినాస్టి – రాజధాని మెంఫిస్ (2620–2500)

స్నెఫ్రు – తొలి నునుపు పిరమిడ్

ఖుఫు – గ్రేట్ పిరమిడ్

రెడ్‌జెడెఫ్, ఖాఫ్రె, మెన్‌కపురి, షెప్‌సెస్‌కాఫ్

అయిదవ డినాస్టి – రాజధాని మెంఫిస్ (2500–2350)

ఉసెర్‌కాఫ్, సహురి, నెసెరిర్‌కరె, న్యుసెర్రి, ఉనాస్

సహురి – బుబాస్టిస్ కాలువ (Suej Canal)

ఉనాస్ – పిరమిడ్ల లోపల వర్ణచిత్రాలు, అలంకరణ

ఆరవ డినాస్టి – రాజధాని మెంఫిస్ (2350–2180)

తెతి, పెపి-I, పెపి-II

ఏడవ, ఎనిమిదవ డినాస్టిలు – అరాచక స్థితి (2180–2160)

తొమ్మిదవ, పదవ డినాస్టిలు – అస్తవ్యస్థ స్థితి (2160–2120)

పదకొండవ డినాస్టి – రాజధాని థెబెస్ (2120–1990)

సెహెర్తాని–అంతెఫ్, మెనుహొతెప్-I, II, III

పన్నెండవ డినాస్టి – రాజధాని థెబెస్ (1990–1785)

అమెనెమ్‌హెత్-I

సెసొస్ట్రిస్-I, అమెనెమ్‌హెత్-II, III

సెసొస్ట్రిస్-III)

పదమూడవ డినాస్టి – రాజధాని థెబెస్ (1785–1745)

సెఖెమ్రె (Sekhmre)

పధ్నాలుగవ డినాస్టి – రాజధాని థెబెస్ – హిక్సాస్ (Hyksos)
హిక్సాస్–గొర్రెలకాపర్లు (1745–1700)

పదిహేనవ డినాస్టి – రాజధాని అవారిస్ (Avaris) 1700–1622)
సలయిటిస్, అపొహిస్, హిక్సాస్ ప్రభువులు

పదహారవ డినాస్టి – రాజధాని థెబెస్ (1622–1580)
కామోస్–హిక్సాస్‌లపై విజయం, అహమోస్–రాజ్య విస్తరణ

పదిహేడవ డినాస్టి – హిక్సాస్‌ల ఆఖరి పాలన

పద్దెనిమిదవ డినాస్టి – రాజధానులు థెబెస్, అఖెతాతెన్
అహమోస్ (1580–1558)
అమెనొఫిస్ (1558–1530)
తుత్‌మోసిస్-I, II, హత్‌షెత్‌సత్, తుత్‌మోసిస్-III
అమెనొఫిస్-II, III, అమెనొఫిస్-IV (అఖెనాతెన్), నెఫెర్‌తితి
తుతన్‌ఖామెన్ (1354–1345)
హొరెమ్‌హెబ్ (1340–1314)

పంధొమ్మిదవ డినాస్టి – రాజధానులు టానిస్ (Tanis), థెబెస్ (Thebes)
రామెస్సెస్-I (1314–1312)
సెతి-I (1312–1298)
రామెస్సెస్-II (1298–1235)
మెర్నెప్తా (1235–1224)
సెతి-II (1224–1200)

ఇరవైయ్యవ డినాస్టి – రాజధాని థెబెస్
సెత్నెఖ్త్, రామెస్సెస్-III, రామెస్సెస్-XI
అమెన్‌హొతెప్ హెరిహర్

ఇరవై ఒకటవ డినాస్టి – రాజధానులు టానిస్, థెబెస్
మెండెస్, పియాంఖి, పినుద్‌జెమ్-I, మెంఖెపెర్రె లిబియన్లు

ఇరవై రెండవ డినాస్టి (950-757 B.C.) – రాజధాని బుబాస్తిస్.
శశాంక్-I, ఒసొర్కాన్-I

ఇరవై మూడవ డినాస్టి – రాజధాని బుబాస్తిస్ (757–730)
ఒసొర్కాన్-III

ఇరవై నాలుగవ డినాస్టి – రాజధాని సయిస్ (Sais)
తెప్‌నఖ్త్ (730–720)
బొక్కొరిస్ (720–716)

ఇరవై అయిదవ డినాస్టి – రాజధాని నపాతా, థెబెస్ (ఇథియోపియన్)
పియాంకి, శబక, శబతక, తహర్క, తనుతమోన్ (716–666 B.C.)

ఇరవై ఆరవ డినాస్టి (సయెతి) – రాజధాని సయిస్ (Sais)
నెఖో, పసామ్‌థిక్-I, నెఖో-II, పసామ్‌థిక్-II, III (666-525 B.C.

ఇరవై ఏడవ డినాస్టి (పర్షియన్) రాజధానులు సయిస్, మెంఫిస్
కాంబినిస్, దరియస్-I, క్జెర్‌క్జెస్, దరియస్-II (524-404 B.C.)

ఇరవై ఎనిమిదవ డినాస్టి – రాజధాని సయిస్
అమిర్‌తయుస్ (404-398 B.C.)

ఇరవై తొమ్మిదవ డినాస్టి – రాజధాని మెండెస్ (398–378)
నెఫ్రెతిస్-I, అఖోరిస్

ముప్పయివ డినాస్టి – రాజధానులు సెబెన్నైతస్, మెంఫిస్ (378–311)
నెక్తానెబో-II, కబ్బాస్, దరియస్-III, అలెగ్జాండర్ (333–323)

టాలమీ డినాస్టి (Ptolemaic) రాజధాని అలెగ్జాండ్రియా (323–32)
టాలమి-I, II, III, IV, XII, XIII, జూలియస్ సీజర్
క్లియోపాత్రా-VII (44-32 B.C.)
నీరో (54-68 A.D.) ట్రాజన్ (98-117 A.D.) హాడ్రియన్ (117-190)

లియొపొలిస్ (హిలియొపొలిస్) విశ్వ ప్రకారం–

అవ్యక్త అస్తవ్యస్త (Chaos) స్థితిలో పరమాత్మ (Absolute Spirit Ra) ఆదిమ జలాలందు నివసించి ఆ మహా నిశ్శబ్దంలో తన మరోరూపాన్ని ఆవాహన చేసినాడు. 'నావేపు రా' – ఆ రూపం అమొన్ (Amon). 'రా' (రవి), వెలుగు, విశ్వ మనస్సాక్షి విశ్వాత్మ అయిన అమొన్‌ను స్వాగతించాయి. ఆ పిలుపుతో సృష్టి

శక్తులైన షు (చలనశీలతగల పొడిగాలి), టెఫ్‌నెత్ (జడత్వపు తడిగాలి) ఆవిర్భవించాయి. ఆ రెండింటి నుంచి నేల (గెబ్–Geb), నింగి (నట్–Nut Sky) ఏర్పడినాయి.

ఈ భూశక్తులు, విశ్వశక్తుల కలయికతో ఒసిరిస్ (జీవశక్తి–Seed and tree of life, Water అదే జీవజలమై) ను స్వీకరించే ఐసిస్ (Isis) - ప్రేమశక్తి, ప్రత్యుత్పత్తి శక్తులు ఏర్పడినాయి. ఆ తరువాత విధ్వంసశక్తులైన సెత్ (Seth), నెఫ్‌థిస్ (Nephthys)లు జనించి నిరంతరం జీవశక్తులతో ఘర్షణ పడుతూ మృత్యువును రూపొందించినాయి. ఈ ఘర్షణ నిరంతర పోరాటమైనది.

హెర్మోపొలిస్ (Hermopolis) విశ్వ ప్రకారం–

అవ్యక్తస్థితి నుంచి బ్రహ్మాండం ఓ పద్మము నందు జనించగా రవి (Sun-Ra) లేదా ప్తా (Ptah) దాని నుండి వెలువడి సృష్టి రచన చేసినాడు. రా (రవి) కన్నీళ్ల నుంచి మానవులు పుట్టారు. అతడి నోటినుంచి పదాలు (Word) దివ్యులై జనించాయి.

హిలియోపొలిస్‌లో నవదేవతలు (Ennead)-

అమెన్‌రా, షు–టెఫ్‌నెట్ (వాయువు, అగ్ని); గెబ్–నట్ (నేల–నింగి), ఒసిరిస్ (జీవశక్తి–అథోలోకపు ప్రభువు), ఐసిస్–ప్రేమశక్తి; సెత్ (విధ్వంసశక్తి), నెఫ్‌థిస్ (ఐసిస్‌కు సహాయశక్తి)లు.

హెర్మోపొలిటన్ దేవతలు– అష్టదేవతలు

నెడు–నెనెత్ (క్షుద్రలోకపు దేవతలు)
నున్–నునెత్ (ఆదిమజల దేవతలు)
హెహ్–హెహాత్ (అనంత ఆకాశ దేవతలు)
కెక్–కెకెత్ (చీకటిలోకపు దేవతలు)

షు, రా, గెబ్‌ల శాంతి–ప్రేమ శకాలతో దేవతలశకం నుంచి మానవశకం ప్రారంభమయ్యింది. తన సోదరుడు సెత్ చేతిలో ముక్కలైన ఒసిరిస్ దేహం ఆకుపచ్చని నల్లనేలలోకి ఎడారి ఎర్రనేల విస్తరించిన తీరున నలభైరెండు పరగణాలైన ఈజిప్టుకు ప్రతీకగా నిలిచింది. ప్రేమరూపిణిగా, విశ్వాసానికి, అనంతప్రేమకు గుర్తుగా ఐసిస్ రూపం చిరస్థాయిగా నిలిచింది.

బహుదేవతారాధన నుంచి ఏకేశ్వరోపాసనకు (1372–1354 B.C.) మళ్లిన ఒకేఒక గొప్ప సందర్భం అఖెనాతెన్ (Akhenaten) కాలం. ఒకే దేవుడు. అతడే అటెన్ (అతెన్). ప్రత్యక్ష నారాయణుడు. ఆ మాట ఎవరికీ నచ్చలేదు. అఖెనాతెన్ మరణించిన వెంటనే ఈజిప్టు మరల పూజారుల బహుదేవతారాధనలోకి తరలిపోయింది. అమెన్–రా ప్రధానదేవత, మాత్ (క్రమపద్ధతి-Order) న్యాయ నిర్మాత, ఒసిరియన్ మరణానంతర జీవన ప్రయాణాలు తరువాత ఆవిర్భవించిన మతాల్లో ముఖ్య ఘట్టాలైనాయి.

పవిత్ర లిపి–హిరొగ్లైఫులు (దేవుని వాక్కు–దైవ పదాలు) మూడువేల ఏళ్లపాటు పాపిరస్‌లపై, గోడలపై చిత్రాలుగా, శిల్పాలుగా, ఈజిప్టు సంస్కృతిని భద్రపరచాయి. (రామాయణంలో సంస్కృతభాష దివ్యుల, రాజుల, ప్రజా భాషగా ఉన్నట్లు) హీరొగ్లైఫులు – చిత్రలిపులు–హెరాటిక్, డెమొటిక్, కాప్టిక్ లిపులుగా వ్రాయబడినాయి.

శిలాశాసనం, కుడ్యచిత్రాల కన్నా పుస్తకం గొప్పది, సులువైనది, ప్రతులుగా చేయడానికి వీలైనది. శ్రమ తక్కువతో కూడుకున్నది. పుస్తకం ఒక దేవాలయం కన్నా ఎక్కువ ప్రయోజనకరమైనది. ఇహలోకం అథోలోకపు ప్రయాణంలో తీసుకు వెళ్లేందుకు అనువైనది. ఇది ఆనాటి లేఖకుల అభిప్రాయం.

పిరమిడ్ టెక్ట్స్‌లు, కాఫిన్ టెక్ట్స్‌లు, మెడిసిన్ టెక్ట్స్‌లు, అనేక కథలు (Story of Sinuhe) క్రీస్తుపూర్వం 2000 సంవత్సరాల నాటికే పాపిరస్‌లపై వ్రాయబడినాయి. ఆ కాలం కవిత్వానికి స్వర్ణయుగం.

“మన ఇరువురి హృదయాలదీ ఒకే స్పందన,
నీ సౌందర్యం నన్ను కట్టిపడేసినదందునా!
నీ పిలుపు నడిపిస్తున్నది నా హృదయానిని,
అతెన్ దేవుడు నన్ను నీ వాడిని చేయనీ!”

Chester Beatty Papyrus లో ఇంకో యుగళగీతం ఉన్నది–

“ఓ అందాలరాశీ! నీకెవ్వరు రాగలరు పోటీ?
కొత్త సంవత్సరానికి వెలుగునిచ్చే నక్షత్రరాశీ!
అన్ని రంగులను కలబోసిన కాంతికిరణాలతోటి
కలిసి ప్రవహించినావు నా ఎద తలుపులు మూసి

ఉన్మత్తురాలినవుతున్నానేమో నన్నది నా భయం!
నిన్ను తలచుకుంటున్నపుడు నా మాట వినదు నా హృదయం
నా రొమ్మును పెకలించుకుని నీకై పోతుంది ప్రతిక్షణం
నన్నెందుకలా కదిలించి పెడుతున్నది నీ వీక్షణం"

వ్యవసాయం, వ్యాపారం అభివృద్ధి చెందడంతో వాణిజ్యకేంద్రాలు, రేవు పట్టణాలు ఎక్కువయ్యాయి. దేవాలయం, రాజభవనం, రాచకుటుంబీకుల భవనాలు, వాటి చుట్టుపక్కల సామాన్యుల ఇళ్లు ఒక నలుచదరపు కోటలో ఉండేవి. సామాన్యుల ఇళ్లు కేవలం ఒక అంతస్తు ఉన్న నిర్మాణాలుగా ఉండేవి. అత్రిచి, మెండెస్, బుటో, సయిస్, తానిస్, బుబాస్టిస్‌లు ఆ కాలంలో ముఖ్య పట్టణాలు. మెంఫిస్, థెబెస్, టెల్–ఎల్–అమర్నా ఆయా కాలపు రాజులను బట్టి ప్రాభవాన్ని కలిగి ఉండేవి. తుత్‌మోసిస్-III (1505-1450 B.C.) నాటికి ఈజిప్టు జనాభా ఏడు మిలియన్లు. దాదాపు 20,000 పల్లెలు, పట్టణాలుండేవి. థెబెస్ దగ్గరలో ఉన్న Deir el Medina అవశేషాలు మనకు ఆనాటి గ్రామ లేదా పట్టణ నిర్మాణ విధానాన్ని తెలియజేస్తున్నాయి. పనివాళ్లకు నిర్దిష్టమైన పనిగంటలు, సెలవులు, వేతనాలు ఉండేవి. బీరు, చిక్కుళ్లు, వస్త్రాలు, చెప్పులు, సువాసన నూనెలు – వీటిరూపంలో కాని, రాగి నాణేల రూపంలో కాని వేతనాలు చెల్లింపబడేవి.

ఎద్దు, పంది, జింక మాంసాలు, పక్షులు, ఉల్లిపాయలు, బీన్సు, చిక్కుళ్లు, ఖర్జూరాలు, అత్తిపళ్లు, ఏప్రికాట్‌లు, దానిమ్మకాయలు, కరబ్‌లు ఆహారంగా ఉండేవి. స్వీట్లు తేనెతో చేయబడేవి. పాలు, నీరు, ద్రాక్షసారా, బీరు పానీయాలు.

సింహాసనం లేదా యజమాని కూర్చునే కుర్చీ, మేజాబల్ల, కుర్చీలు, మడత కుర్చీలు, పాత్రలు ఉంచే బల్లలు, మంచాలు, నగలు, విలువైన వస్తువులు, వస్త్రాలు దాచుకునే భోషాణాలు, పెట్టెలు గృహసామాగ్రిగా ఉండేవి.

తలలు నున్నగా గొరిగి పైన విగ్గులు పెట్టుకునేవారు. మగవాళ్లు మోకాళ్ల వరకు వచ్చే వస్త్రాల్ని, ఆడవాళ్లు పాదాల వరకు వచ్చే వస్త్రాల్ని ధరించేవారు. పిల్లలు దాదాపు నగ్నంగా ఉండేవాళ్లు. అతిథి మర్యాదల్ని పాటించేవాళ్లు. వివాహం, ఏకపత్నిత్వం పాటించబడేవి. రాజులకు మాత్రమే బహు భార్యాత్వం, అంతఃపుర జనం ఉండేవారు. తల్లిని ఐసిస్ దేవతగా, గృహదేవతగా భావించేవారు.

తల్లిదండ్రులను గౌరవించడం అతిముఖ్యమైన విషయం. భార్యను గౌరవించు, ప్రేమించు అని చిన్నప్పట్నించే బోధించేవారు.

శీతాకాలం గడచినాక సిరియస్ నక్షత్రం ఆదిశక్తి ఆకాశాన కనిపించేది. ఉత్తరపుగాలి ఉధృతంగా వీచగానే ఐసిస్ కన్నుల నుంచి రాలిన కన్నీటిచుక్క పడి నైలునది పొంగి వరదగా పధ్నాలుగు రోజులపాటు ఎర్రనేలను నల్లమట్టితో కప్పి శాంతించేది. ఆగష్టు నాటికి అంతా జలమయమే! పల్లెలు, పట్టణాలు నదీజలాల మధ్య ద్వీపాల్లా కానవచ్చేవి. వ్యవసాయపు పనులు మొదలయ్యేవి.

ఋతువులు ఈజిప్టులో మూడు–
అఖెత్ (జూన్ 15 – అక్టోబరు 15) – వరదకాలం
పెరెత్ (అక్టోబరు 15 – ఫిబ్రవరి 15) – పంటకాలం
షెము (ఫిబ్రవరి 15 – జూన్ 15) – కోతకాలం

న్యుబియా (బంగారం), లెబనాన్ (కలప), పంత్ (ఇండియా) (మిర్, సుగంధద్రవ్యాలు) నుంచి దిగుమతి అయ్యేవి. అనేక రకాల నౌకలు 2620 B.C. నాటికే తెలిసిన ప్రపంచాన్ని చుట్టి వస్తూండేవి. 15 నుంచి 50 మీటర్ల పొడవున్న నౌకలు పెద్దపెద్ద తెరచాపలతో నలభై వరకు ఒక నావికాదళంగా ప్రయాణించేవి.

ప్రి డినాస్టిక్ కాలంలో దిగువ ఈజిప్టుకు బుటొ, ఎగువ ఈజిప్టుకు 'నెఖెన్'లు రాజధానులుగా ఉండేవి. ఈజిప్టు ఏకీకరణ తరువాత మెంఫిస్, థెబెస్, ఎబిడాస్, ఎవారిస్, ఎఖెతాతెన్, సయిస్, అలెగ్జాండ్రియా, 969 A.D.లో Al-qahira - కైరోలు ప్రాభవాన్ని సంతరించుకున్నాయి.

ఈజిప్టును 'పిరమిడ్ల ప్రపంచం'గా అభివర్ణించేవారు. మస్తాబాల నుంచి పిరమిడ్ల వరకు, రాజుల, రాణుల లోయలు మృతులకు శాశ్వత నివాసాలుగా నిలిచాయి. 3000 B.C. నాటికే మొదలైన ఈ సమాధుల నిర్మాణం 2500 B.C. నాటికి గిజా వద్ద అత్యున్నత స్థితికి చేరుకున్నది.

మెన్‌వురి పిరమిడ్ – 66 మీటర్ల ఎత్తు × 108 మీ. పొడవు
ఖాఫ్రె పిరమిడ్ – 136½ × 210½ మీటర్లు
ఖుఫు పిరమిడ్ – 146 × 233 మీటర్లు

స్ఫింక్స్ (The Terrible one) - 21 × 73½ మీటర్లు.
సొలార్ బోట్ (Solar Boat) - ఖుఫు కాలం నాటిది
46 మీటర్ల పొడవు, మధ్యలో ఆరుమీటర్ల వెడల్పు

పరలోక ప్రయాణం (Journey in the After world)–

"చూడు! మృత్యువనేది చిరకాలపు వ్యాధి నుంచి విముక్తి కలగడం. గదిలో ఒంటరిగా గడిపి గడిపి బయటకు వెళ్లడం; ఈరోజు మృత్యువు నాకు మిర్ (Myrrh) పరిమళంలా కానవస్తున్నది. చక్కటి పడవలో, చల్లనిగాలిలో, నెమ్మదిగా కదుల్తున్న తెరచాప క్రింద హాయిగా ప్రయాణం..."

మృతుడి ప్రయాణానికి అన్నీ సిద్ధమయ్యాయి.

మమ్మీని సమాధిలో ఉంచడం–

1) జీవగృహంలో మమ్మిఫికేషన్
2) మంత్రోచ్చారణల మధ్య నూలువస్త్రాల పీలికలు చుట్టడం
తాయెత్తులు, ముఖానికి మాస్కులు తొడగడం
3) పడవలో ప్రయాణం
4) అబిడాస్‌కు ఊరేగింపు
5) నెక్రోపొలిస్ వద్ద తీరానికి చేర్చడం
6) మెట్లపై ప్రయాణం – సమాధి ద్వారం దగ్గరకు
7) నోరు, కన్నులను తెరవడం (Opening of mouth)
8) సమాధిలో ప్రవేశం
9) వివిధ వస్తువుల్ని ఉంచడం
10) ఆభరణాల్ని, నిధుల్ని ఉంచడం
11) అందరూ బయటకు వచ్చాక సమాధిని మూసివేయడం.

పరలోక ప్రయాణం–

1) ప్రాణశక్తి (Ka), ఆత్మశక్తి (Ba) వేరుచేయడం
2) అనుబిస్ వెంటరాగా ప్రయాణం
3) ఐసిస్ రక్షణ
4) పశ్చిమాన అథోలోకపు ద్వారాన్ని దాటడం

5) రాత్రి గ్యాలరీలో సెత్ రాజ్యంలో ప్రయాణం నీటిలో
6) బబూన్ల దాడి
7) ఒసిరిస్ శత్రువుల దాడి
8) ఎపెప్ (ఎపొఫిస్) మహాసర్పపు దాడి
9) ఏడు ద్వారాలు
10) పది గోపురాలు
11) న్యాయభవనపు మెట్లు ఎక్కడం
12) ఒసిరిస్ ముందు తీర్పు. అనుబిస్ హృదయాన్ని మాత్ ఈకతో తూస్తాడు. తౌత్ పాపపుణ్యాల లెక్కలు వ్రాస్తాడు. అమ్మిత్ చూస్తూ ఉంటుంది.
13) సచ్ఛీలుడు పద్మసరోవరంలో పునీతుడౌతాడు
14) యాలు (యారు) పొలాల్లో సుఖజీవనం గడుపుతాడు
15) జీవాత్మ (Ka) పరమాత్మ (Ba)లో లీనమవుతుంది.

ఆనాటి ఈజిప్టు ప్రజల ఆలోచనా విధానాన్ని సంక్షిప్తంగా తెలుసుకున్నాక నైలునది వెంబడే విలసిల్లిన నాగరికతా విశేషాలను ఇప్పటికీ మిగిలి ఉన్న మహాశిథిలాలు, సమాధులలో, పిరమిడ్లలో చూస్తూ ఆనాటి వైభవాన్ని ఊహించవచ్చు.

1) నాసర్ సరస్సు వద్ద – అశ్వన్ ఆనకట్ట దగ్గర వేరే ప్రదేశంలోకి మార్చబడిన 14 న్యుబియన్ దేవాలయాలు.
2) అబుసింబల్–31 మీటర్ల ఎత్తున్న నాలుగు శిలావిగ్రహాలు
   రామెస్సెస్-II ఫారో నిర్మాణాలు
3) కలాబ్షా (Kalabshah) - కర్నాక్ ఆఫ్ న్యుబియా
4) ఫిలె (Philae) - ఐసిస్ (Pearl of Egypt) దేవాలయం
5) అశ్వన్ (Aswan) – పురాతన సియనె (Syene) పట్టణం
6) కొమ్ ఒంబొ (Kom Ombo) - సొబెక్–హరొ ఎరిస్‌లు దేవతలు
7) ఎడ్ఫు (Edfu) - హోరస్ దేవాలయం (ఇప్పటికీ చెక్కుచెదరనిది)
8) ఎస్నా (Esna) - ఖ్నుమ్ దేవాలయం; ఒకప్పటి వాణిజ్యకేంద్రం
9) ఎల్‌కాబ్ (Elkab) - నెఖెబెత్ దేవాలయం (రాబందురూప దేవత)

10) లక్సర్ (Luxor - Thebes) ప్రాచీన థెబెస్ నగరం.

11) కర్నాక్ (Karnak) - కర్నాక్ దేవాలయం

12) దెందెరా (Dendera) - తెంతెరా, హాథర్ దేవాలయం

13) అబిడాస్ (Abydos) - ఒసిరిస్ దేవాలయం

14) తెల్ ఎల్ అమర్నా (Amarna) - అఖెనాతెన్ దేవాలయం

15) బెని హసన్ (Beni Hasan) - నెక్రోపొలిస్

16) మేదుమ్ (Maydum) - False Pyramid

17) దాహషుర్ (Dahashur) - Rhomboid Pyramid

18) మెంఫిస్ (Memphis) - మెనెస్ దేవాలయం

19) సక్కారా (Sakkara) - స్టెప్ పిరమిడ్

20) గిజా (Giza) - స్ఫింక్స్, పిరమిడ్లు, సొలార్‌బోట్

21) రొజెట్టా (Rosetta) - రొజెట్టా స్టోన్

22) అలెగ్జాండ్రియా (Alexandria) - లైట్‌హవుస్

1. నాసర్ సరస్సు – మానవ నిర్మిత మహాసరస్సులలో ఒకటైన నాసర్ సరస్సులో 83% భాగం ఈజిప్టులో 17% భాగం సూడాన్‌లో (న్యుబియన్ సరస్సు) ఉన్నది. 479 కిలోమీటర్ల పొడవు, 16 కిలోమీటర్ల వెడల్పున్న ఈ సరస్సు అశ్వన్ ఆనకట్ట నిర్మాణ ఫలితంగా ఏర్పడింది. ఈజిప్టు విప్లవం (1952) సారధులలో ఒకడైన గమల్ అబ్దెల్ నాసర్ పేరుమీదుగా నిర్మించబడిన ఈ ప్రాజెక్టు – అశ్వన్ ఆనకట్ట, నాసర్ సరస్సులను – ప్రెసిడెంట్ అన్వర్ సాదత్ 1971లో ప్రారంభించినాడు.

2. అబుసింబెల్ (Abu Simbel) : 2600 జనాభా, ఈజిప్టులోని అశ్వన్ ఆనకట్టకు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. రెండవ రామెస్సెస్ కట్టించిన దేవాలయాలకు ప్రసిద్ధి. సూడాన్ సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరం. ఎండాకాలం 104^0F ఉష్ణోగ్రత, చలికాలం 50^0F (40^0C - 10^0C). నాసర్ (న్యుబియా) సరస్సు వలన దేవాలయాలు, ఊరు ఎత్తైన ప్రాంతాలకు తరలించబడినాయి.

రెండవ రామెస్సెస్ (Ramesses the great) 1265 B.C. లో ఓ గొప్ప దేవాలయాన్ని అబుసింబెల్‌లో కట్టించాడు. ఇరవై ఏళ్లు పట్టింది ఈ దేవాలయ నిర్మాణానికి; అమున్, రా–హొరాఖ్తె, ప్తాలు దేవుళ్లు. రామెస్సెస్ తనను దేవుడిగా రూపొందించుకున్నదిక్కడే. చాలా అందమైన దేవాలయంగా పేరుగాంచి, 66 అడుగుల నాలుగు విగ్రహాలు ద్వారం దగ్గర ఉన్నాయి.

3) కలాబ్షా (Kalabshah) : అశ్వన్‌కు దక్షిణాన 50 కిలోమీటర్ల దూరంలో నైలునదికి పడమటి ఒడ్డున న్యుబియన్ మండులిస్ సూర్యుడి (Mandulis) దేవాలయం కలాబ్షా దేవాలయం రెండవ అమెన్‌హొతెప్ దేవాలయపు స్థానంలో ఆగష్టస్ కాలంలో ప్రస్తుత దేవాలయం నిర్మించబడింది. తరువాత కొంతకాలం చర్చిగా, అశ్వన్ ఆనకట్ట నిర్మాణపు సమయంలో ఎత్తైన ప్రదేశానికి తరలించబడింది.

4) ఫిలె (Philae) : అశ్వన్ దిగువ ఆనకట్ట ప్రాంతంలోని చిన్న ద్వీపం (అగిల్ కియా ద్వీపం)లోకి ఫిలె దేవాలయాలు మార్చబడినవి. ఒసిరిస్ భాగాలలో ఒక భాగాన్ని ఖననం చేసిన ప్రాంతంగా ఇది ప్రాచీన ఈజిప్షియన్లకు పవిత్రస్థలం. నెక్తానెబో (380-362 B.C.)లో నిర్మించిన ఐసిస్ దేవాలయం కూడా ఇక్కడ ఉన్నది. రెండు పెద్ద సింహ విగ్రహాలు, వాటివెనుక 43 అడుగుల ఒబెలిస్క్ శిలా స్తంభాలున్నాయి. ట్రాజన్ కియోస్క్, మమ్మిసి-Mammisi (Birth House) ఇక్కడ చూడదగిన ఇతర కట్టడాలు.

5) అశ్వన్ (Aswan) : దక్షిణ ఈజిప్టులో అతిముఖ్యమైన పట్టణం. పదహారు లక్షల జనాభా. అస్సువన్ (Assuan) పట్టణాన్ని న్యుబియన్లు దిబ్ (Dib) కోట, భవనం అని పిలిచేవారు.

ఒకప్పటి Swenett - Syene - Assuan-Aswan గా రూపాంతరం చెందిన ఈ పట్టణం ఒకప్పుడు స్వెనెత్ (Sweneth) దేవతకు చెందినది. గ్రీకులు ఈ దేవతను Elileithyia గా, రోమన్లు లూసినాగా ప్రసవదేవత (The opener - Goddess of child birth) గా ఆరాధించేవారు. ప్రారంభం, వ్యాపారం, సంతకు ఈజిప్ట పదం స్వెనెత్‌గా ధ్వనించేది.

అశ్వన్ ఆనకట్టలో దిగువ ఆనకట్ట 1902లో, ఎగువ ఆనకట్ట (1960–1970ల మధ్య) కట్టబడినాయి.

6) కొమ్ ఒంబొ (Kom-ombo) : దీని ప్రాచీన నామం నుబ్ట్ (Nubt - City of Gold) ను బెత్, నుబిత్ ఇతర పేర్లు. అశ్వన్ పట్టణానికి 50 కిలోమీటర్ల ఉత్తరాన ఉన్నది. రెండవ శతాబ్దపు కొమ్-ఒంబొ దేవాలయం.

మకర శిరస్సున్న సొబెక్ (Sobek) దేవుడికి మూడవ తుత్మోసిస్ ఈ దేవాలయాన్ని కట్టించినాడు. క్లియొపాత్రా రూపాన్ని, శస్త్రచికిత్సకు వాడే పనిముట్లను, టాలమి ప్రభువు సొబెక్-హాథర్ల ముందు నిలబడిన దృశ్యాన్ని ఈ దేవాలయపు గోడలపై చెక్కినారు.

7) ఎడ్ఫు (Edfu) : నైలునది పడమటి ఒడ్డున, ఎస్నా-అశ్వన్ల మధ్య ఉన్న పట్టణం. అరవై వేల జనాభా. టాలమిక్ ప్రభువులు కట్టించిన హొరస్ (Horus) దేవాలయం ఇక్కడ ఉన్నది. బాల సూర్యుని ప్రయాణం గోడలపై చెక్కి ఉన్నది. ఇప్పటికీ చెక్కుచెదరని దేవాలయం ఇది.

8) ఎస్నా (Esna) : నైలునది పశ్చిమ తీరాన లక్సర్కు 55 కిలోమీటర్లు దక్షిణంగా ఉన్న పట్టణం. దీని మరోపేరు లాటొపొలిస్ (Latopolis). నైలునదిలో ఉండే పెర్చ్ చేపకు (Lates Niloticus) గుర్తుగా ఇక్కడ దేవాలయం కట్టబడింది. నియత్ దేవతకు చిహ్నం ఈ చేప.

ఎస్నా దేవాలయపు ప్రధాన దేవుడు ఖ్నుమ్ (Khnum) మెన్హిత్, నెబెతుయి భార్యలు. కుమారుడు హెకా.

ఇక్కడ ఎస్నా దేవాలయం, సంత (మార్కెట్) ప్రధాన ఆకర్షణలు.

9) ఎల్ కాబ్ (El Kab) : లక్సర్కు 80 కిలోమీటర్ల దూరంలో నైలునది తూర్పు తీరాన ఉన్న పట్టణం ఎల్ కాబ్-నెఖెబ్ (Nekheb). ఇక్కడ నెఖెబెత్ (Nekhebet) దేవత శ్వేతరాబందు (White Vulture) రూపంలో ఉంటుంది.

10) లక్సర్ (Luxor) : ఎగువ ఈజిప్టులో ప్రధాన పట్టణం. 13,28,429 జనాభా. ప్రపంచంలోని అతి ప్రాచీన నగరాలలో ఒకటి.

ప్రాచీన వసెత్ (Waset), నత్ (Nut) అవి, గ్రీకులు థెబెస్ (Thebes), డయొస్పొలిస్ (Diospolis) గా పిలిచేవారు. అత్యంత రమణీయమైన శిల్పసంపదతో, భవనాలతో Luxor - The World's Greatest Open-Air Museum గా పిలువబడుతున్నది.

ఈ అద్భుత నగరానికి ఎదురుగా నైలునదికి ఆవలి ఒడ్డున పడమటి Necropolis లో రాజుల, రాణుల లోయలో అనేక సమాధులున్నాయి.

లక్సర్ (అరబిక్) పదానికి అర్థం – కోటలు, దుర్గాలు (Casteles) al-uqsur - భవనాలు, Castrum (Latin) - Camp.

అమున్ (Amun, Amun - Ra) ప్రధాన దేవుడు. Waset (taJpt) - దేవాలయం, రాజదండమున్న పట్టణం.

థెబెస్ - The City of Hundred Gates. Lunu Shemaa - దక్షిణ హీలియొపొలిస్. niwt-నత్–పట్టణం, దక్షిణ పట్టణం. పదకొండవ డినాస్టి (2000 B.C.) లో మొంటుహొతెప్-II కాలంలో ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

బాబిలోనియన్లు, మితాని, హిట్టైట్లు, కాననైట్లు, ఫొనిషియన్లు, మినొవన్లు ఈ నగరంలో స్థానిక ప్రజలతో కలిసిమెలిసి ఉండేవారు.

తుతన్‌ఖామెన్ చనిపోయాక అతడి భార్య అంఖెసెనమున్‌ను వివాహం చేసుకునేందుకు ఓ హిట్టైట్ రాకుమారుడు వచ్చాడని కథనం.

అమున్–మత్–ఖొన్సు ఇక్కడి త్రిమూర్తులు (తండ్రి–తల్లి–కుమారుడు).

అస్సురబనిపాల్ థెబెస్ నగరాన్ని ఆక్రమించుకుని మొదటి సాంటిక్ Psantik-I) ను పాలకుడిగా నియమించాడు.

లక్సర్‌లో చూడవలసిన విశేషాలు–

నైలు నదికి పశ్చిమాన– 1) రాజుల లోయ, 2) రాణుల లోయ, 3) మెడినెత్ హబు (మూడవ రామెస్సెస్ దేవాలయం), 4) రామెస్సుయం – రెండవ రామెస్సెస్ దేవాలయం, 5) దిర్–ఎల్–మెదినా (Deir-el-Medina) పనివాళ్ల గ్రామం, 6) ప్రభువుల సమాధులు (Valley of the Kings), 7) దిర్–ఎల్–బహరి (Deir-el-Bahari) - హత్‌షెప్‌సత్ సమాధి దేవాలయం (Mortuary temple of Hatshepsut), 8) మల్కతా (Malkata - Amenophis-III భవనం), 9) మహావిగ్రహాలు– Colossi of Memnon - ఎమెనొఫిస్-III స్మారక దేవాలయం, 10) అల్–అసాసిఫ్ సిమెట్రి.

నైలునది తూర్పు తీరాన– 1) లక్సర్ దేవాలయం, 2) కర్నాక్ దేవాలయం, 3) లక్సర్ మ్యూజియం, 4) మమ్మిఫికేషన్ మ్యూజియం

11) కర్నాక్ (Karnak) : కోట గ్రామం – Fortified Village. క్రీస్తుపూర్వం 2000 నుంచి 30 వరకు నిర్మాణం, మరమ్మత్తులు, పునర్నిర్మాణాలు జరిగిన దేవాలయం. లక్సర్‌కు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్నది.

దీనిలో Great Hypostyle Hall – అమున్–రె నివాసస్థానం ఓ అద్భుత కట్టడం. 50,000 చదరపుటడుగులు, 134 మహాస్తంభాలు, 16 వరుసల్లో, పదిమీటర్ల ఎత్తుగలవి. వాటిపై 70 టన్నుల బరువున్న దూలాలు. చూసి తీరాల్సిన దేవాలయమిది. ఒక్కో స్తంభం వ్యాసం మూడు మీటర్లు.

మానవ ముఖాల స్ఫింక్స్‌ల రహదారి, అమున్–రె సరస్సు, దేవాలయ గోపురం, గొర్రె శిరస్సుల స్ఫింక్స్‌ల దారి, రెండవ రామెస్సెస్ విగ్రహం, తుత్‌మోసిస్ శిలాస్తంభం, ఖెఫ్రి శిల – ఇవన్నీ కర్నాక్‌లో చూడదగిన విశేషాలు.

12) దెందెరా (Dendera) : నైలునది పక్కన ఉన్న ఒయాసిస్సు వద్ద ఏర్పడిన పట్టణం దెందెరా (తెంతెరా). మొదటి పెపి (Pepi-I 2250 B.C.) కాలంలో నిర్మించిన ఈ ప్రదేశంలో హాథర్ దేవాలయం, మామిసిస్ (Temple of Isis Birth), పవిత్ర కోనేరు, ట్రాజాన్ గేట్ (98-117 A.D.) ఉన్నాయి. ఇక్కడ హాథర్ దేవాలయంలో పైకప్పుకు ఉన్న Dendera Zodiacలో వృషభ తులారాశులు చిత్రించబడి ఉన్నాయి. Dendera Light - ఎడిసన్ బల్బు లాంటిదని కొందరు వాదించినారు. ఇది djed pillar - స్తంభంపై తామరపువ్వుకు చిహ్నంగా ఈజిప్టాలజిస్టులు పేర్కొన్నారు.

13) అబిడాస్ (Abydos) : ఈజిప్టులోని ప్రాచీన నగరాలలో ఒకటి. అబ్డు (Abdu) లేదా అబిడాస్ పట్టణంలో రాజుల వంశానుక్రమణికలు మొదటి సెతి (Seti-I) దేవాలయంలో చెక్కబడి ఉన్నాయి (Cartouche లలో) మెనెస్ నుంచి సెతె తండ్రి మొదటి రామెస్సెస్ వరకూ.

జెబెల్–ఎల్–అరక్ కత్తి (చంద్రశిల)పై చెక్కిన చిత్రాలు ఎబిడాస్–హిరాకన్ పొలిస్‌ల మధ్య జరిగిన ఘర్షణను తెలియజేస్తాయి.

తొలి ప్రభువులైన నార్మర్ (Narmer-Menes) తదదితరుల సమాధులున్న ప్రదేశం Abydos లో ఐసిస్–ఒసిరిస్‌లు పూజలందుకున్నారు.

14) అమర్నా (Amarna) : పద్ధెనిమిదవ డినాస్టి కాలంలో అఖెనాతెన్ ఫారొ (1346–1332 B.C.) నిర్మించిన పట్టణం అమర్నా. దీని మరోపేరు అఖెతాతెన్ – Horizon of the Aten. కైరోకు 312 కిలోమీటర్లు దక్షిణాన, లక్సర్‌కు 400 కిలోమీటర్లు ఉత్తరాన ఉన్నది అబిడాస్ పట్టణం.

15) బెని హసన్ (Beni Hasan) : మధ్య ఈజిప్టులో అస్యుత్–మెంఫిస్ పట్టణాలకు మధ్యలో ఉన్నది బెన్‌హసన్ పట్టణం. మిన్యా (Minya) నగరానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్నది. పాకెత్ (Pakhet) యుద్ధదేవత నిలయం. ఇక్కడి Necropolis లో 39 సమాధులున్నాయి.

16) మేదుమ్ (Maydum, Meidum) : కైరోకు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పట్టణంలో ఉన్న పిరమిడ్‌ను False Pyramid అంటారు. అయిదంతస్తుల పర్వతంగా Al-Maqrizi దీనిని వర్ణించినారు. ఈజిప్టులో First straight sided pyramid ఇది. స్టెప్ పిరమిడ్‌గా కట్టి సున్నపురాళ్లతో నునుపుగా చేసినారు. ఇప్పుడు 65 మీటర్లు (తొలుత 90 మీటర్లు) ఎత్తున్న పిరమిడ్‌లో కొంతభాగం కూలిపోయింది.

17) దహషర్ (Dahashur) : కైరోకు 40 కిలోమీటర్లు దక్షిణాన 2613–2589 B.C. కాలంలో నిర్మించబడిన ప్రాచీన సమాధులున్న ప్రాంతం దహషుర్ (Dahashur, Dashur). వంపు పిరమిడ్ (Bent Pyramid) ఇక్కడ ఉన్నది. దీనిని స్నెఫెరు (Sneferu) కట్టించినాడు. రెండవది Red Pyramid.

18) మెంఫిస్ (Memphis) : దిగువ ఈజిప్టులోని తొలి పరగణా (Nome). మెనెస్ (నార్మర్) ప్రభువు నిర్మించిన నగరం. ప్రాచీన ఈజిప్టు (కెమెత్, కుమత్) రాజధాని. Mouth of Nile Delta వద్ద ఉన్న ముఖ్యనగరం మెంఫిస్. అత్యంత రద్దీగా ఉండే ముఖ్య రేవుపట్టణం. దీని 'పెరు–నెఫెర్', ప్తా (Ptah) నిలయం మెంఫిస్, Hut-ka-Ptah ప్తా ఆత్మ నివాసగృహం. దీని నుంచే అయికాప్తా – ఐగుప్తా – ఈజిప్టు పదం వచ్చిందని పరిశోధకుల అభిప్రాయం.

మెంఫిస్ ప్రాచీన ఈజిప్టు నామం – ఇనెబు–హెడ్జె తెల్లటి గోడలు (Inebu-Hedj); Djed-Sut (Everlasting places), Ankh-Tawy (Life of the two lands) ఇతర పేర్లు.

1550 B.C. ప్రాంతంలో దీనిని mn-nfr మెన్‌నెఫెర్ (Men-Nefer), మెంఫి, గ్రీకుల కాలంలో మెంఫిస్‌గా పిలిచారు.

గ్రీకుల పురాణాలలో మెంఫిస్ తండ్రి నైలస్. జ్యూస్–ఇవొల కుమారుడైన ఇపాఫస్ (Epaphus) మెంఫిస్ భర్త.

బైబిల్‌లో మెంఫిస్‌ను మోఫ్ లేదా నోఫ్ అని పిలిచారు.

కైరోకు 20 కిలోమీటర్లు దక్షిణాన, నైలునది పశ్చిమ తీరాన ఉన్నది మెంఫిస్. ఎగువ దిగువ ఈజిప్టులకు సరిహద్దు పట్టణం. క్రీస్తుపూర్వం 2250 నాటికి 30,000 జనాభా ఉన్న ఈ పట్టణంలో ఇప్పుడు టూరిస్టులు మాత్రమే కానవస్తారు. ప్తా–సెఖ్‌మెత్–నెఫెర్‌తెమ్‌లు అధిష్ఠాన దేవతలు. రెండవ రామెస్సెస్ విగ్రహం, హాథర్ గుడి, ప్తా దేవాలయంలోని అలబాస్టర్ స్ఫింక్స్ చూడవలసినవి.

19) సక్కారా (Sakkara, Saqqara) : మెంఫిస్ నగర స్మశానం (Necropolis of Memphis) సక్కారా. ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన Step Pyramid of Djoser ఉన్నది. కైరోకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న సక్కారాలో తొలితరపు మస్తాబా (Mastaba) సమాధులనేకం ఉన్నాయి. సెరాపియం (Serapeum), Philosophers Circle మరియు ఇతర సమాధులే కాక అనుబిస్ దేవాలయం వద్ద ఎనిమిది మిలియన్ల జంతువుల మమ్మీలు తవ్వకాలలో బయటపడినాయి. (ఎక్కువ భాగం కుక్కల మమ్మీలు).

20) గిజా (Giza) : ఈజిప్టులో మూడవ పెద్ద పట్టణం. కైరోకు మూడు మైళ్ల దూరంలో మెంఫిస్‌కు ఉత్తరాన ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్నది గిజా. ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటై, ఇప్పటికీ నిలిచి ఉన్న అద్భుతం గిజా పిరమిడ్ (ఖుఫు పిరమిడ్). 481 అడుగుల ఎత్తు, 2.3 మిలియన్‌ల గ్రానైట్, సున్నపురాళ్లు (ఆరు మిలియన్ టన్నుల బరువున్నవి)తో నిర్మించబడిన మహాకట్టడం. ఇరవై ఏళ్లపాటు నలభై వేలమంది శ్రామికులు (?లక్ష) శ్రమించి 2560 B.C.లో పూర్తి చేసినారు. నాలుగవ డినాస్టి ఫారొ ఖుఫు (Khufu-Cheops) దీని నిర్మాత.

గిజా పిరమిడ్ కాంప్లెక్స్‌లో - The Great Pyramid of Giza, The Pyramid of Khafre, The Pyramid of Menkaure, The Sphinx of Giza

(ఖుఫు, ఖాఫ్రె, మెన్‌కవురి పిరమిడ్లు, గిజా స్ఫింక్స్) ఉన్నాయి. ఇవన్నీ నాలుగవ డినాస్టిలో (2613-2494 B.C.) నిర్మాణమైనవే.

21) రొజెట్టా (Rosetta) : రొజెట్టా లేక రషిద్ (Rashid) అనేది నైలు డెల్టాలో ఒక రేవు పట్టణం. అలెగ్జాండ్రియాకు 40 మైళ్లు (65 కిలోమీటర్ల) దూరాన ఉన్నది. రొజెట్టా శిల (Rosetta Stone) 1799లో ఇక్కడ దొరికింది ఫ్రెంచి సైనికులకు. రషిద్-రసిద్ అనగా మార్గదర్శకుడు (Guide). రొజెట్టి-Rosette అంటే - చిన్ని గులాబి (Little Rose). Rosetta Stone - ఎపిఫేనిస్‌కు చెందిన అయిదవ టాలమి ప్రభువు క్రీస్తుపూర్వం 196లో మెంఫిస్ నగరంలో చెక్కించిన శిలాశాసనం. ప్రాచీన హిరొగ్లైఫిక్ చిత్రలిపిలో, డెమొటిక్-వ్యవహారిక భాషలో, ప్రాచీన గ్రీకుభాషలోమూడు లిపుల్లో చెక్కి ఉన్న ఈ శిలా శాసనం అందరూ మరచిపోయిన ఈజిప్టు చిత్రలిపుల్ని క్రోడీకరించడానికి తోడ్పడింది.

దీనిని కనుగొన్నవాడు ఫ్రెంచి ఆఫీసర్ - పియర్రి ఫ్రాంకాయిస్ బొఖార్డ్ (Pierre Francois Bouchard). ఫ్రెంచి సైన్యం ఇంగ్లీషువాళ్ల చేతుల్లో 1801లో ఓడిపోయినపుడు ఇది బ్రిటిష్‌వాళ్ల హస్తగతమైంది. 1822లో జీన్ ఫ్రాంకాయిస్ ఛాంపొలియాన్ (Jean - Francois Champollion) దీనిని క్రోడీకరించగలిగినాడు.

22) అలెగ్జాండ్రియా (Alexandria) : ఈజిప్టులో రెండవ పెద్ద పట్టణం అలెగ్జాండ్రియా. జనాభా యాభై రెండు లక్షలకు పైగానే. Bride of Mediterrenean గా పేరు. 331 B.C. లో అలెగ్జాండర్ దీనిని నిర్మించాడు. ఒకప్పుడు ఇక్కడ Rhacotis అనే ఈజిప్షియన్ గ్రామం ఉండేది. ఇక్కడే ప్రపంచపు ఏడు వింతలలో ఒకటైన Light House (Pharos) of Alexandria ఉండేది. ప్రపంచంలోనే అతి పెద్దదైన లైబ్రరీ, మధ్యయుగం (Medieval Ages) నాటి ఏడు వింతల్లో ఒకటైన Catacombs of Kom el Shoqafa కూడా అలెగ్జాండ్రియాలో ఉండేవి.

Lake-nasser

Abu-Simbel

Aswan

Kom Ombo

Colossi of Memnon

Luxor Temple

Pylons and Obelisk Luxor temple

Valley of the Kings

Luxor

Luxor, Tal der Könige

Tombe Taousertet Sethnakht

Ramses-II in Luxor Temple

Karnak Temple

Dendera

Abydos



Temple of Horus at Edfu

Memphis

Sakkara

GIZA PYRAMIDS

ALEXANDRIA

LIGHT HOUSE AT ALEXANDRIA

ప్రశ్నలు - సమాధానాలు
(Questions and Answers)

1) ప్తా ఆత్మగృహమని ఏ దేశాన్ని పిలుస్తారు.

జ. ఈజిప్టు (The House of Ka of Ptah)

2) దేవతలకు ముందే ఉన్న ఆదిమజలాల పేరేమిటి ?

జ. నన్ (Nun). ఈ జలాల్లో సృష్టికర్త ఉన్నాడు.

3) అస్తవ్యస్థ స్థితి కలిగిన విధ్వంసకశక్తి రూపం ఏమిటి?

జ. ఎపెప్ (Apep or Apophis) మహాసర్పం.

4) ఆదిమ జలాల్లోంచి బయటకు కనిపించినదేమిటి?

మట్టిదిబ్బ (Mound)

5) ఆ మట్టిదిబ్బపై బ్రహ్మాండాన్ని పెట్టినదెవరు?

బెనుపక్షి లేదా, ఫాల్కన్ లేదా హెరాన్ రూపంలో సృష్టికర్త.

6) ఆ మట్టిదిబ్బ నాభిలోని పద్మంలో ఎవరున్నారు?

సృష్టికర్త (శిశువుగా)

7) సృష్టికర్తకున్న శక్తులేమిటి?

హు (వాక్కు), సియా (అవగాహన); హెకా (మంత్రశక్తి)

8) సక్రమస్థితి (Order out of disorder) పేరు?

మాత్ (పక్షిరూప దేవత) Matt (సూర్యుని కుమార్తె)

9) సృష్టికర్త బాహ్యరూపం ఎవరు?

రా (Ra, Re) రవి (సూర్యనారాయణుడు)

10) మొదటి శబ్దం ఏమిటి?

ఆదిమ మట్టిదిబ్బపై బ్రహ్మాండాన్ని పెడుతూ బెనుపక్షి చేసిన శబ్దం (హిందువుల ఓంకారం).

11) ఎన్నీడ్ (Ennead) ఎవరు?

తొమ్మిదిమంది దేవతలు- అతుమ్ (ఆత్మ-ఆదిదేవుడు), షు-టెఫ్‌నెట్ (వాయువు-అగ్ని); గెబ్-నట్ (నేల-నింగి); ఒసిరిస్-ఐసిస్, సెత్-నెఫ్థిస్‌లు.

12) ఒగ్ డాడ్ (Ogdoad) ఎవరు? (అష్టదేవతలు)

ఖెమెను Khemenu) - హెర్మాపొలిస్‌లో (Eight Town) జ్వాలాద్వీపం (The island of Flame) లోని ఎనిమిది మంది దేవతలు. ఇక్కడి దేవాలయంలో బ్రహ్మాండపు పెంకులో భాగం పాతిపెట్టబడి ఉన్నదని ప్రతీతి.
కెక్–కెకెత్ (చీకటి దేవతలు)
అమున్–అమానెత్ (రహస్యశక్తి దేవతలు)
హె–హెహెత్ (అనంత శక్తులు)
నన్–ననెత్ (ఆదిమ జల శక్తులు)
బురదలో నివసించే పాముల, కప్పల రూపులు.

13) అమున్–రా (Amon-Ra) ఎవరు?

థెబెస్‌లో ప్రధాన దేవత. అష్టదేవతలలో ఒకరు. బ్రహ్మాండాన్ని జనించిన పక్షిరూపుడు.

14) అతుమ్ (Atum) ఎవరు?

హిలియొపొలిస్ లేదా లియొపొలిస్‌లో ప్రధాన దేవుడు. ఆత్మ లేదా పరమాత్మ. Ra-Atumగా సాయంకాలపు సూర్యుడు. అతడి సంతానం షు–టెఫ్‌నెత్ (వాయువు–అగ్ని).

15) షు–టెఫ్‌నెట్‌ల సంతానం ఎవరు?

షు–పొడిగాలి లేదా వాతావరణం; టెఫ్‌నెట్ (తడిగాలి లేదా అగ్నిని ఇముడ్చుకున్న తడిగాలి లేదా అగ్ని (Fire). వాయువు–అగ్ని కలయికతో జన్మించనవారు– గెబ్ (నేల), నట్ (నింగి). నేల–నింగిల సంతానం ఒసిరిస్ (నల్లనేల–ఆకుపచ్చని భూమి); సెత్ (ఎడారి–ఎర్రనేల), ఐసిస్ – నైలు జలాలకు నల్లనేలకు మధ్య ఉన్న రెల్లు–పాపిరస్ పొదలు; నెఫ్‌థిస్–నల్లనేలకు ఎడారి ఎర్రనేలకు మధ్య ఉన్న అడవి పొదలు. ఒసిరిస్–ఐసిస్‌ల సంతానం హోరస్. ఒసిరిస్–నెఫ్‌థిస్‌ల సంతానం– అనుబిస్.

16) ఖ్నుమ్ (Khnum) - గొర్రె శిరస్సున్న దేవుడి ఆలయం ఏది?

ఎలిఫాంటైన్ ప్రాంతంలో ఎస్నా (Esna)లో ఉన్నది. ఖ్నుమ్– తండ్రులకు తండ్రి, తల్లులకు తల్లి. కుమ్మరి సారెపై దేవతలను, మనుషులను, జీవజాలాన్ని మట్టితో తయారుచేసి తల్లుల గర్భంలో ఉంచుతాడు.

17) ప్తా (Ptah) ఎవరు?

మెంఫిస్‌లో ప్రధాన దేవుడు, దేవతలను, రాజులను విలువైన లోహాల నుంచి రూపొందిస్తాడు. దేవతలను తన మనసులో, హృదయంలో అనుకుని వారి పేర్లను బయటకు ఉచ్ఛరించడం వలన దేవతలు సృష్టించబడినారు.

18) అతుమ్ హస్తం (The Hand of Atum) అని ఎవరిని అంటారు?

దేవతల స్త్రీశక్తిరూపం అతుమ్ హస్తంగా భావించబడేది. హాథర్, నియత్‌లకు ఆ పేరు ఇవ్వబడింది.

19) 'రా' నేత్రం (The Eye of Ra) ఎవరు?

సూర్యనేత్రి సౌమ్యరూపం హాథర్ (ఆవు రూపం). హాథర్ దేవత ఉగ్రరూపం సెఖెమత్ (Sekhemet)–సింహరూపిణి. మానవజాతి చేస్తున్న అకృత్యాలకు విసిగిన సూర్యుడు మానవులను శిక్షించడానికి సెఖెమెత్‌ను పంపగా ఆమె మానవులను చంపి వాళ్ల రక్తంతో స్నానమాడింది.

ఆమెను శాంతపరచడానికి హిలియొపొలిస్ పూజారి ఏడువేల పీపాల రక్తవర్ణపు బీరును సరస్సులో నింపగా సెఖెమెత్ దానిని తాగి నిద్రపోయింది. ఆకాశం ధేనువై 'రా'ను అంతరిక్షంలోకి తీసుకుపోయింది. సూర్యుడు పశ్చిమకొండలలో నిష్క్రమించినపుడు ఏర్పడే చీకటిలో వెలుగు కోసం నక్షత్రాలను, చంద్రుడిని (తౌత్) సృష్టించినాడు 'రా' (రవి). ఒసిరిస్‌ను మానవజాతిని పాలించే తొలి ప్రభువుగా నియమించినాడు. సెత్ ద్వేషానికి గురై మరణించిన ఒసిరిస్ అథోలోకపు ప్రభువైనాక హొరస్ నల్లనేలపై అధికారాన్ని పొందినాడు.

20) ఒసిరిస్ శరీరభాగాలు పడిన ప్రదేశాలేవి?

శిరస్సు–అబిడాస్‌లో, గుండె–అథ్రిబిస్‌లో, కాలు–బిగా ద్వీపంలో... ఇలా ఇరవై ఆరు చోట్ల దేహభాగాలు పడినాయి. (సతీదేవి దేహాన్ని శివుడు మోసుకుపోతుంటే ఆమె శరీరభాగాలు పడినచోట శక్తిపీఠాలు ఏర్పడినట్లు).

21) ఒసిరిస్ భార్య ఎవరు?

ఐసిస్. విశ్వాసానికి, మాతృత్వానికి, ప్రేమకు అధిదేవత.

22) హొరస్ కన్ను (The Eye of Horus) అంటే ఏమిటి?

Wedjat - Whole one - హొరస్ నేత్రం – ఫాల్కన్ రూపంలో ఉన్న హొరస్ కుడికన్ను సూర్యుడిని, ఎడమకన్ను చంద్రుడిని సూచిస్తాయి. సెత్–హొరస్‌ల

మధ్య జరిగిన యుద్ధంలో సెత్ నల్లటి అడవిపంది రూపంలో హొరస్ నేత్రాలను గాయపరచగా, హొరస్ తన ప్రత్యర్థి వృషణాలను గాయపరుస్తాడు. హొరస్ నేత్రాలకు ఏర్పడిన గాయాలను గ్రహణాలుగా విశ్లేషకులు భావిస్తారు.

23) 'రా' సూర్యుడి రాత్రిప్రయాణం అంటే ఏమిటి?

రాత్రిని పన్నెండు గంటలుగా విభజించారు. ప్రతి గంటలోనూ సూర్యుడి పడవను ఎపెప్ సర్పం అడ్డగిస్తుంటుంది. ఆ అడ్డంకులను దాటుకుంటూ సూర్యుడి పడవ తెల్లవారేప్పటికి తూర్పుకొండలను చేరుతుంది. ఉదయభానుడు ఖెప్రి (Kepry), మధ్యాహ్నపు మార్తాండుడు–రా హొరాక్తె (Ra - Horakty), సాయంకాలపు సూర్యుడు రా–అతుమ్ (Ra - Atum), రాత్రిసూర్యుడికి పేరు లేదు కాని గొప్పతల. Flesh of Ra గా వర్ణించబడినాడు. చంద్రుడు (Moon-Thoth)గా, బుధుడు (Mercury - Seth)గా, ఒసిరిస్–ఒరియాన్ (Orion) నక్షత్రరాశిగా గుర్తించబడినారు.

24) సూర్యుడి (Ra) రహస్యనామం తెలిసిన వారెవరు?

ఐసిస్, హొరస్‌లు.

25) 74 సర్పాల అర్థమేమిటి?

74 సూర్య (Ra) రూపాలు.

26) తొలి రాజులెవరు?

వృశ్చికరాజు (Scorpion); దేవత సెల్‌ఖెత్.

27) అత్యంత శక్తిగల దేవతలెవరు?

Neith-నియత్ – అమ్మలగన్న అమ్మ (సయిస్ ప్రాంతం)

నియత్, నన్–ఆదిమ జలాల్లో పడినప్పుడు ఎపెప్–మహాసర్పం పుట్టింది. సొబెక్ మకరదేవుడిని, దేవతలను, మానవులను సృష్టించిన తల్లి. Sekhmet (సెఖ్‌మెత్–శక్తి–సింహరూపిణి) ఆమె సైనికులు చిన్నమ్మ, పెద్దమ్మ, ఆటలమ్మ (Chickenpox, Smallpox, Measles) లాంటి వ్యాధులు. ఆమె పూజారులుగా వైద్యులుండేవారు.

Bastet – బస్తెత్ – మార్జాల రూపిణి. ప్రేమ, శృంగారం, ప్రత్యుత్పత్తి దేవత. హాథర్ (The Eye of Ra) సూర్యనేత్రి రెండు రూపాలుగా సెఖ్‌మెత్, బస్తెత్‌లను భావిస్తారు.

దెందెరా (Dendera)లో హాథర్‌ను 'ప్రేమికుల దేవత'గా కొలుస్తారు.

అనత్ – యుద్ధదేవత
అస్తార్తె – యుద్ధదేవత, ప్రేమదేవత
క్వుడ్షు – మిన్ దేవుడి భార్య, హాథర్ మరోరూపం
తవెరెత్ – మొసలి తల, హిప్పొటమస్ – సింహాల శరీరం. ఈమె మృతులకు నన్ జలాల్లో పునర్జన్మనిస్తుంది.
నెఖ్బెత్ – ఎగువ ఈజిప్టు రక్షకదేవత
వడ్జెత్ – దిగువ ఈజిప్టు రక్షకదేవత.

28) ఇమ్‌హొతెప్ (Imhotep) ఎవరు?

ఫారొ జోసర్ (Djoser 2700 B.C.) మంత్రి, పిరమిడ్ నిర్మాత, వైద్యుడు.

29) కా, బా (Ka, Ba) అర్థం?

Ka (కా) అంటే ప్రాణశక్తి. మనిషి మరణించగానే అది శరీరాన్ని విడిచి పోతుంది. Ba (బా) – ఆత్మశక్తి. శరీరంతో ఉంటుంది, రాత్రివేళ పక్షిరూపంలో ఎగిరి సూర్యుడితో ప్రయాణం చేసి తెల్లవారే మరల మృతదేహాన్ని చేరుతుంది.

30) ఇరువురి మంత్రగాళ్ల పోరుకథ ఏమిటి?

రెండవ రామ్‌సెస్ కుమారుడు సెత్నా ఖయిమ్‌వెసి. ఇతడు ప్తా దేవాలయపు పూజారి. అనేక శిధిల దేవాలయాలను పునర్నిర్మించి మంత్రవేత్తగా పేరు పొందినాడు.

ఒకరోజున న్యుబియన్ రాజు ఈజిప్టు రాజుకు సవాల్ విసిరాడు– "మీ రాజ్యంలో ఎవరైనా సీలు విప్పకుండా కవర్ లోపల ఏమి వ్రాసి ఉందో చదవగలిగిన సమర్థులు ఉన్నారా?" అని. సెత్నా చిన్నకుమారుడు సియొసిరె (Siosire) చదివి అందరకు వినిపిస్తాడు– "న్యుబియన్ మంత్రగాడు నాలుగు మైనపు బొమ్మలను చేసి సైనికులుగా పంపగా వాళ్లు ఈజిప్టు ప్రభువును బంధించి తీసుకునిపోయి అయిదు వందల దెబ్బలు కొట్టి మరల రాజభవనంలో విడిచిపెట్టారని; దానికి ప్రతీకారంగా పనెషి (Paneshe) కుమారుడు హొరస్ అదేవిధంగా న్యుబియన్ రాజును బంధించి దెబ్బలు కొట్టి పగ తీర్చుకుని ఆ మాంత్రికుడిని దేశ బహిష్కారం (1500 సంవత్సరాలు) చేస్తాడు" అని వ్రాసి ఉన్నది దానిలో.

న్యుబియన్ రాజు నేనే ఆ మంత్రవేత్తను అంటే సియొసిరె– నేనే హొరస్‌ను అని ప్రకటించి బహిరంగ ప్రదర్శనలో న్యుబియన్ రాజును ఓడిస్తాడు.

Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

I. Poetry (Telugu)

1. Alchemy
2. Vaana Mabbula Kanthi Khadgam
3. Tea Kappulo Toofan
4. Tangeti Junnu
5. Karakatakam (Cancer)
6. Oka Sarassu – Aneka Hamsalu (Psychiatry)
7. Marana Saasanam
8. Sri Lalitha Sahasranama Stotram
9. Kuyyo – Morro Satakam
10. Bhairava Satakam

II. Poetry (English)

11. Shades
12. The Twilight Zone
13. My Poem is My Birth Certificate
14. The Pendulum Clock, The Gramophone, The Typewriter and The Pen
15. The Vigilance Whistle!
16. How to Cook a Delicious Poem
17. Windows and Apples
18. The Guerdon of Poesy
19. The Haste Land
20. Bees Need No Invitation When Flowers Bloom...
21. Poetravelogue
22. WOW! (Supercalifragilisticexpialidocious)
23. The Lost Songs of a Lone Traveler!

III. Stories, Novels, Essays… (Telugu)

24. Katti Anchupai (Noir Stories)
25. Chupke – Chupke (Woman diseases)
26. Akshararchana
27. Deepa Nirvana Gandham (Death)
28. Swapna Sastram (Dreams-1)
29. Kalalu-Peeda Kalalu (Dreams-2)
30. Satyanveshanalo (Novel)
31. Sankya Sastram (Numerology)
32. Dr. Jayadev Cartoons (Cartoons)
33. Kathalu – kavitalu
34. Genome (Biotechnology Novel)

IV Stories, Novels, Essays (English)

35. In Search of Truth (Novel)
36. How to be happy (Philosophy)
37. Bouquet of Telugu Songs and Poems

V Translations (English to Telugu)

38. Iliad (Homer)
39. Odyssey (Homer)
40. Epic Cycle (Homer)
41. Three Greek Tragedies
42. The Poems of Sappho
43. Aeneid (Virgil)
44. Pilgrim's Progress (John Bunyan)
45. Paradise Lost (John Milton)
46. Paradise Regained (John Milton)
47. Divine Comedy (Dante)
48. Faust (Goethe)
49. World Famous Stories
50. Namdeo Dhasal Poetry
51. William Blake Poetry
52. Emily Dickinson Poetry – Part I
53. Emily Dickinson Poetry – Part II
54. Emily Dickinson Poetry – Part III
55. Emily Dickinson Poetry – Part IV
56. Emily Dickinson Poetry – Part V
57. Russian Poetry
58. Jalapatam (Eighteen English Poets)
59. Dabbu Manishi (Money Poetry)

60. Santi Yuddham (War-Peace)
61. Christu Adbhuta Geethalu
62. The Path of Christ
63. Silappadikaram
64. Manimekhala
65. Sangam Poetry
66. Conference of Birds (Attar)
67. Masnavi - Part 1
68. Masnavi - Part 2
69. Masnavi - Part 3
70. Masnavi - Part 4
71. Masnavi - Part 5
72. Masnavi - Part 6
73. Madhusala (Edward Fitzgerald)
74. Sougandhika (Master Poems in English-1)
75. Toorpu Padamara (Master Poems in English-2)
76. Prema Kurisina Velalo… (Master Poems in English-3)
77. Vallu Mugguru (Master Poems in English-4)
78. Alanati Kothagali (Master Poems in English-5)
79. Manchu Toofan (Master Poems in English-6)
80. Endaa – Vaana (Master Poems in English-7)
81. Pillanagrovi Pipupu (Master Poems in English-8)
82. Naalugu Dikkulu (Master Poems in English-9)
83. Allanta Doorana Aa Paata Vinavacche (Master Poems in English-10)
84. Divya Vastrala Kosam (Master Poems in English-11)
85. Oka Madhusala (Master Poems in English-12)
86. The Axion Esti (Odysseus Elytis)
87. Love & Death (Frederico Garcio Lorca)
88. Ten Thousand Lines (Edwin Cordevilla)
89. Century of Love (Roula Pollard)
90. Pablo Neruda Poetry
91. Mexican Poetry
92. Inanna (Queen of Heaven and Earth)
93. Sataroopa (A.K. Khanna)
94. Aamani (Master Poems in English-13)
95. Kotha Deepalu (Master Poems in English-14)

VI Translations (From Telugu, Hindi to English)

96. Bhagavatam (Potana)
97. Soundarya Lahari (Sankaracharya)
98. Modern Bhagavadgita

99. Samparayam (Suprasanna)
100. The Tree of Fire (Anumandla Bhoomaiah)
101. The Poems of Kuppam (Seeta Ram)
102. We Need a Language (T.W. Sudhakar)
103. The Broken Grammer (T.W. Sudhakar)
104. The Voice of Telangana (Madiraju Ranga Rao)
105. Fire and Ice (Rama Chandramouli)
106. The Tears of Bliss
107. This is no Streaking (Stories – K.K. Menon)
108. The Pool of Blood (Novel – Ampasayya Naveen)
109. Madhusala (Harivamsa Roy Bacchan)
110. Journey to Manasa Sarovar (English poetry)
111. Smooth Hands- Sosonjan A. Khan- (Bilingual)
112. Dancing Winds- Maria Miraglia (Bilingual)
113. Moments- Alicja Kubreska (Bilingual)
114. Tayouan Pai Pai- Yaw-Chin Fang(Bilingual)
115. The World of Extinct Lamps- Izabela Zubko (Tri lingual)
116. Pearls of Wisdom- Pramila Khadun- (Bilingual)
117. The Wind my lover- Ade C. Manila-(Bilingual)
118. The Mystic Mariner- Madan Gandhi (Bilingual)
119. Ten Color Rainbow - The Poems from Poland (Bilingual)
120. The True Meaning of Life - Rashid Pelpuo
121. The Wind My Lover - Ade C. (Bilingual)
122. Jak Ziemia Po Pierwszym Deszezu - The Poems from Poland (Bilingual)
123. Prima Ballerina Roberta Di Laura
124. The Casket of Vermilion (English Poetry)
125. Barefoot to Arcadia - Aprilia Zank (Bilingual)
126. Lets be one in The One - George Onsy (Bilingual)
127. Riding the Tide - Ashok Bhargava (Bilingual)
128. The Collected poems of Dr. LSR Prasad
129. The Epic of Gilgamesh
130. Krzysztof Kokot - Around the Haiku
131. Renata Cygan - I am a troubadour
132. Sergio Camellini - The Planet of Pink Clouds
133. Kumkum Bharine
134. Oulaya Drissi El Bouzaidi - A Long-winged Breath
135. Agnieszka Jarzebowska - The Fifth Season
136. The Making of Mahatma
137. Juliusz Erazm Bolek - The Secrets of life - A Calendar in verse
138. The Songs of Annamayya
139. Basudeb Chakraborti Poetry

140. Poland Poetry - As Clear as the Sun
141. Bozena Helena Mazur-Nowak's - Blue Longing
142. Izabela Zubko - The Holy Trinity
143. Deepa Chandran Ram - The Inner Quiet
144. Nazi Naaman Poetry
145. Lal Ded 'Vakhs'
146. Eden S. Trinidad - Eden Blooms
147. Dr. Jernail S. Anand - Fighting the Flames
148. Hell Rise in Paradise
149. Three Color Brush (China Poetry)
150. The Making of Mahatma - Poetry (Collector's Edition)
151. An Epic of Kashmir (Poetry)
152. The Legend of Lady Yang Guifei
153. Tjukurpa - Time Continuum (Dream Time - Every When)
154. Trident (Love, War and Peace) Poetry
155. Yuddhopanishad (The Upanishad of War)
156. COVID-19 - Biotechnology Novel
157. Krishna Prasai's Sun-Shower (A collection of 108 Zen Poems)
158. Covid-19 Parodies
159. VIRUSES - VACCINES
160. THE EDDAS
161. The Fifth Horseman (Telugu)
162. Che Guevara (Poetry) (English)
163. Coffee - Poems (Poetry) (English)
164. Ancient Egypt Stories (Telugu)
165. James Joyce - Chamber Music (Telugu)
166. Ravi Maruth's The Enraged Voice (English)
167. Alicja Kuberska's (Not) my poem (Telugu)
168. Prasen's - To Whomsoever it may concern (English)
169. Coro'noir' Stories (Telugu)
170. The Tortured Artist (English Poetry

ప్రాచీన ఈజిప్టు గాథలు



డా॥ లంకా శివరామప్రసాద్

Dr. LANKA SIVA RAMA PRASAD